
డిసెంబర్, 2010

# స్థానిక పాలన

గ్రామీణ వికాస మాసపత్రిక

సంపుటి: 2 సంచిక: 11 పేజీలు: 64 వెల: రూ. 20/-

## 16వ ముఖ్యమంత్రిగా శ్రీ నల్లారి కిరణ్‌కుమార్ రెడ్డి ప్రమాణ స్వీకారం



# డిసెంబర్-1 ప్రపంచ ఎయిడ్స్ దినం



మరింత ముందడుగు వేద్దాం!
హెచ్ఐవి, ఎయిడ్స్ నివారణకు మరిన్ని
కార్యక్రమాలు చేపడదాం!!
ఎయిడ్స్ సమస్యను తరిమి కొడదాం!!!



స్థానిక పాలన
గ్రామీణ వికాస మాసపత్రిక

సంపుటి: 2 సంచిక: 11

డిసెంబర్, 2010

చీఫ్ ఎడిటర్
**కె. చంద్రమౌళి** ఐ.ఏ.ఎస్.

ఎడిటర్
**డా॥ వి. శివశంకర ప్రసాద్**

ఎడిటోరియల్ బోర్డు

**కె. అంబరీష్,** ఐ.ఏ.ఎస్. (రిటైర్డ్)
**సెబాస్టియన్ రాజు** ఎ.పి.ఎ.ఎస్. (రిటైర్డ్)
**జి. గంగాధరం**
**టి. కృష్ణ**
**డాక్టర్ సి. కృష్ణ మోహనరావు**
**ఎమ్.ఎ. కుమార రాజా**
**బ్రిగేడియర్ డి.వి. రావు**
**ప్రొ. ఆర్. సూర్యనారాయణ రెడ్డి**
**ప్రొ. పి. రఘునాధరెడ్డి**
**డాక్టర్ లీలా ప్రసాద్**
**సి. వెంకటేశ్వర రావు**
**హెచ్. కూర్మారావు**
**డాక్టర్ కె. లక్ష్మీపతి**
**ఎమ్. విజయలక్ష్మి**

కాన్సెప్ట్, ప్లానింగ్,
ఎడిటింగ్, డిజైనింగ్
**కాక్స్టన్ ఆఫ్‌సెట్ ప్రైవేట్ లిమిటెడ్**
హైదరాబాద్

ప్రచురణ
ఎ.ఎం.ఆర్. అపార్డ్

రాజేంద్రనగర్
హైదరాబాద్-500 030
ఆంధ్రప్రదేశ్, ఇండియా
ఫోన్ : 040-24018656
ఫ్యాక్స్ : 040-24017005

E-mail : krishna.chandramouli90@gmail.com

# విషయ సూచిక

సంపాదకీయం ..... 2
అపార్డ్ న్యూస్ ..... 3
వెదురు వస్తువుల తయారీలో ముందంజ
ఎయిడ్స్ వ్యాధి వ్యాప్తిలో వెనుకంజ ..... 6
సమాచార యాజమాన్యంలో రాష్ట్రానికే తలమానికం ..... 9
ఆంధ్రప్రదేశ్ ఎసైన్డు భూములు బదలాయింపు (నిషేధ) చట్టం
9/1977 అమలు ప్రక్రియ ..... 12
ఎ.బి.సి. వ్యూహంతో హెచ్ఐవి వ్యాప్తికి అడ్డుకట్ట ..... 13
గ్రామ పంచాయితీల బిల్లుపై
డా॥ బి.ఆర్. అంబేద్కర్ అభిప్రాయాలు - ఒక విశ్లేషణ ..... 15
కాకతీయుల కావ్య వనిలో క్రేళ్ళురికిన పాల్కురికి ..... 19
అత్యవసర టోల్‌ఫ్రీ నెంబర్స్ ..... 24
ముఖ్యమంత్రిగా శ్రీ కిరణ్‌కుమార్ రెడ్డి ప్రమాణ స్వీకారం ..... 25
ధనుర్మాస వైభవం ..... 27
మానవీయత మూర్తీభవించిన యేసుక్రీస్తు ..... 29
ఆనాటి మేటి టెన్నిస్ దిగ్గజాలను చూద్దాం ! రండి !! ..... 32
ఎస్‌సి, ఎస్‌టిల సుస్థిరాభివృద్ధి దిశలో ..... 36
కమ్యూనిటీ ఫైనాన్స్ ఇన్‌స్టిట్యూషన్స్ ద్వారా మహిళలకు ఋణాలు ..... 40
సదవగాహనతోనే శాంతి ..... 41
మహిళా రైతులకు మంచిరోజులు ..... 45
స్థానిక సంస్థలకు త్వరలో మరిన్ని అధికారాలు ..... 46
పంచాయితీరాజ్ సంస్థలు 13వ ఆర్థిక సంఘం నిధులు
పొందాలంటే నూతన అకౌంటింగ్ విధానం అమలు తప్పనిసరి ..... 47
శ్రీ రమణ పేరడీలు ..... 48
దోమల బెడద నుండి తప్పించుకోవడం ఎలా ? ..... 50
గ్రామ వికాసం - అపార్డ్ దూరవిద్యా బోధన డిసెంబర్ షెడ్యూలు ..... 51
తోడు (కథ) ..... 52
జాతీయ స్థాయిలో ఉత్తమ గ్రామం గంగదేవిపల్లి ..... 53
మహనీయుల చతురోక్తులు ..... 56
చరిత్రకే వన్నె తెచ్చిన మన చేనేత ..... 57
మళ్లీ ఉపయోగించండి - పర్యావరణాన్ని కాపాడండి ..... 60
తల్లికే చదువు నేర్పిన కూతురు ..... 63

# సంపాదకీయం..

డిసెంబర్, 2010

## భరోసానిస్తున్న భవిష్యత్తు

**1980**వ దశకంలో చిన్న అలగా ప్రారంభమైన ఎయిడ్స్ సమస్య తరువాతి కాలంలో ఒక సునామీగా మారి, ఉప్పెనలా ప్రపంచంపై విరుచుకుపడింది. అనేక దేశాలలోని కోట్లాది మంది ప్రజలు దీని బారిన పడి విలవిల్లాడుతున్నారు. యుఎన్ ఎయిడ్స్ అంచనాల ప్రకారం, ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా 33.4 మిలియన్ల మందికి హెచ్ఐవి సోకిందని తెలుస్తోంది. ఇందులో 2.1 మిలియన్ల మంది పిల్లలు కూడా ఉండటం మరింత విషాదకరం.

2008 సంవత్సరంలోనే 2.7 మిలియన్ల మంది ఈ వైరస్ బారిన పడ్డారని, 2 మిలియన్ల మంది ఎయిడ్స్‌తో మరణించారని గణాంకాలు తెలుపుతున్నాయి. విశేషమేమిటంటే, హెచ్ఐవి సోకిన వారిలో దాదాపు సగం మందికి వారి వయస్సు 25 సంవత్సరాలు దాటక ముందే సోకింది. ఎయిడ్స్‌తో మరణించిన వారిలో దాదాపు సగం మంది వారి వయస్సు 35 సంవత్సరాలు దాటకముందే మరణిస్తున్నారు.

ఎయిడ్స్ సమస్య మనవాళికి ఎంత పెద్ద ముప్పుగా పరిగణిస్తుందో గమనించిన ప్రపంచదేశాలు దీన్ని సమర్థవంతంగా తరిమికొట్టేందుకు ఈ సమస్యపై మరింత శ్రద్ధ పెట్టేందుకు ప్రతి ఏటా డిసెంబర్ 1వ తేదీని ప్రపంచ ఎయిడ్స్ దినంగా జరుపుకుంటున్నాయి. 1988 సంవత్సరంలో ప్రారంభమైన ప్రపంచ ఎయిడ్స్ దినం ప్రతి ఏటా ఒక థీమ్‌తో మన ముందు ప్రత్యక్షమై మనవంతు సహాయాన్ని కూడా అర్థిస్తోంది.

1988లో కమ్యూనికేషన్, 1989లో యువజనులు 1990 లో మహిళలు - ఎయిడ్స్, 1991లో సవాలును ఉమ్మడిగా ఎదుర్కోవటం, 1992లో సమాజ అంకితభావం, 1993లో కార్యాచరణ చేపట్టండి, 1994లో ఎయిడ్స్- కుటుంబం, 1995లో పంచుకున్న హక్కులు - పంచుకున్న బాధ్యతలు, 1996లో ఒకే ప్రపంచం- ఒకే ఆశ, 1997లో ఎయిడ్స్‌తో బతుకుతున్న ప్రపంచబాలలు, 1998లో 'మార్పుకోసం ఉద్యమించండి - యువజనులతో ప్రచారం', 1999లో 'వినండి, నేర్చుకోండి, జీవించండి - బాలలతో, యువజనులతో ప్రచారం', 2000లో పురుషులు వ్యత్యాసాన్ని సృష్టించగలరు, 2001లో 'నేను జాగ్రత్త తీసుకుంటాను - మరి నువ్వు?'. 2002, 2003 సంవత్సరాల్లో అప్రతిష్ట - వివక్ష, 2004లో మహిళలు, బాలికలు, హెచ్ఐవి, ఎయిడ్స్, 2005లో ఎయిడ్స్‌ని నిరోధించండి. వాగ్దానాన్ని నిలబెట్టుకోండి, 2006లో ఎయిడ్స్‌ని నిరోధించండి - వాగ్దానాన్ని నిలబెట్టుకోండి- బాధ్యతాయుత వైఖరి, 2007లో ఎయిడ్స్‌ని నిరోధించండి. వాగ్దానాన్ని నిలబెట్టుకోండి - నాయకత్వం, 2008లో ఎయిడ్స్‌ని నిరోధించండి - వాగ్దానాన్ని నిలబెట్టుకోండి - నాయకత్వం వహించండి - సాధికారత కల్పించండి - ఫలితాలను అందించండి, 2009లో అందరికీ అందుబాటులో ఎయిడ్స్ చికిత్స- మానవ హక్కులు అనే అంశాలను థీములుగా నిర్ణయించి, వాటికోసం తగిన కార్యక్రమాలను రూపొందించడం జరిగింది. 2010 లో కూడా 2009 సంవత్సర థీమ్‌నే అనుసరిస్తున్నారు.

ప్రపంచ ఎయిడ్స్ దినం అనేది ప్రాథమికంగా ప్రజల్లో ఆ వ్యాధిపై, వ్యాప్తిపై అవగాహన పెంచడానికి, అపోహలను పారదోలడానికి, హెచ్ఐవి ఎయిడ్స్ వ్యాధిగ్రస్తుల చికిత్సకు నిధులు సమకూర్చుకోడానికి , ఎయిడ్స్ నిర్మూలనకు కార్యాచరణను రూపొందించి, అమలు చేయడానికి తగిన కార్యక్రమాలకు రూపకల్పన చేసే వేదికగా వాడటం జరుగుతోంది. హెచ్ఐవి ఈ ప్రపంచం నుంచి పోలేదని, దాన్ని పారిపోయేలా చేయడానికి ఎన్నో, ఎంతో చేయవలసి ఉన్నదని మనకు గుర్తు చేసే వేళగా కూడా ప్రపంచ ఎయిడ్స్ దినం ఉపయోగ పడుతోంది.

2010 సంవత్సర థీమ్ విషయానికి వస్తే, హెచ్ఐవి నివారణ, చికిత్స జాగ్రత్త, సహాయం మొదలైన అన్ని అంశాలు అందరికీ అందుబాటులో ఉండాలని, అప్పుడే మానవహక్కులు లభించినట్లు కాగలదని విశదీకృతమవుతోంది. వీటిని అందరికీ అందుబాటులోకి తెచ్చినప్పుడే మానవ హక్కులను, మంచితనాన్ని మనం గౌరవించినట్లు కాగలదని ఈ థీమ్ మనకు తెలియజెప్తోంది.

ప్రతి ఏటా ఎయిడ్స్ విషయంలో ప్రపంచ దేశాలు మరింత ప్రజాస్వామికీకరణతో ముందంజ వేయటం భవిష్యత్తుపై ఆశను రేకెత్తిస్తోంది. ఇటీవల అమెరికా, స్వీడన్ వంటి దేశాల్లో ఎయిడ్స్ నిరోధాన్ని అరికట్టే వ్యాక్సిన్ తయారీ ప్రయోగాలు కూడా సత్ఫలితాలనిచ్చినట్లు వార్తలు వచ్చాయి. ఇవన్నీ ఎయిడ్స్ రహిత ప్రపంచం భవిష్యత్‌లో అవిర్భవించగలదని భరోసా కల్గిస్తున్నాయి. అందుకోసం మనం కూడా చేయిచేయి కలుపుదాం.

( కె. చంద్రమౌళి )

వార్తల్లో 'అపార్డ్'

# అపార్డు కమీషనరుగా బాధ్యతలు చేపట్టిన శ్రీ కె. చంద్రమౌళి



అపార్డ్ కమిషనరు
**శ్రీ కె. చంద్రమౌళి**

ఆంధ్రప్రదేశ్ గ్రామీణాభివృద్ధి అకాడమీకి కమీషనరుగా శ్రీ కె. చంద్రమౌళి, ఐ.ఏ.ఎస్. తేది : 15-11-2010న పదవీ బాధ్యతలు చేపట్టారు. పదవీ బాధ్యతలు చేపట్టిన సందర్భంగా సిబ్బందితో జరిగిన పరిచయ సమావేశంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ రాష్ట్ర స్థాయి శిక్షణా సంస్థగా అపార్డు యొక్క పరిణామ క్రమం గత రెండు దశాబ్దాలుగా తనకు సుపరిచితమేనని, ప్రజాప్రతినిధులకు శిక్షణను వారి సామర్ధ్యాలను పెంపుదల చేయటంలో అపార్డు ఇప్పటికే విశేషమైన కృషి చేస్తోందని ఆయన అన్నారు.



ఇప్పటికే ప్రగతిలో ఉన్న వివిధ కార్యక్రమాలను కొనసాగించటం, అవసరమైనచోట్ల క్రొత్త విధానాల ద్వారా శిక్షణా నాణ్యతను పెంచటంపై దృష్టి సారిస్తానన్నారు. సిబ్బంది అంతా తమ యొక్క పూర్తి సామర్థ్యాలను సంస్థ ఎదుగుదల కోసం వినియోగించాలనీ పనిచేస్తున్న సంస్థ కన్న తల్లి వంటిదని, సంస్థను సంరక్షించుకోవల్సిన బాధ్యత అందరిమీదా ఉన్నదని ఆయన అన్నారు. చిత్త శుద్ధితో పనిచేసే సిబ్బందికి తగు విధంగా ప్రోత్సహించటం జరుగుతుందని ఆయన అన్నారు. శిక్షణా కార్యక్రమాల అమలును సమర్థవంతంగా నిర్వహించటానికి అందరి సహకారం కావాలని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో అపార్డు జాయింట్ డైరెక్టర్ శ్రీ గంగాధరం, వివిధ సెంటర్ హెడ్‌లు, ఫ్యాకల్టీ, కన్సల్టెంట్‌లు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. ◆

# అపార్డును సందర్శించిన గుజరాత్ గ్రామీణాభివృద్ధి సంస్థ డైరక్టర్

గుజరాత్ రాష్ట్ర గ్రామీణాభివృద్ధి సంస్థ డైరెక్టర్ శ్రీమతి గౌరీ త్రివేది తేది:9-11-2010న అపార్డును సందర్శించారు. 1986 కర్ణాటక ఐ.ఎ.ఎస్., కేడర్ అధికారిణి అయిన శ్రీమతి గౌరీ త్రివేది, ఐ.ఏ.యస్. పదవికి రాజీనామా చేసి గుజరాత్ యస్.ఐ.ఆర్.డి. డైరెక్టరుగా పదవీ బాధ్యతలు చేపట్టారు. అహ్మదాబాద్‌లో ఉన్న యస్.ఐ.ఆర్.డి.ని అభివృద్ధి చేయటానికి ప్రణాళికలు రూపొందించే పనిలో ఉన్నట్లు, ఈ సందర్భంగా శిక్షణా కార్యక్రమాల నిర్వహణలో అపార్డు అనుసరిస్తున్న వ్యూహాలను గూర్చి తెలుసుకోవటానికి ప్రత్యేకంగా అపార్డును సందర్శించటం జరిగిందని ఆమె అన్నారు. పంచాయితీ రాజ్ ప్రతినిధులకు, గ్రామీణాభివృద్ధి శాఖ సిబ్బందికి సామర్థ్యాల పెంపుదలకు అపార్డు చేస్తున్న కృషిని అపార్డులోని వివిధ సెంటరు హెడ్‌లు శ్రీమతి గౌరీ త్రివేదికి వివరించారు. గ్రామీణ పారిశుద్ధ్య కార్యక్రమాలపై అవగాహన కోసం రూపొందించిన



అపార్డ్ ఫ్యాకల్టీతో చర్చిస్తున్న **శ్రీమతి గౌరీ త్రివేదీ,**
గుజరాత్ SIRD డైరక్టర్

వ్యూహాల గూర్చి, ప్రజా ప్రతినిధుల శిక్షణకు అనుసరిస్తున్న వ్యూహాల గూర్చి, డాక్యుమెంటరీ ఫిల్ముల రూపకల్పన, కంప్యూటర్ ఆధారిత శిక్షణ, స్థానికపాలన మాస పత్రిక నిర్వహణ విధానం, శిక్షకుల శిక్షణ, సాక్షర భారత్ తదితర అంశాలపై ఆమె ఆసక్తి చూపారు. విశేషమైన కృషి చేస్తున్న ఫ్యాకల్టీ సభ్యులను అభినందించారు. అపార్డు అమలు చేస్తున్న కార్యక్రమాల నుండి తాను ఎంతో నేర్చుకున్నాని, ఈ కార్యక్రమాలను గుజరాత్‌లో కూడా అమలు చేయటానికి ప్రయత్నిస్తానని శ్రీమతి గౌరీ త్రివేది అన్నారు. ఈ కార్యక్రమంలో అపార్డు జాయింట్ డైరెక్టర్, శ్రీ గంగాధరం, డి.డి. అకౌంట్స్ శ్రీ కృష్ణ, డిప్యూటీ డైరెక్టర్ డా. కృష్ణమోహన్, వివిధ సెంటర్ హెడ్‌లు పాల్గొన్నారు.

## ప్రతిభ ఆధారంగా పంచాయితీ రాజ్ సంస్థలకు ప్రోత్సాహకాలు

వివిధ రాష్ట్ర ప్రభుత్వాలు పంచాయితీ రాజ్ సంస్థలను బలోపేతం చేయటానికి, సంస్థలలో పారదర్శకంగా జవాబుదారీతనంతో కూడిన సేవలను అందచేయటానికి తీసుకున్న చర్యలను బట్టి రాష్ట్ర ప్రభుత్వాలకు ప్రోత్సాహక బహుమతులను అందచేయటానికి పంచాయితీ సాధికారత, జవాబుదారీతన ప్రోత్సాహక బహుమతి పథకం ప్రవేశపెట్టటం జరిగిందని భారత ప్రభుత్వ పంచాయితీ రాజ్ మంత్రిత్వ శాఖ జాయింట్ సెక్రటరీ శ్రీమతి రష్మీశుక్లా శర్మ, తెలియచేశారు. వివిధ పంచాయితీ రాజ్ సంస్థలలో జవాబుదారీ తనంతో సేవలను అందచేయటానికి ఉద్దేశించిన సూచికల రూపకల్పన కోసం అపార్డులో ఏర్పాటు చేసిన ప్రాంతీయ వర్క్‌షాపుకు ముఖ్య అతిధిగా విచ్చేసిన శ్రీమతి రష్మీ శుక్లా శర్మ రెండు రోజుల పాటు అపార్డులో కేరళ, కర్ణాటక, తమిళనాడు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల పంచాయితీ రాజ్ శాఖాధికారులతోను, యస్.ఐ.ఆర్.డి. డైరక్టర్లు, సిబ్బందితో చర్చాగోష్టి నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ రాష్ట్రాలలో పంచాయితీ రాజ్ సంస్థలకు అందజేస్తున్న ప్రోత్సాహక బహుమతుల వివరాలను, నిబంధనలను గూర్చి చర్చించారు.

క్రొత్తగా రూపొందించాల్సిన నిబంధనలపై కూడా ఏకాభిప్రాయ సాధనకు కృషి చేసారు. ఐతే పంచాయితీ రాజ్ సంస్థలకు అధికారాలు ఒక్కో రాష్ట్రంలో ఒక్కలాగా ఉన్నందున సూచికల రూపకల్పనకు కనీస ప్రమాణాలను భారత ప్రభుత్వ పంచాయితీ రాజ్ మంత్రిత్వ శాఖ సూచిస్తే బాగుంటుందని సమావేశంలో పాల్గొన్న రాష్ట్ర ప్రభుత్వ ప్రతినిధులు సూచించారు. అంతకు ముందు తేది :2.11.2010న సమావేశ ప్రారంభంలో పాల్గొన్న ఆంధ్రప్రదేశ్ పంచాయితీ రాజ్ శాఖ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి శ్రీ ఎం.వి.పి.సి. శాస్త్రి మాట్లాడుతూ పంచాయితీ రాజ్ సంస్థలకు అధికారాల బదలాయింపు రాష్ట్ర ప్రభుత్వ పరిధిలోని విషయమని, కేంద్ర ప్రభుత్వ సూచనల ప్రకారం



వివిధ రాష్ట్రాల అధికారులను ఉద్దేశించి ప్రసంగిస్తున్న
**శ్రీమతి రష్మీ శుక్లా శర్మ**
జాయింట్ సెక్రటరీ పంచాయితీరాజ్ మంత్రిత్వశాఖ

# పారిశుద్ధ్యం, ఆరోగ్యంపై అపార్డు రూపొందించిన ప్రచురణల ఆవిష్కరణ




వివిధ రాష్ట్రాల అధికారులను ఉద్దేశించి ప్రసంగిస్తున్న
**శ్రీ M.V.P.C. శాస్త్రి**
స్పెషల్ చీఫ్ సెక్రటరీ, పంచాయితీరాజ్, ఆంధ్రప్రదేశ్.

ఎ.యం.ఆర్. అపార్డులోని నీరు మరియు పారిశుద్ధ్య కేంద్రం పారిశుద్ధ్యంపై అవగాహన కల్పించేందుకు గానూ సులభ సరళిలో, సరదా సంభాషణలతో సన్నివేశాలతో రూపొందించిన ప్రచురణలను జాతీయ స్థాయిలో ది.28/10/2010న జరిగిన వివిధ రాష్ట్రాల గ్రామీణ నీటి సరఫరా, పారిశుద్ధ్య శాఖల మంత్రివర్యులు, ప్రధాన కార్యదర్శుల సమావేశంలో కేంద్ర గ్రామీణ అభివృద్ధి శాఖా మాత్యులు డాక్టర్ సి.పి. జోషి ఆవిష్కరించారు. ఆవిష్కరించబడిన ప్రచురణలలో ఆంధ్రప్రదేశ్‌లో నూతన కమ్యూనికేషన్ విధానం, "హాయిగా - ఆరోగ్యంగా" (తెలుగు మరియు ఇంగ్లీషు బాషలలో), "పాము - నిచ్చెనల ఆట ఉన్నాయి.

ఆంధ్రప్రదేశ్‌లో ఇంత వరకూ పారిశుద్ధ్య విషయంలో అవగాహన పెంచటానికి చేసిన ప్రయత్నాలలో వచ్చిన ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని రాష్ట్ర ప్రభుత్వ నూతన భావ ప్రసార వ్యూహాన్ని రూపొందించడం జరిగింది. ఈ మేరకు గ్రామంలో పారిశుద్ధ్యం పాటించే వారిలో ముఖ్యులైన మహిళలు, పురుషులు, బాల బాలికలను ఉద్దేశించి వేర్వేరు మాధ్యమాలలో సందేశాలను



అపార్డు రూపొందించిన ఐ.ఇ.సి. మెటీరియల్ తిలకిస్తున్న కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖాభివృద్ధి మంత్రివర్యులు **డా॥ సి.పి. జోషి**

రూపొందించడం జరిగింది. హాయిగా - ఆరోగ్యంగా బడి పిల్లలకు సున్నితమైయన పారిశుద్ధ్య అంశాన్ని ఆసక్తి కలిగించేలా ఇద్దరు పిల్లల మధ్య సాగిన గిల్లి కజ్జాలుగా రూపొందించడం జరిగింది. పాము నిచ్చెనల ఆట గ్రామీణ ప్రజలకు సంపూర్ణ పారిశుద్ధ్యం సాధనకు గల అవరోధాలను తెలియచెప్తూ ఏ నిర్ణయాలు ప్రగతికి సోపానాలుగా ఉపయోగపడతాయో తెలియచెప్పే విధంగా రూపొందించడం జరిగింది. ఈ సమావేశానికి ఆంధ్రప్రదేశ్ గ్రామీణ నీటి సరఫరా, పారిశుధ్య శాఖామాత్యులు శ్రీ పినిపే విశ్వరూప్ గారు, ప్రధాన కార్యదర్శి శ్రీమతి చిత్రారామచంద్రన్ తదితరులు పాల్గొన్నారు. ◆

పంచాయితీరాజ్ సంస్థలకు 29 అంశాలలో అధికారాల బదలాయింపుకు కృషిచేస్తున్నామి, 2007 సంవత్సరంలో 10 శాఖలలో అధికారాల బదలాయింపు చేసినట్లు తెలియచేశారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో గ్రామ పంచాయితీల సంఖ్య అధికంగా ఉన్నదని, పునర్వ్యస్థీకరణ చేస్తే తప్ప ఆర్థికంగా పరిపుష్టికాలేవని ఆయన అన్నారు. గ్రామ సభ పనితీరు కూడా ఆశాజనికంగా లేదని అన్నారు. ఐతే ప్రభుత్వం ఏడాదికి రెండు సార్లు గ్రామ సభ నిర్వహణకు తప్పనిసరిచేసిందని ఆయన అన్నారు. ప్రజా ప్రతినిధుల సామర్థ్యాల పెంపుదలకు అపార్డు కృషి చేస్తున్నదని, భవిష్యత్తులో క్రొత్తగా ఎన్నికయ్యే ప్రతినిధులకు శిక్షణ అందచేయుటానికి ప్రణాళికలు రూపొందించుకోవాల్సిన అవసరం ఉన్నదని ఆయన అన్నారు. ఐతే 2.61 లక్షల మందికి శిక్షణ ఇవ్వటం సామాన్యమైన విషయం కాదని, ప్రత్యేక శ్రద్ధ తీసుకోవల్సిన అవసరం ఉందని అయిన అన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో పంచాయితీ రాజ్ వ్యవస్థపై అదనపు కమీషనర్ శ్రీ సి. శంకర్ రెడ్డి, పవర్‌పాయింట్ ప్రజంటేషన్ ఇచ్చారు. ఈ కార్యక్రమాన్ని సి.డి.పి.ఏ. సెంటర్ హెడ్ ప్రొ.సూర్యనారాయణరెడ్డి సమన్వయం చేయగా అపార్డు కన్సల్టెంట్‌లు శ్రీసి.వి. రావు, శ్రీవతిరావు, ప్రొ. బలరామ్‌లు ఇతర ఫ్యాకల్టీ, సిబ్బంది ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. పరిపాలనా పరమైన సహాయాన్ని అపార్డు జాయింట్ డైరెక్టర్ శ్రీ గంగాధరం, డిప్యూటీ డైరెక్టర్ (లెక్కలు) శ్రీ టి. కృష్ణ, డిప్యూటీ డైరెక్టర్ శ్రీ కృష్ణమోహన్ రావు అందించారు. ◆





# వెదురు వస్తువుల తయారీలో ముందంజ

# ఎయిడ్స్ వ్యాధి వ్యాప్తిలో వెనుకంజ

**మో కాలికీ బట్టతలకీ ముడిపెట్టినట్లుగా అనడానికే కాస్త వింతగా వుంది కదూ! కానీ నిజమేనంటోంది ఒక ఆఫ్రికన్ యువతి. టాంజానియా దేశస్థురాలు పాలిన్ సమత ఇది ఏమాత్రం వింతకాదనీ, అక్షరాలా నిజమని ఋజువు చేసిమరీ చూపించింది. అందుకే ఆమెను 'సెయింట్ ఆఫ్ బ్యాంబూ' అనీ, 'మదర్ థెరిసా ఆఫ్ టాంజానియా' అనీ పలు సంస్థలు బిరుదులిచ్చి సత్కరించాయి.**

### వెదురు పుల్లలతో ఎయిడ్స్‌ను అరికట్టే

### ఆ కథ ఏమిటో మనమిప్పుడు తెలుసుకుందాం....

ఆఫ్రికా ఆసియా దేశాల్లో ప్రజల ఆర్థిక స్థితిగతులను మెరుగు పరచడం ద్వారా పేదరికాన్ని, నిరక్షరాస్యతను, అనారోగ్యాన్ని అంతం చేయడానికి అనేక అంతర్జాతీయ సంస్థలు కృషి చేస్తున్నాయి. వీటిలో ఇంటర్నేషనల్ ఫండ్ ఫర్ అగ్రికల్చర్ డెవలప్‌మెంట్ (ఐఫాడ్) ఒకటి. ఈ సంస్థ టాంజానియాలో వున్న అపారమైన వెదురు సంపదను ప్రజల ఆర్థికస్థితిని మెరుగుపరచడానికి ఉపయోగించవచ్చున్న ఉద్దేశంతో మరో అంతర్జాతీయ సంస్థ 'ఇంటర్నేషనల్ నెట్ వర్క్ ఫర్ బ్యాంబూ అండ్ రట్టన్ (ఇన్‌బార్)తో కలిసి కొన్ని పథకాలను రచించింది.

లక్షల ఎకరాలలో వెదురు అడవులు కళ్ల ముందు ఉన్నా వాటిని సద్వినియోగ పరిచే పరిజ్ఞానం అక్కడి ప్రజలకు లేనందున అవి వృథా అయిపోతున్నాయని గ్రహించిన పై సంస్థలు వెదురు పుల్లలతో గృహోపకరణాలు, ఫర్నీచర్ తదితర వస్తువులను తయారు చేసి, వాటి అమ్మకాల ద్వారా స్థానికుల ఆర్థికస్థితిలో మార్పు తీసుకురావాలని సంకల్పించాయి.





ఈ కృషిలో భాగంగా అత్యంత ప్రతిభాశాలి తెలివి, చొరవ వున్న మహిళ పాలిన్ సమతను ఎంపిక చేసుకున్నాయి. వెదురు వస్తువుల తయారీలో శిక్షణ ఇప్పించేందుకు ఆమెను చైనా, ఫిలిప్పీన్స్ దేశాలకు 'ఐఫాడ్' పంపింది. వాస్తవానికి ఈ భూమండలం మీద అతివేగంగా పెరిగే చెట్టు వెదురు చెట్టేనని శాస్త్రవేత్తలు సైతం అంగీకరిస్తున్నారు. అనేక విధాలుగా ఈ చెట్టుకు ప్రాధాన్యం ఉంది. పర్యావరణాన్ని పరిరక్షించడంలో దీని పాత్ర అద్వితీయం. అభివృద్ధి చెందుతున్న దేశాల్లో పేదరిక నిర్మూలనలో కూడా వెదురు చెట్లకు ప్రముఖ స్థానం ఉన్నందున దాన్ని 'పేదలపాలిటి పెన్నిధి' అంటున్నారు.

టాంజానియాలో 2001 లో ఇంటర్నేషనల్ ఫండ్ ఫర్ అగ్రికల్చర్ డెవలప్‌మెంట్ సమకూర్చిన నిధులతో జీవనోపాధి, ఆర్థికాభివృద్ధి కార్యక్రమాన్ని చేపట్టారు.వెదురు కేన్ వనరులతో స్థానికులకు ఉపాధి అవకాశాలు కల్పించడం ఈ పథకం ముఖ్యోద్దేశం. వినూత్న సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి స్థానికుల ద్వారా ఉత్తమ ప్రమాణాలు గల వినియోగ వస్తువులను తయారు చేయించాలని వారు తలపెట్టారు. దీని ద్వారా వెదురు చెట్ల పెంపకంలో మెళకువలను గ్రామీణ ప్రజలు నేర్చు కోవాలన్నది ఈ ప్రాజెక్టు లక్ష్యాల్లో ఒకటి. ఆసియా-ఆఫ్రికా దేశాల ప్రజల మధ్య శాస్త్ర, సాంకేతిక విజ్ఞానాన్ని, ఇచ్చిపుచ్చుకొనే ధోరణిని పెంపొందించడానికి కూడా 'ఐఫాడ్' సహాయపడుతోంది.

"వెదురు చెట్లుకు ఇన్ని గొప్ప గుణాలున్నాయని నేను చైనా, ఫిలిప్పీన్స్ దేశాల్లో శిక్షణకు వెళ్లిన తరువాత గాని అర్థంకాలేదు. వెదురు బద్దలతో వివిధ రకాలవస్తువుల తయారీలో శిక్షణ ఇప్పించేందుకు నన్ను చైనా, ఫిలిప్పీన్స్ దేశాలకు 'ఐపాడ్' 'ఇన్‌బార్' సంస్థలు పంపించాయి. ఈ చెట్ల ద్వారా ఆర్థికఫలితాలు ఎలా సాధించవచ్చో ప్రతి ఒక్కరూ తెలుసుకోవాల్సిన అవసరం ఉంద" ని సమత అంటారు.

వెదురుతో ఇళ్లను ఎలానిర్మించ వచ్చో ఫిలిప్పీన్స్‌లో ఆమె నేర్చుకుంది. ఆఫీసుల్లో ఉపయోగించే డస్ట్‌బిన్స్, స్కూళ్లలో వాడే డెస్కులు వంటి ఫర్నీచర్‌ను తయారు చేసే పద్ధతులను చైనాలో ఆమె నేర్చుకుంది. వంట వండుకోటానికి వెదురుతో చేసిన చార్‌కోల్ వాడితే అడవిలోకి వెళ్లి పుల్లలు ఏరుకోవాల్సిన అవసరం ఉండదని ఆమె ఇట్టే గ్రహించింది.

" మా దేశం చాలా పేదదేశం. మా దేశ మహిళలకు చాలా మందికి చదువురాదు.డబ్బు సంపాదించటానికి చాలా తక్కువ అవకాశాలు ఉంటాయి. వాళ్ల పిల్లల ఆకలి తీర్చటానికి డబ్బు అవసరం అవుతుంది. ఉపాధి అవకాశాలు తక్కువగా ఉండటం వల్ల వాళ్లు వ్యభిచారవృత్తిలో తప్పనిసరి పరిస్థితిలో దిగాల్సి వస్తోంది," అని సమత చెబుతుంది.






టాంజానియాలో వెదురు అడవులు చాలా ఎక్కువగా ఉన్నాయి. దాదాపు 1,27,000 హెక్టార్లలో వెదురు అడవులు విస్తరించి ఉన్నాయి. ఇరవై ఏళ్ల క్రితమే వెదురు సంపద ప్రాముఖ్యాన్ని ప్రజలు గ్రహించి వాటి పెంపకంపై దృష్టిపెట్టారు.

వెదురు పుల్లలతో విదేశాల్లో నేర్చుకున్న కళను నేర్పటానికి సాటి మహిళలకు ఆమె శిక్షణా తరగతులను ప్రారంభించింది."ముంబేయ బ్యాంబూ విమెన్స్ గ్రూప్" పేరుతో ఒక శిక్షణా సంస్థను స్థాపించింది. ఈ శిక్షణ ద్వారా మహిళలకు ఉపాధి అవకాశం కల్పించడమే కాకుండా, వాళ్ళు వ్యభిచార కూపంలోకి దిగిపోకుండా చేసి, హెచ్.ఐ.వి. ఎయిడ్స్ బారిన పడకుండా కాపాడగలుగుతోంది.

సమత తన శిక్షణా తరగతులను ఉచితంగానే నిర్వహిస్తుంది.శిక్షణా కాలంలో మహిళలు విధిగా ఆరునెలల పాటు తన వద్దే నివసించాల్సి ఉంటుంది. శిక్షణా సమయంలో మధ్యలో మానేసి వెళ్లకుండా ఉండేందుకు వారికి రోజుకు 1500 టాంజానియా షిల్లింగ్స్ (75 రూపాయలకు సమానం) చెల్లిస్తుంది కూడా. ఎక్కువ మంది మహిళలకు శిక్షణ ఇచ్చేందుకు తను మరింత డబ్బు సంపాదించాలని అనుకొంటున్నట్లు సమత చెబుతుంది. యుక్త వయస్సులో ఉన్న అమ్మాయిలు ఇంటి పని మనుషులుగా మారడం నాకు ఇష్టం లేదు. వారికో వృత్తి నేర్పి, స్వశక్తిపై నిలబడగలిగేలా చేయడమే తన లక్ష్యమని ఆమె అంటుంది. శిక్షణా సమయంలో వెదురు వస్తువుల తయారీనే కాకుండా వాళ్లకు లెక్కలు రాయడం, పేర్లు రాయడం, చదవటం




కూడా నేర్పుతానని సమత వివరించింది.

తన వద్ద శిక్షణ పొందిన మహిళలు తమ తిండికీ, మందులకు సరిపోను సంపాదనను పొందగలుగుతున్నారు. వాళ్ల పిల్లలను బడికి పంపుతున్నారు.అన్నింటి కంటే ముఖ్యం అనేకమంది యువతులు హైచ్.ఐ.వి., ఎయిడ్స్ బారిన పడకుండా కాపాడగలిగానంటోంది.

ప్రస్తుతం సమత వెదురు వస్తువుల వ్యాపారం బాగా పుంజుకొంది. గ్రామానికి 10 కిలోమీటర్ల దూరంలో ఒక వర్క్‌షాపును స్థాపించింది. రెండు మూడేళ్ల కిందటి వరకు వెదురు కలప తెచ్చేందుకు తానే స్వయంగా అడవిలోకి వెళ్లేది. ఇప్పుడా పనిని గ్రామస్తులకు అప్పగించింది. ఒక్కో వెదురు గడను నరికి వర్క్‌షాప్‌కి చేరవేసేందుకు ఆమె వారికి 200 షిల్లింగ్స్ చెల్లిస్తుంది.

సమత, ఆమె శిష్యులు నెలకు 30 నుంచి 34 వెదురు గడలను వాడతారు. ఒక్కో గడను ముక్కలుగా కోసి బుట్టలు, కుర్చీలు, బల్లలూ, డస్ట్‌బిన్స్ తయారు చేస్తారు. ఈ సంస్థ యువతులు ఒక కేటలాగును తయారుచేసి ఆఫీసులు, హోటల్స్‌లో పంచి పెడ్తుంటారు.చాలామంది కస్టమర్లు నేరుగా తమ వర్క్‌షాప్ నుంచే తమకు కావాల్సిన వస్తువులను కొనుక్కెళ్తూ ఉంటారు. డిమాండ్ ఎక్కువగా వున్న వస్తువులను అధికంగా ఉత్పత్తి చేసి స్టాక్ పెట్టుకొంటారు. దేశ రాజధాని దార్-ఎస్-సలామ్‌లో 30 లక్షల షిల్లింగ్‌ల విలువజేసే వస్తువులను ఈ సంస్థ అమ్మగలిగిందంటే వాటి నాణ్యతను, పనితనాన్ని ఇట్టే అర్థం చేసుకోవచ్చు.తనవద్ద శిక్షణ పొందిన మహిళలు కొందరు నెలకు 50 వేల షిల్లింగులు సంపాదించ గలుగుతున్నారు.వాటిద్వారా పిల్లల చదువులు తిండీ మందులూ ఇతర ఖర్చులు పోను నెలకు 5000 షిల్లింగులు పొదుపు చేయగలుగుతున్నారని సమత వివరిస్తుంది.

అద్దె ఇళ్లలో ఉండే వారిని వెదురు కలపతో సొంత ఇళ్ళు నిర్మించుకొనేలా వారిని సమత ప్రోత్సహిస్తోంది.

సాధ్యమైనంత ఎక్కువ మందికి వెదురు వస్తువుల తయారీలో శిక్షణనివ్వాలన్నది తన ఆశయం అని ఆమె అంటుంది.వెదురులో వివిధ వస్తువులను ఎలా తయారు చేయవచ్చో ప్రజలందరికీ అవగాహన కల్పించి, తద్వారా పేదరికాన్ని జయించవచ్చని తెలియజెప్పడమే తన లక్ష్యమని కూడా సమత అంటుంది.

గొప్ప ప్రజాదరణ పొందిన నాయకురాలిగా ఎదిగిన సమత తన సొంత స్థలంలో ఒక వర్క్‌షాప్‌ను నెలకొల్పి, కొత్త మార్కెట్లలోకి ప్రవేశించాలని భావిస్తోంది. తన వస్తువులకు జాంబియా, మలావీ, కెన్యా, ఉగాండాలలో మంచి మార్కెట్ ఉందని ఆమె గ్రహించింది. తన గ్రామంలో మరింత భూమిని కొనుగోలు చేసి వెదురు చెట్లను పెంచాలన్నది ఆమె దీర్ఘకాలిక లక్ష్యం.

'బ్యాంబూ సెయింట్' గా పేరుపొందిన పాలిన్ సమత టాంజానియాలో పేదరిక నిర్మూలనలో తన వంతు పాత్రను పోషిస్తోంది. ఆమె నేతృత్వంలోని "ముంబేయ మహిళాసంఘం" తన ప్రత్యేకతను చాటుకొంది.

ఇకముందూ ఆ ప్రత్యేకతను చాటుకొంటుదని సమత సగర్వంగా చెబుతుంది.

*- కె. సాంబశివారెడ్డి*

# సమాచార యాజమాన్యంలో రాష్ట్రానికే తలమానికం

## తూర్పు గోదావరి జిల్లా ప్రజా పరిషత్

**ప్రభుత్వ కార్యాలయంలో ఉత్తర ప్రత్యుత్తరాలు అన్నీ డి.ఓ.ఎమ్. పద్ధతి ఆధారంగా దస్త్రాల రూపంలో నిక్షిప్తమై ఉంటాయి. ప్రతి దస్త్రా విషయాన్ని, దాని పరిష్కారాల కాలపరిమితిని బట్టి 'టోటన్ హామ్' పద్ధతి ప్రకారం వర్గీకరించిన దస్త్రాలను ఎల్.డిస్., డి.డిస్., ఆర్.డిస్.లుగా నామకరణం చేస్తారు. వీటిలో దీర్ఘకాలం భద్రపరచవలసి ఉన్నా డి.డిస్., ఆర్.డిస్.ను రికార్డు రూంలో భద్రపరచి, రికార్డు అసిస్టెంట్ అధీనంలో ఉంటాయి. స్వల్ప కాలపరిమితి అంశాలకు సంబంధించిన అంశాలతో కూడిన ఎల్.డిస్. దస్త్రాలు ఆయా విభాగపు గుమస్తాల వద్ద భద్రపరచబడి సమయానుకూలంగా ఉత్తర ప్రత్యుత్తరాలు జరుగుతూ ఉంటాయి.**

ఈ విధానంలో దస్త్రాల యాజమాన్యం పూర్తిగా ఆయా విభాగాల గుమస్తాలు, రికార్డు రూం అసిస్టెంట్ (సహాయకుల) వ్యక్తిగత సామర్థ్యం, పనిపట్ల వారి అంకిత భావంపై ఆధారపడి ఉంటుంది. ఈ విధానం ప్రభుత్వ వ్యవస్థలో తరచుగా జరిగే బదిలీలు వలన ఆయా విభాగాల సిబ్బంది మారటం, విషయం పట్ల, దస్త్రాల యాజమాన్యం పట్ల సరైన అవగాహన పెంచుకోకపోవటం, అప్పుడప్పుడు దస్త్రాలలోని కొన్ని ముఖ్యమైన కాగితాలు కనిపించకుండా పోవటం, కొన్ని సందర్భాలలో ముఖ్యమైన దస్త్రాలు కనిపించకుండాపోవడం, తస్కరించటం, మార్పులు చేయటం (టేంపరింగ్) దిద్దటం వంటి సమస్యలు పలు సందార్భలలో తలెత్తే అంశాలుగా గుర్తించటం జరిగింది.

11 మే 2005 సంవత్సరం నుండి భారత ప్రభుత్వం సమాచార చట్టాన్ని అమలు చేయటం వలన ప్రతి పౌరుడు చట్టంలో పేర్కొన్న విధంగా తమకు కావలసిన సమాచారాన్ని పొందే హక్కును పొందటం జరిగింది. ఈ నేపథ్యంలో మన ప్రభుత్వ కార్యాలయంలో సమాచారాన్ని ఇచ్చే విషయంలో తీవ్ర జాప్యం జరుగుతుంది. దీనికి కారణం మనం అవలంబిస్తున్న సమాచార యాజమాన్య విధానం.

ఉదాహరణకు ఏ వ్యక్తి అయినా సమాచారం పొందటానికి దరఖాస్తు ఇచ్చిన వెంటనే సమాచారం అందాలంటే ప్రస్తుత విధానంలో ఆ దరఖాస్తులో (అర్జీ) మొదట సంబంధిత సమాచార అధికారి ద్వారా విభాగపు పర్యవేక్షకులు, విభాగపు గుమాస్తా, సమాచార ఆవశ్యకతను బట్టీ రికార్డు గది సహాయకులు, ఈ విధంగా అందరినీ చేర్చి నిర్దిష్ట కాల వ్యవధిలో సమాచారాన్ని అందించాల్సి ఉండగా, తీవ్రజాప్యం జరుగుతుంది. సమాచార కమీషన్ నుండి సమన్స్ జారీ అయిన సందర్భాలు కూడా ఉన్నాయి. జిల్లా ప్రజా పరిషత్, తూర్పు గోదావరి జిల్లా 2005కు ముందు దస్త్రాల యాజమాన్యం, పరిశీలిస్తే పైన పేర్కొన్న అన్ని అంశాలు, ఇబ్బందులు కార్యాలయ సిబ్బంది, అధికారులు, ముఖ్యంగా జిల్లా ప్రజలు, ప్రజా ప్రతినిధులు ఎదుర్కొన్న సందర్భాలు కోకొల్లలు.

ఈ అంశాలు దృష్టిలో ఉంచుకొని జిల్లా ప్రజా పరిషత్ అధ్యక్షులు శ్రీ చెల్లుబోయిన వేణుగోపాల కృష్ణ, జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణ అధికారి శ్రీ బి.భవానీ దాస్ సహకారంతో వివిధ అంశాలపై సమగ్రంగా చర్చించి, సమాచార సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకొని సమాచార యాజమాన్యం, దస్త్రాలు భద్రపరచటంలో విప్లవాత్మకమైన మార్పులు తీసుకురావటానికి నిర్ణయం తీసుకోవటం జరిగింది.

**దస్త్రాలను కంప్యూటరీకరించు విధానం 5 దశలలో జరుగుతుంది.**

- ★ మౌలిక సదుపాయాలు, సిబ్బంది
- ★ డిజిటల్ కెమెరాలు, కంప్యూటర్లు



*జిల్లా ప్రజాపరిషత్ డిజిటైజేషన్ ప్రాజెక్టును పరిశీలిస్తున్న గౌరవనీయులు రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖామాత్యులు శ్రీ పిల్లి సుభాష్ చంద్రబోస్, జిల్లా ప్రజా పరిషత్ ఛైర్మన్ శ్రీ సి.హెచ్. శ్రీనివాస వేణుగోపాలకృష్ణ, జిల్లా కలక్టర్ శ్రీ ఎం. రవిచంద్ర, జాయింట్ కలెక్టర్ శ్రీ కె. శశిధర్*

★ స్కానింగ్ చేసే నైపుణ్యం కలిగిన సిబ్బంది

★ ఎడిటింగ్ చేసే నైపుణ్యం కలిగిన సిబ్బంది

★ దస్త్రాలను వర్గీకరించి కంప్యూటర్‌లో నిక్షిప్తం చేసే సిబ్బంది.




దీనికి ముందుగా జిల్లా ప్రజా పరిషత్‌లో గల వివిధ విభాగాలలోని దస్త్రాలను వాటి వాటి ప్రాముఖ్యత, ప్రాధాన్యత ఆధారంగా వర్గీకరిస్తారు. ఈ విధంగా వర్గీకరించిన దస్త్రాలను కంప్యూటరీకరించటానికి సిద్ధంగా ఉంచుతారు. ఈ రకంగా సిద్ధంగా ఉన్న దస్త్రాలను మొదటగా డిజిటల్ కెమెరా సహాయంతో ఫొటో తీయటం జరుగుతుంది. ఈ ఫొటోరూపంలో ఉన్న దస్త్రాలలోని రికార్డులు / పేర్కొన్న పేజీలు అందులోని అక్షరాల సైజు, ఫొటో సైజు కంప్యూటర్‌లోని డాటాలో నిక్షిప్తం చేయటానికి అనుకూలంగా కంప్యూటర్లో ప్రత్యేకమైన ప్రోగ్రాం ద్వారా ఎడిటింగ్ చేస్తారు. ఈ విధంగా ఎడిటింగ్ చేసిన దస్త్రం / రికార్డులను వర్గీకరణ చేసిన విధంగా జత చేయటానికి / విడగొట్టడం (సార్టింగ్) చేస్తారు. తర్వాత వర్గీకరించిన దస్త్రం / రికార్డును కంప్యూటర్‌లో ఉన్న డేటాలో భద్రపరుస్తారు. కంప్యూటర్‌లో ఉన్న డేటాను సర్వర్‌లోనికి అప్ లోడింగ్ చేయటం ద్వారా 5 దశలలో దస్త్రాల కంప్యూటరీకరణ పూర్తికాబడి, వీక్షించటానికి దస్త్రాలు అందుబాటులోనికి వస్తాయి.

| | | |
|---|---|---|
| **కంప్యూటరీకరించిన దస్త్రాలు** | - | **6000** |
| **ఉద్యోగుల సేవాపుస్తకాలు** | - | **600** |
| **నగదు పుస్తకాలు** | - | **1000** |
| **మినిట్స్ పుస్తకాలు** | - | **600** |
| **మొత్తం కంప్యూటరీకరించిన దస్త్రాలలోని పేజీలు** | - | **7,50,000** |

పై పని 180 రోజులలో 20 మంది ఉద్యోగులు అహర్నిశలు శ్రమించి అన్ని విభాగాలలోని డి.డిస్, ఆర్.డిస్ దస్త్రాలను కంప్యూటరీకరించటం జరిగింది.

ఈ విధంగా కంప్యూటరీకరించిన డాటాను కాంపాక్ట్ డిస్క్‌లో నిక్షిప్తం చేసి మూడు స్థాయిలలో భద్రపరుస్తారు. మొదటగా సర్వర్‌లో బ్యాక్ –అప్, రెండవది కంపాక్ట్ డిస్క్‌ల రూపంలో ముఖ్య కార్యనిర్వహణ అధికారి వద్ద మూడవది రికార్డు గదిలో తద్వారా కంప్యూటర్‌లో జరిగే వైరస్ ప్రమాదాలు నుండి పూర్తి స్థాయిలో రక్షణ కల్పించబడుతుంది.

ఈ దస్త్రాల కంప్యూటరీకరణ అనేది నిరంతరం జరిగే ప్రక్రియ, ఇకనుండి రికార్డు గదికి వెళ్ళే ముందు ప్రతి దస్త్రం డిజిటలైజ్ చేయబడి కంప్యూటర్‌లో నిక్షిప్తం చేసిన తర్వాతే రికార్డు గదికి పంపటం జరుగుతుంది.

ఇంతవరకు జిల్లా ప్రజా పరిషత్ ఆస్తుల వివరాలు జిల్లా ప్రజా పరిక్షత్‌లోని 'హెచ్' విభాగంలో ఒక రిజిష్టర్‌లో నమోదు అయి ఉండేది. ఆస్తుల స్వరూపం, స్వభావం, సరిహద్దులు తెలుసుకోవాలంటే స్వయంగా వెళ్ళి చూస్తేగాని తెలియని పరిస్థితి. అందువలన కాల పరిమితిగల ఆస్తుల పర్యవేక్షణ సక్రమంగా ఉండేది కాదు. దీనిని ఆసరాగా తీసుకొని కొంతమంది జిల్లా ప్రజా పరిషత్ ఆస్తుల దురాక్రమణకు పాల్పడేవారు. కొన్ని సమయాలలో కోర్టుకు వెళ్ళిన సందర్భాలు కూడా ఉన్నాయి. అటువంటి పరిస్థితులలో సరైన సమయంలో సరైన సమాచారం అందుబాటులో ఉండక పలు ఇబ్బందులు ఎదురయ్యేవి.

ఈ అంశాలు దృష్టిలో ఉంచుకొని జిల్లా పరిషత్ ఆస్తుల వివరాలు. రెవెన్యూ శాఖ ధృవీకరణతో ఫొటోలతో (వీడియో క్లిప్పింగ్స్) డిజిటైజ్ చేసి, కంప్యూటర్‌లో నిక్షిప్తం చేయటం జరిగింది. రికార్డు గదిలో ఉన్న జిల్లా ప్రజా పరిషత్ ఆస్తులకు సంబంధించిన వివరాలు (1608) కంప్యూటర్‌లో నిక్షిప్తం చేయటం జరిగింది. దీని ద్వారా ఆస్తుల వివరాలకు సంబంధించి సమగ్ర సమాచారం అందుబాటులో ఉండటమే కాకుండా, అన్యాక్రాంతం, ఆక్రమణకు గురైనప్పుడు విచారణకు సరైన సమాధానం అందుబాటులో ఉంటుంది. అంతేకాకుండా ఆస్తుల చిత్రాలను ఇంటర్ నెట్‌లోని గూగుల్ ఎర్త్ వంటి సమాచార వ్యవస్థతో అనుసంధానం చేయటం ద్వారా భౌగోళికంగా ఆస్తులు ఎక్కడ ఉన్నాయో తెలుసుకోవచ్చును.




***ఈ విధంగా దస్త్రాలను కంప్యూటర్‌లో నిక్షిప్తం చేయటం వలన క్రింది ప్రయోజనాలు ఉన్నాయి.***

★ రికార్డు గదిలో దశాబ్దాల తరబడి పాతరికార్డులు యధాతథంగా

భద్రపరచడం క్లిష్టమైన పని. కాబట్టి ఎప్పటికప్పుడు పాత రికార్డును దగ్ధం చేయకపోతే రికార్డు గదిలో చోటు చాలదు. అదేవిధంగా కాలం గడిచేకొద్దీ పేపరు పాడవడం సహజం. ఎంత విలువయిన సమాచారమయినా కొంత కాలానికి కనుమరుగవుతుంది. కెమికల్స్ ద్వారా ముఖ్యమైన రికార్డు భద్రపరచడం ఖర్చుతో కూడుకున్న పని. కాబట్టి తక్కువ ఖర్చుతో రికార్డును కంప్యూటర్‌లో పదిలపరచడం ఒకే ఒక మార్గం.

★ యావత్తు రికార్డును ముఖ్యంగా చారిత్రక ప్రాముఖ్యత కలిగిన రికార్డులు, ఆస్తులకు సంబంధించిన డాక్యుమెంట్లతో పాటుగా కార్యాలయంలోని ప్రతి దస్త్రం స్కాన్ చేయబడి, డిజిటైజు చేయబడి కంప్యూటర్‌లో నిక్షిప్తం చేయడం వలన, ఎటువంటి విపత్కర పరిస్థితులలోనూ రికార్డు భద్రంగా వుంచవచ్చు.


★ దస్త్రం తొలగించడంకానీ, దస్త్రంలోని పేజీలలోని విషయం అర్థం మారిపోయేలా అక్షరాలను మార్చడం గాని, దస్త్రంలోని కొన్ని పేజీలు తొలగించడం కాని జరుగకుండా నివారించవచ్చు.

★ రికార్డు గదిలో దస్త్రాలు వెతికి తీసుకోవడం కన్నా, కంప్యూటర్‌లో దస్త్రాలు వెతికి పట్టుకోవడం చాలా తేలిక.

★ కార్యాలయంలోని అన్ని విభాగాల పర్యవేక్షకులు వారికి కావలసిన దస్త్రాన్ని రికార్డు గదిలోకి వెళ్ళవలసిన అవసరం లేకుండానే, నేరుగా వారి వద్దనున్న కంప్యూటరు నుండి పాత దస్త్రాలను చూసుకోవచ్చు.






First Prev Next Last

18-2-58

First Prev Next Last

★ ఇంటర్నెట్ ద్వారా మొత్తం రికార్డును పూర్తి పారదర్శకతతో చూపించవచ్చు.

★ సమాచారహక్కు చట్టం ద్వారా కోరిన సమాచారాన్ని వెంటనే అందచేయవచ్చు.

★ సమాచార హక్కు చట్టం 2005 ప్రకారం ఎవరైనా వారికి కావలసిన రికార్డును కంప్యూటరు ద్వారా తగు రుసుం చెల్లించి తక్కువ వ్యవధిలో చూసుకోవచ్చు.

★ సర్వీసులోకి క్రొత్తగా వచ్చిన జూనియర్ సిబ్బంది సీనియర్లు వ్రాసిన పాత దస్త్రాలు చూసి నేర్చుకోవచ్చు.... పని తీరు మెరుగు పరచుకోవచ్చు.

★ అధికారులతో సహా యావన్మంది సిబ్బంది సర్వీసు రిజిష్టరులు కూడా ఎవరైనా కంప్యూటర్‌లో చూసుకోవచ్చు.

★ భవిష్యత్తులో మండల ప్రజా పరిషత్ రికార్డులు కూడా ఇదే పద్ధతిలో డిజిటైజ్ చేయవచ్చు.

ఈ విధానంవలన జిల్లా ప్రజా పరిషత్ సమాచార యాజమాన్యం పటిష్ట స్థితిని చేరుకోవడమే కాకుండా, నూటికి నూరు శాతం పారదర్శకత, జవాబుదారీతనం, జాప్యం లేని విధంగా పరిపాలన సాగిస్తున్న జిల్లా ప్రభుత్వంగా (జిల్లా ప్రజా పరిషత్) రాష్ట్రంలోనే ముందుస్థానంలో ఉందనటంలో సందేహం లేదు.

**– ఎ. సుభాష్‌చంద్రగౌడ్**

*ఎం.పి.డి.ఓ, జిల్లా పరిషత్, తూర్పుగోదావరి జిల్లా*



**ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో పేదప్రజలకు మంజూరుచేసిన ప్రభుత్వ భూముల బదలాయింపును (అన్యాక్రాంతాన్ని) ఆంధ్రప్రదేశ్ ఎసైన్డ భూములు బదలాయింపు చట్టం 09/1977 నిషేధిస్తుంది. ఈ చట్టం 21-1-1977 నుండి అమలు లోనికి వచ్చింది. ఈ చట్టం అంతకుముందు జరిగిన బదలాయింపులకు కూడా వర్తిస్తుంది. ఆంధ్రప్రదేశ్ అంతటికి వర్తిస్తుంది.**

ఎసైన్‌మెంటు భూమి అంటే ఇతరులకు అన్యాక్రాంతం చేసే హక్కు లేకుండా ప్రభుత్వ నిబంధనలననుసరించి భూమి లేని పేదవారికి మంజూరు చేసిన ప్రభుత్వ భూములు. చట్టం ద్వారా స్వాధీనం చేసుకొని భూమిలేని పేదవారికి ఇచ్చిన సీలింగు మిగిలు భూములని అర్థం. మంజూరు చేసిన భూములు, లబ్ధిదారు సాగుచేసుకొని వంశపారంపర్యంగా అనుభవించవలసిందేగాని, అన్యాక్రాంతం చేయరాదు. ప్రభుత్వ భూములు నివేశ స్థలాలకు మంజూరు చేసినవి కూడా వంశపారంపర్యంగా అనుభవించవలసిందే గాని అన్యాక్రాంతం చేయరాదు.

తనఖా పెట్టడం కూడా బదలాయింపు నిర్వచనం కిందికి వస్తున్నప్పటికీ 1964 కో-ఆపరేటివ్స్ చట్టం కింద రిజిష్టరైన కో-ఆపరేటివ్ సొసైటీలలోనూ, కేంద్ర, రాష్ట్ర, స్థానిక ప్రభుత్వాల గుర్తింపు పొందిన జాతీయ, వాటి అనుబంధ బ్యాంకులకు తనఖా పెట్టుకోవడం ఈ నిర్వచనం (బదలాయింపు) కిందకు రాదు.

బదలాయింపు అంటే అమ్మటం, కానుక (గిఫ్ట్), మార్పిడి, స్వాధీన, అస్వాధీన తనఖాలు, కౌలు లేదా ఎసైన్‌మెంటు భూములకు సంబంధించిన ఏ వ్యవహారమైన బదలాయింపు నిర్వచనం కిందికి వస్తుంది.

బదలాయింపు ద్వారా భూమి పొందిన వ్యక్తి నుండి ఎసైన్‌మెంట్ భూమిని స్వాధీన పరుచుకోమని అదేశించాలి.

ప్రభుత్వం నోటిఫై చేసినటువంటి ప్రాంతాలలో స్వాధీన పరుచుకున్న ఎసైన్‌మెంటు భూములను ప్రజా ప్రయోజనాలకు ఉపయోగిస్తారు (సవరణ చట్టం 2007). ఇతర ప్రాంతాలలో స్వాధీన పరుచుకున్న ఎసైన్‌మెంటు భూములను అసలు లబ్ధిదారునికి తిరిగి యిచ్చే రోజుకి అర్హుడు అయి ఉంటే అతనికి ఒక్కసారి మాత్రమే తిరిగి అందచేయాలి. అది సాధ్యం కాని పక్షంలో అమలులోవున్న నిబంధనలను అనుసరించి పేదవారికి ఎసైన్ చేయాలి. ఆ గ్రామంలో అట్టి పేద వారు లేకపోతే సదరు భూమిని ప్రజా ప్రయోజనాలకు ఉపయోగించాలి (సవరణ చట్టం 2007).

ఈ చట్టం కింద ఇచ్చిన ఆదేశాలను సివిల్ కోర్టులలో ప్రశ్నించడానికి వీలు లేదు. ఈ చట్టాన్ని అనుసరించి చేపట్టే చర్యలపైన, అధికారులపైన, ప్రభుత్వంపైన ఇంజక్షన్ ఇచ్చే అధికారం సివిల్ కోర్టులకు లేదు.

(సవరణ) చట్టం, 2007 ప్రకారం అమల్లోకి వచ్చిన నాటికి (29ట-1-2007), 45 రోజులలో తహశీల్దారు పరిధిలో అసైన్ చేయబడిన మొత్తం భూములు, క్రొత్తగా అసైన్ చేసిన భూముల వివరాలను సంబంధిత రిజిష్టరింగ్ అధికారికి తెలియజేయాలి. ఎసైన్‌మెంటు భూముల బదలాయింపుకు సంబంధించి ఏ వ్యవహారాన్ని రిజిస్ట్రేషన్ శాఖ రిజిష్టర్ చేయకూడదు.

# ఆంధ్రప్రదేశ్ ఎసైన్డ్ భూములు బదలాయింపు (నిషేధ) చట్టం 9/1977 అమలు ప్రక్రియ

చట్టం రావడానికి ముందుగానీ, తరువాత గానీ ప్రభుత్వం ద్వారా వ్యవసాయానికి లేదా గృహ నివాసానికి మంజూరు చేసిన ఎసైన్‌మెంటు భూమిని బదలాయించడం నిషేధించబడింది. అమలులో వున్న మరేదైనా చట్టం ద్వారా గానీ లేదా రికార్డుల ద్వారా గానీ ఎసైన్‌మెంట్ భూమిని బదలాయించకూడదు. చట్ట విరుద్ధంగా అన్యాక్రాంతం పొందిన వ్యక్తికి ఆ భూమిపై హక్కు గానీ, యజమానిత్వం (title) గానీ ఉండవు.

భూమిలేని పేదవారెవరూ తమకు మంజూరు చేసిన ఎసైన్‌మెంట్ భూములను అన్యాక్రాంతం చేయకూడదు. అమ్మకం, కానుక, కౌలు, తనఖా, మార్పిడి, మరే ఇతర రూపాలలోనూ ఇతరులు ఆ భూమిని పొందకూడదు. చట్టంలోని నిబంధనలకు విరుద్ధంగా బదలాయింపు జరిగితే దానికి చట్టపరంగా ఎట్టి గుర్తింపు, హక్కు వుండదు.

సివిల్ కోర్టు ఆదేశాల ద్వారా, డిక్రీ అమలు ద్వారా లేదా అధికార వ్యవస్థల అదేశాల ద్వారా గానీ పైన తెలిపిన విధంగా ఎసైన్‌మెంటు భూమిని బదలాయింపు చెయ్యటం చెల్లదు.

కానీ 29-1-2007కు ముందు ఎవరైనా పేదవారు వ్యవసాయం కోసం లేదా ఇంటి నివాసం కోసం సదుద్దేశంతో, సక్రమ పద్ధతుల్లో, భూమిని కొని వారు దాన్ని అనుభవిస్తుంటే అటువంటివారికి ఈ చట్టం వర్తించదు.

చట్టంలోని నిబంధనలకు విరుద్ధంగా బదలాయింపు జరిగిందని జిల్లా కలెక్టరు విశ్వసిస్తే తాశీల్దారు కంటే దిగువ స్థాయి కాని అధికారిని

అయితే కేంద్ర, రాష్ట్ర, స్థానిక ప్రభుత్వాలకు, జాతీయ బ్యాంకులు, కో-ఆపరేటివ్ బ్యాంకులు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నడిపే, నియంత్రించే ఆర్థిక సంస్థలకు ఎసైన్‌మెంట్ భూములను తనఖా పెట్టుకొనే సందర్భంలో ఈ సెక్షన్ వర్తించదు.

చట్టంలోని నిబంధనలకు విరుద్ధంగా ఎవరైనా ఎసైన్‌మెంట్ భూమిని అన్యాక్రాంతంగా పొందితే అట్టి వ్యక్తికి 6 నెలలు జైలుశిక్ష, 2 వేల రూపాయల వరకు జరిమానా విడివిడిగా గానీ, కలిపిగానీ విధించవచ్చు.

ఏ అధికారి అయినా పై నిబంధనలు పాటించనట్లయితే అట్టి అధికారి కి 6 నెలలు జైలు శిక్ష గాని, 10,000 రూపాయలు జరిమానా గాని లేక రెండు కలిపి విధించవచ్చు.

సవరణ చట్టం 2007 అమలులోకి వచ్చిన (29-1-2007) 90 రోజులలో తన స్వాధీనంలోనున్న ఎసైన్ చేసిన భూమిని, స్వచ్ఛందంగా సరెండర్ చేసిన వారిని శిక్షల నుండి మినహాయిస్తారు.

*– బి. వెంకటేశ్వర రావు, కన్సల్‌టెంట్, ల్యాండ్ సెల్*

**సమాజంలో ఎయిడ్స్ తీవ్రతను తెలియచేయడంలో 'ప్రపంచ ఎయిడ్స్ దినం' ప్రధాన పాత్ర వహిస్తుంది. ఎయిడ్స్ వ్యాధి గురించి ప్రజలకు తెలియజేయటంతో పాటు వ్యాధి వ్యాప్తి చెందకుండా తీసుకోవలసిన జాగ్రత్తలను, నివారణ చర్యలను తెలియజేయటానికి దోహదపడుతుంది.**

**ఎయిడ్స్ వ్యాధిని గుర్తించినప్పటి (1981) నుంచి ఇప్పటి వరకు ప్రపంచ వ్యాప్తంగా సుమారుగా 25 మిలియన్ల ప్రజలు మరణించి ఉంటారని, దాదాపుగా 33 మిలియన్ల ప్రజలు హెచ్ఐవితో జీవిస్తున్నారని ఒక అంచనా.**



ఇంత తీవ్రస్థాయిలో వ్యాపిస్తున్న ఈ వ్యాధి తీవ్రతను గురించి సమాజానికి తెలియజేయటానికి ఒక రోజంటూ గుర్తించబడితే బాగుంటుందనే ఉద్దేశ్యంతో ప్రపంచ ఆరోగ్య సంస్థలో పబ్లిక్ ఇన్ఫర్మేషన్ ఆఫీసర్స్‌గా పనిచేసే జేమ్స్. డబ్ల్యు. బన్, థామస్ సాట్టర్ల సూచనల మేరకు ప్రపంచ ఆరోగ్య సంస్థవారు 1988 డిసెంబర్ 1ని మొట్టమొదటి ప్రపంచ ఎయిడ్స్ దినంగా ప్రకటించటం జరిగింది. ఆ నాటి నుంచి ప్రతి సంవత్సరం డిసెంబర్ 1న ప్రపంచ ఎయిడ్స్ దినంగా జరుపుకోవటం ఆనవాయితీగా వస్తూంది.

సుమారు 2.31 మిలియన్ల ప్రజలు హెచ్ఐవి/ఎయిడ్స్‌తో జీవిస్తున్నారనే నిజం ఈ వ్యాధి తీవ్రతను తెలియజేస్తుంది.

ప్రారంభంలో మన దేశంలో ఈ వ్యాధి ఒక ప్రత్యేక సముదాయం (సెక్స్ వర్కర్లు, ట్రక్ డ్రైవర్లు) లో మాత్రమే ఎక్కువగా గుర్తించారు. కానీప్రస్తుతం అన్ని రకాల ప్రజలు దీని బారిన పడుతున్నారు. ఈ వ్యాధికి ఏ విధమైన లింగ, వయో, జాతి బేధంలేదు. ముఖ్యంగా యువకులు, స్త్రీలు ఈ వ్యాధి బారిన పడుతున్నారు. HIV వ్యాధిగ్రస్తులలో దాదాపుగా 88.7% మంది 15 నుంచి 45 సంవత్సరాల వారై ఉండటం గమనార్హం.

**మన రాష్ట్రంలో సుమారుగా 5 లక్షల మంది హెచ్ఐవి/ ఎయిడ్స్ వ్యాధిగ్రస్తులున్నారని అంచనా.** మొత్తం భారతదేశంలో 187 జిల్లాలలో ఈ వ్యాధి తీవ్రత ప్రమాదకర స్థాయిలో ఉందని గుర్తించగా, ఆంధ్రప్రదేశ్‌లోని 23 జిల్లాలు 'A' కేటగిరిలోనే ఉండటం బాధాకరమైన విషయం.

*మన రాష్ట్రంలో ఈ వ్యాధి ఇంత తీవ్రస్థాయిలో ఉండటానికి ఈ క్రింది కారణాలు దోహదపడుతున్నాయని చెప్పవచ్చు.*

* సమాజంలో లైంగిక వ్యాధుల తీవ్రత ఎక్కువగా ఉండటం (సామాన్య ప్రజలలో 6-7% మరియు హైరిస్క్ గ్రూప్‌లలో 26%)
* ఒకరి కంటే ఎక్కువ మందితో లైంగిక సంబంధాలను కలిగి ఉండటం, కండోమ్ వాడకం తక్కువగా ఉండటం. (25%)
* సాంప్రదాయ, సాంప్రదాయేతర పద్ధతులలో వ్యభిచార వృత్తిని స్వీకరించడం, బాలికలను లైంగిక వ్యాపారంలోకి తరలించడం.
* సుదీర్ఘమైన రవాణా వ్యవస్థ (రైలు, రోడ్డు) కలిగి ఉండటం, పర్యాటక రంగం, హోటల్ పరిశ్రమ అభివృద్ధి చెందియుండటం.
* పారిశ్రామికీకరణ కారణంగా ప్రజలు ఒక ప్రాంతం నుంచి వేరొక ప్రాంతానికి, వేరొక దేశానికి వలస వెళ్ళి రావడం.

# ఎ.బి.సి వ్యూహంతో హెచ్ఐవి వ్యాప్తికి అడ్డుకట్ట

### ప్రపంచ ఎయిడ్స్ దినాన్ని జరుపుకోవటానికి ముఖ్య ఉద్దేశం

* ప్రపంచ వ్యాప్తంగా వివిధ స్థాయిలలోని ప్రజలకు ఎయిడ్స్ వ్యాధి పట్ల సంపూర్ణ అవగాహన కల్పించటం.
* ప్రజలకు ఈ వ్యాధి సమాజంపై చూపే ప్రభావాన్ని తెలియజేయటం.
* ఎయిడ్స్ వ్యాధిపై అవగాహనను పెంపొందించుకునే విధంగా ప్రజల దృష్టిని మళ్లించటం.
* ఎయిడ్స్ వ్యాధి నివారణ, చికిత్స, దానిని నిర్మూలించటానికి అవలంబించవలసిన పద్ధతులను ప్రజలకు తెలియచేయటం. దీని నిర్మూలనకు అవసరమైన ప్రయోగాలు జరపటానికి కావలసిన ధనాన్ని సమకూర్చుకోవటం.
* ప్రజలకు హెచ్ఐవి/ఎయిడ్స్‌ల గురించి సంపూర్ణ అవగాహన కల్పించి, ఇది వ్యాప్తి చెందకుండా తీసుకోవలసిన జాగ్రత్తలను గురించి తెలియచేయటం.

ప్రతి సంవత్సరం ప్రపంచ ఎయిడ్స్ దినం సందర్భంగా ఒక నినాదాన్ని తీసుకుని దానిని ప్రజలలో చర్చనీయాంశంగా ఉంచి, ఈ వ్యాధిపై అవగాహన పెంపొందించుకొనే విధంగా దోహదం చేయటం జరుగుతుంది. 2005 నుంచి 2010వ సంవత్సరం వరకు, 'ఎయిడ్స్‌ను ఆపు- వాగ్దానాన్ని నిలుపు' అనే నినాదాలను చర్చనీయాంశాలుగా ఎంచి, ఈ వాగ్దానాలను నిలుపుకోవటానికి కావలసిన సహాయ సహకారాలను అందించటం జరుగుతుంది.

దక్షిణాఫ్రికా, నైజీరియాల తర్వాత అత్యధిక HIV వ్యాధిగ్రస్తులు ఉన్న దేశంగా భారతదేశం గుర్తించబడింది. మనదేశంలో మొట్టమొదటి ఎయిడ్స్ కేసు 1986లో తమిళనాడులో గుర్తించటం జరిగింది. కేవలం 20 సంవత్సరాలలో 2007లో జరిపిన గణాంకాల ప్రకారం మన దేశంలో

### హెచ్. ఐ.వి/ ఎయిడ్స్ మధ్యగల బేధాలు ఏమిటి

హెచ్.ఐ.వి/ ఎయిడ్స్ అనే రెండు పదాలు కలిసి ఉన్నందున అవి రెండూ ఒకటే అన్న భావన చాలామందిలో ఉంది. కాని ఈ రెండు వేరు. హెచ్.ఐ.వి., ఎయిడ్స్ ఒకటి కాదు. హెచ్.ఐ.వి సంక్రమించడంతో ఎయిడ్స్ వస్తుంది.

***హెచ్.ఐ.వి అనగా***

హెచ్ - అంటే హ్యూమన్ (మానవులలో).
ఐ - అంటే ఇమ్యూనో డెఫిషియన్సి (మానవ శరీరంలోని సహజమైన వ్యాధి నిరోధక శక్తి లోపించడము).
వి - అంటే వైరస్ (ఒక రకమైన క్రిమి).

***ఎయిడ్స్ అంటే***

ఎ - అంటే ఎక్వయిర్డ్ (సంపాదించుకొన్న).
ఐ - ఇమ్యూనో (వ్యాధి నిరోధక శక్తి).
డి - అంటే డిఫిషియన్సి (లోపం, బలహీనత).
ఎస్ - అంటే సిండ్రోమ్ (కొన్ని రోగ లక్షణాల సముదాయం).

***హెచ్. ఐ.వి. ఎలా వ్యాప్తి చెందుతుంది***

***అసురక్షిత లైంగిక సంబంధాల వలననే వ్యాధి సంక్రమిస్తుంది :*** దాదాపు 87% మందిలో అసురక్షిత లైంగిక సంబంధాల వలననే వ్యాధి సంక్రమిస్తుంది.

***హెచ్.ఐ.వి సంక్రమించిన తల్లి నుంచి బిడ్డకు :*** దాదాపుగా 6% మంది హెచ్.ఐ.వి ఇన్‌ఫెక్షన్ తల్లి నుంచి సంక్రమిస్తుంది.

***కలుషితమైన సూదులు మరియు సిరెంజ్‌లను ఉపయోగించడం:*** దాదాపుగా 1.3 శాతం మందికి ఈ మార్గం ద్వారా హెచ్.ఐ.వి సంక్రమిస్తుంది.

***కలుషితమైన రక్త మార్పిడి ద్వారా :*** సుమారుగా 1.1% మందికి ఈ మార్గం ద్వారా వ్యాధి సంక్రమిస్తుంది.

***హెచ్. ఐ.వి ఎలా వ్యాప్తి చెందదు?***

* హెచ్.ఐ.వి వ్యాధిగ్రస్తులతో కరచాలనం చేయటం వలన
* హె.చ్.ఐ.వి వ్యాధి గ్రస్తులతో కలిసి ప్రయాణం చేయడం వలన
* ఒకే కంచంలో కలిసి భుజించడం వలన
* ఒకే మరుగుదొడ్డిని ఉపయోగించడము వలన
* దోమ కాటు ద్వారా కాని లేదా కలిసి పనిచేయడం వలన కాని ఈ వ్యాధి వ్యాప్తి చెందదు.
* ప్రజా స్నానశాలలను ఉపయోగించటం వలన, లాలాజలం, జలుబు ద్రవాలు, చెవిలో చీము, కన్నీరు, చెమట, మల మూత్రాల వలన వ్యాప్తి చెందదు.

***హెచ్.ఐ.వి పరీక్ష ఎవరికి అవసరం***

హెచ్.ఐ.వి ఎవరికైనా సోకవచ్చు. జీవితంలో ఏదో ఒకసారి ప్రమాదకర సంఘటనలో పాల్గొన్నా లేదా ప్రమాదకర ప్రవర్తన కలిగి ఉన్న వారెవరైన హెచ్.ఐ.వి పరీక్ష చేయించుకోవాలి. గర్భందాల్చిన ప్రతి స్త్రీ కూడా హెచ్.ఐ.వి పరీక్ష చేయించుకోవాలి.

***హెచ్.ఐ.వి పరీక్ష ఎక్కడ చేయబడుతుంది***

వైద్య కళాశాల, జిల్లా వైద్యశాల, ఏరియా వైద్యశాల, కమ్యూనిటీ ఆరోగ్య కేంద్రంలో ఉన్న ఇంటిగ్రేటెడ్ కౌనిల్సింగ్ టెస్టింగ్ కేంద్రాలలో (ICTC) ఉచితంగా హెచ్.ఐ.వి పరీక్ష చేయబడుతుంది.

హెచ్.ఐ.వి వ్యాప్తిని నివారించడానికి సమాజంలో వ్యాధిగ్రస్తులను గుర్తించడానికి, వారికి కావలసిన సహాయ సహకారాలను అందించడానికి ప్రభుత్వం వివిధ రకాలైన సేవలను ప్రవేశ పెట్టింది

## సమీకృత సలహా పరీక్షా కేంద్రం (ICTC)

*ఈ క్రింది సేవలను ఐసిటిసిలో పొందవచ్చు.*

* హెచ్. ఐ.వి వ్యాధి గ్రస్తులలో మానసిక ధైర్యాన్ని పెంపొందించడం.
* పరీక్షా ఫలితాలను అంగీకరించే విధంగా వారిని సంసిద్ధపరచడం
* వ్యక్తి రిస్క్‌ను అంచనావేసి, దానిని తగ్గించుకోవడానికి ప్రణాళికలను రూపొందించుకోవడంలో వ్యక్తికి సహాయపడటం.
* వ్యాధిగ్రస్తుని నుంచి ఇతరులకు హెచ్.ఐ.వి. వ్యాధి సోకకుండా నివారణా మెళుకువలను తెలియజేయటం.
* వ్యక్తికి సంబంధించిన అన్ని విషయాలను గోప్యంగా ఉంచడం.

## ప్రివెన్షన్ ఆఫ్ పేరెంట్ - టు - చైల్డ్ ట్రాన్స్‌మిషన్ (PPTCT)

హెచ్.ఐ.వి పాజిటివ్ గర్భిణి స్త్రీ నుంచి శిశువుకు వైరస్ సంక్రమించకుండా పిపిటిసిటి కార్యక్రమం తోడ్పడుతుంది.

ఈ కార్యక్రమంలో ప్రతి గర్భిణి స్త్రీకి HIV/AIDS పట్ల అవగహన కల్పిస్తూ వారు స్వచ్ఛందంగా పరీక్ష చేయించుకొనడానికి ప్రోత్సహిస్తారు. ఒక వేళ తల్లికి HIV సంక్రమించి ఉంటే ప్రసూతి సమయంలో శిశువుకు పాలిచ్చే సమయంలో తీసుకోవలసిన జాగ్రత్తలను తెలియబరుస్తూ, ఔషధాలవలన తల్లి నుంచి బిడ్డకు వ్యాధి సంక్రమించకుండా పిపిటిసిటి కార్యక్రమం సహాయపడుతుంది.

## ఎఆర్‌టి కేంద్రం (యాంటి రిట్రోవెరల్ చికిత్సా కేంద్రం)

హెచ్.ఐ.వి పూర్తిగా నిర్మూలించడానికి చికిత్స లేదు కాని వారి జీవిత కాలాన్ని పెంపొందించడంలో ఎఆర్‌టి మందులు ఉపయోగపడతాయి.

ప్రభుత్వం అన్ని జిల్లా వైద్యశాలల్లో ఎఆర్‌టి కేంద్రాలను ఏర్పాటుచేసి ఎఆర్‌టి మందులను ఉచితంగా పంపిణీ చేస్తుంది. ఇది చాలా ఖర్చుతో కూడిన వైద్యం. ఒకసారి చికిత్స మొదలు పెడితే జీవిత పర్యంతం చికిత్స తీసుకోవాలి. ఎఆర్‌టి మందుల వలన కూడా కొన్ని దుష్ఫలితాలు ఉన్నాయి.

## కమ్యూనిటీ కేర్ సెంటర్స్

ఈ సెంటర్స్ ప్రభుత్వేతర సంస్థలచే నిర్వహించబడతాయి. ఈ సెంటర్లు ఎఆర్‌టి కేంద్రాలకు అనుసంధానంగా ఉంటూ అవకాశ వ్యాధులకు చికిత్స చేస్తూ ఎఆర్‌టి మందులు సక్రమంగా ఉపయోగించే విధంగా హెచ్ఐవి/ఎయిడ్స్ బాధితులకు ప్రోత్సాహం అందిస్తాయి.

## రక్త నిధి కేంద్రాలు

స్వచంధ రక్తదానాన్ని ప్రోత్సహిస్తూ, అన్ని ప్రాంతాలలో సురక్షిత రక్త సేకరణ కేంద్రాలను అందుబాటులో ఉంచి అన్ని వేళల్లో సురక్షిత రక్తం అందుబాటులో ఉండే విధంగా ప్రభుత్వం అనేక చర్యలు చేపడుతుంది.

## టార్గెటెడ్ ఇంటర్‌వెన్షన్స్ ప్రోగ్రామ్

**(TARGETED INTERVENTIONS)**

హెచ్.ఐ.వి. ప్రబలడానికి ముఖ్య కారకులైన హైరిస్క్ గ్రూప్స్, సెక్స్‌వర్కర్లు, స్వలింగ సంపర్కులు, ట్రక్ డ్రైవర్లు, వలసదారులు, తదితరుల ను గుర్తించి వారి ద్వారా ప్రత్యేకమైన నివారణ చర్యలను చేపట్టడం ద్వారా మాత్రమే హెచ్.ఐ.వి వ్యాప్తిని సులభంగా అరికట్టగలమనే ఉద్దేశ్యంతో హైరిస్క్ గ్రూప్స్ హెచ్.ఐ.వి.లో నివారణ చర్యలను చేపట్టడానికి ప్రాధాన్యత ఇవ్వడం జరుగుతుంది. ఈ కార్యక్రమంలో స్వచ్ఛంధ సంస్థలు, కమ్యూనిటీ ప్రజల భాగసామ్యాన్ని ఎక్కువగా ప్రోత్సహిస్తున్నారు.

హెచ్.ఐ.వి. ని ఒక వ్యక్తిగత సమస్యగానే కాక, దీనిని ABC వ్యూహం ద్వారా సాధించవచ్చు. ABC లో ఒక సామాజిక సమస్యగా గుర్తించాలి. ఎంతోమంది చిన్నారులు తమ తల్లితండ్రులను కోల్పోయి తాతయ్య, నానమ్మ, అమ్మమ్మల సంరక్షణలో జీవిస్తున్నారు. జీవిత చరమాంకంలో వయోవృద్ధులు తిరిగి ఆ చిన్నారుల బాధ్యతలను నిర్వహించాల్సి రావడం నిజంగా దయనీయం.

హెచ్.ఐ.వి.ని నిర్మూలించలేం కాని నివారించడం అసాధ్యమేమీ కాదు.

A - ABSTINENCE (వివాహానికి ముందు లైంగిక సంబంధాలకు దూరంగా ఉండటం).

B - BE FAITHFUL TO YOUR LIFE PARTNER (జీవిత భాగస్వామితో మాత్రమే విశ్వనసీనయంగా ఉండటం).

C - CORRECT AND CONSISTANT USE OF CONDOMS. (సరియైన పద్ధతిలో ఎల్లప్పుడు నిరోధ్‌ను వాడటం.

చేయి చేయి కలుపుదాం ABC వ్యూహంతో హెచ్ఐవి వ్యాప్తిని అరికడదాం.

***- విజయలక్ష్మి,*** *STRC - CWCD, అపార్డ్*

గ్రామపంచాయితీ వ్యవస్థ అనగానే సాధారణంగా అందరికీ గుర్తుకు వచ్చేది మహాత్మాగాంధీజీ. ఎందుకంటే, అప్పటి గ్రామీణ వ్యవస్థలను ఆయన 'రిపబ్లిక్‌లు'గా అంటే ప్రజాస్వామ్యబద్ధ పాలన నిలయాలుగా భావించి, వాటి విస్తరణకు అనేక సలహాలు ఇవ్వడం జరిగింది. ఇది ఒక కోణం అయితే, రెండవ కోణం రాజ్యాంగ నిర్మాత, బాబాసాహెబ్ డా॥ బి.ఆర్. అంబేద్కర్. ఈయన ఆనాటి గ్రామీణ వ్యవస్థలను అప్రజాస్వామిక వ్యవస్థలుగా అభిప్రాయపడ్డారు. ఒకరు బానిసత్వం నుండి విముక్తికి పోరాడారు, మరొకరు భావిభారత నిర్మాణానికి కృషి చేసినవారు.

1933లో జనవరి, ఫిబ్రవరి మాసాలలో బొంబాయి శాసనసభ సమావేశాలలో అప్పటి 'గ్రామపంచాయితీల బిల్లు'పై డా॥ అంబేద్కర్ మాట్లాడిన విషయాలను పరిశీలించటం ద్వారా ఆయన అభిప్రాయాలను కొంతవరకు తెలుసుకొనగలుగుతాం.



# గ్రామ పంచాయితీల బిల్లుపై డా॥ బి.ఆర్. అంబేద్కర్ అభిప్రాయాలు - ఒక విశ్లేషణ

## డా॥ అంబేద్కర్ 54వ వర్ధంతి సందర్భంగా . . .

1933లో బొంబాయి ప్రెసిడెన్సీ శాసనసభలో అప్పటి స్థానిక పాలనకు సంబంధించిన మంత్రి గ్రామాలకు స్వపరిపాలనాధికారాలు ఇచ్చే క్రమంలో 'గ్రామ పంచాయితీల బిల్లు'ను చర్చకు ప్రవేశపెట్టడం జరిగింది. అధికార వికేంద్రీకరణ ఒక మంచి ప్రక్రియ అని,



ఆహ్వానిస్తూనే ఆ బిల్లుపై అప్పటి పరిస్థితులలో తన అభిప్రాయాలను డా॥ బి.ఆర్. అంబేద్కర్ వ్యక్తపరచడం జరిగింది. ముందుగా వాటిని వరుస క్రమంగా పరిశీలిద్దాం.

**మొదటి అంశం :** "గౌరవనీయులైన మంత్రివర్యులు ప్రధానమైన స్థానిక పాలనకు సంబంధించిన గ్రామ పంచాయితీల బిల్లును ప్రవేశపెట్టి, వారం రోజులలో ఆమోదించవలసిందిగా కోరారు. కాని దీనిని కేవలం పరిపాలన పరంగానే చూడక, ప్రజల స్వేచ్ఛ, జీవన విధానం, కనీస అవసరాలు, ఆర్థిక వనరులు, వాటిపై వారి హక్కులు వంటివి ఎన్నో పరిశీలించాల్సిన అవసరం ఉంది. కాబట్టి దీనికి ఏడు రోజులు కాక, ఏడు నెలలు గడువు ఇచ్చి, సమగ్రంగా పరిశీలించాల్సిన అవసరం ఉందని నేను భావిస్తున్నాను" అని డా॥ అంబేద్కర్ అభిప్రాయపడ్డారు.

దీనికి కారణం మన దేశ గ్రామీణ ప్రాంతాలలో ప్రజలు నిరక్షరాస్యత, కులవ్యవస్థ ముసుగులో, మూఢాచారాలతో విడిపోయి బ్రతుకుతున్నారు. కొందరు ఎక్కువగాను, మరికొందరు తక్కువగాను సాంఘికంగా, ఆర్థికంగా చూడబడే ప్రస్తుత పరిస్థితులలో ప్రజలకు ఇస్తున్న స్వపరిపాలన, న్యాయపరమైన విధులు సక్రమంగా వినియోగించుకోగలుగుతారా? అనేది నాకున్న అనుమానం.

అనగా గ్రామస్థాయిలో స్వపరిపాలనను అప్పటికున్న పరిస్థితులలో అవి ఏ విధమైన ప్రభావం చూపుతాయో సమగ్రంగా

పరిశీలించాలనేది డా॥ బి.ఆర్. అంబేద్కర్ అభిప్రాయం. అప్పటి గ్రామాలలో మత ప్రభావం, బంధుప్రీతీ, అంటరానితనం, అసమానతలు ఉన్నవన్నది వాస్తవమైనపుడు, గ్రామస్థాయిలో అధికారాలు అందరికీ ప్రజాస్వామ్యబద్ధంగా అందగలవా లేదా అనేది సమగ్రంగా పరిశీలించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. అది మనం అందరం కూడా అంగీకరించాల్సిన విషయం.

**రెండవ అంశం:** "ఈ బిల్లు పూర్తిగా ప్రజలకు అంగీకారయోగ్యమేనా? లేదా వ్యతిరేకత ఉన్నదా?" అనే అంశాన్ని డా॥ అంబేద్కర్ అడిగారు.

దీనికి కారణం, అప్పటి ప్రజలు, ఈ బిల్లు ప్రవేశపెట్టమని అడగలేదు. అప్పటి రాజకీయ పార్టీ తన అజెండాలో పేర్కొనలేదు. పైగా సింథ్ రాష్ట్రంలో గ్రామపంచాయతీలు ఏర్పాటు చేయవద్దని, ఉద్యమాలు చేసిన అనుభవం ఉంది. 1920లో ప్రవేశపెట్టిన గ్రామపంచాయితీల చట్టంపై 1925లో నియమించిన కమిటీ రిపోర్టును, దానిలోని అంశాలు, సలహాలు పరిశీలించకుండా, ఈ బిల్లును ఇంత అత్యవసరంగా ప్రవేశపెట్టడానికి గల కారణం ఏమిటని డా॥ అంబేద్కర్ ప్రశ్నించారు. అందుకనే దీనిని సమగ్రంగా పరిశీలించమని ఆయన కోరడం జరిగింది.

**మూడవ అంశం:** జాతీయ భావంపై గ్రామస్థాయిలో ప్రజల అభిప్రాయం, దానిపై ఈ బిల్లు ప్రభావం కూడా పరిశీలించాల్సి ఉందనే అంశాన్ని డా॥ అంబేద్కర్ పేర్కొన్నారు. దీనికి కారణం అప్పటి ప్రజలలో కులతత్వం, మితిమీరిన వ్యక్తి పూజా భావం ఉండి, వర్గాలుగా విభజింపబడి, చిన్న చిన్న ఆవాసాలుగా విభజింపబడి, కొంతమంది సర్వస్వతంత్రంగాను, మరికొంతమంది బానిసలుగాను, మరికొంత మంది మిగిలిన వారితో సంబంధాలు లేకుండా జీవించే గ్రామీణ వ్యవస్థలో, ప్రాచీన కుల పంచాయితీల కారణంగా 'గ్రామాల సమాఖ్య'గానే జీవించడానికి అలవాటుబడ్డాయే తప్ప, ఏదో ఒక రాజుపై విధేయత తప్ప ప్రజలందర్నీ ఐక్యంగా ఉంచగలిగే జాతీయ భావాన్ని పెంపొందించే పునాది మన దేశ గ్రామీణ వ్యవస్థలో లేదు. ఈ బంధం ఏర్పడాలంటే, ఇప్పుడున్న అసమానతలు పోయి గ్రామంలో ఉన్న ప్రజలందరూ సమైఖ్యంగా, సమానంగా తమ హక్కులను వినియోగించుకొనే అవకాశం కల్పించగలిగే వ్యవస్థకు పునాది ఏర్పచాలి. దాని ద్వారా ఏర్పడే జాతీయవాదం స్థిరమైనదిగా ఉంటుంది. ఆ కోణంలో ప్రస్తుత బిల్లులోని అంశాలు ఈ విధంగా ఉన్నాయో లేదో అన్నది పరిశీలించాలని డా॥ అంబేద్కర్ అభిప్రాయం.

అసమానతలు పునాదులుగా, భిన్న సంస్కృతులు, సాంప్రదాయాలు, భిన్నత్వం గల సమూహాల మధ్య బలవంతంగా 'ఐక్యత', 'జాతీయ సమైక్యత' అనే భావాలు రుద్దడం వల్ల రావు. జాతీయ భావం రాకపోగా, పరిపాలన పేరుతో, కొన్ని వర్గాల ఆర్థిక వనరులపై, మరికొన్ని వర్గాల వారు అధికారం చలాయించడం వల్ల వారి మధ్య అభద్రతా భావం, ద్వేషం, తిరుగుబాట్లకు దారితీస్తుంది. కాబట్టి జాతీయతా భావం, స్వేచ్ఛ, సమానవత్వం అనే పునాదులపై నిర్మింపబడే అంశాలు ఈ బిల్లులో చర్చించవలసిన అవసరం ఉందని డా॥ అంబేద్కర్ అభిప్రాయపడ్డారు.

**నాల్గవ అంశం:** ప్రతి గ్రామంలో ప్రజలు అగ్రకులాలు, నిమ్న కులాలుగా విడిపోయి, కొందరు కనీస అవసరాలకు దూరంగా,



దయనీయంగా, బానిసలుగా, అంటరానివారుగా ఉన్నారని, వారికి తగిన న్యాయబద్ధమైన స్వేచ్ఛ, సమానత్వం తీసుకొచ్చే అంశాలను చర్చించకుండా దానిని 'జాతీయ భావం' అనే ముసుగులో అణచివేయడం, లేదా గుర్తించకపోవడం చాలా దురదృష్టకరమని, ఈ పరిస్థితులున్న ఇటువంటి గ్రామాలను 'రిపబ్లిక్‌లుగా' కీర్తించడాన్ని డా॥ అంబేద్కర్ తీవ్రంగా ఖండించారు. రిపబ్లిక్ అంటే బలవంతుడు సర్వహక్కులూ పొందుతూ, బలహీనులను ప్రాథమిక హక్కులకు దూరంగా, బానిసలుగా చేయడం కాదని, సమానత్వం ఉండాలని, దీనిని గుర్తించకపోవడం దురదృష్టకరమని డా॥ అంబేద్కర్ విమర్శించారు. ఈ బిల్లులో ఈ అంశంపై చర్చించవలసిన అవసరం ఉందని ఆయన పేర్కొన్నారు.

**ఐదవ అంశం:** ఈ బిల్లులో నిమ్నజాతులకు కేవలం ఓటుహక్కు ఇవ్వడం ద్వారా, వారు సామాజిక వ్యవస్థలో, రాజకీయాధికారంలో భాగస్వాములవుతారని భావించడం లేదని డా॥ అంబేద్కర్ అభిప్రాయాన్ని తెలిపారు.

దీనికి కారణం, అప్పుడున్న గ్రామాలలో అణగారిన కులాలు అల్పసంఖ్యాక వర్గాలవారుగా ఉన్నారు. ఎక్కువ గ్రామాలలో ఇలాంటి పరిస్థితి ఉన్నపుడు, సాధారణ ఎన్నికలలో ఎట్టి పరిస్థితులలోను మెజారిటీ కుల లేదా వర్గాలకు సంబంధించిన సభ్యులు మాత్రమే ఎన్నికవుతారు. అల్పసంఖ్యాకులు ఎప్పటికీ ఓటర్లుగానే మిగిలిపోతారు. ఒక మెజారిటీ హిందూ అగ్రవర్ణ అభ్యర్థిపై ఎక్కడా, ఎప్పుడూ, అల్పసంఖ్యాక వర్గాల ప్రతినిధి గెలవలేదు. నిమ్నజాతుల అభిప్రాయాలు, బాధలు, కష్టాలు, సమస్యలు ప్రభుత్వ దృష్టికి, లేదా చర్చకు తీసుకురాలేరు. కాబట్టి వారు అభివృద్ధి చెందలేరు.

కొన్ని వేల సంవత్సరాల నుండి, కనీస వసతులకు దూరమైన వారి పై ప్రత్యేకమైన శ్రద్ధ తీసుకొనవలసిన అవసరం ఎంతైనా ఉందని తాను భావిస్తున్నానని డా॥ అంబేద్కర్ అభిప్రాయపడ్డారు. దీనికి పరిష్కారంగా గ్రామ పంచాయతీల బిల్లులో అణగారిన వర్గాలకు ఓటు హక్కుతో పాటు, వారు ఎన్నికలలో గెలవలేరు కాబట్టి, కనీసం ఒక అభ్యర్థినైనా నిమ్నజాతుల ప్రతినిధిని నియమించుట ద్వారా మాత్రమే

వారికి రాజకీయాధికారంలో భాగస్వామ్యం కల్పించినపుడు మాత్రమే, వారు మిగిలిన వారితో 'సమానం' అనే భావన వారిలో వస్తుంది. ఈ అంశాన్ని పరిశీలించని పక్షంలో ఈ 'గ్రామపంచాయితీ బిల్లు' వల్ల వెనుకబడిన వర్గాలకు ప్రయోజనం ఏమీ ఉండదని, అలాంటప్పుడు దానిని తాను వ్యతిరేకిస్తానని డా॥ అంబేద్కర్ తన అభిప్రాయాన్ని తెలియజేయడం జరిగింది. ఈ సందర్భంలో స్వేచ్ఛ, సమానత్వం వంటి ప్రజాస్వామిక విలువలపై తనకున్న నమ్మకం, 'సామాజిక న్యాయం కోసం' ఆయనకున్న తెగింపు మనం అర్థం చేసుకొనవచ్చు.

***ఆరవ అంశం:*** ప్రజల చేత ఎన్నికైన ప్రజాప్రతినిధులు గ్రామస్థాయిలో స్థానిక స్వపరిపాలనా విధులే కాకుండా, కొన్ని క్రిమినల్, సివిల్ కేసులకు సంబంధించిన (న్యాయపరమైన) విధులు నిర్వహిస్తారు అని ఈ బిల్లులో ఉంది. దీనిని తాను పూర్తిగా వ్యతిరేకిస్తున్నాను అని డా॥ అంబేద్కర్ తన అభిప్రాయాన్ని చెప్పారు.

దీనికి కారణాలు ఆయన ఈ సందర్భంగా తెల్పిన అంశాల ద్వారా మనం అర్థం చేసుకొనవచ్చు. "ఓట్ల ద్వారా ఎన్నికైన ప్రజాప్రతినిధులు, గ్రామంలో న్యాయవ్యవస్థకు అధిపతులుగా, న్యాయ నిర్ణేతలుగా, సివిల్, క్రిమినల్ కేసులు విచారించడం అనేది నేను ప్రపంచంలో ఏ స్థానికపాలనా వ్యవస్థలోను చూడలేదు. ప్రజల ఓట్లను ఆశించేవారు, బంధుప్రీతి కలవారు, నిష్పక్షపాతంగా, న్యాయబద్ధంగా వ్యవహరిస్తారని నేను భావించడంలేదు, న్యాయవిధులు వారి ద్వారా నిర్వర్తించటం వల్ల అందరికీ సమన్యాయం జరుగుతుందని నేను భావించడం లేదు" అని డా॥ అంబేద్కర్ తన అభిప్రాయాన్ని తెలిపారు.

అంతేకాకుండా, న్యాయవిధులు నిర్వహించేవారికి, న్యాయశాస్త్రంలో శిక్షణ, నిర్ణయాలలో నిష్పాక్షికత, హోదాలో స్వతంత్రత ఈ మూడు ప్రధాన లక్షణాలుగా ఉండాలి. ఇవి లేని న్యాయవ్యవస్థ ద్వారా, ఇప్పుడు ఈ గ్రామపంచాయితీ బిల్లులో ఉన్న న్యాయ విధానం ద్వారా ప్రజలకు



మేలుకన్న, ప్రమాదం ఎక్కువ జరుగుతుందని. ఆయన అభిప్రాయపడ్డారు. దీనికి మరొక ఉదాహరణను ఆయన సభకు గుర్తు చేశారు. బొంబాయి హైకోర్టులోను, ఇతర ప్రాంతీయ న్యాయస్థానాలలోను ఐ.సి.ఎస్. సభ్యులు వారికి కొన్ని స్థానాలు కేటాయించమని కోరినప్పుడు, సభలోని వారంతా ఎంతో ఆందోళన చెందాం? కుదరదని అభ్యంతరం చెప్పాం! దానికి కారణం, న్యాయశాస్త్రంలో కనీస శిక్షణ లేని వారు, న్యాయవిధులు నిర్వహించలేరని సభలోని వారంతా అభిప్రాయపడ్డారు. మరి ఇప్పుడు కూడా నిరక్షరాస్యులు, న్యాయవ్యవస్థలోని ఎటువంటి కనీస శిక్షణలేని, కుల వ్యవస్థ, మూఢాచారాలతో గుంపులుగా అసమానతలు కలిగి జీవించేవారు, బంధుప్రీతి గలవారు, ప్రజల ఓట్లను ఆశించే ప్రజాప్రతినిధులు న్యాయబద్ధంగా వ్యవహరించలేరని, దీని వలన బలహీన వర్గాలకు, అల్పసంఖ్యాక వర్గాలకు మరింత అన్యాయం జరిగే ప్రమాదం ఉందని డా॥ అంబేద్కర్ సభలోని వారందర్నీ హెచ్చరించడం జరిగింది. దీనికి ఆయన మరొక ఉదాహరణ తెలియజేశారు.

ఒక గ్రామంలో అధికులైన హిందువులు, అల్పసంఖ్యాకులైన మహమ్మదీయుల మధ్య చిన్నగొడవ జరిగింది అనుకుందాం! హిందువులు కేసును గ్రామపంచాయితీ దృష్టికి తీసుకువచ్చారు అనుకుందాం! ఒక సంవత్సర కాలంలోనే స్థానిక ఎన్నికలు వస్తాయని అనుకుందాం! ఈ పరిస్థితులలో హిందువులకు చెందిన ప్రజాప్రతినిధులు ఒక మహమ్మదీయ నిందితుడ్ని విచారిస్తున్నపుడు, వచ్చే ఎన్నికలలో తమ గెలుపును దృష్టిలో పెట్టుకొని, అధిక సంఖ్యాకులైన హిందువులకు అనుకూలంగా తీర్పు చెప్పడం ద్వారా ఎటువంటి నిష్పాక్షిక విచారణ లేకుండానే, మహమ్మదీయుడికి శిక్ష విధించే అవకాశం ఉంది. ఎందుకంటే న్యాయవిధులలో ఉన్న ప్రజాప్రతినిధులు వారి పదవులకు, వచ్చే ఎన్నికలలో అధికారంలోనికి రావడానికి ప్రాధాన్యం ఇస్తారే కాని, ఒక నిరపరాధికి శిక్ష పడుతుందనేది వారికి అంత ముఖ్యమైన విషయం కాకపోవచ్చు. కాబట్టి ఇన్ని లోపాలున్న బిల్లు మనం నిర్మించుకోబోయే ప్రజాస్వామ్య వ్యవస్థకు ఇది చాలా ప్రమాదకరమైనదిగా భావిస్తున్నాను అని డా॥ అంబేద్కర్ తన అభిప్రాయాన్ని తెలియజేశారు.

కాబట్టి, ఇప్పుడు ప్రవేశపెట్టిన 'గ్రామపంచాయితీ బిల్లు'ను అధిక సంఖ్యాకులు ఆమోదించనప్పటికీ, గ్రామస్థాయిలో బలహీనవర్గాలు, అల్పసంఖ్యాక వర్గాలకు ప్రమాదకరమైన, ప్రజాస్వామ్యానికి వ్యతిరేకమైన, ప్రజల స్వేచ్ఛా, స్వాతంత్ర్యాలను భంగపరిచే విధమైన అంశాలు ఉండడం వలన, వాటిపై చర్చ జరగకుండా, వాటిని పరిశీలించకుండా, అందరి ప్రయోజనాలు కాపాడే విధంగా వాటిని మార్చకుండా ఉంటే, నేను ఈ బిల్లును వ్యతిరేకిస్తాను, నా అనుచరులు కూడా దీనిని వ్యతిరేకిస్తారు అని డా॥ అంబేద్కర్ తన అభిప్రాయాన్ని తెలియజేశారు.

పైన పరిశీలించిన ఆరు అంశాలను మనం ఈ రోజు ఉన్న పరిస్థితులను బట్టి పరిశీలించినట్లయితే, అన్ని అంశాలు న్యాయబద్ధంగానే కనిపిస్తాయి. ప్రతి అంశంలోను, స్వేచ్ఛ, సమానత్వం గురించి, సామాజిక న్యాయాన్ని గూర్చి డా॥ అంబేద్కర్ ప్రయత్నించడం జరిగింది. అంటే, అప్పటి గ్రామాలు ప్రాచీన కుల పంచాయితీలతో, గుంపులుగా విడివిడిగా ఒకే గ్రామంలో ఉంటూ ఒక కుల సమూహానికి, మరొక



కుల సమూహానికి సంబంధం లేకుండా, కొంతమంది కులాధిక్యతతో అన్నీ అనుభవిస్తూ, మరొకవైపు నిమ్నకులాలుగా ఉన్నవారు, తక్కువగా చూడబడుతూ, కనీస అవసరాలకు దూరంగా, చాలా దుర్భరమైన పరిస్థితులలో ఉంటే, ఇన్ని అసమాన, అసంబద్ధ, అప్రజాస్వామిక అంశాలున్న అప్పటి 'గ్రామపంచాయతీల బిల్లు' ఏ ప్రజాస్వామ్య వాదైనా, కనీసం సమానత్వం, ప్రాథమిక హక్కులు కోరేవారైనా దీనిని వ్యతిరేకిస్తారు.

ఇన్ని అవలక్షణాలున్న అప్పటి గ్రామీణ వ్యవస్థలో ఉన్నప్పుడు వాటిని ప్రజాస్వామ్యాలకు నిలయాలని, 'రిపబ్లిక్'లని ఎలా అనగలము. మన దేశంలో ఎన్ని సమస్యలున్న, ఎన్ని అవలక్షణాలున్న మనం వేరే దేశంతో పోల్చి మాట్లాడాలనుకున్నప్పుడు గొప్పగానే, జాతీయభావంతో మాట్లాడుతాం. కాని, మన దేశంలో మన ప్రజల అభివృద్ధి, శ్రేయస్సు ఆశించి మాట్లాడేటప్పుడు, చర్చించేటప్పుడు, మంచి లక్షణాల కన్న చెడు లక్షణాలపైనే శ్రద్ధ చూపవలసి ఉంటుంది. మంచి లక్షణాల వలన మంచే జరుగుతుంది. కాని ప్రమాదం చెడులక్షణాల వలన వస్తుంది. కాబట్టి ఆనాటి గ్రామీణ వ్యవస్థలో చెడు లక్షణాలైన కులం, అసమానత, దోపిడీ, బానిసత్వం, అంటరానితనం నిర్మూలనపై డా॥ అంబేద్కర్ శ్రద్ధ వహించారు. అప్పటి సాంఘిక సంస్కర్తలలో కులాన్ని పూర్తిగా రూపుమాపాలన్న కృతనిశ్చయం, డా॥ అంబేద్కర్ కోరినంతగా, ఆయనలో ఉన్నంతగా మిగిలిన వారికి లేకపోవడం, కులం వారికి పెద్ద సమస్యగా కన్పించకపోవడం, భారతదేశ ప్రజల దురదృష్టకరం అని చెప్పక తప్పదు. అందుకే, కులవ్యవస్థ నేటికీ తన రూపాల్ని మార్చుకుంటూ, మన సమాజ వెనుకబాటుతనానికి కారణం అవుతున్నది.

డా॥ అంబేద్కర్ భావించినట్లు, నిరక్షరాస్యులు, అసమానతలు గల సమాజాభివృద్ధికి ఎన్ని చట్టాలు చేశామన్నది కాదు, ఎంత చిత్తశుద్ధితో చేశాము, అమలు చేస్తున్నాము అన్నదే ప్రామాణికం. భారతదేశంలో కుల వ్యవస్థ, దాని ప్రభావం నిర్మూలన కానంతకాలం, గ్రామీణ ప్రజలకు స్థానిక స్వపరిపాలన ద్వారా వారికిచ్చే అధికారాలు హక్కుల ద్వారా సామాజిక న్యాయం వస్తుందనడం సత్య దూరం అవుతుంది. స్థానిక స్వపరిపాలన ద్వారా ప్రజలకు అధికారాలివ్వడం చాలా మంచి ప్రక్రియ. అయితే, నాయకుల విధి దానితో పరిమితమై, ఓట్ల కోసం ప్రచార ఆర్భాటం కాకుండా, అది ఏవిధంగా సామాజిక వర్గాలను ప్రభావితం చేయబోతుంది అనేది పరిశీలించకుండా ఉండడం, దూరదృష్టి లేకపోవటం వలన ప్రయోజనం శూన్యం.

స్వాతంత్ర్యానంతరం నుంచి, గత 64 సంవత్సరాల నుండి పేదరిక నిర్మూలనకు, ప్రాంతీయ అసమానతలు తొలగించడానికి అనేక పథకాలు ప్రవేశపెట్టినా ప్రయోజనం లేదంటే, వాటిని ప్రవేశపెట్టే ముందు, ప్రయోగాత్మకంగా పరిశీలించి, హేతుబద్ధంగా చర్చించకుండా, అవి భిన్న సామాజిక వర్గాల వారిని ఏ విధంగా ప్రభావితం చేస్తున్నాయి అనే పరిశీలనపై ఎక్కువ శ్రద్ధ చూపలేకపోవడమే కారణం. అంతేకాకుండా, భారతదేశంలో ఉన్న సామాజిక, ఆర్థిక సమస్యల పరిష్కారం రాజకీయ రంగంతో ముడిపడి ఉంది. రాజకీయ రంగంలో పరిశుద్ధత, పరిపూర్ణత లేనంత కాలం, మన దేశంలో సమస్యలు ప్రజలు అధిగమించలేరని, డా॥ అంబేద్కర్ భావించారు.

డా॥ అంబేద్కర్ పరిశీలన, పరిశోధన అంతా చారిత్రక విశ్లేషణ, హేతుబద్ధత కలిగి ఉంటుంది. ఆయన చేసిన ప్రతి రచనలో, ప్రసంగంలో, చర్చలలో ఇది స్పష్టంగా తెలుస్తుంది. మన దేశంలో ఉన్న ప్రతి సమస్యకు ఎంతో చారిత్రక నేపథ్యం ఉంది కాబట్టి అటువంటి పరిశోధనలు అవసరం.

మన దేశంలో పరిశోధనలో సమస్యల పునాదుల గూర్చి చర్చించేటప్పుడు, వాస్తవికత కన్నా కూడా ఎక్కువ మంది అంగీకార యోగ్యమైన పద్ధతులలో, ఎక్కువ మంది అభినందించగలిగే సూచనలు ఇవ్వడానికి అలవాటుపడ్డారు. ఈ సమస్య ముఖ్యంగా సామాజిక సమస్యల పునాదులు 'హిందూ మతానికి' సంబంధం ఉన్న వాటిపై మనదేశంలో ఎక్కువ మంది సామాజిక శాస్త్రవేత్తలు ఉదాసీన వైఖరి అవలంబించారు. దానికి కారణం మతపరమైన అంశాల మార్పుకు మన దేశ ప్రజలు అంగీకరించకపోవడం. కాని వాస్తవానికి సాంఘిక, ఆర్థిక వ్యత్యాసాలు మనదేశంలోని మత వ్యవస్థతో ముడిపడి ఉన్నాయి. మతం, కులాన్ని అంగీకరించినంత కాలం, కులం మతంలో భాగమైనంతకాలం, జీవన విధానంలో మతం నుండి కులాన్ని విడదీయనంత కాలం భారతదేశంలో సమసమాజ నిర్మాణం సాధ్యం కాదని డా॥ అంబేద్కర్ భావించారు.

ప్రస్తుతం ప్రధానంగా మన దేశంలోని సాంఘిక, రాజకీయ, సామాజిక శాస్త్రవేత్తలు హిందూ సమాజంలో మతంతో ముడిపడిన 'కులం' అనే జాడ్యాన్ని పూర్తిగా ప్రజల మనసులలో నుండి తీసివేయకుండా, వారిని మభ్యపెట్టే పథకాలు, అధికారాలు, చట్టాలు చేయడం ద్వారా ప్రయోజనం లేదు. ఎందుకంటే, అవి కుల ప్రభావానికి నిష్ఫల మవుతాయి అని డా॥ అంబేద్కర్ స్పష్టంగా తెలియజేయడం జరిగింది. దానిని హిందూ సమాజమే ముందుకు తీసుకుపోవాలి, ఆయన ఆలోచనలే నేడు భారతదేశ సమస్యలకు పరిష్కారాలు.

*- డా॥ బి. నాగేశ్వరరావు*
*రీసెర్చ్ అసోసియేట్, అపార్డ్*

# తెలుగు సాహిత్య చరిత్ర

కాలమేదైనా, ప్రాంతమేదైనా అది ఆనాటి రాచరిక వ్యవస్థ ఆధారంగా కళలకు కాణాచిగానే చరిత్రలో నిలిచింది. ఆనాటి రాజులు, కవితాప్రియులు, కళాబంధులు తమ అభిరుచి మేరకు కళలను పోషించారు. అగ్రహారాలతోను, ఆస్థానంలో పదవులతోను ఆదరించారు. ఈ ఆదరణ మతంతో కూడా ముడిపడిన కారణంగా, ఆయా ప్రాంతాలలో శైవం, వైష్ణవం, జైనం, బౌద్ధం మొదలైన మతాలు కూడా అభివృద్ధి చెందాయి. పరమత సహనం గల మహారాజులు, తమకు అభిమతమైన మతంతో పాటు, ఇతర మతాలను కూడా ఆదరించారు, పోషించారు. ఇది వారి విశాల మనోభావాలకు దర్పణం పట్టింది.

కాకతీయుల కాలంలో సంగీతం, సాహిత్యం, నాట్యం, శిల్పం మొదలైన కళలు చక్కగా పోషింపబడ్డాయి. కాకతీయులు కాకలు తీరిన వీరయోధులను తమ ఆస్థానాలలో నిలుపుకొన్నారు. విజయకేతనాలను ఎగురవేశారు. కేవలం తాము న్న ప్రదేశాన్ని అభివృద్ధి పరచుకోవడం కోసం మాత్రమే కాక సువిశాలమైన సామ్రాజ్య స్థాపనకు కృషి చేశారు. ఓరుగంటి నుండి నేటి ఒరిస్సాలోని బస్తర్ వరకు, తమిళనాడులోని బృహదీశ్వరాలయం వరకు, కర్ణాటకలోని బళ్ళారి వరకు తమ రాజ్యాన్ని విస్తరింపజేసుకొన్నారు.

యుద్ధాలు చేసుకొన్నారు. దానిని అదనుగా చేసుకొని, చాళుక్యులకు సామంతులుగా ఉన్న రాజులు స్వాతంత్ర్యం ప్రకటించుకొన్నారు. స్వతంత్ర సామ్రాజ్యాలు ఏర్పాటు చేసుకొన్నారు. ఈ సందర్భంగానే కాకతీయ సామ్రాజ్యం ఏర్పడింది.

రెండవ బేతరాజు కాకతీయ సామ్రాజ్యానికి రాజైనాడు. అనుమడు, కొండడు అనే ఇద్దరినీ జయించాడు. వారి పేరు మీదుగా ఆ ప్రాంతాన్ని అనుమకొండగా ఏర్పాటు చేశాడు. బేతరాజును సింహాసన భ్రష్టుణ్ని చేయాలని శత్రువులు ప్రణాళికలు రచించారు. కానీ, మిరియాల ఎఱ్ఱన్న, ఆయన భార్య కామసాని మొదలైన వాళ్ళు కొందరు శత్రువులను అణచివేసి, బేతరాజును కొరవి రాజ్యానికి రాజుగా పట్టాభిషిక్తుణ్ని చేశారు. ఈ కాలంలో ఈ ప్రాంతంలో జైనమతం విస్తరించి ఉంది. కానీ, బేతరాజు శైవమతాన్ని స్వీకరించాడు. ఈయన మతదీక్షా గురువు కామేశ్వర దీక్షితులు.

# కాకతీయుల కావ్య వనిలో క్రేళ్ళురికిన పాల్కురికి

కాకతీయుల కాలంలో కవిత్వం ఏ విధంగా అభివృద్ధి చెందిందో, ప్రభువులు కావ్యసరస్వతిని ఏ విధంగా పోషించారో ఈ ప్రకరణంలో పరిశీలిద్దాం.

కాకతీయులు, కాకతీయ యుగం అనగానే ప్రముఖంగా గుర్తుకు వచ్చేపేరు రుద్రమదేవి. వీరికాలంలో కాకతీయ సామ్రాజ్యం ఏ విధంగా ఏర్పడిందో, ఏ విధంగా అభివృద్ధి చెందిందో తెలుసుకోవలసిన అవసరం ఉంది.

క్రీ.శ. 900వ సంవత్సరం నుండి ఈ సామ్రాజ్యం ఆధిపత్యంలోకి వచ్చినట్లు, క్రీ.శ. 1291 నుండి 1323 వరకు రాజ్యపాలన చేసిన ప్రతాపరుద్రుని వరకు కాకతీయ సామ్రాజ్యం పరిపాలన సాగించింది. ఈ రాజ్యపాలకుల కులదైవం 'కాకతి' దేవత. వీరు కొంతకాలం 'కాకతి' అనే ప్రాంతంలో కూడా పరిపాలన చేశారు. అక్కడి నుండి కొరవి ప్రాంతానికి, అనుమకొండకు, ఆ తరువాత ఓరుగంటికి చేరారు. కాకతి నుండి వచ్చిన కారణంగా వీరు కాకతీయులయ్యారు.

జగ్గయ్యపేటకు సమీపంలో దొండపాడు అనే ప్రాంతానికి దగ్గరగా కాకతమ్మ బీడు, కాకతి రామచంద్రపురం అనే ప్రదేశాలున్నాయి. 'కాకతమ్మకు సైదోడు ఏకవీర' - అనే కవి ప్రయోగం కూడా ఉంది. దీనిని బట్టి ఏకవీరాదేవి ఎంతటి శక్తిమంతురాలో, కాకతమ్మ కూడా అంతటి శక్తిమంతురాలని తెలుస్తోంది.

కాకతీయులు వరహాలాంఛనులు. వీరి జండాల మీద వరాహ (పంది) ముద్ర ఉంటుంది. ఆనాటి నాణాల మీద కూడా వరహముద్ర ముద్రించబడి ఉంటుంది. కాకతీయులు, మొదట్లో వేంగీ చాళుక్య ప్రభువులకు సామంతులు. చాళుక్య సామ్రాజ్యంలో రాజ్యం కోసం అన్నదమ్ములు ఒకరి మీద ఒకరు కత్తులు దూసుకున్నారు.

తరువాత కాలంలో రాజ్య సింహాసనం అధిష్ఠించిన రుద్రదేవుడు యుద్ధప్రియుడు. యుద్ధానికి వెళ్ళడమంటే రుద్రదేవునకు అపరిమితమైన ఇష్టం. ఆ ఉత్సాహంతో రుద్రదేవుడు, తన సామ్రాజ్యాన్ని ముసుముందుగా గోదావరి, కృష్ణా మండలాలకు వ్యాపింపజేశాడు. ఆ తరువాత తూర్పుసముద్రం వరకు, పశ్చిమాన కళ్యాణి వరకు, ఉత్తరాన మాల్యవంత పర్వతం వరకు, దక్షిణ దిక్కున శ్రీశైలం వరకు, వ్యాపింపజేశాడు. అనుమకొండ రాజధాని, రాజకీయ వ్యవహారాలకు సరిపడంలేదని, అనుమకొండకు సమీపంలో ఓరుగల్లు కోటను నిర్మించాడు.

రుద్రదేవుని తరువాత ఆయన సోదరుడు కాకతీయ రాజ్యసింహాసనం అధిష్టించాడు. ఈయన కుమారుడు గణపతిదేవుడు. గణపతి దేవుడు యుద్ధంలో ఓడిపోయి కొంతకాలం యాదవరాజులకు బందీగా ఉన్నాడు. మూడు సంవత్సరాల చెరసాలలో ఉన్న తరువాత, యాదవరాజు, గణపతిదేవుని కారాగార విముక్తుణ్ని చేశాడు. గణపతిదేవుడు విజృంభించి యుద్ధాలు చేశాడు. ఈనాడు ఆంధ్రప్రదేశ్‌గా వ్యవహరింపబడుతున్న సామ్రాజ్యాన్నంతటినీ స్వాధీనం చేసుకున్నాడు. ఆ రకంగా గణపతిదేవుడు, గణపతిదేవ చక్రవర్తి అయ్యాడు.

గణపతిదేవుని కుమార్తె రుద్రమదేవి. ఈయనకు పుత్రసంతానంలేని కారణంగా రుద్రమదేవికి పురుష వేషం వేయించి, రుద్రదేవుడు అనే పేరుతో పెంచి పెద్దచేశాడు. వీరోచితమైన ధనుర్విద్య, ఖడ్గవిద్య, అశ్వారోహణ, గజారోహణాలు రుద్రమదేవి అభ్యసించింది. రుద్రమ వీరనారి. నిరవద్యపురం (నిడదవోలు) పాలిస్తున్న చాళుక్యరాజైన ఇందుశేఖరుని కుమారుడుగా వీరభద్ర నృపతితో రుద్రమదేవికి వివాహం జరిపించాడు. ఈ దంపతులకు కూడా పుత్రసంతానం కలగలేదు. రుద్రమదేవికి ముమ్మడమ్మ, రుయ్యమ్మ అనే ఇద్దరు

కుమారైలు జన్మించారు. ముమ్మడమ్మకు ప్రతాపరుద్రుడు జన్మించాడు. ప్రతాపరుద్రుడుని కాకతీయ సామ్రాజ్యానికి వారసునిగా ప్రకటించాడు గణపతిదేవ చక్రవర్తి.

ఇది కాకతీయులు కాలంలో జరిగిన రాజ్యవిస్తరణ. ఆయా పాలకుల కాలంలో మతం, సంఘ సంస్కరణ, విద్య, కళలు, చిత్రలేఖనం, హస్తకళలు (చేతివృత్తులు), వ్యాపారం, ప్రజాసౌకర్యాలు, వినోదాలు, కవిత్వం, శిల్పం, పాచికలు, యుద్ధక్రీడలు, యుద్ధ విన్యాసాలు, స్త్రీల అలంకరణాలు - మొదలైనవి ఏ విధంగా అభివృద్ధి చెందాయో, ప్రభువులు ఏ విధంగా వాటిని అభివృద్ధిలోకి తెచ్చారో అన్న విషయాలను కవులు తమ తమ కావ్యాలలో చక్కగా తెలియజేశారు. ఈ కళలలో వీరానికెంత ప్రాధాన్యం ఉందో, శృంగారానికి కూడా అంతటి ప్రాధాన్యాన్నిచ్చారు. నిజం చెప్పాలంటే శృంగారం లేకపోతే అది కవిత్వమే కాదంటాడు సుమతి శతకకారుడు బద్దెన.

**'తమలము సేయుని నోరును**
**రమణుల చనుమొనల మీద రాయని మేనున్**
**కమలములు లేని కొలనును**
**హిమధాముడు లేని రాత్రి హీనము సుమతీ'**

అది కాకతీయుల కాలమైనా, రెడ్డి రాజుల కాలమైనా కాస్త ధనవంతుడైతే చాలు శృంగారంలో మునిగితేలేవాడు. రాజులే కాదు, కవిరాజులు కూడా కొందరు నారీలోకాన్ని ఉగ్రూతలూగించినవారు లేకపోలేదు. పాల్కురికి సోమనాధుడు బసవపురాణంలో, పండితారాధ్య చరిత్రలో 'మిండ జంగాల విచ్చలవిడి కామాన్ని' అత్యంత రసస్ఫోరకంగా వర్ణించాడు. జంగాలు శివభక్తులు. శ్రీశైలం మొదలైన శివక్షేత్రాలలో శివరాత్రినాడు వారు జరిపే కామకలాపానికి భామల అనులాలనం జోడైతే, ఇక్కడ జరిగేది మరో శివతాండవమే చూడండి...!

**రారోరి బగుత! తేరాలంజకనుచు**
**నారంగ రయమున కడిగి తెచ్చుటలు**
**బసవన్న కరుణరా! బగుత నీకనుచు**
**అసలిచ్చుచును ధనం బడిగి తెచ్చుటలు,**
**కలియుగ బసవండ! నిలనీవ యనుచు**
**అలరించి భక్తుల నడిగి తెచ్చుటలు**
**ప్రాకటంబున వచ్చు పణ్యాం గనలను**
**క్రేగంట జూచుచు గేలిసేయుటలు**

(ఇది ద్విపద అనే ఛందస్సులో ఉంది. బగుత అంటే భక్తుడు అని అర్థం)

ఇంత పచ్చిగా పలకడం, వ్రాయడం ఆ కాలంలో అలవాటే. ఈనాడు కొందరకిది ఆశ్చర్యంగా అనిపించవచ్చు. బసవేశ్వరుని కాలంలో కళ్యాణ కాటకం అనే పట్టణంలో శైవులు లక్షల సంఖ్యలో వేశ్యల యిండ్లలో భోగాలనుభవించే వారట. వారికి రసికులు రెండు చేతులా ధనం ధారపోసేవారు. ఈ రకమైన విశృంఖల శృంగార కళ తెలిసిన వారెందరున్నారో, తెలియని అమాయక చక్రవర్తులు కూడా సమాజంలో అంతకన్న ఎక్కువగా ఉన్నారట. వీరిలో ఓ అమాయకుని పేరు ముగ్ధ సంగయ్య. నిజం చెప్పాలంటే అతడొక వెర్రిబాగులవాడు. ఈ అమాయకుణ్ని బసవన్న వేశ్య యింటికి పంపించాడు. అక్కడి వారవనితలు నాట్యం చేసి సంగయ్యకి కొంచెం ఆనందం కలిగించారు. దానితో సంగయ్య ఉబ్బితబ్బిబ్బయ్యాడు. ఆ తరువాత అతడు, "మున్నిట్టి సుఖము నేనెరుగ" అని అందరకు చెప్పి పరమానందభరితుడయ్యాడు.

ఆ కాలంలో ఇది సర్వసాధారణమైన విషయం. రాజుల కొలువులో వారవనితలుండడం అతి సహజం. రాచకొలువులోని భోగినులు ఎటువంటి వస్త్రాలంకారాలు కలిగి ఉండాలో పాల్కురికి సోమనాధుడు రమణీయంగా వర్ణించాడు.

**లలిత మంజుల విమలాంగ లతలు వెలుగ**
**సూక్ష్మ వస్త్రాభరణ మాల్య సుభగ మూర్తు**
**లగుచు వారాంగనలు మన్మధాస్త్ర లీల**
**బలిసి కొలువంగ వలయు భూపాల మదను**

*- కామందక నీతిశాస్త్రం*

రాజులకు ద్యూతం ఒక వ్యసనం. ఇది సప్త వ్యసనాలలోను ఒకటి. జూదమాడి నలమహారాజు రాజ్యాన్ని కోల్పోయాడు. జూదం అనే మత్తులో పడి ధర్మరాజు సంపదను, సోదరులను, తనను, భార్యయైన ద్రౌపదిని కూడా ఓడిపోయి అడవుల పాలయ్యాడు. కనుక మహారాజులకు ద్యూతక్రీడ మంచిది కాదంటూ -

**ద్యూత మెల్ల జముని దూతయుగా, ధనం**
**బెల్ల హాలహలము, నింతు లెల్ల**
**ఘోరతరములైన కారాగృహములుగా**
**తలచు నతడు ప్రియుడు ధరణిపునకు**

ద్యూతమనేది యముని దూత, ధనం కాలకూట విషం, స్త్రీల పొందు కారాగృహ సమానం అని భావించేవాడే మహారాజునకు ఇష్టుడు.

కాకతి రాజులలో ప్రతాపరుద్ర చక్రవర్తి సంస్కృతాంధ్రాది భాషలలో నిష్ణాతుడు. ఈయన సంస్కృతంలో నీతిసారం అనే గ్రంథాన్ని రచించాడు. ఈ విషయం 'నీతిశాస్త్ర ముక్తావళి' అనే గ్రంథంలో ఉంది. దానిని ధ్రువపరుస్తూ, ఆంధ్రభాషలో బద్దెన రచించిన 'నీతిశాస్త్రం', ప్రతాపరుద్ర మహారాజు రచించిన 'నీతిసారం' అనే గ్రంథాలు బాలురకు నీతివిషయాలు తెలియజేస్తాయి.

మడికి సింగన్న అనే కవి కూడా 'సకల నీతి సమ్మతమే' అనే గ్రంథాన్ని రచించాడు. ఆ కాలంలో సంస్కృత నీతిసార గ్రంథం బహుళ ప్రచారంలో ఉంది. అలాగే తెలుగులోని నీతిసారం కూడా అంతప్రచారంలోను ఉండేది. ఈ గ్రంథంలో నీతివిషయాలే కాక అందమైనా జాతీయాలు కూడ ఉన్నాయి. ఉదాహరణకు -

***1. పామునకెరకలు వచ్చినట్లు :*** ఎరకలు అంటే రెక్కలు. పాము నడక వంకరగా ఉన్నా ఎంతో వేగంగా ముందుకు కదులుతుంది. పగపట్టిన వానిని కాటువెయ్యడమే దాని కసి, ఒకవేళ పాముకి రెక్కలు కూడా ఉంటే, అది సరిగా దాని లక్ష్యాన్ని ఎగిరి మరీ పట్టుకొంటుంది.

***2. కుక్కతోక పట్టుకొని మహాంబుధి దాట దలచినట్లు :*** ఈ సామెత గోదావరీ తీరవాసుల్లో, 'కుక్కతోక పట్టుకొని గోదావరి ఈదినట్టు'గా చెబుతారు. గోదావరి దిగువకు ప్రవహిస్తూ, మహాంబుధి (సముద్రం)లో కలుస్తుంది. కనుక కవి 'మహాంబుధి' అనే పదం ప్రయోగించాడు. మిగిలిన నదులకన్నా గోదావరినది వెడల్పు ఎక్కువ. గోదావరీ నదిని అడ్డంగా ఈదడం, లేదా ఎదరదడం కష్టం. కుక్కతోక పట్టుకొంటే అది తన ప్రాణసంరక్షణ విషయమే చూసుకుంటుంది. చనిపోయిన వాడు, ఆవుతోక పట్టుకొంటే వైతరణీనదిని దాటినట్లు, బ్రతికున్న వాడు కుక్కతోక పట్టుకొని గోదావరిని దాటడం చాలా కష్టమని దీని భావం.

***3. అంబుధి కలం లేక ఈదగడగినట్లు*** : ఇక్కడ కలం అనే పదానికి ఓడ, నావ అని రెండర్థాలున్నాయి. సముద్రాన్ని దాటాలంటే ఓడగాని, నావగాని ప్రయాణ సాధనాలుగా ఉండాలి. ఏ సాధనం లేక సముద్రాన్ని దాటలేం. ఆ కాలంలో సముద్ర ప్రయాణానికి, విదేశీ వ్యాపారానికి ఓడ ప్రధాన సాధనం.

*4. మిడుత లగ్గి మీద పడినయట్లు :* ఎఱ్ఱగా కనబడుతున్న అగ్నిని చూచి, అది తమ ఆహారం అనుకొని మిడుతలు నిప్పు మీదకు దూకి మరణిస్తాయి. తమకు ఎదుటనున్నది ప్రమాదకరమైనదో, ప్రమోదకరమైనదో మిడుతలు తెలిసికోవు. అదే విధంగా ముందు వెనుకలాలోచించుకోకుండా తొందర పడరాదన్నది దీని భావం.

కావ్యాన్ని రాజు వ్రాసినా, కవిరాజు వ్రాసినా ప్రజలకు కావలసింది ఆ కావ్యంలోని నీతి. అది రాజనీతి కావచ్చు, జనానీకానికి ప్రతిదినం అనుభవంలో పనికివచ్చే నీతి కావచ్చు. 'నీతి' చెరువు కట్టలాంటిది. కట్ట తెగిపోతే చెరువులోని నీరు ఊరుని ముంచేస్తుంది. నీతిని విడిచి, అవినీతిగా ప్రవర్తిస్తే అటువంటి వాడి వలన కులం నశిస్తుంది. ఊరు, దేశం కూడా పాడైపోతాయి. నీతి అనేది, సమాజాన్ని కట్టుబాట్లలో ఉంచడానికి ఉపయోగపడుతుంది.

**పెనుగజము, ద్రుంచు నక్రము**
**తన నెలవున నుండి, నెలవు, దప్పిన మరి తా**
**శునకంబు చేత, జచ్చున్**
**దన నెలవున హీనుడైన దగ ఘనునోర్చున్**

ఎవరు ఎక్కడుండాలో అక్కడే ఉండాలి. నీటిలో ఉండే మొసలికి బలం ఎక్కువ. నీరున్న ప్రదేశం మొసలికి స్థానబలాన్ని కలిగిస్తుంది. నీటికోసం ఏనుగు, నదిలోకి దిగితే, మొసలి దాన్ని సంహరిస్తుంది. ఒకవేళ తన స్థానాన్ని విడిచి బయటకు వస్తే అది ఒక కుక్క చేతిలో చస్తుంది. ఎంతటి నీచునికైనా స్థానబలం అంటూ ఉంటుంది. ఇదే విషయాన్ని వేమన కవి ఈ విధంగా చెప్పాడు-

**నీళ్ళలోన మొసలి నిగిడి యేనుగు దీయు**
**బైట కుక్కచేత భంగపడును**
**స్థానబలిమి కాని తన బలిమి కాదయా**
**విశ్వదాభిరామ వినుర వేమ!**

ఈ విధంగా చెప్పిన వేమన కవి పద్యం తెలుగు తెలిసిన ప్రతివాడికి తెలుసు. ఒకవేళ పద్యమంతా ధారణలో లేకపోయినప్పటికి, 'స్థానబలిమి కాని తన బలిమికాదో' అన్న మాట తెలియని వారుండరు. ఈ విధంగా చదువరుల నాలుక మీద నిలిచిపోవడమనేది పద్యానికున్న గొప్పదనం.

కాకతీయుల కాలంలో మతసంబంధంగా కొన్ని విప్లవాలు చెలరేగాయి. విప్లవం అనగానే తిరుగుబాటు అని, యుద్ధమని అనుకోరాదు. ఒకరకమైన మార్పుకి జరిగిన పరిణామం. ఒకప్పుడు బాగా విస్తరించిన బౌద్ధం వీరి కాలంలో చాలావరకు నష్టమైపోయింది. చివరకు నామమాత్రా విశిష్టమై నిలిచింది. బుద్ధుణ్ని విష్ణుమూర్తి యొక్క తొమ్మిదవ అవతారంగా నిర్ణయించి ప్రచారం చేసిన తర్వాత, బౌద్ధమత వ్యాప్తి కాకతీయుల కాలంలో తగ్గింది.

క్రీ.శ. 1171లో వెల్లంకి గంగాధర మంత్రి శివకేశవా భేదంతో, ఈశ్వరునకు, విష్ణువునకు ఆలయాలు నిర్మించాడు. పరమత సహనం కాలవాడైన గంగాధర మంత్రి బుద్ధుడు, నారాయణావతారుడే అనే భావంతో ఒక ఆలయం నిర్మించాడు. ఆయన ఒక శాసనం ఆ విషయాన్ని ఈ విధంగా వివరించాడు.

**పరమేశుడు హరి బుద్ధ**
**స్వరూపుడై యసురవరుల వంచించుట నా**
**హరి యనియు పట్టశాలము**
**జరముగ బుద్ధ ప్రతిష్ఠ జేసిత భక్తిన్**

ఈ విధంగా బౌద్ధమతం హిందూ మతంతో లీనం కాసాగింది. అదే సమయంలో జైనం తన ఆధిపత్యం కోసం పెనగులాడడం ప్రారంభించింది.

ఈ సమయంలో పాల్కురికి సోమనాథుడు శైవమత ప్రచారానికి పూనుకొన్నాడు. శివుడొక్కడే దేవుడంటూ వీరశైవానికి జీవం పోశాడు. శివునికి సేవకుడై సేవలు చెయ్యాలని, ఆయనకు దూతనని భక్తుడు భావించాలన్నాడు. ఈ ఉద్ధృతిని చూసిన వైష్ణవులు కూడా ఒక్కడుగు ముందుకు వేసి, విష్ణుమూర్తికి దాసానుదాసుదాసులకు దాసుడను. వారికి బంటును, సేవకుడును అని ప్రతి యొక్కడు దాసానుదాసుడైఉండాలని ప్రబోధించారు. భక్తి, జ్ఞానము, ప్రపత్తి అనే మూడు యోగాల్లో ప్రపత్తి (శరణాగతి)కి మించిన యోగం లేదన్నారు. కులశేఖరాళ్వార్లు కూడా ఈ విషయాన్నే ముకుందమాలలో తెలియజేశారు.

మానవుడు భోగాలకు అలవాటు పడ్డాక కష్టపడలేదు. ధన సంపాదనకు మార్గాలు వెదకడం ప్రారంభిస్తాడు. ఈ విషయాన్ని పాల్కురికి సోమన నిరుపేదకు నిధానం లభిస్తే తిరిగి కూలి పనికి వెళ్ళడు అని నిర్మోహమాటంగా తెలియజేశాడు. ధన సంపాదనకు కూలి పని చెయ్యడం కన్నా ధనవంతుల యిండ్లను కొల్లగొట్టడం, దొంగతనాలు చెయ్యడం మంచిదని సమాజానికి హితవు పలుకుతాడు.

ఈ విధంగా శైవమతాన్ని విస్తరింపజెయ్యడం కోసం ప్రజల్ని రెచ్చగొట్టడం నిజంగా విడ్డూరమే. విడ్డూరమే కాదు ఎంతో అపరాధం. మహాపాపం కూడా. ఈ విషయాన్ని బాగా అవగాహన చేసుకొన్న కన్నడ బ్రహ్మయ్య అనే శివభక్తుడు ఇంటి గడియకు కన్నం వెయ్యడం, గడపకు కన్నం, గోడకు కన్నం, నేలకు కన్నం వెయ్యడం మొదలైన వాటిలో గొప్పనేర్పరి - ఒకవేళ పొరపాటున శివభక్తుని యింటికి కన్నంవేస్తే, ఆ యింటి యజమానిని (శివభక్తుని) నిద్రలేపి, ఆయన పాదాలను భక్తితో కడిగి పాదోదకం త్రాగి, క్షమాపణలు కోరి వెళ్ళిపోయాడు. వీరి దృష్టిలో శివభక్తుడు శివుడితో సమానం. ఇంతకీ దొంగతనం చేసి సంపాదించిన సొమ్మును తన స్వార్థానికి, భోగాలకు వినియోగించుకోకుండా జంగమదేవర్లకు దానధర్మాలు చేస్తాడు. అది నీతిలో కూడ కొంత నీతిని ప్రదర్శించడం ఇక్కడ కనబడుతుంది. ఈ విషయం పాల్కురికి సోమనాథుని బసవపురాణంలో కనబడుతుంది.

భుక్తి మార్గాన్ని మానవుడికి చూపిస్తే అదే భక్తి మార్గానికి బాట వేస్తుందంటాడు. తిండి లేక మలమల మాడిపోతే భక్తి ఎక్కడి నుండి వస్తుంది? శివాలయాలలో తీర్థం, విభూతి, మారేడుదళం ప్రసాదంగా ఇస్తారు. దీని వల్ల భక్తుడికి కడుపు నిండదు. ఈ కోణంలో ఆలోచించిన వైష్ణవ స్వాములు, శైవుల్ని, ఇతర మతాల జనాలను తమ వైష్ణవ మతంలోకి మళ్ళించుకోడానికి ఓ మంచి ఆలోచన చేశారు. వైష్ణవంలో విష్ణు మూర్తికి భోగాలు ఏర్పాటు చేశారు. పులిహోర, చక్రపొంగలి, దద్దోజనం, పాయసం, వడలు మొదలైన ఆహారాలను ప్రసాదంగా పంచిపెట్టారు. దానితో ప్రజల్ని ప్రసాదభక్షణకి అలవాటు చేశారు. పుట్టుకతో వైష్ణవులు కాకపోయినా, కడుపు నిండే మార్గానికి దారి దొరికిందని కొందరు వైష్ణవంలోకి ప్రవేశించారు. చక్రాంకితాలు వేయించుకొన్నారు. మధ్యలో వైష్ణవాన్ని స్వీకరించారు. తద్వారా వైష్ణవమత ప్రచారం ఊపందుకొంది.

ప్రజాభీష్టానికి అనుగుణంగా మహారాజులు కూడా మతపోషణకి నడుం కట్టారు. ఈ విధంగా ఓ ప్రక్క శైవం, మరో ప్రక్క వైష్ణం పోటాపోటీలుగా వృద్ధి చెందాయి. ఆలయాలు వెలిశాయి. ఆలయాల మీద శిల్పసౌందర్యం వెల్లివిరిసింది. శిల్ప శాస్త్రానికి చెందిన గ్రంథాలు కూడా బయలుదేరాయి. గణపతిదేవ చక్రవర్తి బావమరిది జాయపసేనాని. ఈయన సంస్కృతంలో ఎన్నో గ్రంథాలు రచించాడు. కాకతీయ శిల్పానికి

లక్షణగ్రంథ. సమానమైన 'నృత్త రత్నావళి' అనే గ్రంథాన్ని ఈయన రచించాడు. రామప్పగుడిలోని శిల్పాలకు, నాట్యభంగిమలకు ఈయన గ్రంథం ఉదాహరణ. ఈ గ్రంథాన్ని అనుసరిస్తూ మరికొందరు కూడ శిల్పకళావిష్కరణకి సంబంధించిన రచనలు చేశారు.

పుష్పాంజలి, పేరణి, ప్రేంఖణము, చర్చరీరాసకం, శివప్రియ, చిందు, కందుక, భాండిక, బహురూప, చారూ, కొల్లాట, ఘటిసణి మొదలైన నృత్యరీతులు జాయపసేనాని నృత్త రత్నావళిలో గోచరిస్తాయి. విద్యానాథ మహాకవి ప్రతాపరుద్ర యశోభూషణం అనే ప్రామాణిక అలంకార గ్రంథాన్ని రచించాడు.

కాకతీయుల కాలంలో, ఆంధ్రకవితోద్యానంలో తెలుగు సరస్వతి పాల్కురికి రూపంలో క్రేళ్ళురికింది. శైవానికి పాల్కురికి సోమనాథుడు పెద్దపీట వేశాడు. ఈయన రచించిన మహాకావ్యం బసవపురాణం. ఆ వరుసలో చెప్పుకోదగినవి, అనుభవసారం, చతుర్వేదసారం, వృషాధిపశతకం, చెన్నమల్లు సీసాలు. ఈ గ్రంథాలన్నీ కూడా శివపారమ్యానికి అమృతసోపానాలే. బసవ పురాణం ద్విపదరచన కాగా మిగిలిన రచనలు పద్యాలు. శైవమత ప్రచారంకోసం, పాలకురికి సోమనాథుడు, బసవ పురాణాన్ని ఏడాశ్వాసాల గ్రంథంగా రచించాడు. ఈ గ్రంథంలో అన్నీ శివభక్తులే కథలే ఉన్నాయి. వీరిలో శివునకు భక్తురాండ్రైన స్త్రీల కథలు కూడా ఉన్నాయి. శివభక్తి తత్పరతతో శివైక్యం చెందిన గోడగూచి కథ తెలుసుకుందాం.

### గొడగూచి కథ

కర్నాటక దేశంలో ఓ చిన్న గ్రామముంది. ఆ గ్రామంలో శివదేవయ్య అనే శివభక్తుడున్నాడు. అతడు ఆవులను, గేదెలను కొని పాలవ్యాపారం చేస్తూ జీవించేవాడు. ఇతడు న్యాయబద్ధంగా పాలవ్యాపారం చేస్తాడు. పాలల్లో నీళ్ళు కలపడు. పశువులను అమ్మడం, కొనడం కూడా ఈతని వృత్తి. శివభక్తులకు ఆతిధ్యమిచ్చి గౌరవిస్తాడు. ప్రతిదినము ఒక కుంచెడు ఆవుపాలు కొలిచి ఆ గ్రామమందలి శివునకు నివేదన చేసేవాడు. తిరిగి ఆ పాలను, పాలుత్రాగే పసిపిల్లలకు, పాలు కొనలేని పేదలకు పంచిపెడతాడు. ఇది అతని నిత్యకృత్యం. అతని మంచితనాన్ని, మెచ్చుకొన్నవారు, తమ దగ్గరున్న ఆవులు, గేదెలు అతనికే అమ్మేవారు. అతని దగ్గరనే కొనుగోలు చేసేవారు. ఇది అతని ఋజు వర్తనమునకు ఒక చక్కని ఉదాహరణ. ఈశ్వరుని కృపవలన శివదేవయ్య సంసారం ఏ ఒడిదుడుకులు లేకుండా సాగిపోతోంది.

ప్రతిరోజూ ఉదయాన్నే శివదేవయ్య నిద్ర లేస్తాడు. ఆవుపాలు, గేదెపాలు పనిమనుష్యుల చేత పిదికిస్తాడు. పశువుల కొట్టం శుభ్రం చేయిస్తాడు. కొలపాత్రతో పాలు కొలిచి వాటిని ఎవరెవరకి పంపాలో పంపిస్తాడు. కుంచెడు ఆవుపాలను స్వయంగా కొలిచి శివునకు నివేదన జరుపుతాడు. ఈ విధంగా శివదేవయ్య దైనందిన కార్యక్రమం కొన్ని సంవత్సరాల పాటు నిర్విఘ్నంగా సాగిపోయింది.

శివదేవయ్య సకుటుంబంగా ఒకనాడు గ్రామాంతరం వెళ్ళవలసి వచ్చింది. ఆ కారణంగా పది పన్నెండేళ్ళ వయసు గల తన కుమార్తె గొడగూచితో,

**'రూపించి కడగొట్టు పాపఁడా రింటి**
**కాపిడి, అటయిట కదలకుమమ్మ!**
**పడుచులతో నాడఁ బరవకుమమ్మ!**
**నొడివిన మా వ్రతం బెడపకు మమ్మ!**
**గుడికేగి నిత్యంబు కుంచెడు పాలు**
**బడరున కారగింపగఁ బెట్టుమమ్మ!'**

"అమ్మా! మేము పొరుగూరికి వెడుతున్నాం. తొందరలోనే వచ్చేస్తాం. నీవు అటూ ఇటూ ఇల్లు విడిచి ఎటూ వెళ్ళకు. చుట్టుప్రక్కలనున్న ఆడపిల్లలతో ఆడుకోడానికి వెళ్ళకు. మేము శివునికి ప్రతిరోజు కుంచెడు ఆవుపాలు ఆరగింపు చేస్తున్నాం. మేము తిరిగి వచ్చేటంతవరకు నీవు, మన ఊరిలోని శివునకు గోక్షీరాన్ని ఆరగింపు పెట్టు" అని ఎన్నో జాగ్రత్తలు చెప్పి శివదేవయ్య దంపతులు పొరుగూరికి వెళ్ళిపోయారు. పాపం గొడగూచికి పది పండ్రెండేండ్ల వయసే కదా! సరేనంది.

ఇంటిలోని పనిని పనివాళ్ళు చూసుకుంటారు. గొడగూచి ప్రతిదినం శుచిగా స్నానం చేసి, పెరట్లోని పూవులు కోసి దండకట్టి కొలపాత్రతో కుంచెడు పాలు కొలిచి వేరొక కుండలో పోసి నెత్తికెత్తుకుంది. తనతో కోలపాత్రను కూడా పట్టుకువెళ్ళింది.

తాను తెచ్చిన పూలచెండ్లతో గొడగూచి శివుణ్ని అలంకరించింది. పాలకుండ ఆయన లింగానికి ఎదురుగా పెట్టింది. "స్వామీ! శివా! మా తండ్రి పని మీద మరో ఊరు వెళ్ళాడు. నీ ఆరగింపు కోసం కుంచెడుపాలు ఇమ్మన్నాడు. ఇదిగో! కుంచెడు ఆవుపాలతో కుండ. ఈ పాలు ఆరగించు స్వామీ!" అని ఈశ్వరునకు నమస్కరించి, అక్కడే నిలబడి కళ్ళు మూసుకుంది.

కొంతసేపటికి కళ్ళు తెరిచింది. పాలు అలాగే ఉన్నాయి. శివుడు త్రాగలేదు. అపుడామె, "అయ్యో! మా అయ్య చెప్పినట్లే చేశాను. అయినా శివయ్యపాలు త్రాగలేదు. ఓహో! నేను ఎదురుగా నున్నానని మొగమాట పడుతున్నాడేమో" అని ఆలోచించింది.

"స్వామీ! నేను కొంచెంసేపు బయట నిలబడి ఉంటాను. ఈలోగా పాలు త్రాగు స్వామీ!" అంటూ తాను గర్భాలయం బయటకు వచ్చింది. గోడ కానుకొని కొంతసేపు నిలబడింది. తరువాత తిరిగి ఆలయంలోకి వెళ్ళింది. పాలు అలాగే ఉన్నాయి. శివుడు త్రాగలేదు. గొడగూచికి బాధ వచ్చింది. కన్నీళ్ళ పర్యంతమైంది. ఆమె శివుడితో-

**"పాలేల ఆరగింపవు లింగమూర్తి!**
**కాచుట చాలదో! కమ్మ వల్వమినొ!**
**ప్రాచియో విరిగెనో, పడుచ నేననియొ!**
**ప్రొద్దెక్కెనో, యొండె, పొగయు వల్చెడినో,**
**బుద్ధిపుట్టదో, నెయ్యివోయ కుండితినో,**
**కడువేడియో, నీరు కలిసిన వనియొ,**
**. . . . . . . . . . . . . . . . . . . . . . . . . . . . . .**
**. . . . . . . . . . . . . . . . . . . . . . . . . . . . . ."**

"శివా! నీవెందుకీ పాలు త్రాగవు? బాగా కాగలేదా? కమ్మగా లేవా? నిన్నటి పాలనుకొంటున్నావా? ఆడపిల్ల తెచ్చిన పాలు త్రాగకూడదనుకుంటున్నావా? ప్రొద్దుపోయిందా? పాలు పొగచూరి పోయాయా? పాలంటే నీకిష్టం లేదా? పాలల్లో నెయ్యి కలపకుండా తెచ్చానని కోపమా? బాగా వేడిగా ఉన్నాయా? నీళ్ళు కలిపి తెచ్చాననుకుంటున్నావా? త్రాగడానికి వీల్లేకుండా పాలు విరిగి పోయాయా? తగినంత చక్కెర కలపలేదనియా? స్వామీ! నా వలన కలిగిన లోపం ఏమిటి? నాకు తెలియజెప్పు. వీలైనంత మేర నా లోపాన్ని సరిదిద్దుకుంటాను.

నీ మీద నాకు భక్తి లేదనుకుంటున్నావా? నేనా వయసులో చిన్నదాన్ని. నిన్నే విధంగా సేవించాలో తెలియనిదాన్ని. ఇంతకు ముందు మా తండ్రి నిన్నే విధంగా సేవించేవాడో నేను చూడలేదు. ఆయన చెప్పగా నేను వినలేదు. తెలియకుండా నీకు నేనేమయినా అపరాధం

చేసి ఉంటే మన్నించు తండ్రీ!'' అంటూ పాల పాత్ర కేసి మళ్ళీ దృష్టి సారించింది. పాలు అలాగే ఉన్నాయి. గోడగూచి ఇంత చెప్పినప్పటికి శివుడు పాలు త్రాగలేదు.

గోడగూచికి పట్టరాని ఉక్రోషం వచ్చింది. కళ్ళ నుండి నీళ్ళు జలజల రాలాయి. ''ఓ దేవా! దేవాది దేవా! శివా! పశుపశుపతీ!ఉమాపతీ! నిన్నెలా సేవించాలి? నా మీద దయ కలగడడానికి నేను ఏమి చెయ్యాలి? నీవు కరుణాభరణువని పెద్దలు చెప్పగా విన్నాను. పెద్దలు చెప్పినట్లు నీవు కరుణాపరుడవు కాదు. నిష్కరుణుడవు శిలవు. నీ హృదయం వజ్రసమానం. నీకు విషమంటేనే ఇష్టం. పంచదార కలిపిన కమ్మని ఆవుపాలు ఎందుకిష్టమౌతాయి? పాలు త్రాగు స్వామీ! అని కోరే నేను నీకు శత్రువునైపోయాను. అమృతం కోసం తాపత్రయపడుతూ, విషాన్ని ఆరగిస్తూ ఉంటే చూస్తూ ఊరుకున్న దేవతలు నీకు మిత్రులైపోయారు. ఇదేమి న్యాయం స్వామీ! ఒక ఆడపిల్ల, పైగా వయసులో చిన్నపిల్ల తండ్రి మాట మీద గౌరవముంచి, భక్తిశ్రద్ధలతో ఆరగింపు కోసం పాలు తెచ్చిందన్న అభిమానం కూడా నీకు లేదా? నీవు పాలు త్రాగకపోతే మా తండ్రి నన్ను నిందిస్తాడు, తిడతాడు, కొడతాడు. చర్మం చిట్లగొట్టి చంపేస్తాడు. ఆయన చేతిలో చనిపోయే కన్న, నీ శివలింగానికి తల బ్రద్దలు కొట్టుకొని ఇక్కడే, ఇప్పుడే, నీముందే చనిపోతాను'' అని శివలింగానికి తలబాదుకోసాగింది. తలపగిలి రక్తం కారసాగింది.

పార్వతీపతికి గొడగూచి మీద కరుణ కలిగింది. ఆమెను అనుగ్రహింప దలచాడు. ఆమె ముందు ప్రత్యక్షమయ్యాడు. ఒక చేతితో ఆమె, తల బాదుకోవడాన్ని నిరోధించాడు. మరొక చేతితో పాలపాత్ర తీసుకొని గడగడ పాలు త్రాగేశాడు. శివ హస్త స్పర్శతో, కారుతున్న రక్తం ఆగి పోయి, గోడగూచి యథాపూర్వస్థితికి వచ్చింది. శివుడికి భక్తితో సాష్టాంగ దండప్రణామాలాచరించింది. ఉమాపతి అంతర్ధానమయ్యాడు. గోడగూచి ఖాళీ పాత్రలతో ఇంటికి తిరిగివచ్చింది.

ఈ విధంగా ప్రతిరోజూ గోడగూచి శివాలయానికి పాలు పట్టుకొని వెళ్ళడం, శివుడు పాలు త్రాగడం నిత్యకృత్యంగా జరిగిపోతోంది. కొన్నాళ్ళు గడిచాయి. ఒకనాడు ఉదయమే గోడగూచి, శివుడికి పాలు ఆరగింపు చేసింది. శివుడు పాలారగించాడు. గోడగూచి ఇంటికి బయలుదేరింది. మార్గమధ్యంలో పొరుగూరి నుండి తిరిగి వస్తున్న తల్లిదండ్రులు కనిపించారు. శివదేవయ్య, గోడగూచిని చూశాడు.

ఆమె చేతిలో ఖాళీ పాలకుండను చూశాడు. వెంటనే, ''బిడ్డా! కుండలో పాలు లేవేమి?'' అని అడిగాడు. దానికామె, శివుడారగింపు చేశాడని సమాధానమిచ్చింది. ఆ సమాధానం విని శివదేవయ్య ఆశ్చర్యంతో అదిరిపడ్డాడు.

''ఆరగింపు చేశాడా?'' అన్నాడు.

''ఔను తండ్రీ! నీవు వెళ్ళిన మరునాటి నుండి నేనిచ్చిన ఆవు పాలను శివుడు ఆరగిస్తున్నాడు'' అని సమాధానం చెప్పింది.

ఆ సమాధానానికి శివలింగయ్య అపరరుద్రుడయ్యాడు.

''ఓసి! రాక్షసి! కిరాతకీ! ఎక్కడైనా రాతిలింగం పాలు త్రాగుతుందా? లింగం పాలు త్రాగుతుందంటే లోకంలో ఎవరైనా నమ్ముతారా? నీ మాటలు వినడానికి, నమ్మడానికి నేనేమైనా మూర్ఖుననుకొన్నావా? దుర్మార్గులారా? ఇన్నేళ్ళ నుండి నేను శివుడికి పాలు నివేదన చేస్తున్నాను. ఒక్కనాడైనా ఆయన నేనిచ్చిన పాలు త్రాగాడా? ఆ పాలు ఇంటికి తెచ్చి పిల్లల తల్లులకు పంచుతున్న సంగతి నీకు తెలియదా?

**''. . . . . . . . . . . . . . . . . . . . తోడ**
**నాడెడు పడుచుల కచట బోసితివో?**

**ఏడ జల్లితివో? మై యెఱుగవ్వ గాక''**

నీతో ఆటలాడే పడుచు పిల్లలకి త్రాగమని పోశావా? లేక ఎక్కడైనా పాలు నేలపాలు చేశావా? ఒళ్ళు తెలియకుండా మాట్లాడుతున్నావు. నువ్వేమైనా మహాభక్తురాలివా, నీవిచ్చిన పాలు శివుడు త్రాగడానికి. నీ మాటలు నేను నమ్మాలా?'' అంటూ కూతురు మీద మండిపడ్డాడు. నిజం చెప్పకపోతే చర్మమొలిచేస్తానన్నాడు.

తండ్రియేమన్నా, గోడగూచి భయపడక, ''తండ్రీ! ఎందుకు కోపగిస్తావు. శివుడు బోళాశంకరుడు. ఆయనకు కోపం లేదు. శివుడికి లేని కోపం శివభక్తులకుండవచ్చునా? నేను సత్యాన్నే చెప్పాను. నీ పాదాల సాక్షిగా మళ్ళీ చెబుతున్నాను. నీవు చెప్పినట్లు శివునకు ఆవుపాలు ఆరగింపు చేశాను. ఆయన ఆరగించాడు. ఇప్పుడు కూడా స్వామి క్షీరాలు ఆరగించాడు. ఇదిగో ఆ స్వామి, పాలుగ్రోలి తిరిగి యిచ్చిన పాలపాత్ర'' అంది. అప్పుడు శివదేవయ్య కొంత శాంతించాడు. ఇంటికి వచ్చాడడు ఆ రోజంతా ఆయన మథనపడుతూనే గడిపాడు.

తెల్లవారింది. శివదేవయ్య ఆజ్ఞతో ఆవుపాలు నిండిన పాలకుండతో గోడగూచి శివాలయానికి బయలుదేరింది. శివదేవయ్య ఆమెననుసరించాడు. గోడగూచి తాను తెచ్చిన పాలపాత్రను శివుడి ముందుపెట్టి, ''ఆరగించు స్వామీ!'' అంది. శివుడు పాలు త్రాగలేదు. ఈనాడు, ప్రతిరోజులాగా శివుడు పాలారగించలేదు. శివదేవయ్య గోడగూచిని కోపంగా క్రీగంట చూశాడు.

అపుడామె, ''తండ్రీ! మనం ఎదురుగా ఉంటే శివుడు పాలు త్రాగడు, మనం కొంత సమయం బయట వేచి ఉందాము'' అంది.

శివదేవయ్య, గోడగూచి కొంచెంసేపు బయటకు వెళ్ళివచ్చారు. శివుడు పాలు త్రాగలేదు. ఒక్క చుక్క కూడడ కుండలో నుండి తరగలేదు. గోడగూచి అనేక విధాల శివుని ప్రార్థించింది. అయినా శివుడు పాలు త్రాగలేదు. ఆ దృశ్యం చూసి శివదేవయ్య కోపం రెట్టింపయింది. కళ్ళెర్రబడ్డాయి. కనుబొమలు ముడివడ్డాయి. కళ్ళ నుండి నిప్పులు రాలుస్తూ ''ఏమే! గోడగూచి! శివుడు ప్రతిరోజు ఇలాగే పాలు త్రాగుతున్నాడా?'' అని గట్టిగా ఉరుము మాదిరిగా గర్జించాడు.

అపుడు గోడగూచి ఏడుస్తూ శివలింగాన్ని కౌగిలించుకుని, ''శివా! శంకరా! ఎందుకు ఈనాడు నన్ను పరీక్షిస్తున్నావు? నేనసత్య వాదినని మా తండ్రి నమ్ముతున్నాడు. నన్ను చంపేస్తానంటున్నాడు. ఆయన చేతిలో మరణించడం కన్న, నీ ముందే ప్రాణాలు పరిత్యజిస్తాను'' అంటూ తల శివలింగానికి వేసి కొట్టుకోసాగింది.

కొంతసేపటికి శివలింగం మధ్యకు రెండుగా పగిలింది. ఆ భాగంలో గోడగూచి శివలింగంలో కలిసిపోతోంది. దానిని గమనించిన శివదేవయ్య, గోడగూచిని పట్టుకోబోయాడు. కాని, అప్పటికే గోడగూచి శివైక్యం చెందింది. కాని, గోడగూచి కేశాలు శివదేవయ్య చేతికి చిక్కాయి.

గోడగూచి పూర్తిగా శివైక్యం చెందింది. శివలింగం రెండు పక్షాలు కలిసిపోయి, లింగాకారం పొందింది. శివలింగానికి మాత్రం బయట గోడగూచి కేశాలు వ్రేలాడుతూ ఉన్నాయి.

ఇప్పటికి శివలింగానికి అలంకారంగా ఉన్న గోడగూచి తల వెంట్రుకలను, ప్రతి ఆరుమాసాలకి కత్తిరిస్తూ ఉంటారు.

శివదేవయ్య తన కుమార్తె సంస్మరణార్థం గొప్ప జాతర జరిపించాడు.

ఇది గోడగూచి భక్తి తత్పరత కాకమరేమిటి? శివుని భక్తప్రియత్వము కాక మరేమిటి?

*- వారణాసి వేంకటేశ్వర శాస్త్రి*

## వివిధ సందర్భాలలో ప్రజలకు ఉపయోగపడే టోల్ ఫ్రీ నెంబర్స్ వివరాలు

### 108



అత్యవసర సమయాలలో, రోడ్డు ప్రమాదం జరిగిన, గుండెపోటు వెుుదలైన ప్రమాదకర సమయాలలో, గర్భిణులకు ప్రసవ సమయంలో, పాము కాటు మొదలగు విపత్కర సమయాలలో ఎటువంటి అత్యవసర సమయాల్లోనైనా సర్వీస్ టోల్ ఫ్రీ నెంబర్ '108' చేస్తే తక్షణం ప్రాథమిక వైద్యం అందిస్తారు.

### 100

పోలీసులకు సమాచారం తెలియచేసేందుకు ఉద్దేశించినది. ట్రాఫిక్ జామ్ అయినా, గూండాయిజం, కొట్లాటలు, యువతులను వేధించటం వంటి వాటి బారి నుంచి బయటపడడానికి '100' కి ఫోన్ చేస్తే పోలీస్ డిపార్ట్‌మెంట్ వారు వెంటనే స్పందిస్తారు.

### 1090

ఇది క్రైం స్టాపర్ నెంబరు. అల్లర్లు, దోపిడీలు జరిగినప్పుడు 1090కి ఫోన్ చేస్తే, ఆయా జిల్లాల ఎస్.పిల ఆధ్వర్యంలో ఈ సేవలు అందుతాయి.

### 101

అగ్ని ప్రమాదం సంభవించినప్పుడు 101కి ఫోన్ చేస్తే, అగ్ని ప్రమాద దళాల సిబ్బంది వచ్చి రక్షించటం జరుగుతుంది. నదులు, కాలవులు, చెరువుల్లో మునిగిపోయినా, వరదల్లో చిక్కుకున్నా, బోరుబావుల్లో పడిపోయినా, 101 కు ఫోన్ చేస్తే చాలు సిబ్బంది వచ్చి రక్షించే వీలుంది.



### 1058

వికలాంగులు, ఎయిడ్స్ వ్యాధిగ్రస్తులు, అత్యవసర వైద్య సలహాలను పొందగోరేవారు ఆ జిల్లా కేంద్రంలోని 1058 కి ఫోన్ చేసి సహాయం పొందవచ్చును.

### 1077

అధికవర్షాలు, తుపానులు, పిడుగులు, వరదల సమయంలో ఇబ్బందులు పడుతుంటే '1077' కు ఫోన్ చేస్తే తక్షణ సహాయం పొందవచ్చును.

### 1100

అన్నదాతల కోసం ఉద్దేశించిన 'హెల్ప్‌లైన్', వ్యవసాయ సస్యరక్షణ కోసం శాస్త్రవేత్తల నుంచి సమాచారం పొందాలంటే '1100'కు ఫోన్ చేయవచ్చు.

### 1551

ఇది రైతులకు సంబంధించిన కాల్ సెంటర్. వివిధ పంటల గిట్టుబాటు ధరలు, మార్కెట్లు రోజువారీ ధరలను తెలుసుకునేందుకు '1551' ఫోన్ చేయవచ్చును.

### 18004257788

అత్యంత ప్రతిష్ఠాత్మకంగా ప్రారంభించిన 'రాజీవ్ ఆరోగ్యశ్రీ' పథకం గురించి తెలుసుకోవాలంటే '18004257788' నెంబరుకు ఫోన్‌చేసి సహాయం పొందవచ్చును.

### 1992-1991

బి.ఎస్.ఎన్.ఎల్ కి సంబంధించిన ఫోన్‌నెంబర్. ఫోన్‌లో అంతరాయాలు ఏర్పడినా ఏదైనా సమాచారం కావాలన్నా ఈ నెంబరుకు ఫోన్ చేయవచ్చును. ల్యాండ్‌లైను, విల్‌ఫోన్ కనెక్షన్‌దారులు ఈ నెంబరుకు చేసి తెలుసుకోవచ్చును.

1991 బి.ఎస్.ఎన్.ఎల్. కాల్ సెంటర్ టోల్ ఫ్రీ నెంబర్.

### 155333

ఇది విద్యుత్ సమస్యలను పరిష్కరించేందుకు ఏర్పాటు చేశారు. లోవోల్టేజి, నిరాటంకంగా విద్యుత్ నిలిచిపోవడం, ట్రాన్‌ఫార్మర్స్ మరమ్మతులకు గురైన తదితర సమస్యలను '155333' ఫోన్ చేసి చెప్పొచ్చు.

## అత్యవసర టోల్‌ఫ్రీ నెంబర్స్

### 1098

ఇది ఛైల్డ్‌లైన్ టోల్‌ఫ్రీ నెంబర్ 1098. 18 సంవత్సరాలలోపు బాలబాలికలకు, నిరాశ్రయులైన వారికి సేవలందిస్తుంది. ఈ విభాగం వీధిబాలలు, తప్పిపోయిన వారికి, అనాథలను సంరక్షించి వారి బంధువులకి అప్పగిస్తారు. పిల్లల కోసం ఎవరూ రాకపోతే జిల్లా కేంద్రంలోని ఛైల్డ్‌లైన్‌కి ఈ విభాగం అందచేస్తుంది.

### 155321

మహాత్మాగాంధీజీ గ్రామీణ ఉపాధి హామీ పథకంపై ఎటువంటి సందేహాలు, సూచనలు, సలహాలు, ఫిర్యాదులు చేయాలన్నా ప్రభుత్వం దృష్టికి నేరుగా తీసుకెళ్ళే టోల్‌ఫ్రీ నెంబర్ 155321

### 1091

మహిళలు, బాలికలపై వేధింపులు జరిగితే వాటిని అరికట్టేందుకు 1091 కు ఫోన్ చేస్తే సహకారం లభిస్తుంది.

### 139

రైల్వే రిజర్వేషన్, రైల్వే రాకపోకలు, పి.ఎన్.ఆర్ స్టేటస్ కావాలంటే 139కి ఫోన్ చేయాలి. ఇది ఉచితం కాదు.

### 18004252910

ఆంధ్రాబ్యాంక్ ఎ.టి.ఎంకి వెళ్ళినప్పుడు నగదులో తేడాలొచ్చినా, కార్డు పోగొట్టుకున్నా టోల్‌ఫ్రీ నెం 18004252910 చేసి సహాయం పొందవచ్చును.

*- కె. కోటేశ్వరరావు, ఎమ్.పి.డి.ఓ,*
*భీమడోలు మండలం, పశ్చిమ గోదావరి జిల్లా*



# ముఖ్యమంత్రిగా శ్రీ కిరణ్‌కుమార్ రెడ్డి ప్రమాణ స్వీకారం

**ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర 16వ ముఖ్యమంత్రిగా చిత్తూరు జిల్లా పీలేరు శాసన సభ్యుడు శ్రీ నల్లారి కిరణ్ కుమార్ రెడ్డి ది :25.11.2010న ప్రమాణ స్వీకారం చేసారు. గురువారం ది. 25.11.2010 మధ్యాహ్నం గం. 12.14.ని.లకు రాజ్ భవన్‌లో రాష్ట్ర గవర్నర్ శ్రీ ఈ.ఎస్.ఎల్. నరసింహన్ ఆయన చేత ప్రమాణం చేయించారు.**

శ్రీ కిరణ్ కుమార్ రెడ్డిని రాష్ట్ర ముఖ్యమంత్రిగా నియమిస్తూ గవర్నర్ వెలువరించిన ఉత్తర్వులను ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్.వి. ప్రసాద్ చదివి వినిపించిన వెంటనే శ్రీ కిరణ్ కుమార్ రెడ్డి తెలుగులో దైవసాక్షిగా ప్రమాణం చేసారు. ప్రమాణ స్వీకారోత్సవానికి కేంద్ర మంత్రులు శ్రీయుతులు వీరప్పమొయిలీ, గులాంనబీ అజాద్‌లు, మాజీ ముఖ్యమంత్రి శ్రీ రోశయ్య, పి.సి.సి. అధ్యక్షుడు డి. శ్రీనివాస్, శాసన మండలి ఛైర్మన్ చక్రపాణి, డిప్యూటీ ఛైర్మన్ మహ్మద్ జానీ, టి.డి.పి. నేత నాగం జనార్ధన రెడ్డి, మోత్కుపల్లి నర్సింహులు, దాడి వీరభద్రరావు, బిజె.పి. రాష్ట్ర అధ్యక్షుడు కిషన్ రెడ్డితో పాటు పలువురు మాజీ మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు పాల్గొన్నారు. ప్రమాణ స్వీకారం అనంతరం జరిగిన విలేకరుల సమావేశంలో పాల్గొన్న ముఖ్యమంత్రి శ్రీ కిరణ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో శాంతిభద్రతల పరిరక్షణకు, ప్రజారోగ్యం, విద్యకు తొలి ప్రాధాన్యం ఇవ్వనున్నట్లు తెలియచేసారు. రాష్ట్రాన్ని పెట్టుబడులకు అనుకూల ప్రాంతంగా తీర్చి దిద్దటానికి కృషి చేస్తానన్నారు. జలయజ్ఞం పూర్తి చేయటానికి, అమలులో ఉన్న పలు అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలను సమర్ధవంతంగా అందచేయటానికి దృష్టిసారిస్తానన్నారు.

రాష్ట్ర ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన వెంటనే ముఖ్యమంత్రి శ్రీ కిరణ్ కుమార్ రెడ్డి గురువారం 25.1.2010 మధ్యాహ్నం నిమ్స్ ఆస్పత్రిని సందర్శించి, అక్కడ ఆరోగ్యశ్రీ వార్డులో చికిత్స పొందుతున్న రోగులను పరామర్శించారు. వైద్య సేవలు ఏ విధంగా అందుతున్నాయో రోగులను ప్రశ్నించి తెలుసుకున్నారు. తదనంతరం వ్యవసాయశాఖ, పౌరసరఫరాలు, విద్యుత్, సంక్షేమం, శాంతి భద్రతలు, ఆర్థిక పరిస్థితులపై ఉన్నతాధికారులతో వేర్వేరుగా సమావేశాలు నిర్వహించారు. రైతులకు కనీస మద్దతు ధర దక్కేలా చర్యలు తీసుకోవాలన్నారు. వర్షాలకు తడిసి రంగు మారిన ధాన్యం కొనుగోలుకు అన్ని చర్యలు తీసుకోవాలన్నారు. రబీలో పంటల సాగుకు విద్యుత్ సక్రమంగా సరఫరా అయ్యేలా చూడమని అధికారులను ఆదేశించారు. పంటలకు అవసరమైనంత విద్యుత్తును కొనుగోలు చేయటానికి వెనుకాడవద్దని అన్నారు. ధాన్యాన్ని నిల్వ చేయటానికి గోదాములను సంసిద్ధం చేసుకోవాలని, గోదాముల కొరతతో ధాన్యం పాడయ్యే పరిస్థితులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలన్నారు. వివిధ సంక్షేమ శాఖల అధికారులతో సమావేశమైన ముఖ్యమంత్రి శ్రీ కిరణ్ కుమార్ రెడ్డి ఎస్సీ, ఎస్టీ, బిసి, మైనారిటీ, మహిళా, శిశు సంక్షేమ పథకాలు, కార్యక్రమాల వివరాలు అడిగి తెలుసుకున్నారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి గూర్చి ఆయన అడిగి తెలుసుకున్నారు. తన పని తీరే పలు ప్రశ్నలకు సమాధానం కాబోతున్నదని ఆయన అన్నారు.

## క్రీడా స్ఫూర్తి కల్గిన నాయకుడు మన ముఖ్యమంత్రి

శ్రీ కిరణ్ కుమార్ రెడ్డి చిత్తూరు జిల్లా నగరిపల్లి వాసి అయినప్పటికీ హైదరాబాద్‌లో పుట్టిపెరిగారు. 10వ తరగతి వరకూ హైదరాబాద్ పబ్లిక్ స్కూల్‌లోను, ఇంటర్ మీడియట్ సెయింట్ జోసఫ్ జూనియర్ కళాశాలలోను, బి.కామ్ డిగ్రీ నిజామ్ కళాశాలలోను, ఎల్.ఎల్.బి. ఉస్మానియా యూనివర్సిటీలోను అభ్యసించారు. 1981-82 కాలంలో నిజామ్ కళాశాల విద్యార్థి సంఘ అధ్యక్షుడిగా పనిచేసారు. విద్యార్థి దశ నుండే నాయకత్వ లక్షణాలను పుణికి పుచ్చుకున్న శ్రీ కిరణ్ కుమార్ రెడ్డి విద్యార్థుల కష్టాలను ఎప్పటికప్పుడు తెలుసుకొని సమస్యలను పరిష్కరించటానికి కృషిచేసేవారు. బి.కామ్ చదివే సమయంలో

తెలంగాణ జిల్లాల్లోని డిగ్రీ కాలేజీ జట్టుకు కెప్టెన్‌గా వ్యవహించారు. దక్షణ భారతదేశంలో రంజీ క్రికెట్ టీమ్‌కు కూడా కెప్టెన్‌గా పనిచేసారు. ప్రముఖ క్రికెట్ క్రీడాకారుడు మహ్మద్ అజారుద్దీన్ అప్పట్లో ఈయన టీమ్ సభ్యుడే. చిత్తూరు జిల్లా నుంచి రాజకీయ నేపథ్యం ఉన్న కుటుంబంలో జన్మించిన శ్రీ కిరణ్ కుమార్ రెడ్డి తన తండ్రి శ్రీ అమర్‌నాథ్ రెడ్డి మరణంతో ప్రత్యక్ష రాజకీయాలలోకి 1989 సంవత్సరంలో అడుగుపెట్టారు. 1989-1999 మధ్య రెండు సార్లు శాసన సభకు ఎన్నికయ్యారు. తిరిగి 2004లో ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. 2004-2009 వరకూ వై.ఎస్. ప్రభుత్వంలో ఛీఫ్ విప్‌గా సమర్ధవంతంగా పనిచేశారు. తిరిగి 2009లో పీలేరు నియోజకవర్గం నుండి శాసన సభ్యునిగా ఎన్నికైన శ్రీ కిరణ్‌కుమార్ రెడ్డి ఆంధ్రప్రదేశ్ శాసన సభ స్పీకర్‌గా ఉన్నికై ముఖ్యమంత్రిగా ఎంపిక చేయబడే వరకూ స్పీకర్‌గా సమర్థవంతంగా తన విధులు నిర్వర్తించారు.

## కొత్త సీఎం బయోడేటా ఇదీ...

| | |
|---|---|
| పూర్తి పేరు | : **నల్లారి కిరణ్ కుమార్ రెడ్డి** |
| జననం | : 13.09.1960 |
| జన్మ స్థలం | : హైదరాబాద్ |
| స్వస్థలం | : నగిరిపల్లె, పత్తేగడ పంచాయతీ, కలికిరి మండలం, చిత్తూరు జిల్లా |
| తల్లితండ్రులు | : నల్లారి అమర్‌నాథ్ రెడ్డి (మాజీ మంత్రి), సరోజమ్మ |
| విద్యార్హతలు | : బి.కాం., ఎల్.ఎల్.బీ. |

| | |
|---|---|
| ప్రాథమిక విద్యాభ్యాసం | : హైదరాబాద్ పబ్లిక్ స్కూల్ |
| ఇంటర్ | : సెయింట్ జోసెఫ్స్ జూనియర్ కళాశాల |
| డిగ్రీ | : నిజాం కళాశాల |
| ఎల్.ఎల్.బీ. | : ఉస్మానియా యూనివర్సిటి |

## రాజకీయ నేపథ్యం

| | |
|---|---|
| 1989-94 | : ఎమ్మెల్యే - వాయల్పాడు |
| 1999-04 | : ఎమ్మెల్యే - వాయల్పాడు |
| 2004-09 | : ఎమ్మెల్యే - వాయల్పాడు, ఛీఫ్ విప్ |
| 2009-ప్రస్తుతం | : ఎమ్మెల్యే - పీలేరు, రాష్ట్ర ముఖ్యమంత్రి |

1. శ్రీ కిరణ్ కుమార్ రెడ్డి రాష్ట్రానికి 16వ ముఖ్యమంత్రి. చిత్తూరు జిల్లా నుండి రాష్ట్ర ముఖ్య మంత్రిగా ఎన్నికైన రెండో వ్యక్తి. గతంలో ఇదే జిల్లాకు చెందిన శ్రీ నారా చంద్రబాబు నాయుడు రెండు సార్లు ముఖ్యమంత్రిగా పనిచేశారు.

2. శ్రీ కిరణ్ కుమార్ రెడ్డి తండ్రి అమర్ నాధ్ రెడ్డి 4 సార్లు ఎమ్మెల్యేగా గెలిచారు. వాయల్పాడు నుంచి 1962లో ఇండిపెండెంట్ అభ్యర్థిగా, 1972, 1978, 1985లలో కాంగ్రెస్ తరపున ఎమ్మెల్యేగా గెలిచారు. శ్రీ అమర్‌నాథ్ రెడ్డి 1978 నుంచి శ్రీ మర్రి చెన్నారెడ్డి, శ్రీ అంజయ్య, శ్రీ భవనం వెంకట్రామ్‌ల మంత్రివర్గాల్లో సభ్యుడిగా ఉన్నారు. ◆



## మన ముఖ్యమంత్రులు


| పేరు | పదవీకాలం | పేరు | పదవీకాలం |
|---|---|---|---|
| 1. నీలం సంజీవ రెడ్డి | 01/11/1956 నుండి 11/01/1960 | 12. నాదెండ్ల భాస్కర్ రావు | 16/08/1984 నుండి 16/09/1984 |
| 2. దామోదరం సంజీవయ్య | 11/01/1960 నుండి 12/03/1962 | 13. ఎన్.టి.రామారావు | 16/09/1984 నుండి 09/03/1985 |
| 3. నీలం సంజీవరెడ్డి | 12/03/1962 నుండి 29/02/1964 | 14. ఎన్.టి. రామారావు | 09/03/1985 నుండి 03/12/1989 |
| 4. కాసు బ్రహ్మానందరెడ్డి | 19/02/1964 నుండి 30/09/1971 | 15. మర్రి చెన్నారెడ్డి | 03/12/1989 నుండి 17/12/1990 |
| 5. పి.వి. నర్సింహారావు | 30/09/1971 నుండి 10/01/1973 | 16. ఎన్. జనార్థన్ రెడ్డి | 17/12/1990 నుండి 09/10/1992 |
| రాష్ట్రపతి పాలన | 10/01/1973 నుండి 10/12/1973 | 17. కోట్ల విజయభాస్కర్ రెడ్డి | 09/10/1992 నుండి 12/12/1994 |
| 6. జలగం వెంగళరావు | 10/12/1973 నుండి 06/03/1978 | 18. ఎన్.టి. రామారావు | 12/12/1994 నుండి 01/09/1995 |
| 7. మర్రి చెన్నారెడ్డి | 06/03/1978 నుండి 11/10/1980 | 19. నారాచంద్రబాబునాయుడు | 01/09/1995 నుండి 14/05/2004 |
| 8. టంగుటూరి అంజయ్య | 11/10/1980 నుండి 24/02/1982 | 20. వైయస్ రాజశేఖర రెడ్డి | 14/05/2004 నుండి 02/09/2009 |
| 9. భవనం వెంకట్రామ్ | 24/02/1982 నుండి 20/09/1982 | 21. కొణిజేటి రోశయ్య | 04/09/2009 నుండి 24/11/2010 |
| 10. కోట్ల విజయభాస్కర్ రెడ్డి | 09/01/1982 నుండి 09/01/1983 | 22. నల్లారి కిరణ్ కుమార్ రెడ్డి | 25/11/2010 నుండి |
| 11. ఎన్.టి. రామారావు | 09/01/1983 నుండి 16/08/1984 | | ★ ఆధారం AP Online Website |

# ధనుర్మాస వైభవం



*సప్తాశ్వరథమారూఢం ప్రచండం కశ్యపాత్మజం*
*శ్వేతపద్మధరం దేవం తం సూర్యం ప్రణమామ్యహం*


**సూర్యుడు లోకబాంధవుడు. తన సహస్ర కిరణాలతో లోకాన్ని జాగృతం చేసే చైతన్య స్వరూపుడు. అటువంటి సూర్య భగవానుని ప్రయాణాన్ని బట్టి ప్రకృతిలో ఎన్నో మార్పులు సంభవిస్తుంటాయి. ఆయా మార్పులకు తగిన విధంగా మానవ మనుగడ సర్వసుఖప్రదం కావటం కోసం మన పెద్దలు వివిధ కాలాలలో వివిధ పర్వదినాల రూపంగా విధివిధానాలను ఏర్పరచారు.**



పండుగలతో పాటుగా వ్యక్తి వికాసానికి, మానసిక వికాసానికి సహకరించే విధంగా కొన్ని మాసాలను కూడా నియమనిష్ఠలతో గడపాలని ఆదేశించారు. అలా వారు రూపొందించిన మాసంలో నెలరోజుల పాటు చేసే వ్రతమే ధనుర్మాసవ్రతం. ఇది సూర్యుడు ధనురాశిలో ప్రవేశించటంతో ప్రారంభమవుతుంది. ఇది మార్గశీర్ష మాసంలో వస్తుంది. 'మాసానాం మార్గశీర్షోహం' అని గీతాచార్యుడైన శ్రీకృష్ణపరమాత్మ చెప్పడాన్ని బట్టి మనం ఈ మాస ప్రత్యేకతను అర్థం చేసుకోవచ్చు.

మార్గశిరమాసం మహిమాంశు భాసురం. ఈ మాసంలో సూర్యభగవానుని అనుగ్రహం సూర్యకిరణాల రూపంలో ఉంటుంది. చంద్రుడి అనుగ్రహం చంద్రకిరణాల రూపంలో ఉంటుంది. ఈ అనుగ్రహాలు అంతకు ముందుకంటే అత్యంత తేజోవంతంగా, శక్తిమంతంగా ఉండటం ఈ మాస విశేషం.

ధనుర్మాస ప్రారంభంతో ప్రకృతి సహజ సౌందర్యంతో ఒప్పారుతుంది. మంచు దుప్పట్లు దట్టంగా పరుచుకొంటాయి. చల్లగా వీచే ప్రాభాత



మలయ మారుతాలు ప్రకృతిని ఆహ్లాదభరితం చేస్తాయి. దేవాలయాలు సూర్యుడు నిద్ర లేవకముందే తమ తమ ఆధ్యాత్మిక కిరణాలను లోకమంతా వెదజల్లుతాయి. ఈ ధనుర్మాస ప్రారంభం నుంచే గోదాదేవి శ్రీరంగనాథుణ్ణి వివాహమాడటం కోసం ధనుర్మాస వ్రతం ఆచరించింది.



రోజూ తెల్లవారుజామునే గోపికలందరినీ కలుపుకొని రోజుకో పాశురం చొప్పున విన్నవించి స్వామిని కీర్తించి రంగనాథుణ్ణే వరించింది గోదాదేవి. ఆనాటి నుంచి వివాహం కావలసిన కన్యలు మంచి భర్త రావాలనే కోరికతో ఈ వ్రతాన్ని ఆచరిస్తుంటారు. రోజుకో పాశురం చొప్పున స్వామివారికి విన్నవిస్తూ గోదాదేవి రచించిన స్తోత్రమే తిరుప్పావైగా ప్రసిద్ధి చెందింది. ఆ గోదాదేవి ఆండాళ్ గానూ, చూడికుడుత్త నాచ్చియార్ గానూ పేరుపొందింది. ద్వాదశాళ్వారులలో ఒకరిగా ఘనత వహించింది.

విష్ణ్వాలయాలన్నిటా ఈ 'తిరుప్పావై' పాశురాలను రోజుకో పాశురం చొప్పున విన్నవిస్తారు. స్వామిని యజ్ఞ, జప తపాదుల చేత అభిషేకాది అర్చనలచేత విశేషంగా పూజిస్తారు. సాయంత్రం పరమపౌరాణికులు తిరుప్పావై ప్రవచనాలతో ప్రజల్ని ఆధ్యాత్మిక సుసంపన్నుల్ని చేస్తారు. మార్గశిర్ష మాసంలోనే ఏకాదశి తిథిని ముక్కోటి ఏకాదశిగా వ్యవహరిస్తారు. ఈ రోజు ఎంతో పవిత్రమయినది. ఈ రోజు చేసే స్వామివారి ఉత్తరద్వార దర్శనం ఎంతో పుణ్యప్రదమైందని భక్తుల విశ్వాసం.

మార్గశిర్షం ఫలితానికి శీర్షిక వంటిది. ఎందుకంటే దీని తరువాత వచ్చే పుష్యమాసంలో పంట చేతికందుతుంది.ఆ పౌష్యలక్ష్మిని అందుకోవటానికి కావలసిన సకల అర్హతలను ప్రజలకు కల్గించేది మార్గశీర్ష మాసమే. పుష్యమాసంలో అందబోయే ఆనందానికి, ఐశ్వర్యానికీ, సుఖసంతోషాలకూ కరదీపిక మార్గశీర్షమే.

ఈ మాసంలో నెలగంట పెట్టడడం అనే సంప్రదాయం ఒకటి ఉంది. ప్రకృతిలో కలిగే మార్పులకు అనుగుణంగా ప్రజలు తమ ఆధ్యాత్మిక చింతనలలో సంప్రదాయపు వేడుకలతో తరించడానికి చేయవలసిన వ్రతాలకు నెలగంట సూచిక.

వేకువ వాకిళ్ళలో చిడతలతో కళ్ళాపి జల్లే హరిదాసులు మనలోని దానగుణాన్ని నిద్రలేపుతారు. డూడూ బసవన్నలు సన్నాయివాద్యాలతో మనలోని భూతదయను గుర్తుచేస్తాయి. ముంగిళ్లలో రంగవల్లులు హరివిల్లుల్లా శోభనిస్తాయి. గొబ్బెమ్మలు, స్త్రీల నోములు సంస్కృతికి సరికొత్త సత్తువ నిస్తాయి. స్త్రీలు వేసే రథం ముగ్గులో సమాజంలోని మానవుల మధ్య ఐక్యత దర్శనమిస్తుంది. అభివృద్ధి ఆ రథం ముగ్గులాగే సుదీర్ఘంగా సాగిపోతుంది.




పొలాల్లోని పంటఫలాలు చేతికి అందడానికి ముందు చివరిదశలో ఈ ఉత్సాహభరితమయిన వేడుకలు మనలోని ఆశావాద దృక్పథాన్ని తెలియజేస్తాయి. పంటల్ని కష్టపడి పండించి చివరికి దాని ఫలితాన్ని పొందే ఈ సమయంలో.. చేతినిండా ధనం వచ్చిపడే ఈ శుభతరుణంలో మానవుడి బుద్ధి వక్రించకుండాఉండేందుకూ ఇంద్రియ నిగ్రహంతో మనలు కొనేందుకూ రూపొందించినదే ఈ ధనుర్మాసవ్రతం.

*- డా॥ అద్దంకి శ్రీనివాస్*



అందరూ చేయగలిగిన అత్యంత తేలికపాటి విషయం. కాని వాటినే ఆచరణలో చూపించాల్సి వస్తే మాత్రం అంతా వెనక్కితగ్గే విషయమే!

ముప్పై మూడున్నర సంవత్సరాల యేసుక్రీస్తు జీవితం పూర్తిగా ప్రేమమయం. ప్రజలతో వారి కష్టాలు, కన్నీళ్ళతో, వారి దైనందిన జీవితంతో, వారి సమస్యలతో యేసుక్రీస్తు జీవితం పూర్తిగా పెనవేసుకుపోయింది. ఆనాటి మతాచార్యులు, రోమాప్రభుత్వ పాలకులు, వారి అధికారులు, అనుచరులంతా సమాజంలో ఒక బలమైన వర్గంగా ఏర్పడి 'దోపిడీ వ్యవస్థ'కు ప్రతినిధులుగా మారిన అత్యంత కీలకమైన దశలో యేసుక్రీస్తు సామాన్య మానవుని 'అసామాన్య నేతగా' రంగప్రవేశం చేశాడు. దౌర్జన్యం, దోపిడీ, బలప్రయోగం, అహంకారం, అధికారదర్పం రాజ్యమేలుతున్న సమయంలో ఆనాటి పోకడలకు, పరిస్థితులకూ పూర్తిగా భిన్నంగా కరుణ, సాత్వికత్వం, ప్రేమ, క్షమాపణ వంటి మరుగుపడిన నిజ మానవీయ విలువలను తెర మీదకి తెచ్చాడు.

అందుకే ఆయన ఎక్కడే ఉంటే అక్కడికి వేల సంఖ్యలో ప్రజలు పరుగులెత్తేవారు. ఆయన బోధనలు విని స్వాంతన పొందేవారు. ఎవరినీ కాదనకుండా ఆయన అందర్నీ

# మానవీయత మూర్తీభవించిన యేసుక్రీస్తు

**మా**నవ చరిత్రను 'జీసస్ క్రైస్ట్ లేదా తెలుగీకరణలో 'యేసుక్రీస్తు' ప్రభావితం చేసినంతగా బహుశా మరే చారిత్రక వ్యక్తీ చేయలేదనడంలో అతిశయోక్తి లేదేమో! యేసుక్రీస్తు క్రైస్తవులందరికీ ఆరాధ్యదైవం. నిజానికి ఆయన తరువాత ఆయన అనుచరులు ఆయన సిద్ధాంతాల ఆధారంగా స్థాపించి వ్యాప్తి చేసిందే క్రైస్తవ మతమైనా, యేసుక్రీస్తు దాకా చలామణిలో ఉండి అప్పటిదాకా మానవచరిత్రలో తనదైన ముద్రను వేసిన యూదు మతానికి క్రైస్తవ మతం పొడిగింపు అని చెప్పవచ్చు.

ప్రేమ, క్షమాపణ అనే రెండు పునాదుల మీద క్రైస్తవ మతం స్థాపించబడింది. ఎందుకంటే ఈ రెండింటినీ ఆధారం చేసుకున్నవే యేసుక్రీస్తు ప్రబోధాలు, ఆయన జీవితం కూడా!! ప్రపంచంలోని అన్ని భాషల్లోనూ ఈ రెండు పదాలూ ఉన్నా వాటికి ఆచరణయోగ్యమైన, మానవ కళ్యాణార్థమైన అసలు సిసలు భాష్యం మాత్రం యేసుక్రీస్తు ప్రబోధాల్లో, జీవితంలో మాత్రమే చూడగలం. ప్రేమ, క్షమాపణ అనే అంశాల పైన అనేక గంటలు, రోజుల పాటు ప్రబోధాలు వల్లించడం


అక్కున చేర్చుకునేవాడు, ఓదార్చేవాడు, తన మాటలతో సేదదీర్చేవాడు. ఆయన్ను అనుసరించిన వారిలో సామాన్యులు, అతిసామాన్యులేకాదు; పండితులు, సంపన్నులు ఆనాటి అగ్రశ్రేణి సామాజిక వర్గమూ ఉన్నారు. అయితే సంపన్నులూ, ప్రముఖులంతా తెరవెనకే రహస్య క్రైస్తవులుగా మిగిలిపోగా, సామాన్యులు మాత్రం సాహసంతో ముందుకు వచ్చి ఆయన్ను అనుసరించారు.

యేసుక్రీస్తు జననం, జీవితం, మరణం, పునరుత్థానం అన్నీ అత్యంత అసాధారణమైన ఘట్టాలుగా చరిత్రలో మిగిలిపోయాయి. పేదవారు కాకపోయినా, అతి సామాన్యులుగా పిలువదగిన నేపథ్యంలో దైవాంశ సంభూతుడు ఆత్మవశంతో మేరీ, జోసఫ్ దంపతులకు ఈనాటి ఇజ్రాయెల్ దేశంలో గల యూదయ ప్రాంతంలోని బెత్లేహేము అనే అనామక గ్రామంలో యేసుక్రీస్తు జన్మించాడు. వృత్తిరీత్యా వడ్రంగి అయిన జోసఫ్ యేసుక్రీస్తుకు వృత్తి సంబంధమైన పూర్తి తర్ఫీదునిచ్చాడు. అయితే జన్మరీత్యా తన ప్రాశస్త్యాన్ని, తన యుగంలో తన ద్వారా దేవుడు నెరవేర్చాలనుకున్న ప్రణాళికలన్నీ ఆకళింపు

చేసుకున్న యేసుక్రీస్తు నాటి మతాచార్యుల తప్పుడు బోధనలను చిన్ననాటి నుండే ఎదిరించడం ప్రారంభించాడు. ఒక విధంగా ఆయన 'బోర్న్‌రెబెల్'! (జన్మించిన నాటినుండే తిరుగుబాటు దారుడు).

పశ్చిమాసియా అంతటా రోమా ప్రభుత్వం పెత్తనాన్ని చలాయిస్తున్న రోజులవి. ఆనాటి పాలస్తీనా (ఈనాటి ఇజ్రాయెల్) దేశాన్ని కూడా రోమా ప్రభుత్వమే పరిపాలిస్తున్న సమయంలో స్థానికంగా ఉన్న యూదు మతాచార్యులు, పెద్దలు రోమా ప్రభుత్వ ప్రతినిధులతో చేతులు కలిపి సామాన్య ప్రజానీకంపైన దోపిడీని, దౌర్జన్యాన్ని అత్యధికం చేశారు. నీటి కొరత, సారవంతమైన భూముల కొరత (అదంతా ఎడారి ప్రాంతం) కారణంగా అసలే పంటల దిగుబడి అంతంత మాత్రంగా ఉండి కరువు క్షామ పరిస్థితులు, భరించలేని పన్నుల వసూళ్ళతో నడ్డి విరిగి ఉన్న సామాన్య ప్రజల కష్టాలను యేసుక్రీస్తు అర్థం చేసుకొని వెలుగులోకి తెచ్చాడు. తన బోధనల ద్వారా, ముఖ్యంగా తన జీవితం ద్వారా ప్రజల్లో చైతన్యాన్ని కలిగించడానికి, దేవుని పట్ల, దైవిక నియమాల పట్ల సరైన అవగాహనను కల్పించడానికి ఆయన శ్రమించాడు.

ఆనాడూ, ఈనాడూ కూడా దేవుడు చెప్పేది ఒక్కటైతే మతాచార్యులు చెప్పేది మరొకటిగా ఉంటుంది. దేవుణ్ణి తమ స్వార్థంకోసం మతాచార్యులు వాడుకోవాలనుకోవడమే నేడు, నాడూ కూడా సమాజంలో ఘర్షణలకు, తిరుగుబాటుకు కారణమయింది. దేవుడు కరుణామయుడన్నది సార్వత్రిక నిజం కాగా, దేవుణ్ని ఒక బూచిలాగా చూపించి పరమ కర్కోటకుడుగా, తప్పులు చేసినవారిని దండించడం తప్ప దేవుడు మరొకటి ఎరుగనివాడన్నట్టుగా ఆనాటి మతాచార్యులు చిత్రిస్తున్న సమయంలో యేసుక్రీస్తు దేవునికి సంబంధించిన అసలు విషయాలను ప్రాచుర్యంలోనికి తెచ్చాడు.



నజరేతు అనే గ్రామంలో ఒకరోజు ఆయన తన వాడుక చొప్పున అక్కడి దేవాలయానికి ఆరాధన కోసం వెళ్ళితే ఆయన చేతికి దైవగ్రంథాన్నిచ్చి దాంట్లోని ఒక భాగాన్ని చదవమన్నారు మతాచార్యులు. 'ప్రభువు ఆత్మ నా మీద ఉంది. బీదలకు సువార్త ప్రకటించడం కోసం ప్రభువు నన్ను అభిషేకించాడు. ఖైదీలకు విడుదలను, అంధులకు దృష్టిభాగ్యాన్ని ప్రకటించడానికి, అణగారినవారిని విడిపించడానికి, ప్రభువు మహోత్సవ సంవత్సరాన్ని ప్రకటించడానికి ఆయన నన్ను పంపాడు' అంటూ ప్రవచన రూపంలో యెషయా ప్రవక్త రాసిన భాగాన్ని ఆయన చదివి తిరిగి తన స్థలంలో కూర్చున్నాడు. ఆ భాగాన్నే యేసు ఎందుకు చదివాడో అర్థంకాక ఆలయంలో అంతా విస్తుపోయి చూస్తూ ఉంటే, "ఈ లేఖనాన్ని దేవుడు నా రాకకు ఎన్నో వందల సంవత్సరాల పూర్వమే ప్రవచన రూపంగా రాయించాడు. అది నెరవేరడం, మీరంతా కళ్ళారా చూస్తున్నారు" అని యేసుక్రీస్తు జవాబిచ్చాడు.

లోకంలో పాపం మితిమీరినపుడు, దేవుని పట్ల విధేయత హద్దులు మీరినపుడు దేవుడు తనదైన విధానంలో దండనకు పూనుకొంటాడన్నది అంతా విశ్వసిస్తూ వచ్చిన విషయం. కాని పాపిని దండించడం కాదు, మనిషిని పాపం నుంచి దూరం చేయడమే అసలు సిసలైన దైవిక పరిష్కారంగా, వినూత్నంగా ఆవిష్కరించి ఆలోచన రేకెత్తించిన యేసుక్రీస్తు నిజంగా విప్లవకారుడే!

నోవహు దినాల్లో అదే విధంగా జరిగిందని లేఖన భాగాల్లో అంతదాకా ప్రజలు చదివి తెలుసుకున్నారు. 'నోవహు దినాల్లో భ్రష్టత్వం పెచ్చరిల్లితే, దేవుడు నీతిమంతులుగా పేరుపొందిన నోవహును, అతని సంతానాన్ని, సకల జీవచరాల్లో 'ఆడమగ' జంటల నొక్కక్కదాన్ని ఒక ఓడలో భద్రపరచి ఆ తరువాత నలభై రోజుల మహా జలప్రళయం ద్వారా లోకంలోని సకల జీవచరాలను నిర్మూలన చేశాడు. అయితే ఆ వినాశనాన్నంతటినీ చూసిన దేవుడు చాలా బాధపడి ఇక ముందు అలాంటి మహావినాశనానికి తాను పూనుకోబోనని నొవహుకు ప్రమాణం చేశాడు.


అయితే మానవుడెపుడూ అవిధేయతా ప్రియుడు, తిరుగుబాటుదారుడు, పాప ప్రలోభితుడు. మరి దానికి పరిష్కారం ఏమిటి? తన నిర్ణీత సమయంలో తన కుమారున్ని ఈ లోకానికి అణగారిన వారి ప్రతినిధిగా, విమోచకుడిగా, రక్షకుడిగా పంపిస్తానని దేవుడు వాగ్దానం చేశాడు. ఆ రక్షకుడు లేదా హెబ్రీ భాషలో 'మెస్సీయ' కోసం అంతా ఎంతో ఆసక్తితో కనిపెడుతున్న సమయంలోనే యేసుక్రీస్తు జననం జరిగింది. తన జీవిత ఉద్దేశ్యాన్ని ప్రభువు ఆవిధంగా లేఖనభాగం ద్వారా చదివి ప్రకటించినా సమాజంలోని ఉన్నత వర్గాల వారి చెవులకు అది సోకలేదు. ఎందుకంటే సమాజంలో పేరుకుపోయి ఉన్న దుర్గంధానికి తామే కారకులమన్న సంగతి ఎరిగిన వారుగా సంస్కరణలకు, దిద్దుబాట్లకు వారు సిద్ధంగా లేరు.

అందుకే యేసుక్రీస్తు ప్రబోధాలకు, పరిచర్యలకు అన్నిరకాల ఆంక్షలు, ఆటంకాలు సృష్టించారు. అడుగడుగునా అవరోధాలు ఎదుర్కొంటూ కూడా యేసుక్రీస్తు తన జీవితోద్దేశ్యాన్ని నెరవేర్చుకున్నాడు. లోకం అంతదాకా ఎరుగనటువంటి 'దైవత్వపు పార్శ్వాన్ని'

ఆయన ప్రజల ముందర ఆవిష్కరించాడు. ఒక చెంపన కొడితే మరొకటి చెంప చూపించమన్న యేసుప్రభువు, సిలువలో మరణ శిక్షను అనుభవిస్తూ, ఆ సూత్రాన్ని అక్షరాలా అమలుచేశాడు. 'ప్రభువా! వారు చేస్తున్నదేమిటో వారికి తెలియదు కాబట్టి వారిని క్షమించు' అని మనసారా ప్రార్థించాడు. ప్రేమతో అందర్నీ అక్కున చేర్చుకున్నాడు, అందర్నీ ప్రేమతో పలకరించాడు. చివరికి సిలువలో మరణ శిక్షననుభవించేటపుడు కూడా ప్రేమతో అందరికోసం ప్రార్థించాడు.

యేసుక్రీస్తు ఒక గొప్ప తిరుగుబాటుకు నాయకత్వం వహించి విప్లవాన్ని లేవనెత్తి రోమా ప్రభుత్వాన్ని, ఆనాటి మతాచార్యుల దురాగతాలతో కూడిన ప్రాబల్యాన్ని మట్టికరిపిస్తాడని ఆశతో ఎదురుచూసిన ఆయన శిష్యులు ఆయన అంత బేలగా మరణించడాన్ని చూసి జీర్ణం చేసుకోలేక ఆయన్ను వదిలేసి పారిపోయారు. అయినా ఆయన మూడవనాడు తిరిగి పునరుత్థానం చెందిన తరువాత, తిరిగి వారందరినీ పోగు చేసి మళ్ళీ ఉద్బోధించి తాను అసంపూర్తిగా వదిలి వెళ్తున్న కార్యాన్ని పూర్తిచేయడం కోసం వారందరినీ కార్యోన్ముఖుల్ని చేశాడు.

యేసుక్రీస్తు ప్రబోధాలు, మాటల్లోని శక్తి ఆయన జీవితంలో వెల్లడయింది గనుకనే ఆయన ద్వారా ప్రోత్సహింపబడిన పామరులు, జాలరులు, నిరక్షరాస్యులైన ఆయన శిష్యులు ఆయన తరువాత ఆయన సువార్తను లోకంలోని అన్ని మూలాలకు చేరవేశారు. ఈ రెండువేల సంవత్సరాల్లో లోకంలోని 150 కోట్ల మంది క్రైస్తవులకు ఆ సువార్త చేరిందంటే దానికి ఆయన శిష్యులే కారణం! పిరికివారిని, పామరులను, పనికిమాలిన వారిని తన కోసం అనుచరులుగా ఎంపిక చేసుకోవడం చూసి ఆనాటి పండితులు, ప్రముఖులంతా ఆయన్ను ఎగతాళి చేశారు. కాని ప్రభువు అనుగ్రహించే శక్తితో వారే నలు దిగంతాలకూ సువార్త మోసుకెళ్ళారు. అది ఆయన ప్రేమలోని శక్తికి, ఆయనలోని పరివర్తనా ప్రాబల్యానికి నిదర్శనం. ఈ లోకంలో అగ్రగణ్యులను, సంపన్నులను, అధికారులను, మహా గొప్ప రాజకీయ నాయకులను అనుచరగణంగా చేసుకోవడానికి అంతా ఆరాటపడ్డారు. కాని సమాజంలోని అణగారిన వారి కోసమే తాను వచ్చానని, పాపులే తనకు అత్యంత ప్రియమైన వారని బహిరంగంగా ప్రకటించి వారినే అక్కున చేర్చుకొని, వారితోనే 'నవలోక నిర్మాణానికి' అంకురార్పణ చేసిన యేసుక్రీస్తు జీవితం, ప్రబోధాల పరమార్థం నిజంగా విప్లవాత్మకమైనదే!! యేసుక్రీస్తును ద్వేషించే వారున్నారు, ఆయన్ను గాఢంగా ప్రేమించే వారు ఉన్నారు. కాని ఆయన్ని విస్మరించడం మాత్రం ప్రపంచంలో ఎవరివల్లా కాదు. అదే ఆయన ప్రత్యేకత.



ఇక్కడ ఒక విషయం ఒప్పుకోక తప్పదు. యేసుక్రీస్తులోని అతి లోతైన భావాలను, ఆయన నిజమైన శక్తి సామర్థ్యాలను నిజంగా ఎరిగిన వారి సంఖ్య కూడా లోకంలో చాలా తక్కువే! ప్రేమ, క్షమ పునాదులుగా నవలోక నిర్మాణం ఆయన ఉద్దేశ్యం కాగా; దోపిడీ, దౌర్జన్యం, అణచివేత ఇంకా సాగుతూనే ఉన్నాయి. అంతే కాదు, ఆయన పేరుతోనే కొన్ని చోట్ల సాగుతోంది. ఇది నిజంగా దురదృష్టకరమైన పరిణామం. నయా భౌతికవాదంతో, పెచ్చరిల్లిన లాభార్జనా విధానాలతో 'కర్ర చేతిలో ఉన్న వాడిదే గేదె' అన్న సిద్ధాంతంతో మానవీయ విలువలు నానాటికీ అడుగంటుతున్న నేటి సమాజానికి నిజమైన ఊరట, పరిష్కారం యేసుక్రీస్తు ప్రబోధాల్లోనే అన్నది నిర్వివాదాంశం. అయితే వాటిని ప్రబోధించే వారు కూడా వాటిని అమలు చేసేవారుగా ఉండాలన్నది అత్యంత ప్రాథమికమైన నిబంధన. యేసుక్రీస్తు ప్రబోధాలు అప్పుడో ఎప్పుడో అంతా విన్నవారే. ఎరిగిన వారే!! అయితే వాటిని అమలు చేసి ప్రయోగాత్మకంగా లోకానికి రుజువు చేయగల యేసుప్రభువు నిజ అనుచరుల కోసం లోకం ఎదురుచూస్తోంది. మరో విధంగా చెప్పాలంటే, లక్షమంది యేసుక్రీస్తు ప్రబోధకులు కలిసి చేయలేని పనిని ఒక మదర్ థెరిస్సా చేయగలిగింది. అలాంటి లక్షల మంది థెరిస్సాల కోసం లోకం ఎదురుచూస్తోంది. ప్రేమ, క్షమ పునాదులుగా కలిగిన నవలోకపు నిర్మాణం ఆనాడే పూర్తవుతుంది. యేసుక్రీస్తు తన వంతు చేశారు, ఇక మన వంతు మిగిలి ఉంది.

- రెవ.టి.ఎ. ప్రభు కిరణ్

# ఆనాటి మేటి టెన్నిస్ దిగ్గజాలను చూద్దాం! రండి!!



సైనా నెహ్వాల్ ఎవరు? సానియా మీర్జా ఎవరు? ఈ ప్రశ్నలు వింటే, నేటి యువతరం అర్థరహితమని కొట్టివేయవచ్చు. ఎందుకంటే, వీరిద్దరినీ తెలియనివారు ఎవరున్నారు కనుక! క్రీడా ప్రియుల్లో ప్రతి ఒక్కరికీ తెలుసు - బ్యాడ్మింటిన్ క్రీడా రంగాన్ని పరిపాలిస్తున్నాది ఎవరో, టెన్నిస్ క్రీడకు ప్రియతమంగా ఉన్నది ఎవరో. ఈ ఇద్దరు హైదరాబాద్‌కు చెందిన వారు కావటం విశేషం.

కాలాన్ని కొన్ని దశాబ్దాల వెనుకకు జరుపుదాం. "నందు నటేకర్ ఎవరు? లేదా నరేష్ కుమార్ ఎవరు?" అనే ఈ ప్రశ్నలకు మాత్రం సమాధానం "సారీ, మాకు తెలియదు" అని మాత్రమే ఖచ్చితంగా వస్తుంది. బ్యాడ్మింటన్, టెన్నిస్ క్రీడా రంగాల్లో మాజీ జాతీయ ఛాంపియన్ల గురించి తెలియనందుకు ఎవర్నీ తప్పు పట్టలేము.

దేశాన్ని ఒకప్పుడు గర్వంగా తెలెత్తుకునేలా చేసిన టెన్నిస్ క్రీడారంగపు బంగారు క్షణాలను జ్ఞప్తికి తెచ్చుకోవడానికి, ఈ తరంలోని క్రీడాభిమానులకు ఆ సంగతులను తెలియజేయటానికి, చరిత్రలోకి చూడడానికి చేసిన చిరు ప్రయత్నమే ఈ వ్యాసం.

హైదరాబాద్‌కి చెందిన మన సొంత గౌస్ మహమ్మద్‌తోనే మనం ప్రారంభిద్దాం. వింబుల్డన్ కేవలం నామమాత్రంగా ఉన్నప్పుడు, 1938లో వరల్డ్ ప్రీమియర్ లాన్ టెన్నిస్ ఛాంపియన్ షిప్స్ క్వార్టర్ ఫైనల్స్‌కు చేరటం ద్వారా ప్రపంచవ్యాప్తంగా ఆయన పతాక శీర్షికలకు ఎక్కారు. అప్పుడు దేశం వలసపాలనలో ఉంది. అయినప్పటికీ గౌస్ మహమ్మద్ సాధించిన విజయానికి దేశం యూవత్తూ ఉప్పొంగిపోయింది అయితే, చివరిలో ఇంగ్లాండుకు చెందిన ఫ్రెడ్ పెర్రీ చేతిలో గౌస్ మహమ్మద్ ఓటమి పాలయ్యారు. ఆఖరుకు ఫ్రెడ్ పెర్రీ టోర్నమెంట్‌ను గెలుచుకున్నారు.







దిగ్గజమే. తరువాత 1973లో 1980లో విజయ్ అమృత్‌రాజ్ రెండుసార్లు ఆ ఘనతను సాధించారు.

నిజానికి, 1960లో, 1961లో రామనాధన్ కృష్ణన్ సెమీ ఫైనల్ రౌండు వరకు కూడా దాదాపు వెళ్లగలిగారు. 1954లో వింబుల్డన్ జూనియర్స్ సింగిల్స్ టైటిల్‌ను ఆయన గెలుచుకున్నారు. ఆయన కుమారుడైన రమేష్ కృష్ణన్ 1987లో యుఎస్ ఓపెన్ క్వార్టర్ ఫైనల్‌లో ప్రవేశించటం విశేషం. తద్వారా తాను కూడా తండ్రితో సరిసమానమైన ప్రతిభ కలవాడినని అతను నిరూపించుకున్నట్లయింది. రమేష్ కృష్ణన్ అనేక డేవిస్ కప్‌లను, వింబుల్డన్ జూనియర్ ఛాంపియన్ షిప్‌లను సాధించారు.

1960 లో దేశంలోను, 1970 దశకం తొలి భాగంలోనూ ఉస్మానియా విశ్వవిద్యాలయంలో చదివిన విద్యార్థులకు గౌస్ మహమ్మద్ చిరపరిచితులే. నోట్లో సిగార్‌తో ఒక పెద్ద మోటర్ బైక్‌పై ఆయన తిరుగుతుండే దృశ్యం వారికి కనపడుతుండేది. 1970 ల దశకం తొలి భాగంలో ఆయన ఫిజికల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్‌గా ఉన్నారు.

40 సంవత్సరాల క్రితం ఈ రచయిత గౌస్ మహమ్మద్ గురించి రాసిన వ్యాసాన్ని అప్పుడు 'దక్కన్ క్రానికల్' పత్రిక ప్రచురించింది. ఆ క్రీడా యోధుడు సాధించిన విజయాలను ఆనాటి వ్యాసం వివరించింది. ఆయన విజయాలకు తగిన గుర్తింపు నివ్వాలని కూడా ఆ వ్యాసం గట్టిగా వాదించింది. తరువాత కొంతకాలానికి గౌస్ మహమ్మద్‌కు పద్మశ్రీ అవార్డును బహూకరించారు.

వింబుల్డన్ టోర్నమెంట్ క్వార్టర్ ఫైనల్‌లో ప్రవేశించడం గౌస్ మహమ్మద్ సాధించిన ఘనత 22 సంవత్సరాల తరువాత రామనాధన్ కృష్ణన్ ద్వారా పునరావృతమైంది. రామనాధన్ కృష్ణన్ కూడా ఒక టెన్నిస్



1960లో జరిగిన వింబుల్డన్ సెమీఫైనల్‌కి దూసుకొచ్చిన రామనాధన్ కృష్ణన్‌ని ప్రపంచమంతటా ఆసక్తిగా గమనించింది. అయితే ఆ మ్యాచ్‌లో ఆస్ట్రేలియాకి చెందిన నీల్ ఫ్రేజర్ చేతిలో రామనాధన్ కృష్ణన్ ఓడిపోయారు. ఫైనల్ మ్యాచ్‌లో రాడ్ లేవర్‌ని ఓడించటం ద్వారా నీల్ ఫ్రీజర్ ఛాంపియన్ షిప్‌ని గెలుచుకున్నారు.

తదుపరి సంవత్సరం జరిగిన వింబుల్డన్ ఛాంపియన్ షిప్ పోటీలలో రాడ్ లేవర్ టైటిల్ గెలుచుకుని టెన్నిస్ క్రీడలో అత్యుత్తమ క్రీడాకారుల్లో ఒకరుగా ఎదిగారు. తరువాత కూడా (1961) రామనాధన్ కృష్ణన్ సెమీఫైనల్ వరకు వింబుల్డన్‌లో రాణించారు. ఈ సారి కూడా ఆస్ట్రేలియాకి చెందిన టోనీ రోచ్ చేతిలో ఓడిపోయారు.

1966లో ఆస్ట్రేలియాతో జరిగిన డేవిస్ కప్ మ్యాచ్‌ని టెన్నిస్ రంగంలో భారతదేశానికి అత్యుత్తమ ఆటగా పరిగణించవచ్చు. ప్రపంచ దేశాల్లో డేవిస్ కప్‌ని గెలవటం టెన్నిస్ క్రీడా రంగంలో అగ్రశ్రేణి విజయంగా గుర్తింపు ఉంది. భారతదేశం ఆ మ్యాచ్‌లో ఫైనల్‌కి చేరింది. టోర్నమెంట్‌లో అది చాలెంజ్ రౌండ్‌గా పేరు పొందింది.

అప్పుడు అమల్లో ఉన్న నిబంధనల ప్రకారం, ఆ రౌండ్‌లో గెలిచిన వారికి ఫైనల్‌లో చోటు లభిస్తుంది. అప్పటికి ఛాంపియన్‌గా ఉన్న వ్యక్తితో పోటీ పడే స్థానానికి ఇతర దేశాలు పోటీ పడుతుంటాయి. అప్పుడు ఆస్ట్రేలియా ఛాంపియన్‌గా ఉంది. ఇండియా 4-1 తో ఓడిపోయింది. నాలుగు సింగిల్స్ ఓడిపోయి, ఒకే ఒక డబుల్స్ మ్యాచ్ గెలిచింది. రామనాధన్ కృష్ణన్, జైదీప్ ముఖర్జీ కలిసి మాల్ అండర్సన్‌ను,




గిల్లిటినన్‌ను డబుల్స్ మారథాన్ మ్యాచ్‌లో ఓడించారు. ఆ మ్యాచ్ 99 గేమ్స్ వరకు విస్తరించింది. డేవిస్ కప్ చరిత్రలో అన్ని గేమ్స్‌గా ఒక మ్యాచ్ జరగటం ప్రపంచ రికార్డు. కలకత్తాలో ఆ చరిత్రాత్మకమైన మ్యాచ్ జరిగింది.

1974, 1987 సంవత్సరాల్లో ఇండియా, మళ్లీ ఫైనల్ గ్రేడ్‌కి చేరింది. 1974లో భారతదేశానికి చివరికి బాధే మిగిలింది. జపాన్, ఆస్ట్రేలియా, రష్యాలను ఓడించి, ఇండియా ఫైనల్‌కు చేరింది. ఫైనల్‌లో సౌత్‌ఆఫ్రికాతో ఆడవలసి ఉంది. సౌత్ ఆఫ్రికాను తేలిగ్గా ఓడించి, కప్ స్వాధీనం చేసుకుంటాననే భారత్ భావించింది. అయితే అదలా జరగలేదు.

అంతర్జాతీయ రాజకీయాలకు, విదేశాంగ విధానానికి క్రీడారంగం తలవంచవలసి వచ్చింది. దక్షిణాఫ్రికాలోని శ్వేత జాతి మైనారిటీ ప్రభుత్వం అనుసరిస్తున్న జాతి వివక్ష విధానాలను నిరసిస్తూ ఫైనల్ మ్యాచ్‌ను బహిష్కరించాలని భారత్ నిర్ణయించింది. దాంతో, ఒక్క బంతి కూడా కొట్టకుండానే దక్షిణాఫ్రికా డేవిస్ కప్‌ను జేబులో వేసుకుంది.

ఆ రోజుల్లో జరిగిన చర్చ ఏమిటంటే, ఆ మ్యాచ్ జరిగితే కనుక భారత్ తేలికగా ఫైనల్ గెలిచి ఉండేదని.

1987లో కూడా భారత్ డేవిస్ కప్ ఫైనల్‌కు చేరుకుంది. ఆ సమయానికి రామనాధన్ కృష్ణన్ టెన్నిస్ నుంచి నిష్క్రమించారు. అప్పుడు జపాన్, ఇజ్రాయెల్, అర్జెంటీనా, ఆస్ట్రేలియాలను ఓడించిన భారత్ ఫైనల్‌లో ప్రవేశించి స్వీడన్ చేతిలో ఓడిపోయింది.

టెన్నిస్‌లో స్టార్ డబుల్స్ ఆటగాళ్లయిన మన లియాండర్ పేస్, మహేష్ భూపతి అనేక సంవత్సరాల పాటు డేవిస్ కప్ మ్యాచ్‌లలో ప్రధాన భూమిక పోషించారు. ప్రపంచవ్యాప్తంగా లెక్కలేనన్ని టైటిల్స్ గెలుచుకునాష్ట్రరు. అయితే, భారత్ మటుకు మళ్లీ ఎప్పుడూ ఫైనల్‌కు చేరుకోలేక పోయింది.

బీజింగ్‌లో 2008లో జరిగిన ఒలింపిక్స్‌లో కాంస్య పతకం గెలవటం ద్వారా లియాండర్ పేస్ దేశానికి గర్వకారణంగా నిలిచాడు.

వింబుల్డన్‌లో క్వార్టర్ ఫైనల్‌కు చేరుకున్న టెన్నిస్ క్రీడాకారుల్లో విజయ్ అమృత్‌రాజ్ మూడవవారు. తన కెరీర్ శిఖరాగ్రభాగంలో ఉండగా, చెకోస్లావేకియాకు చెందిన జాన్ కోడ్స్‌తో విజయ్ క్వార్టర్ ఫైనల్‌లో తలపడ్డారు. చివరికి జాన్ కోడ్స్ గెలిచారు. 1980 లో మళ్లీ విజయ్ అమృత్‌రాజ్ క్వార్టర్ ఫైనల్ గ్రేడ్‌కు చేరుకున్నారు.

విశేషమేమిటంటే, 1973, 1974 లలో కూడా మరొక గ్రాండ్ శ్లామ్ ఈవెంట్ అయిన యుఎస్ ఓపెన్‌లో కూడా విజయ్ క్వార్టర్ ఫైనల్స్‌కు చేరుకున్నాడు. 1976లో యుఎస్ ఓపెన్‌లో డబుల్స్ సెమీ ఫైనల్‌ను







తన సోదరుడు ఆనంద్‌తో కలిసి చేరుకున్నాడు.

అమృత్‌రాజ్ సోదరులు అమెరికాలో స్థిరపడ్డారు. విజయ అమృత్‌రాజ్ అక్కడ ఒక టెన్నిస్ అకాడెమీని నడుపుతున్నారు. అంతేకాక, ఎక్స్‌పర్ట్ కామెంటేటర్‌గా కూడా ఉన్నారు. ఇక ఆనంద్ విషయానికి వస్తే, హాలీవుడ్‌లో తన కొక స్థానం సంపాదించుకున్నాడు.

సానియామీర్జా పుట్టడానికి చాలాకాలం ముందే, పంజాబ్‌కు చెందిన ఒక వీర బాలిక మహిళా టెన్నిస్ ప్రపంచ పటంలో దేశానికి ఒక స్థానం కల్పించింది. 1970లో న్యూఢిల్లీలో జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో నేషనల్ ఛాంపియన్ అయిన నిరుపమా మంకాడ్‌ను ఓడించటం ద్వారా పంజాబ్‌కి చెందిన కిరణ్ పెషావరియా ఆసియా ఉమెన్స్ ఛాంపియన్ షిప్‌ను సాధించింది. ఆ బాలికే తరువాత దేశంలో మొదటి మహిళా ఐపిఎస్ అధికారి అయ్యారు. ఆమే కిరణ్ బేడీ. టెస్ట్ క్రికెటర్ అయిన అశోక్ మంకాడ్‌ను నిరుపమ వివాహం చేసుకున్నారు. ఆల్ రౌండర్ అయిన ప్రసిద్ధ క్రికెటర్ వినూ మంకాడ్ పుత్రుడే అశోక్ మంకాడ్.

ఎస్‌పి మిశ్రా, ఎస్ ఎస్ మిశ్రాల ప్రవేశంతో హైదరాబాద్ టెన్నిస్ మళ్లీ చైతన్యవంతమైంది. 1960 ల దశకంలో అనేక సంవత్సరాల పాటు ఇండియన్ డేవిస్ కప్ స్క్వాడ్‌లో ఎస్‌పి మిశ్రా వరుసగా సభ్యుడిగా కొనసాగారు. డేవిస్ కప్ మ్యాచ్‌లలో 18 సార్లు గెలిచి, కేవలం రెండు సార్లే ఓడిపోయిన ఘనత ఎస్‌పి మిశ్రాది. వింబుల్డన్ టోర్నీలోనూ, యుఎస్ ఓపెన్‌లోనూ కూడా ఎస్‌పి ఆడారు. 1966లో చాలెంజ్ రౌండుకు చేరుకున్న చరిత్రాత్మక బృందంలో ఆయన కూడా భాగమే. ప్రస్తుతం ఆయన భారత డేవిస్ కప్ బృందానికి ఆడని కెప్టెన్‌గా ఉన్నారు.

నిజాం కాలం నాటి హైదరాబాద్‌లో ముషీరాబాద్‌లోని తన ప్యాలస్‌లో నవాబ్ మోహది నవాబ్ జంగ్‌కి ఒక టెన్నిస్ స్టేడియం ఉంది. అనేక రసవత్తరమైన మ్యాచ్‌లకు ఆ స్టేడియం వేదికైంది. రామనాథన్ కృష్ణన్, ఆస్ట్రేలియాకి చెందిన రాయ్ ఎమర్సన్, స్పెయిన్‌కి చెందిన ఆండ్రెస్ జిమెనో, యుఎస్‌కి చెందిన బారీ మెకీ తదితరులు ఆ స్టేడియంలో ఆడుతుండటాన్ని అనేక సార్లు ఈ రచయిత వీక్షించాడు. రాయ్ ఎమర్సన్ అనేక గ్రాండ్ శ్లామ్ టైటిళ్లు గెలుచుకున్న మేటి క్రీడాకారుడు. 1960 దశకం మధ్య భాగంలో ఆ స్టేడియంను నేలమట్టం చేశారు.

హైదరాబాద్‌కి చెందిన గ్లామర్ గర్ల్ టెన్నిస్ తార సానియా మీర్జా సాధించిన విజయాల గురించి దేశంలోని క్రీడాభిమానులకు బాగానే తెలుసు.

దేశంలో టెన్నిస్ క్రీడకు దృఢమైన పునాదులు నిర్మించిన మేటి టెన్నిస్ క్రీడాకారులు సాధించిన విజయావలోకనమే ఈ వ్యాసం. వారు నిర్మించిన పునాదులపై తరువాత వచ్చిన క్రీడాకారులు, ఇప్పటి తరం క్రీడాకారులు కష్టపడి అందుకు తగ్గ భవనం నిర్మించి, దాన్ని మరింత పటిష్టం చేస్తున్నారు.

**- దాసు కేశవరావు**

*(అనువాదం. టి. నర్మద)*



# ఎస్‌సి, ఎస్‌టిల సుస్థిరాభివృద్ధి దిశలో....

షెడ్యూలు కులాలు, షెడ్యూల్డు తెగల వారిని దేశంలోనే అత్యంత వెనుకబడిన తరగతులుగా భారత రాజ్యాంగం గుర్తిస్తోంది. ప్రభుత్వం వీరికి రక్షణను, భద్రతను కల్పించాల్సిన అవసరం ఉందని రాజ్యాంగం భావన.

సమాజపు ప్రధాన జనజీవన స్రవంతికి, నాగరికతను దూరంగా కొండప్రాంతాల్లో షెడ్యూల్డు తెగల వారు నివశిస్తుండగా, షెడ్యూల్డు కులాల వారు 'అంటరాని తనం' అనే అమానుష విధానంతో భాధలు పడ్డారు. బహిరంగ ప్రదేశాలు, పాఠశాలలు, హోటళ్లు, దేవాలయాలు, వీధులు, ఉన్నత కులాల వారు ఉండే ఇతర ప్రదేశాలలోకి వారిని అనుమతించే వారు కాదు. ఉమ్మడి బావుల నుంచి వారు నీళ్లు తెచ్చుకోవడానికి అనుమతి లభించేది కాదు. వారి బట్టలు ఉతకడానికి, మంగలి పని చేయటానికి రజకులు, మంగలి వారు సమ్మతించేవారు కాదు.

షెడ్యూల్డు కులాల జనాభాలో అత్యధికులు గ్రామీణ ప్రాంతాల్లో నివశిస్తున్నారు. 2001 జనాభా లెక్కల ప్రకారం షెడ్యూల్డు కులాల్లో 82.82 శాతం మంది గ్రామీణ ప్రాంతాల్లో ఉన్నారు. అదే ఇతర ప్రజానీకం విషయానికి వస్తే, 70 శాతం మంది గ్రామీణ ప్రాంతాల్లో ఉంటున్నారు.

పైగా, గ్రామీణ ప్రాంతాల్లోని ఈ షెడ్యూల్డు కులాల వారు వ్యవసాయ కూలీలుగా, ఇతర చిన్నా చితక పనుల కూలీలుగా జీవితం వెళ్ల బుచ్చుతున్నారు. కేవలం 11శాతం వ్యవసాయ భూమి మాత్రమే షెడ్యూల్డు కులాల వారి చేతుల్లో ఉంది.

మూడు దశాబ్దాల క్రితం షెడ్యూల్డు కులాలకు చెందిన ప్రజలు వెట్టి బానిసలుగా, పాకీవారిగా పనిచేస్తూ దుర్భర జీవితాలు గడిపేవారు. కొందరు మహిళలు దేవదాసీ వంటి వృత్తిలో హీనమైన జీవితాలు గడిపేవారు. అయితే, అటువంటి ఘోరమైన వృత్తులను నిషేధిస్తూ చట్టాలు రావటం వలన వారి సామాజిక జీవితంలో గణనీయమైన అభివృద్ధి జరిగింది.

భారతదేశంలోనూ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోనూ షెడ్యూల్డు కులాల మొత్తం జనాభా ఒకే నిష్పత్తిలో ఉంది. భారతదేశంలో మొత్తం షెడ్యూల్డు కులాలవారు 16.6 కోట్లమంది (16.2 శాతం) ఉండగా, ఆంధ్రప్రదేశ్‌లో వీరి సంఖ్య 1.23 కోట్లు ఉంది. రాష్ట్ర జనాభా మొత్తంలో వీరి శాతం 16.19. భారతదేశంలో షెడ్యూల్డు కులాల వారి జనాభా విషయంలో ఉత్తర ప్రదేశ్, పశ్చిమబెంగాల్, బీహార్‌ల తరువాత స్థానం ఆంధ్రప్రదేశ్‌దే.

షెడ్యూల్డు కులాలు, షెడ్యూల్డు తెగల వారి ప్రయోజనాల పరిరక్షణకు మన రాజ్యాంగం వివిధ రక్షణలను నిర్దేశించింది.

### సామాజిక రక్షణలు

ప్రాథమిక హక్కుల (మూడవభాగం) కింద చేర్చిన 17వ అధికరణ, దానికి అనుబంధంగా ఉన్న 1956 నాటి పౌర హక్కుల చట్టం ప్రకారం షెడ్యూల్డు కులాల ప్రజలకు అందరితో సమానమైన సామాజిక హక్కులు ఉన్నాయి. వీటి ప్రకారం అంటరానితనాన్ని అవలంబిస్తే, జైలు, జరిమానా తప్పదు, అంటరానితనాన్ని ఒక నేరంగా నిర్ధారించారు.

1993 నాటి వెట్టి కార్మిక వ్యవస్థ (నిషేధ) చట్టం, పాకీపని నిషేధ చట్టం, పొడి తరహా మరుగుదొడ్ల నిర్మాణ నిషేధ చట్టం లక్షలాది మంది సఫాయి కార్మికుల జీవితాలను మెరుగు పరిచింది. వీరిలో అత్యధికులు షెడ్యూల్డు కులాల వారే.

1988 నాటి ఆంధ్రప్రదేశ్ దేవదాసీల (నిషేద) చట్టం అనేక మంది దేవదాసీలను హీనమైన వృత్తి నుంచి ఒడ్డున పడేసింది.

సాధారణమైన చట్టాల పరిధిలో షెడ్యూల్డు కులాల వారిపై జరిగే దాడులను అరికట్టలేమనే భావనతో భారత ప్రభుత్వం ఒక ప్రత్యేక చట్టాన్ని తెచ్చింది. అదే 1989 నాటి షెడ్యూల్డు కులాలు, షెడ్యూల్డు తెగల వారిపై అత్యాచారాల నిరోధక చట్టం.

ఈ చట్టం కింద విచారించడానికి ప్రత్యేక న్యాయస్థానాలను నెలకొల్పే అవకాశం ఉంది. ప్రాసిక్యూషన్ చేసే ప్రక్రియను, ఇన్వెస్టిగేషన్





చేపట్టే ప్రక్రియ ఈ చట్టం ద్వారా క్రమబద్ధీకరించబడ్డాయి. అంతేకాక బాధితులకు నష్టపరిహారం ఇచ్చేందుకు రాష్ట్రాలకు అధికారం ఇస్తూ తగిన నిబంధనలు వీటిలో చేర్చారు.

షెడ్యూల్డు కులాలు, షెడ్యూల్డు తెగలు వంటి బలహీనమైన వర్గాల వారిపై నేరాలకు పాల్పడే వారికి కఠినమైన శిక్షలు వేసే అవకాశాన్ని ఈ చట్టం కల్పించటం ద్వారా ఇండియన్ పీనల్ కోడ్ పరిధిని విస్తరించింది.

## ఆర్థిక రక్షణలు

షెడ్యూల్డు కులాలు, షెడ్యూల్డు తెగలు విద్యాపరంగా, ఆర్థికంగా అభివృద్ధి చెందడానికి తగిన ఏర్పాట్లు చేయాలని రాజ్యాంగంలోని 23,24,46 అధికరణలు నిర్దేశిస్తున్నాయి. షెడ్యూల్డు కులాల వారికి స్పెషల్ కాంపోనెంట్ ప్లాన్‌ను, షెడ్యూల్డు తెగల వారికి ట్రైబల్ సబ్ ప్లాన్‌ను రూపొందించారు. 1980 -81 సంవత్సరంతో ప్రారంభించి ఎస్‌సి/ఎస్‌టి ప్రజలు సామాజికంగా, ఆర్థికంగా అభివృద్ధి చెందడానికి ఈ ప్లాన్‌లను నిర్దేశించటం జరిగింది. 275వ అధికరణ ప్రకారం, ప్రత్యేక కేంద్ర సహాయ పథకం కింద రాష్ట్రాలకు గ్రాంట్లను కూడా కేంద్ర ప్రభుత్వం విడుదల చేస్తోంది.

## విద్యాపరమైన, సాంస్కృతిక పరమైన రక్షణలు

షెడ్యూల్డు కులాలు, షెడ్యూల్డు తెగలవారికి విద్యా సంస్థల్లో రిజర్వేషన్లను కల్పించే అధికారాన్ని రాజ్యాంగంలోని 15 (4), 26 (1) అధికరణలు రాష్ట్రాలకు ఇస్తున్నాయి.

## ఉద్యోగపరమైన రక్షణలు

ప్రభుత్వశాఖలు, ప్రభుత్వరంగ సంస్థల్లో షెడ్యూల్డు కులాలు, షెడ్యూల్డు తెగలు, ఇతర వెనుకబడిన తరగతులకు ఉద్యోగాలను కేటాయించాలని 16వ అధికరణ పేర్కొంటున్నది. తదనుగుణంగా, ఆయా వర్గాల ప్రజలకు ఉద్యోగాల్లో రిజర్వేషన్లు కల్పించిన సంగతి మనకు విదితమే.

## రాజకీయ రక్షణలు

రాజ్యాంగంలోని 164 (1)వ అధికరణ ప్రకారం, రాష్ట్రాల్లోని శాసన సభ్యుల్లో, పార్లమెంట్‌లో షెడ్యూల్డు కులాల వారికి, షెడ్యూల్డు తెగల వారికి స్థానాలు కేటాయించటం జరిగింది. రాజ్యాంగానికి జరిగిన 73వ, 74వ సవరణల్లోని నిబంధనల ప్రకారం పంచాయితీ సంస్థలు, మున్సిపల్ సంస్థల్లో కూడా షెడ్యూల్డు కులాలు, షెడ్యూల్డు తెగల ప్రజలకు రాష్ట్రాల మొత్తం జనాభాలో వారి సంఖ్యకు తగినట్లుగా రిజర్వేషన్లు కల్పించటం జరిగింది.

1975 ఏప్రిల్‌లో రాష్ట్రాల వెనుకబడిన తరగతుల శాఖల మంత్రుల సమావేశం జరిగింది. అప్పుడు ఎస్‌సి/ఎస్‌టి ప్రజల పేదరికం, వారి జీవన పరిస్థితులు చర్చకు వచ్చాయి. స్వాతంత్ర్యం సిద్ధించిననాడు వారు ఏ పరిస్థితుల్లో ఉన్నారో, అప్పటికి కూడా వారి పరిస్థితుల్లో పెద్దగా మార్పులేదని సమావేశం అభిప్రాయ పడింది. దారిద్ర్యరేఖకు అటుఇటూగానే వారి జీవితాలు ఊగిసలాడుతున్నాయని సమావేశం భావించింది. దాంతో, షెడ్యూల్డు కులాలను అభివృద్ధి చేయడానికి స్పెషల్ కాంపొనెంట్ ప్లాన్‌ను, షెడ్యూల్డు తెగల అభివృద్ధికి ట్రైబల్ సబ్ ప్లాన్‌ను అమలు చేయాలని ఆ సమావేశం నిర్ణయించింది. కేంద్ర ప్రభుత్వ స్థాయిలో, అన్ని రాష్ట్రాల్లో వార్షిక ప్రణాళికల ద్వారా అమలవుతున్న పంచవర్ష ప్రణాళికల్లో ఎస్‌సి /ఎస్‌టిల సంక్షేమానికి, అభివృద్ధికి నిధులను తప్పనిసరిగా కేటాయిస్తూ ఉండాలని సమావేశం నిర్ణయించింది.

1978-83 మధ్యకాలంలో అమలుచేసిన మూడవ పంచవర్ష ప్రణాళికలో ఎస్‌సి/ఎస్‌టిల పట్ల ప్రత్యేక శ్రద్ధ కనబరిచారు. ప్రభుత్వ శాఖల్లో మొత్తం 18 శాఖలను గుర్తిస్తూ 19-9-1976న కేంద్ర హోంశాఖ మార్గదర్శకాలు విడుదల చేసింది. వీటిల్లో వ్యవసాయశాఖ, విద్యాశాఖ, ఆరోగ్యశాఖ, గృహనిర్మాణ శాఖ, విద్యుదీకరణ, మైనర్ ఇరిగేషన్ శాఖలు ముఖ్యమైనవి. ఇట్లా గుర్తించిన 18 శాఖల ద్వారా ఎస్‌సి/ఎస్‌టిల అభివృద్ధికి ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టాలని సూచించటం జరిగింది.

అప్పటి ప్రధానమంత్రి తన మంత్రివర్గ సహచరులకు, రాష్ట్రాల ముఖ్యమంత్రులకు రాసిన లేఖ ద్వారా ప్రభుత్వ ప్రధాన ఉద్దేశ్యం వెల్లడవుతోంది. ప్రతి వృత్తి విభాగంలో ఎస్‌సి కుటుంబాల వారు దారిద్ర్యరేఖకు దాటేందుకు వారి అభివృద్ధి అవసరాలపై ప్రత్యేక శ్రద్ధ కనపరచాలని ఆమె లేఖలో పేర్కొన్నారు.

ప్లాన్ నిధుల్లో రెండు విభాగాలుంటాయి. అవే విభజిత, అవిభజిత విభాగాలు. ఎస్‌సి/ఎస్‌టిలకు వారి వారి వృత్తిపరమైన అవసరాలకు తగిన విధంగా విభజిత విభాగంలో పథకాలను రూపొందిస్తారు. స్థానిక పరమైన అవసరాలను గుర్తించటం ద్వారా కూడా వీటిని రూపొందించినందువల్ల వాటి ఉపయోగాన్ని, అవి లబ్దిదారులకు చేకూర్చిన ప్రయోజనాలను పరిశీలించడానికి, అంచనా వేయడానికి వీలు కలుగుతుంది.

వ్యవసాయం, నీటి పారుదల, డ్రిప్ ఇరిగేషన్, స్ప్రింక్లర్ ఇరిగేషన్, పశు సంవర్ధక శాఖలోని పశుక్రాంతి పథకం వంటివన్నీ ఈ విధానం కిందకి వస్తాయి. డిఆర్‌డిఎల పరిధిలో అమలు జరిగే వివిధ పేదరిక నిర్మూలన కార్యక్రమాలకు, ఆదాయ పెంపుదల కార్యక్రమాలకు వీటిని అనుసంధానం చేయవచ్చు.

అవిభజిత విభాగంలో చేపట్టే కార్యక్రమాలకు పరిశీలన వీలుపడదు. భారీ నీటి పారుదల ప్రాజెక్టులు, విద్యుత్ ప్లాంట్లు, జాతీయ రహదారుల నిర్మాణం, విద్యా సంస్థలు, విశ్వ విద్యాలయాల భవనాల నిర్మాణం, కోర్టు భవనాల నిర్మాణం, ఇన్‌స్పెక్షన్ బంగ్లాల నిర్మాణం వంటివి ఈ విభాగం కిందకు వస్తాయి.

2010-11 సంవత్సరానికి చెందిన ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ప్లాన్ డాక్యుమెంట్లను పరిశీలిస్తే, వార్షిక ప్రణాళికలో 49 శాతం నిధులు నూతన నీటిపారుదల ప్రాజెక్టుల నిర్మాణానికే కేటాయించినట్లు స్పష్టమవుతున్నది.

11వ పంచవర్ష ప్రణాళికను ప్రారంభిస్తున్నప్పుడు ఎస్‌సి స్పెషల్ కాంపోనెంట్ ప్లాన్, ట్రైబల్ సబ్ ప్లాన్‌లను అమలు చేసే విషయంలో ప్రణాళికా సంఘం రాష్ట్రాలకు మార్గదర్శకాలు విడుదల చేసింది. అందులో కొంత భాగం "ఎస్‌సిలు, ఎస్‌టిలు, ఇతర బలహీన వర్గాలకు జనాభాలోని ఇతర వర్గాలకు మధ్య కొనసాగుతున్న వ్యత్యాసాన్ని సృజనాత్మక పథకాల ద్వారా త్వరితగతిన పూరించవలసి ఉన్నది. ఆయా వర్గాల అభివృద్ధి, బలహీనత, లోపాలతో కూడిన ఒక సూచికను తయారు చేయవలసి ఉంది. దీని ఆధారంగానే కార్యక్రమాలను రూపొందించాలి. అమలు చేయాలి."

మహారాష్ట్ర అనుసరించిన విధానాన్ని ప్రణాళికా సంఘం మెచ్చుకుంది. ఒక ప్రత్యేక యంత్రాంగాన్ని రూపొందించటం ద్వారా అన్ని రాష్ట్రాలు దీన్ని అమలు చేయాలని ప్రణాళికా సంఘం సిఫార్సు చేసింది.

మన రాష్ట్రంలో విభాగాధిపతులు సాధారణ విభాగాల్లో పథకాలను రూపొందించి, ఎస్‌సి స్పెషల్ కాంపోనెంట్ ప్లాన్, ట్రైబల్ సబ్ ప్లాన్‌ల కింద తమ నిర్ణయానుసారం నిధులను కేటాయి స్తున్నారు. జిల్లా స్థాయిలోని అమలు సంస్థలు, జిల్లా నోడల్ ఏజెన్సీలకు ఛైర్మన్‌లుగా ఉన్న కలెక్టర్లు ఈ ప్రక్రియలో ఎప్పుడూ పూర్తిగా పాల్గొనరు.

ఈ కారణం వల్లనే జిల్లా స్థాయి నోడల్ ఏజెన్సీల సమావేశాలు మూడు నెలలకు ఒకసారి జరుగుతాయి. పథకాల గురించి అధికారులకు పెద్దగా తెలియను కూడా తెలియదు. తరుచుగా ఈ సమావేశాలు వాయిదా పడుతుంటాయి. లేదా పెద్ద ఉపయోగకరమైన చర్చలు కూడా జరగవు.

ఏ బాధ్యతాయిత అధికారి కూడా క్షేత్ర స్థాయిలో పరిశీలన జరపరు. ఇటీవల కాలంలో చేపట్టిన ఒక అధ్యయనంలో తేలినది ఏమిటంటే, 1983-87 సంవత్సరాల మధ్యగల నాలుగేళ్ల కాలంలో తప్ప, కేటాయించిన నిధుల కంటే వ్యయం చాలా తక్కువ ఉంటూ వచ్చింది. కేటాయించిన నిధుల ప్రకారం, వ్యయం ఎప్పుడూ జరగలేదు. సాంఘిక సంక్షేమ శాఖకు అప్పుడు కార్యదర్శిగా ఉన్న శ్రీ ఎస్.ఆర్. శంకరన్‌గారు తరచూ చేపట్టిన క్షేత్ర పర్యటనల కారణంగానే ఆయన ఆ పదవిలో ఉన్న కాలంలో నిధుల వ్యయం బాగా జరిగిందని చెప్పాలి.

2009 - 10 సంవత్సరం విషయానికి వస్తే, విభాజిత విభాగంలో అమలయిన పథకాలు తప్ప, మిగిలినవి పరిశీలనకు అందనివే. విశ్వవిద్యాలయాల భవనాల నిర్మాణం, నీటి పారుదల ప్రాజెక్టులు, కోర్టు భవనాలు, రహదారుల నిర్మాణం మొదలైనవి ఎస్‌సి ప్రజల బాగోగులపై పెద్దగా ప్రభావం చూపించవు.

ఎస్‌సి స్పెషల్ కాంపోనెంట్ ప్లాన్ ట్రైబల్ సబ్ ప్లాన్‌ల కింద 2009 -10లో 80 విభాగాలకు, 75 విభాగాలకు నిధులు కేటాయించారు. ఎస్‌సి స్పెషల్ కాంపోనెంట్ ప్లాన్ కింద 6970 కోట్ల రూపాయలు కేటాయించగా, 2265 కోట్ల రూపాయలు మాత్రమే ఖర్చు చేయగా, ట్రైబల్ సబ్ ప్లాన్ కింద 2250 కోట్ల రూపాయలు కేటాయించగా, 1583 కోట్ల రూపాయలు మాత్రమే ఖర్చు అయ్యాయి. ఖర్చు చేసిన నిధులు కూడా ఆయా వర్గాలకు ఏవిధంగా మేలు కలిగించాయో పరిశీలించటం చాలా రంగాల్లో సాధ్యపడదు.

దారిద్ర్యరేఖకు దిగువన ఉన్న కుటుంబాల్లో ప్రధానంగా ఆకలి, పేదరికం, పోషకాహార లోపం, నిరక్షరాస్యత, సురక్షితమైన త్రాగునీటి కొరత వంటి దుర్భర పరిస్థితులు తాండవిస్తున్నాయి. స్థానిక అధికారుల ఆధీనంలో ఉండే నిధులను జమచేసి, అర్థవంతంగా ఖర్చు చేస్తే, ఈ సమస్యలు కొంత తీరుతాయి.



ప్రణాళికా విధానం చేపట్టిన 6 దశాబ్దాల తరువాత కూడా, అక్షరాస్యత, మౌలిక సదుపాయాలు వంటి కీలక రంగాల్లో గ్రామీణ ప్రాంతాల్లోని ఇతర జనాభాకంటే ఎస్.సి/ ఎస్‌టిలు బాగా వెనుకబడి ఉన్నారు. ఈ సమస్యలను పరిష్కరించుకోవడానికి భూమి, తదితర ఆస్తులు కల్పించటం ద్వారా వారికి సుస్థిరమైన సంక్షేమాన్ని అందించవచ్చు.

అక్షరాస్యత రాష్ట్ర జనాభాలో సగటున 61 శాతం ఉండగా, ఎస్‌సిలలో 53 శాతం ఉంది. ఎస్‌సి మహిళలల్లో ఇతర జనాభాకంటే నిరక్షరాస్యత 15 నుంచి 20 శాతం వరకు

ఎక్కువవుంది. 11వ పంచవర్ష ప్రణాళిక ప్రారంభంలో 1 నుంచి 10 తరగతుల మధ్య బడి మానేసేవారి శాతం ఎస్‌సిలలో 71.3 ఉంది. పేదరికం వంటి కారణాలే ఇందుకు దోహదపడుతున్నాయి. మధ్యాహ్న భోజన పథకం వల్ల పరిస్థితి కొంత మారినా, బాలికల విషయంలో పెద్దగా మెరుగుపడలేదు.

గృహ నిర్మాణం, విద్యుత్, అంతర్గత రోడ్లు, నీటి సరఫరా, రేషన్ షాపుల ఏర్పాటు, అంగన్‌వాడీ సెంటర్ల ఏర్పాటు వంటివి ఎస్‌సి, ఎస్‌టి ప్రజలకు అందుబాటులో ఉండాల్సిన అవసరం ఉంది.

సాంఘిక సంక్షేమ శాఖ, ఎస్‌సి ఫైనాన్స్ కార్పొరేషన్ తమ తమ వార్షిక బడ్జెట్లలో కేటాయించిన నిధుల ప్రకారం పథకాలను అమలు చేస్తున్నాయి. ఈ నిధుల్లో 60 శాతం విద్యపై ఖర్చు చేస్తుండగా, మిగిలిన నిధులను ఇతర పథకాలపై ఖర్చు చేస్తున్నారు. అయినప్పటికీ, ప్రాథమిక విద్యా స్థాయిలో బడిలో చేరి గ్రాడ్యుయేషన్ స్థాయికి చేరుకునే విద్యార్థులు ఎస్‌సిలలో కేవలం 4% మాత్రమే ఉన్నారు. అదే ఇతర జనాభాలో 11 శాతం ఉన్నారు.

### ఆరోగ్యం, పోషకాహారం

బాలికలకు త్వరగా పెళ్లిళ్లు చేయటం, ఎక్కువమంది పిల్లల్ని కనటం వల్ల మహిళల్లో తీవ్రమైన రక్తహీనత నెలకొంటున్నది. శిశు మరణాల రేటు కూడా ఎస్‌సిలలో 83 ఉండగా, రాష్ట్ర సగటు 56 ఉంది. అధిక పోషక విలువలున్న మంచి ఆహార పదార్థాలను ఎంపిక చేయటంలో అంగన్ వాడీ వర్కర్లకు సహాయ పడేలా స్వయం సహాయ బృందాలను ప్రోత్సహిస్తే, సత్ఫలితాలు ఉండగలవు.

మౌలిక సదుపాయాల విషయానికి వస్తే, ఎస్‌సి ప్రజానీకంలో 81 శాతం ఇళ్లకు వ్యక్తిగత మరుగుదొడ్లు లేవు. 50 శాతం ఇళ్లకు విద్యుత్ లేదు. వీళ్లలో 81 శాతం కుటుంబాలు వంట చెరకుపై ఆధారపడుతున్నాయి. దారిద్ర్యరేఖకు దిగువన ఉన్న అర్హులైన కుటుంబాలకు ఎస్‌సి స్పెషల్ కంపోనెంట్ ప్లాన్ నిధుల ద్వారా ప్రత్యేక ఆర్థిక సహాయం అందజేయగలిగే విషయాన్ని చురుగ్గా పరిశీలించ వలసి ఉంది.

రాష్ట్రంలోని మొత్తం 29,69,915 ఎస్‌సీ కుటుంబాలలో 11,17,659 (26.7%) కుటుంబాలు దారిద్ర్యరేఖకు దిగువన ఉన్నాయి. ఎస్‌సిలలో 2.48 లక్షల మంది ప్రభుత్వ విభాగాలు, ప్రభుత్వ రంగసంస్థలు, సహకార సంస్థల్లో ఉద్యోగాలు చేస్తున్నారు. మొత్తం 49,37,314 మంది ప్రధాన కార్మికుల్లో 64.2 శాతం మంది (31,70,383) వ్యవసాయ కార్మికులుగా పనిచేస్తున్నారు. మహాత్మాగాంధీ గ్రామీణ ఉపాధి హామీ పథకం ప్రారంభమైన తరువాత దినసరి వేతన కార్మికులకు ఉపాధిహామీ లభించింది.

ఎస్‌సిలకు చెందిన రైతులు తమ సేద్యపు దిగుబడిని, ఆదాయాన్ని పెంచుకోవటానికి తగిన కార్యక్రమాలు చేపట్టి నట్లయితే, వీరు దారిద్ర్య రేఖను దాటడానికి అవకాశం ఏర్పడుతుంది. నీటి పారుదల సౌకర్యాల కల్పన, భూమి పరిరక్షణ, భూమి అభివృద్ధి వంటి అంశాలను ఇది వరకే ఉపాధిహామీ పథకంలో చేర్చి, సత్ఫలితాలను సాధించటం జరిగింది.

ఎస్‌సిలలో వ్యవసాయ కూలీలేకాక, విద్యాపరంగా సాంకేతికంగా శిక్షణ పొందిన డ్రైవర్లు, మెకానిక్‌లు వంటి వారు కూడా ఉన్నారు. ఎస్‌సి ఫైనాన్స్ కార్పొరేషన్ వీరికి శిక్షణ ఇవ్వటం ద్వారా వీరు అభివృద్ధి చెందారు. మరికొందరు నిరుద్యోగ యువతకు కిరాణా దుకాణాలు, టీ దుకాణాలు పెట్టుకోవడానికి, ఆటో రిక్షాలు నడుపుకోవడానికి ఎస్‌సి కార్పొరేషన్ ఆర్థిక సహాయం కూడా అందిస్తున్నది. 1975 నుంచి 2008 వరకు అట్లా 46 లక్షల మందికి సహాయం అందించటం జరిగింది. అయితే, వీరిలో కొద్ది మంది మాత్రమే తమ ఆదాయాలను గణనీయంగా మెరుగుపరచుకున్నట్లు, ఇతరులు దారిద్ర్యరేఖకు దిగువకు జారిపోయినట్లు ఒక శాంపిల్ సర్వే సూచించింది.

ఎస్‌సిలలో ఎక్కువమంది దారిద్ర్యరేఖకు పైకీ కిందకు మారకుండా ఉండేందుకు, మహారాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ గత ఏడాది తయారు చేసిన దశవర్ష పర్ స్పెక్టివ్ ప్లాన్‌ను అమలు చేయటం ఆవశ్యకంగా కనపడుతున్నది.

ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ కార్యక్రమాలలో ఎస్‌సి/ఎస్‌టి ప్రజలకు ప్రత్యేక కోటాలను అమలు చేయటం ద్వారా వివిధ పేదరిక నిర్మూలన కార్యక్రమాల దిశ మళ్లించవచ్చు. గృహనిర్మాణం, ఇళ్ల స్థలాలు, ఇరిగేషన్ బావులు, ఆదాయ పెంపు పథకాలు వంటి అన్నిట్లో ఎస్‌సి/ఎస్‌టిలకు ప్రత్యేక కోటాలను అమలు చేయాలి. రాజీవ్ యువశక్తి, ఎస్‌జి ఎస్ వై ఎస్ హెచ్ జి, పావలావడ్డీ మొదలైన పథకాల్లో ఇదే విధానం అనుసరించాలి.

స్పెషల్ కాంపోనెంట్ ప్లాన్ ప్రవేశపెట్టి 30 ఏళ్లు పూర్తవుతున్నా, అట్టడుగు స్థాయిలోని ఎస్‌సి/ఎస్‌టిలకు చెందిన ప్రజాప్రతినిధుల్లో అధిక శాతం మందికి ఆ ప్లాన్ గురించే తెలియదు. జిల్లా పరిషత్, మండల పరిషత్ సమావేశాల్లో దీనిపై తరచూ సమీక్షలు నిర్వహిస్తూంటే ఈ పరిస్థితి మారగలదు.

2005-06 సంవత్సరంలో జరిగిన సర్వే ప్రకారం, ఎస్‌సిల ఆధీనంలో 14.22 లక్షల భూకమతాలు ఉన్నాయి, ఇవి 11.36 లక్షల హెక్టార్లలో విస్తరించి ఉన్నాయి. 2000 - 01 లో జరిగిన సర్వేతో పోలిస్తే, భూకమతాలలో 4.20 శాతం పెరుగుదల , విస్తీర్ణంలో 0.18 శాతం పెరుగుదల నమోదైంది.

ఎస్‌సి స్పెషల్ కాంపో నెంట్ ప్లాన్, ట్రైబల్ సబ్ ప్లాన్‌ల ద్వారా లభించే నిధులతో నీటి పారుదల సౌకర్యాల కల్పన, భూమి అభివృద్ధి పనుల వంటివి చేపట్టినట్లయితే, దారిద్ర్య రేఖకు దిగువన ఉన్న ఎస్‌సి రైతు కుటుంబాలకు ప్రయోజనం చేకూరుతుంది.

ప్రస్తుతం సిపివోల దగ్గర అందుబాటులో ఉన్న ఎస్ సి రైతు కుటుంబాల భూముల వివరాలను జిల్లాల వారీగా, మండలాల వారీగా సేకరించి, వ్యవసాయ శాఖ, డిఆర్‌డిఎ, ఇతర శాఖల అధికారులతో సమావేశాలు నిర్వహిస్తే తగిన అభివృద్ధి పథకాలకు రూపకల్పన చేయవచ్చు.

**- సెబాస్టియన్ రాజు,**
సెంటర్ హెడ్, అపార్డ్,
(అనువాదం : వై. సరోజ)

# కమ్యూనిటీ ఫైనాన్స్ ఇన్‌స్టిట్యూషన్స్ ద్వారా మహిళలకు ఋణాలు

**ప్రైవేటు మైక్రో ఫైనాన్సు దురాగతాల నుండి మహిళలకు అడ్డుకట్ట వేసేందుకు మరో కీలక చర్యకు ప్రభుత్వం నడుం బిగించింది. స్వయం సహాయక సంఘాలకు ఇకపై ఏదైనా అత్యవసర పరిస్థితులల్లో ఋణాలు కావల్సివస్తే మైక్రో ఫైనాన్సు ఇనిస్టిట్యూషన్స్‌ను ఆశ్రయించాల్సి పనిలేదని, కమ్యునిటీ ఫైనాన్స్ ఇన్‌స్టిట్యూషన్స్ (CFI) అనే కొత్త విధానం ద్వారా తక్కువ వడ్డీకే ఋణాలు అందిస్తామని గ్రామీణాభివృద్ధి శాఖా మంత్రి శ్రీ వట్టివసంతకుమార్ చెప్పారు.**

మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి సంస్థలోది. 22.11.2010న జరిగిన మహిళా సమాఖ్యల సమావేశంలో ముఖ్య అతిధిగా పాల్గన్న మంత్రి శ్రీ వట్టి వసంతకుమర్ మాట్లాడుతూ, మండల మహిళా సమాఖ్యలకు జాతీయ బ్యాంకుల నుంచి 10 శాతం వడ్డీకే 50 లక్షల రూపాయల నగదును క్రెడిట్‌లోన్‌గా ఇవ్వనున్నట్లు తెలియచేశారు.

యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ప్రయోగాత్మకంగా 11 జిల్లాల్లోని 20 మండల సమాఖ్యలకు మొత్తం రూ. 10 కోట్లు మంజూరు చేసినట్లు చెప్పారు. బ్యాంకుల నుండి పొందిన సొమ్ముతో మహిళా సమాఖ్యలు ఇకపై మహిళల ఇంటివద్దే ఋణాలు బట్వాడా చేస్తారని, దీనివల్ల సభ్యుల అవసరాలు తీరటంతోపాటు ఎంతో విలువైన సమయం వీరికి ఆదా అవుతుందని ఆయన అన్నారు. ఈ క్యాష్ క్రెడిట్ లోను (సి.సిఎల్) ద్వారా మహిళా సంఘాలు బ్యాంకుల నుండి తీసుకొనే ఋణాలకు అదనంగాఈ మొత్తాన్ని వినియోగించుకోవటానికి వీలవుతుందని తెలిపారు.


ఈ కార్యక్రమంలో పాల్గొన్న గ్రామీణాభివృద్ధి శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శ్రీ రెడ్డి సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ మైక్రోఫైనాన్స్ దురాగతాలను అరికట్టడానికి ప్రభుత్వం ఇప్పటికే ఆర్డినెన్సు తెచ్చిందని, గ్రామీణ పేద ప్రజలకు వ్యవస్థాగత పరపతి సౌకర్యం అందచేయడానికి అవసరమైన అన్ని చర్యలను ప్రభుత్వం తీసుకొంటున్నట్లు తెలియచేశారు. ఒకసారి బ్యాంకునుండి ఋణం తీసుకొన్న స్వయం సహాయక సంఘానికి, ఆ బకాయి చెలామణీలో ఉన్నంతకాలం మరొక ఋణం తీసుకొనడానికి బ్యాంకు నిబంధనలు అనుమతించనందువల్ల, సభ్యులు తమ వ్యక్తిగత అవసరాల కోసం మైక్రో ఫైనాన్స్ సంస్థలను ఆశ్రయిస్తున్నారని అన్నారు. అదేవిధంగా ఒకసారి ఋణం తీర్చిన స్వయం సహాయక సంఘాలకు మరల ఋణాన్ని పంపిణీ చేయడానికి కూడా 3-6 నెలల కాల వ్యవధి పడుతోందని, ఈ మధ్యకాలంలో సభ్యుల అవసరాలకు కూడా మైక్రోఫైనాన్స్ సంస్థలను ఆశ్రయిస్తున్నారని ఆయన అన్నారు. అందువల్లే సంస్థలు గతంలో తీసుకొన్న ఋణాలతో నిమిత్తం లేకుండా గ్రూపుయొక్క పనితీరు ఆధారంగా ప్రతీ గ్రూపుకు కొంత క్రెడిట్ సదుపాయం కల్పించడానికి బ్యాంకర్లతో జరిపిన నిరంతర సంప్రదింపుల వల్ల రాష్ట్రంలో ప్రథమంగా యూనియన్‌బ్యాంకు ఆఫ్ ఇండియా మండల మహిళా సమాఖ్యలకు ముందస్తుగా క్యాష్ క్రెడిట్ సదుపాయం కల్గచేయడానికి ముందుకు వచ్చిందన్నారు. సెర్ప్ సి.ఇ.ఒ. శ్రీ రాజశేఖర్ మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రస్తుతం 9.75 లక్షల స్వయం సహాయక సంఘాలను గ్రామస్థాయి, మండల, జిల్లా స్థాయిలలో సమాఖ్యలుగా ఏర్పరచటం జరిగిందని, గ్రామీణ పరపతి రంగంలో మైక్రోఫైనాన్స్ సంస్థల ప్రమేయాన్ని తగ్గించడంలో ఈ మహిళా సమాఖ్యలను కమ్యూనిటీ ఫైనాన్షియల్ ఇన్‌స్టిట్యూషన్స్‌గా రూపాంతరం చెందించటానికి సెర్ప్ కృషి చేస్తోందని అన్నారు. ఈ విధానం ద్వారా తొలివిడతగా ఎంపిక చేయబడిన మహిళా సమాఖ్యలకు నిర్ణీత మొత్తాన్ని పరపతి అవధిగా నిర్ణయించి, సొమ్మును అందచేయడం జరుగుతుందని, ఈ సొమ్మును పొందిన మహిళా సమాఖ్యలు తమ పరిధిలోని వివిధ స్వయం సహాయక సంఘాల సభ్యులను చిన్న చిన్న అవసరాలు, వ్యాపారాల నిమిత్తం, తదితర అవసరాల కోసం తక్కువ వ్యవధిగల ఋణాన్ని అందచేయడానికి వీలు కలుగుతుందన్నారు. ఈ మేరకు సభ్యులు బ్యాంకులపై ఆధారపడటం కూడా తగ్గుతుందన్నారు. అంతేగాక బ్యాంకులకు కూడా పని వత్తిడి తగ్గుతుందన్నారు. ఈ వ్యవస్థను పటిష్ఠంగా అమలు పర్చటానికి అవసరమైన సాంకేతిక మద్దతును సెర్ప్ అందచేస్తుందన్నారు. యు.బి.ఐ. ఛైర్మన్, మేనేజింగ్ డైరక్టర్ శ్రీ ఎమ్.వి. నాయర్ మాట్లాడుతూ తమ బ్యాంకు 100 మహిళా సమాఖ్యలకు బల్క్ ఋణాలు ఇచ్చేందుకు సిద్ధంగా ఉందని తొలివిడతగా 20 మహిళా సమాఖ్యలకు రూ. 10 కోట్ల మేరకు బల్క్ ఋణాన్ని విడుదల చేయటం జరిగిందని అన్నారు. ఈ ప్రయోగం దేశంలోనే మొట్టమొదటిసారిగా ఆంధ్రప్రదేశ్‌లో అమలు చేయ్యడం జరుగుతోందని అన్నారు. ఈ కార్యక్రమాన్ని యుబిఐ, హైదరాబాద్ డి.జి.ఎం. శ్రీ ఆఫ్తాబ్, సెర్ప్ ఆర్.పి.డి. శ్రీ మురళిలు సమన్వయపరచగా, 11 జిల్లాలలోని 20 మండల మహిళా సమాఖ్యలు, డి.ఆర్.డి.ఎ. ప్రాజక్టు డైరక్టర్లు, బ్యాంకు అధికారులు పాల్గొన్నారు. ◆



మహిళా సమాఖ్యకు బల్క్ ఫైనాన్స్ చెక్కులను అందచేస్తున్న గ్రామీణాభివృద్ధి శాఖామాత్యులు శ్రీ వట్టి వసంత్‌కుమార్, యు.బి.ఐ. ఛైర్మన్ శ్రీ ఎమ్.వి. నాయర్.

సమావేశంలో పాల్గొన్న సెర్ప్ సి.ఇ.ఒ. శ్రీ బి. రాజశేఖర్, యు.బి.ఐ. ఛైర్మన్ శ్రీ ఎమ్.వి. నాయర్, గ్రామీణాభివృద్ధి శాఖామంత్రి శ్రీ వట్టి వసంత్‌కుమార్, గ్రామీణాభివృద్ధి శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శ్రీ రెడ్డి సుబ్రహ్మణ్యం, ఆర్.పి.డి. జె. మురళి. (ఎడమ నుండి కుడివైపు)





**ఆంధ్రప్రదేశ్ అవతరణోత్సవాల సందర్భంగా రాష్ట్రంలోని, రాష్ట్రేతర ప్రాంతాలలోని సాటి తెలుగు వారందరికీ నా హృదయపూర్వక శుభాకాంక్షలు.**

**ఆంధ్రప్రదేశ్ అవతరించి 54 సంవత్సరాలు నిండాయి. 55వ సంవత్సరంలోకి అడుగుపెడుతున్నాం. ఈ సందర్భంగా ఆనాడు ఆంధ్రప్రదేశ్ అవతరణకు కారకులైన బూర్గుల రామకృష్ణారావు, మాడపాటి హనుమంతరావు, మీర్ అహ్మద్ ఆలీఖాన్, వి.బి.రాజు, రావి నారాయణరెడ్డి, అయ్యదేవర కాళేశ్వరరావు, అల్లూరి సత్యనారాయణరాజు, కాళోజీ నారాయణరావు, బెజవాడ గోపాలరెడ్డి, దేవులపల్లి రామానుజరావు, భోగరాజు పట్టాభి, పాగ పుల్లారెడ్డి తదితర దేశభక్తుల త్యాగనిరతిని స్ఫురణకు తెచ్చుకుంటూ... వారందరికీ పేరుపేరునా నివాళులర్పిస్తున్నాను. అంతకన్నా ముందు 'ఆంధ్రరాష్ట్రం' అవతరణ కోసం ఆత్మబలిదానం చేసిన 'అమరజీవి' పొట్టి శ్రీరాములుకి శ్రద్ధాంజలి ఘటిస్తున్నాను.**

ప్రత్యేక ఆర్థిక మండలాలను ఏర్పరచుకొంటున్నాం.

మనం ఇంతటి అభివృద్ధి సాధించటానికి ప్రధాన కారణం మౌలిక సదుపాయాల కల్పన పట్ల మొదటి పాతికేళ్ళలో మన నాయకులు చూపిన శ్రద్ధ, ఆసక్తి. ఇరిగేషన్ ప్రాజెక్టులు, భారీ పరిశ్రమలు, రహదార్లు, విద్యుత్ కల్పన వంటి మౌలిక వసతుల మీద వాళ్ళు దృష్టిని కేంద్రీకరించారు.

మహాత్మాగాంధీ ఒక సందర్భంలో అన్నారు.... "ప్రజాభిమానాన్ని చూరగొనగల ప్రభుత్వాన్ని యుద్ధ ప్రాతిపదికన నిర్మించలేం".

గడచిన ఆరేళ్ళ కాలంలో కూడా ఇదే ప్రయత్నాన్ని మనం సాగిస్తూ వచ్చాం. డాక్టర్ రాజశేఖరరెడ్డి సారథ్యంలో మనం చేపట్టిన జలయజ్ఞం కానీ, ప్రత్యేక ఆర్థిక మండలాలకు శ్రీకారం చుట్టటం కానీ, విశ్వవిద్యాలయాల ఏర్పాటు కానీ, ఇన్‌ఫర్మేషన్ టెక్నాలజీ రంగాన్ని జిల్లాలకు విస్తరించే కార్యక్రమం కానీ... ఇవన్నీ మరో 40-50 ఏళ్ళ ప్రగతికి ఆధారభూతాలు కాగల మౌలిక వసతుల కల్పనలే.

గడచిన ఆర్థిక సంవత్సరంలో కరవు, వరదలు, మతఘర్షణల

# సదవగాహనతోనే శాంతి

1956 నవంబరు 1న అప్పటి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ చేతుల మీదుగా ఆంధ్రప్రదేశ్ అవతరించటాన్ని చూసి పులకించిపోయిన కోట్లాది తెలుగు వారిలో నేనూ ఒకణ్ణి.

మన నేల పచ్చటి మాగాణిగా వర్ధిల్లాలనీ... ప్రతి పల్లె పాడిపంటలతో స్వయం సమృద్ధిని సాధించాలనీ... ప్రతి కుటుంబమూ శాంతిసౌఖ్యాలతో జీవించాలనీ... ఇలా ఎన్నో కలలతో ఆనాటి త్యాగధనులు వేసిన బాటలో మనం 54 సంవత్సరాలు ముందుకు వచ్చాం.

ఒక్కసారి వెనక్కి తిరిగి చూస్తేనే కదా మనం ఎంత ముందుకు వచ్చామో తెలుస్తుంది. 1957-58లో మన రాష్ట్ర బడ్జెట్ 58 కోట్ల రూపాయలు. ఇప్పుడు అది లక్ష కోట్ల రూపాయలకు మించిపోయింది. అప్పట్లో మన రాష్ట్రంలో ఆహారధాన్యాల ఉత్పత్తి 51 లక్షల టన్నులు. ఇప్పుడు 200 లక్షల టన్నులు దాటిపోయాం. మన రాష్ట్రంలో మొట్టమొదటి పారిశ్రామిక ఉత్పత్తి కేంద్రానికి 1957లో సనత్‌నగర్‌లో శంకుస్థాపన జరిగింది. ఇప్పుడు రాష్ట్రంలో ఇంచుమించు ప్రతి జిల్లాలోనూ పారిశ్రామిక కేంద్రాలు వున్నాయి. కొత్తగా వివిధ ప్రాంతాల్లో

ఉద్రిక్తతలు, ప్రాంతీయ ఉద్యమాలు, డాక్టర్ రాజశేఖరరెడ్డి దుర్మరణం వంటి పరిస్థితులు మన ప్రగతి వేగం మీద ప్రభావం చూపాయి. అయినా ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో క్రమంగా రాష్ట్రం పుంజుకుంటోంది. మళ్ళీ ఆశావహమైన భవిష్యత్ దిశగా రాష్ట్రం ముందంజ వేస్తోంది. ఈ ఆనందాన్ని మీతోకాక ఇంకెవరితో పంచుకుంటాను. నాకు శక్తినిచ్చేది మీరు... నాకు ఆసక్తి కలిగించేది మీ శ్రేయస్సు.

2009-10లో మన ఆర్థిక ప్రగతి ప్రోత్సాహకరంగా లేకపోయినప్పటికీ, మనం ప్రయత్నాలు కొనసాగిస్తూనే వచ్చాం. ఆశావాదం, పట్టుదల సత్ఫలితాలనిచ్చి తీరతాయని నా నమ్మకం.

నా నమ్మకం వమ్ము కాలేదు. మనం చేసిన ప్రయత్నాలు ఫలించి, మన ఆర్థిక పురోగతి మెరుగుపడింది. ఈ ఆర్థిక సంవత్సరం మొదటి ఆరు మాసాలలో మన రెవెన్యూ గత ఏడాది ఇదే కాలంలో కంటే 25.5 శాతం పెరిగింది. అయినా ఇంకా మనం లక్ష్యాన్ని చేరుకోవటానికి కృషి కొనసాగిస్తూనే వున్నాం.

**ఆంధ్రరాష్ట్ర అవతరణోత్సవాలలో ముఖ్యమంత్రి శ్రీ కె. రోశయ్య ప్రసంగం . . .**

వ్యవసాయ రంగంలో అయితే మన పురోగతి మరింత ఆనందాన్ని కలిగించేదిగా వుంది. 2008-09లో 204 లక్షల టన్నులు పండించాం. 2009-10లో కరవు, వరదల వల్ల వ్యవసాయోత్పత్తి 150 లక్షల టన్నులకి పడిపోయింది. కాని, ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో వర్షాలు సకాలంలో బాగా కురవటం, వీటికితోడు రైతు సదస్సులు, పొలంబడి వంటి కార్యక్రమాల్ని మనం విస్తృతంగా నిర్వహించటం వంటి కారణాల వల్ల ఖరీఫ్, రబీ పంటల మొత్తం దిగుబడి 210 లక్షల టన్నులు దాటుతుందని అంచనా. 2009-10లో వ్యవసాయ రుణాల క్రింద 30వేల 768 కోట్ల రూపాయలను పంపిణీ చేస్తే, ఈ సంవత్సరం ఆ లక్ష్యాన్ని 34 వేల 800 కోట్ల రూపాయలకు పెంచుకున్నాం.

నాకు విశ్వాసం కలుగుతోంది. మన రైతుకి మనం ప్రోత్సాహం కల్పిస్తే అతడు ఎదగలేని స్థాయి లేదు. మీరు పత్రికల్లో చదివి వుంటారు. ఇటీవల వరంగల్ జిల్లాలో ఒక మహిళా రైతు 'శ్రీ' వరిసాగు ద్వారా ఎకరాకి 60 బస్తాలు పండించి ప్రపంచ దృష్టిని ఆకర్షించింది. ఎంతటి గౌరవాన్ని ఆమె మన రాష్ట్రానికి తీసుకువచ్చింది! అదే దారిలో మరి కొంతమంది రైతులు సాధిస్తున్నారు. రైతుల్ని ఇంతకాలం మనం 'అన్నదాత' అని మాత్రమే అంటూ వచ్చాం. వాళ్ళని ఇప్పుడు 'కీర్తి ప్రదాత' అని కూడా అనాలి.

రైతు తన స్వేదం చిందించి, పండించి మన ఉదరాన్ని నింపుతున్నాడు. కనుకనే రైతు కోసం పంటల బీమా పథకంలో మార్పులు చేసి, గ్రామం ఒక యూనిట్‌గా చేశాం. 2009 ఖరీఫ్‌లో కరవు, వరదల వల్ల నష్టపోయిన రైతులకు నష్టపరిహారాన్ని 699 కోట్ల రూపాయలుగా అంచనా వేయడం జరిగింది. ఇందులో 268 కోట్ల రూపాయలను ఇప్పుడు విడుదల చేయబోతున్నాం.

ఇరిగేషన్ రంగంలో ఇందిరాసాగర్ (పోలవరం), జె.చొక్కారావు ఎత్తిపోతల, ప్రాణహిత్-చేవెళ్ళ ప్రాజెక్టుల్ని జాతీయ ప్రాజెక్టులుగా చేపట్టాలని కేంద్రాన్ని నేను కోరిన సంగతి, అందుకు ప్రధానమంత్రి డాక్టర్ మన్మోహన్ సింగ్, యుపి.ఏ. ఛైర్‌పర్సన్ శ్రీమతి సోనియాగాంధీలు సానుకూలంగా స్పందించిన సంగతీ మీకు తెలుసు. నాకు నమ్మకముంది - ఈ ప్రాజెక్టుల విషయంలో కేంద్ర సహకారం మనకు లభిస్తుందని. నా నమ్మకానికి ఒక ఆధారం వుంది. ఏ ఇతర రాష్ట్రంలోనూ లేనివిధంగా జలయజ్ఞం క్రింద మనం ఇరిగేషన్ రంగంలో మౌలిక సదుపాయాల కల్పనకు అపారమైన ప్రాధాన్యతని ఇచ్చాం. గత అయిదేళ్ళలో 20 లక్షల ఎకరాల బీడు భూములకు సాగునీటిని కల్పించటం కోసం, మరో మూడు లక్షల ఎకరాల ఆయకట్టుని స్థిరీకరించటం కోసం 12 ప్రాజెక్టుల్ని పూర్తిచేసుకొన్నాం. మరో 20 ప్రాజెక్టుల సామర్థ్యాన్ని పెంచుకున్నాం. మిగతా ప్రాజెక్టుల విషయంలో మన నిధుల లభ్యతను బట్టి ప్రాధాన్యతాక్రమాన్ని మార్చుకుంటున్నాం. త్వరగా పూర్తయ్యే అవకాశమున్న వాటిమీద ఎక్కువ శ్రద్ధ పెడుతున్నాం. 17 లక్షల హెక్టార్ల అదనపు ఆయకట్టు కల్పన కోసం క్రొత్తగా 55 చిన్న నీటిపారుదల చెరువుల పనులు నిర్వహిస్తున్నాం.

వ్యవసాయ నీటిపారుదల రంగాలు బాగుంటే మన గ్రామీణాభివృద్ధి వేగం బాగుంటుంది. గ్రామీణాభివృద్ధి బాగుంటే మన ఆర్థిక ప్రగతి బాగుంటుంది. ఇప్పుడు గ్రామీణాభివృద్ధికి కూడా అధిక ప్రాధాన్యతనిస్తున్నాం. ఇందులో అతి కీలకమైనది మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం. గత అయిదేళ్ళలో మొత్తం 13 వేల 382 కోట్ల రూపాయలను వెచ్చించటం ద్వారా ఒక కోటీ 72 లక్షల మందికి ఉపాధి కల్పించాం. ఇప్పటికీ దేశంలో ఈ పథకం అమలులో మనమే అగ్రస్థానంలో వున్నాం. సమీకృత వాటర్‌షెడ్‌ల నిర్మాణం ద్వారా కరవు పీడిత ప్రాంతాలలో నీటి నిల్వ సామర్థ్యాన్ని, సక్రమ వినియోగాన్ని పెంచగలిగాం. ఇందిరప్రభ ద్వారా ఎస్.సి, ఎస్.టి, బిసి తదితర పేదల భూమిని అభివృద్ధి చేసే కార్యక్రమం మీద ఇప్పటిదాకా 415 కోట్ల రూపాయలు వెచ్చించాం.

గ్రామీణాభివృద్ధిలో భాగంగా పావలావడ్డీ పథకం ద్వారా కోటిమందికి పైగా పేద మహిళల్ని ఆర్థికంగా శక్తివంతుల్ని చేస్తున్నాం. వాళ్ళకి వృద్ధాప్యం భారం కాకుండా 'వైఎస్ఆర్ అభయహస్తం' పథకాన్ని అమలు చేస్తున్నాం. 'ఇందిరమ్మ' గ్రామాలలో పేదల కోసం చేపట్టిన 64 లక్షల ఇళ్ళల్లో దాదాపు 32 లక్షలకు పైగా పూర్తిచేశాం.

అప్పుడప్పుడు కొంతమంది నిరాశావాదులు మాట్లాడుతుంటారు.... "ఎన్ని దశాబ్దాలు గడిచినా మనం సాధించింది ఏముంది" అంటూంటారు. వాస్తవిక దృష్టితో చూస్తే కాని మనం సాధించిన పురోగతి కనుపించదు.

ఉదాహరణకి మనం షెడ్యూల్డుకులాల సంక్షేమం కోసం 35 ఏళ్ళ క్రితం ఎస్.సి. ఫైనాన్స్ కార్పొరేషన్‌ని ఏర్పాటు చేసుకున్నాం. ఈ మూడున్నర దశాబ్దాల్లో మనం 49 లక్షల 63 వేల మందికి పైగా ఎస్.సి లబ్ధిదారులకు 412 కోట్ల రూపాయల మేరకు ఆర్థిక సహాయాన్ని అందించటం జరిగింది.

2010-11 కార్యాచరణ ప్రణాళికలో కూడా ఇప్పటివరకూ 2 లక్షల 88 వేలకు పైగా ఎస్.సి. లబ్ధిదారులకు 363 కోట్ల రూపాయలకు పైగా ఆర్థిక సహాయాన్ని మంజూరు చేశాం. వీటిలో 57 శాతం పైగా యూనిట్లు ఇప్పటికే ప్రారంభమయ్యాయి. 2010-11 కార్యాచరణ ప్రణాళికలో సబ్సిడీ పరిమాణాన్ని 50 శాతానికి పెంచాం.

ఈ ప్రణాళికలో పశుక్రాంతి పథకం క్రింద పాడిపశువుల సేకరణ, భూమి అభివృద్ధి, విద్యుద్దీకరణ, పండ్లతోటల పెంపకం, బోర్ల త్రవ్వకం వంటి అనేక ప్రయోజనాలను ఎస్.సి.లు పొందుతున్నారు. ఎస్.సి.ల సంక్షేమం గురించి ఎప్పుడు ప్రస్తావన వచ్చినా నాకు మహాత్మాగాంధీ మాటలు గుర్తుకొస్తాయి...

"నాకు మళ్ళీ జన్మ అంటూ వుంటే హరిజనుడిగా పుట్టాలని కోరుకుంటాను" అనేవారు గాంధీజీ.

దళితుల సంక్షేమం కోసం, వారి సామాజిక గౌరవం కోసం ఆయనలా తపించిన నాయకులెంతమంది? అందుకే దళితుల సంక్షేమం విషయంలో మహాత్మాగాంధీ ఆలోచనలే మాకు మార్గదర్శకాలు.

షెడ్యూల్డు తెగలవారి సంక్షేమానికి కూడా అదే ప్రాధాన్యతనిస్తున్నాం. షెడ్యూల్డు తెగల విద్యార్థుల సదుపాయం కోసం ఇప్పుడు కొత్తగా 126 హాస్టళ్ళను నిర్మించాలని నిర్ణయించాం.

వెనుకబడిన తరగతుల సంక్షేమానికి మా ప్రభుత్వం ఇస్తున్న ప్రాధాన్యతకి తాజా పరిణామాలు అద్దంపడతాయి. చేనేత కార్మికులు సొసైటీల పరంగానూ, వ్యక్తిగతంగానూ తీసుకున్న రుణాలలో అసలు, వడ్డీ రెండింటిని మాఫీ చేయాలనీ, రుణమాఫీ జరిగిన చేనేత కార్మికులకు తిరిగి రుణాలు ఇచ్చేలా బ్యాంకుల రుణ పరిమితి నిబంధనలు మార్చాలనీ మంత్రివర్గ ఉపసంఘం చేసిన సిఫార్సులను సూత్రప్రాయంగా ఆమోదించాం. వెనుకబడిన తరగతుల సంక్షేమం బడ్జెట్‌ని గత ఏడాదినాటి 1305 కోట్ల రూపాయల నుంచి 1721 కోట్ల రూపాయలకు పెంచిన విషయం మీకు తెలుసు.

రాష్ట్ర ఆర్థికాభివృద్ధిలో వ్యవసాయంతో పాటు పరిశ్రమలు కూడా కీలకపాత్ర వహిస్తాయని ప్రభుత్వం భావిస్తోంది. ఇప్పటికే వివిధ విభాగాలకు చెందిన ఎన్నో పరిశ్రమలు మన రాష్ట్రంలో నెలకొని ఉన్నాయి. అయినప్పటికీ, మరింత పారిశ్రామికాభివృద్ధిని సాధించి,

సాధ్యమైనంత ఎక్కువమందికి ఉపాధి సౌకర్యం కల్పించాలని ప్రభుత్వం కృషిచేస్తోంది. ఇందుకు అనుగుణంగానే 2010-15 సంవత్సరాలకు నూతన పారిశ్రామిక పెట్టుబడుల ప్రోత్సాహక విధానానికి రూపకల్పన చేశాం.

ఈ నూతన విధానం ప్రకారం, రాష్ట్రంలో పరిశ్రమలు నెలకొల్పే ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు ఎన్నో ప్రోత్సాహకాలు, రాయితీలు కల్పిస్తున్నాం. వివిధ అంశాలకు సంబంధించి నిబంధనలను సరళతరం చేశాం. మరిన్ని పరిశ్రమలను ఆకర్షించే విధంగా మౌలిక సదుపాయాల కల్పన, విద్యుత్, తదితర అంశాలలో పారిశ్రామికవేత్తలకు అనువైన చక్కటి వాతావరణాన్ని రాష్ట్రంలో నెలకొల్పగలిగాం.

2010 మార్చి నాటి వరకూ రాష్ట్రంలో 81,444 కోట్ల రూపాయల పెట్టుబడులతో 4,224 భారీ పరిశ్రమలు ఏర్పాటయ్యాయి. వీటిద్వారా సుమారు 10 లక్షల మందికి ఉద్యోగాలు లభించాయి. కాగా, 2009-10 ఆర్థిక సంవత్సరంలో 11,610 కోట్ల రూపాయల పెట్టుబడులతో 74 భారీ పరిశ్రమలు మన రాష్ట్రంలో నెలకొల్పబడ్డాయి. వీటిద్వారా మరో 12 వేల మందికి ఉద్యోగావకాశాలు లభించాయి.

లబ్ధిదారులకు సామూహికంగా ప్రయోజనం కల్పించేందుకు కేంద్రప్రభుత్వం'కామన్ ఫెసిలిటీ సెంటర్స్' మంజూరుచేసింది. గుంటూరు జిల్లా పిడుగురాళ్ళలో సున్నంబట్టీల సమూహాన్నీ, విజయనగరం జిల్లా భీమిలి వద్ద మామిడితాండ్ర తయారీ సమూహాన్నీ, కృష్ణా జిల్లా మచిలీపట్నంలో రోల్డ్‌గోల్డ్ ఆభరణాల తయారీ సమూహాన్నీ కేంద్రప్రభుత్వ సహాయంతో ఏర్పాటుచేస్తున్నాం.

ఐ.టి పరిశ్రమలకు ప్రోత్సాహకాలు కల్పించే విషయంలో ఇతర రాష్ట్రాల కన్నా మనమే ముందున్నామని చెప్పక తప్పదు. ఐ.టి. రంగానికి సంబంధించి దేశంలోనే అగ్రగామిగా నిలిచేందుకు మన ఐ.టి. విధానాన్ని మరింత మెరుగుపరచి, అవసరమైన మార్పులు, చేర్పులు చేసుకున్నాం. దీనినే 'ఇన్ఫర్మేషన్ అండ్ కమ్యూనికేషన్ టెక్నాలజీ(ఐ.సి.టి)' విధానంగా పిలుస్తున్నాం. 2010-2015 వరకూ ఐదు సంవత్సరాల కాలానికి ఈ విధానం రూపొందించాం.

ఈ నూతన ఐ.సి.టి. విధానం క్రింద, 2015 సంవత్సరం నాటికి ఐ.టి. ఎగుమతుల వృద్ధిని 70,000 కోట్ల రూపాయలకు పెంచాలనీ, వార్షిక వృద్ధి 17 శాతం సాధించాలనీ లక్ష్యంగా పెట్టుకున్నాం. ఐ.టి.లో ప్రత్యక్షంగా 1,25,000 మందికి, పరోక్షంగా 5 లక్షల మందికి ఉపాధి అవకాశాలు కల్పించాలని లక్ష్యంగా నిర్దేశించాం.

రాష్ట్ర అవతరణ తరువాత తొలి దశాబ్దాలలో ఎలాగైతే మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యతనిచ్చారో అలాగే ఇప్పుడు కూడా మా ప్రభుత్వం ఆలోచిస్తోంది. ఇందుకు అనుగుణంగానే మన్నవరంలో విద్యుత్ ప్లాంట్ల విడి భాగాల తయారీ పరిశ్రమకు శంకుస్థాపన చేయడం జరిగింది. కాకినాడ-విశాఖపట్నం పెట్రో కారిడార్, విమానాశ్రయాల విస్తరణ, హైదరాబాద్ ఔటర్ రింగురోడ్డు, విద్యుదుత్పత్తి పెంపుదల, ఓడరేవుల విస్తరణ, రాజధాని నగరానికి 24 గంటల త్రాగునీటి సరఫరా, గ్రేటర్ హైదరాబాద్‌కి మెట్రోరైలు ప్రాజెక్టు వంటి వివిధ కార్యక్రమాలు ఇప్పుడు అమలు జరుగుతున్నాయి. ముఖ్యంగా విద్యుత్ ఒక నిత్యావసరంగా మారిపోయింది. రైతులకు ఉచిత విద్యుత్‌ని అందిస్తున్న సంగతి మీకు తెలుసు. మన అవసరాల్లో 50 శాతాన్నే ఇప్పుడు మనం ఉత్పత్తి చేయగలుగుతున్నాం. అందుకే పదకొండవ, పన్నెండవ ప్రణాళికల కాలాల్లో మొత్తం 16,865 మెగావాట్ల విద్యుత్‌ను అదనంగా ఉత్పత్తి చేసే వ్యూహాన్ని రచించి అమలుచేస్తున్నాం. ఇందులో 836 మెగావాట్లను ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలోనే సాధించడం లక్ష్యంగా పనిచేస్తున్నాం.

రాబోయే ఐదేళ్ళలో 'ఆంధ్రప్రదేశ్ మున్సిపల్ డెవలప్‌మెంట్ ప్రాజెక్ట్' క్రింద ప్రపంచబ్యాంకు నుండి 1670 కోట్ల రూపాయల సహాయంతోనూ, 13వ ప్రణాళికా సంఘం నిధుల నుంచి 1919 కోట్ల రూపాయలతోనూ మన పట్టణ ప్రాంతాలకు మౌలిక సదుపాయాలను క్రమబద్ధంగా అభివృద్ధి చేసుకోబోతున్నాం.

బలహీనవర్గాల వారందరికీ ఉన్నతవిద్య భారం కాకుండా చూసే లక్ష్యంతో -వార్షికాదాయం లక్ష రూపాయలు దాటని ఎస్.సి., ఎస్.టి., బి.సి., ఇ.బి.సి. కుటుంబాలలోని విద్యార్థులకు మెస్ ఛార్జీలు, ఫీజులు రీయింబర్స్‌మెంట్ చేస్తున్నాం. పోస్ట్‌మెట్రిక్ స్కాలర్‌షిప్‌లను 2008-09 నుంచి 'ఆన్‌లైన్' విధానంలో చెల్లిస్తున్నాం. ఈ 'ఆన్‌లైన్' విధానం వల్ల ప్రతినెలా ఒకటవ తేదీకల్లా విద్యార్థులకు స్కాలర్‌షిప్ లభించడమేగాక, పూర్తి పారదర్శకతతో చెల్లింపులు జరుగుతున్నాయి. అవినీతికి ఆస్కారం లేకుండా చేయగలిగాం.

రాష్ట్రంలో సొంత ఇల్లు లేనివారు ఎవరూ ఉండరాదన్నది మా ప్రభుత్వ లక్ష్యం. ఇందులో భాగంగానే, షెడ్యూల్డు కులాలు, షెడ్యూల్డు జాతులు, బి.సిలు, మైనారిటీలకు ఇళ్ళస్థలాలు పంపిణీ చేస్తున్నాం. 2006 నుంచి ఈ కార్యక్రమాన్ని 'ఇందిరమ్మ' కార్యక్రమంలో భాగంగా అమలుచేస్తున్నాం.

మైనారిటీసంక్షేమం విషయంలో మా ప్రభుత్వ చిత్తశుద్ధి మీకు తెలుసు. వెనుకబడిన ముస్లింల కోసం నాలుగు శాతం రిజర్వేషన్లు ప్రవేశపెట్టడం, మైనారిటీ ఆర్థిక సహాయ సంస్థని ఏర్పాటు చేయడం వంటి అనేక చర్యలు అమలుచేస్తున్నాం. కొత్తగా ఇప్పుడు మైనారిటీల కోసం రెండు మెడికల్ కాలేజీలను మెడికల్ కౌన్సిల్ ఆమోదించింది.

మాధ్యమిక విద్యాప్రమాణాలను మెరుగుపరచేందుకు 'సి.యన్.యన్' క్రింద 737 మండలాల్లో మోడల్ స్కూళ్ళను ఏర్పాటుచేసేందుకు చర్యలు తీసుకుంటున్నాం. పదవ తరగతి విద్యార్థుల వరకూ మధ్యాహ్న భోజన పథకాన్ని విస్తరించాం. ఉన్నత విద్యకు సంబంధించి 'ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ సంస్థ', 'బిట్స్' వంటి ప్రతిష్ఠాత్మక సంస్థలతోపాటు, రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలలో ఎన్నో కొత్త విశ్వవిద్యాలయాలు, ఇంజనీరింగ కళాశాలలు, పాలిటెక్నిక్ కళాశాలలు ఏర్పాటు చేసుకున్నాం. కరీంనగర్ జిల్లా మంథనిలో జె.ఎన్.టి.యు. ఇంజనీరింగ్ కళాశాలను ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలోనే మంజూరు చేశాం. ఈ కళాశాలలో ఈ ఏడాది అడ్మిషన్లు కూడా ప్రారంభమయ్యాయి.

ప్రభుత్వం గత రెండేళ్లలో 50 కొత్త పాలిటెక్నిక్ కళాశాలలను మంజూరు చేసింది. కొన్ని పాలిటెక్నిక్‌లలో రెండో షిఫ్ట్ పాలిటెక్నిక్‌లకు అనుమతినివ్వడం జరిగింది. అలాగే 57 ఇంజనీరింగ్ కాలేజీల్లో రెండో షిఫ్టులో పాలిటెక్నిక్‌లను నడిపేందుకు అనుమతినివ్వడం జరిగింది.

బాధ్యత గల ఏ ప్రభుత్వానికైనా ప్రజల ఆరోగ్యం, వైద్యం చాలా ముఖ్యమైన అంశాలని నేను భావిస్తాను. ప్రజలకు వైద్య సదుపాయాల్ని మెరుగుపర్చడం కోసం రాష్ట్ర వైద్య విధాన పరిషత్ ప్రణాళిక, ప్రణాళికేతర బడ్జెట్‌ను ఏయేటికాయేడు పెంచుతూ వస్తున్నాం. 2010-11 ఆర్థిక సంవత్సరంలో ఈ బడ్జెట్ కేటాయింపులు 412 కోట్ల రూపాయలకు చేరుకున్నాయి. గత సంవత్సరం ఈ బడ్జెట్ 354 కోట్ల రూపాయలు మాత్రమే. 'రాజీవ్ ఆరోగ్యశ్రీ' పథకం ఇప్పటివరకూ ఏడున్నర లక్షల పేద కుటుంబాలకు ఎలాంటి ఖరీదైన వైద్యం అందించిందో మీకు తెలుసు.

రాష్ట్రప్రభుత్వం తీసుకుంటున్న జాగ్రత్తల వల్ల ప్రభుత్వ ఆసుపత్రుల పట్ల ప్రజల విశ్వాసం ప్రతి ఏడాదీ పెరుగుతూ వస్తోంది. వైద్య విధాన పరిషత్ పరిధిలోని అనేక ఆసుపత్రులను అప్‌గ్రేడ్ చేయడం పూర్తికావస్తోంది. కొన్ని జిల్లా కేంద్రాల్లో ప్రారంభించిన ట్రామాకేర్ సెంటర్‌ల నిర్మాణం పూర్తికావచ్చింది. వైద్య విధాన పరిషత్ ఆసుపత్రుల్లో 45 కోట్ల రూపాయలు వెచ్చించి అధునాతన పరికరాలను ఇటీవలనే సమకూర్చడం జరిగింది. వైద్య విధాన పరిషత్ ఆసుపత్రుల్లో ఖాళీగావున్న 580 సివిల్ అసిస్టెంట్ సర్జన్ స్పెషలిస్ట్ పోస్టులను భర్తీ చేసేందుకు చర్యలు తీసుకున్నాం.

మాతా-శిశు రక్షణ కార్యక్రమానికి ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యం ఇస్తోంది. ప్రభుత్వం తీసుకుంటున్న చర్యల వల్ల మహిళల్లో చైతన్యం వచ్చి గర్భిణీలు ఆరోగ్య పరీక్షల నిమిత్తం ఆసుపత్రులను సందర్శించడం గణనీయంగా పెరిగింది. అలాగే దవాఖానాల్లో ప్రసూతి చేయించుకునే వారి శాతం గణనీయంగా పెరిగింది. ఆంధ్రప్రదేశ్‌లో ప్రతీ సంవత్సరం 100% శిశువులకు వ్యాధి నిరోధక టీకాలు వేయడం జరుగుతున్నది.

'108' అంబులెన్స్ సర్వీసులు ప్రారంభించినప్పటి నుంచీ గ్రామీణ ప్రాంతాల్లో 52 లక్షలకు పైగా కేసుల్లో సేవలు అందించడం జరిగింది. ఇందులో 45 లక్షల 81 వేల ఎమర్జెన్సీ కేసులను అంబులెన్స్ '108' ద్వారా ఆసుపత్రులకు చేర్చడం జరిగింది. అలాగే 8 లక్షల 81 వేల మంది గర్భిణీలను ప్రసవం కోసం ఆసుపత్రులకు చేర్చడం జరిగింది. శిశు మరణాలను బాగా అదుపు చేయడం జరిగింది. మృత్యువాత పడే శిశువుల సంఖ్యని ప్రతి వెయ్యి జననాల్లో 52కి తగ్గించగలిగాం. మనం తీసుకున్న చర్యల వల్ల ప్రసూతి సమయాల్లో మరణించే పిల్లల సంఖ్య కూడా లక్షమందిలో 154కి తగ్గింది. సగటు జననాల సంఖ్య ఒక్కో మహిళకు 1.79కి వచ్చింది. ఇదే సమయంలో బడికి వెళ్ళే పిల్లల ఆరోగ్యం పట్ల శ్రద్ధ పెంచుతూ, వారికి బలవర్ధక ఆహారం అందేలా 'జవహర్ బాల ఆరోగ్య రక్ష' పథకాన్ని ఈ నవంబర్ 14న నెహ్రూ జయంతి సందర్భంగా ప్రారంభిస్తున్నాం.

మనం ఎన్ని పథకాలు రచించినా, ఎన్ని రకాల కార్యక్రమాలు రూపొందించినా, వాటి ఫలితాలు ఆయా లబ్ధిదారులకు సక్రమంగా చేరకపోతే ప్రయోజనం లేదు. అలాగే ఎప్పుడైనా ఒక ప్రజాస్వామిక ప్రభుత్వం నుంచి ప్రజలు ఆశించే సుపరిపాలన లక్షణం - తమ సమస్యలకు తక్షణం స్పందించడం.

ప్రజాస్వామ్యంలో ఏ ప్రభుత్వమైనా ప్రజలకే జవాబుదారీ. ప్రజల కోసమే ప్రభుత్వం ఉంది. సమీక్షా సమావేశాల్లో నేను తరచూ చెప్తుంటాను. "పేద ప్రజల సంక్షేమం మన ప్రాధాన్యతా అంశం. అభివృద్ధి ప్రణాళికలు అమలు చేయడంతో పాటు బలహీనవర్గాల సంక్షేమ స్ఫూర్తి మన ప్రతి ఆలోచనలోనూ, ప్రతి చర్యలోనూ, ప్రతి కార్యక్రమంలోనూ ప్రతిఫలిస్తూనే ఉండాలి. ఈ ప్రభుత్వం తమ కోసం పనిచేస్తోందీ అన్న విశ్వాసాన్ని ప్రజలకు - ముఖ్యంగా బలహీనవర్గాలకు - కలిగించడమే అన్ని పథకాల, కార్యక్రమాల లక్ష్యం కావాలి".

ఈ మధ్య పావలావడ్డీ రుణాల విషయంలోనూ, రైతులకు వ్యవసాయ రుణాల విషయంలోనూ కూడా బ్యాంకర్ల సమావేశంలో ఇదే విషయాన్ని నేను నొక్కి చెప్పడం జరిగింది..... మైక్రోఫైనాన్స్ సంస్థల ఏజెంట్లు చేస్తున్న ఆగడాలకు తట్టుకోలేక గ్రామాల్లో పేదప్రజలు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారంటే, ఈ విషయం మీద ప్రధానమంత్రితో, రిజర్వుబ్యాంకు గవర్నరుతో మాట్లాడాను. మరో అడుగు ముందుకు వేసి మైక్రోఫైనాన్స్ సంస్థల పనితీరుని కట్టడిచేసేలా ఆర్డినెన్స్‌ని తీసుకువచ్చాం.... బాబ్లీ ప్రాజెక్టు సమస్య మీద అఖిలపక్ష సమావేశం జరిపి, కేంద్రం దగ్గరికి ప్రతినిధి వర్గాన్ని తీసుకెళ్ళాం.

ఏదైనా సమస్య వచ్చిన ప్రతిసారీ నన్ను నేను ప్రశ్నించుకుంటాను. నా పరిధిలో నాశక్తి మేరకు ఈ సమస్య పరిష్కారానికి నేను కృషి చేస్తున్నానా?

ఇలాంటి సందర్భాల్లో జవహర్‌లాల్ నెహ్రూ సూక్తి నాకు గుర్తొస్తూ వుంటుంది...

"తక్షణం స్పందించడం లేదా చర్య తీసుకోవటం, ఇది సరైనదే అని నాకు అనిపించేలా నేను తీసుకోగలిగితే, అది నాకు సంతృప్తి నిస్తుంది."

మన ముందున్న లక్ష్యాలు రెండు... నిరంతర అభివృద్ధి, బలహీన వర్గాల సంక్షేమం. వీటిని విజయవంతంగా సాధించడంలో ఉపయోగించాల్సిన సాధనం సుపరిపాలన. ఈ దిశగా మా ప్రభుత్వం తన కృషిని నిరంతరం కొనసాగిస్తూనే వుంటుందని ఆంధ్రప్రదేశ్ అవతరణోత్సవాల సందర్భంగా మరోసారి మీకు వాగ్దానం చేస్తున్నాను.

కామన్వెల్త్ గేమ్స్‌లో ఎనిమిది స్వర్ణ పతకాలతో సహా 18 పతకాలను సాధించి తెచ్చి, భారతదేశ ఖ్యాతిని ఇనుమడింపజేసిన ఆంధ్రప్రదేశ్ క్రీడాకారులందరినీ ఈ సందర్భంగా మరోసారి అభినందిస్తున్నాను. వారు తెచ్చిన విజయంతో ఈ 55వ రాష్ట్రావతరణోత్సవాలు మరింత పరిపుష్టం అయ్యాయనే ఆనందాన్ని మీతో పంచుకోవటంలో నాకొక సంతృప్తివుంది.

ఈ ఉత్సవాల సందర్భంగా మరో మాట మీకు చెప్పాలి. 'సుందరకవి' శంకరంబాడి వర్ణించిన 'తెలుగుతల్లి' గౌరవాన్ని నిలబెట్టేలా తెలుగు భాషకి ప్రాచీన భాష హోదాని సంపాదించుకున్నాం. అధికార భాషగా తెలుగు వినియోగానికి అత్యంత ప్రాధాన్యతనిస్తున్నాం. అయినా ప్రతి తెలుగు వ్యక్తీ తన పిల్లలకి తెలుగు భాషా మాధుర్యాన్ని అలవాటు చేస్తేనే ప్రభుత్వం చేసే ప్రయత్నాలు సత్ఫలితాలనిస్తాయనీ, దేశ భాషలందు తెలుగు విశిష్టత చిరస్థాయిగా నిలుస్తుందనీ నా విశ్వాసం.

తెలుగు సంస్కృతి అందాలకి, ఈ రాష్ట్రంలోని దివ్య క్షేత్రాలకి, విహారయాత్రా స్థలాలకి టూరిస్టుల్ని విరివిగా ఆకర్షించేలా కొత్త టూరిజం పాలసీని ఇటీవల రూపొందించి విడుదల చేశాం. తెలుగు సంస్కృతికి పూర్వ వైభవాన్ని తీసుకొచ్చేలా ఇటీవలే శ్రీ కృష్ణదేవరాయల పంచ శతాబ్ది పట్టాభిషేక మహోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నాం. అలాగే కాకతీయ సామ్రాజ్య వైభవాన్ని స్ఫురణకు తెచ్చేలా 2013లో 'కాకతీయ ఉత్సవాల' నిర్వహణకు సమాయత్తమవుతున్నాం.

తెలుగు సంస్కృతీ, సంప్రదాయాల్ని కాపాడుకొనే దిశగా ఈ ప్రభుత్వం అహరహం శ్రమిస్తూనే ఉంటుందని మీకు స్పష్టంచేస్తున్నాను.

అన్ని ప్రాంతాలూ, అన్ని వర్గాలూ శాంతి సౌఖ్యాలతో జీవించేలా రాష్ట్రం మరింత వేగంగా అభివృద్ధి చెందాలని కోరుకుంటూ... శాంతియుత సహజీవనం గురించి మహాత్మాగాంధీ చెప్పిన మాటల్ని ఒకసారి గుర్తు చేస్తాను.

"ముష్టిఘాతాలతో శాంతిని సాధించలేం.. కాని ద్వేషాన్ని కూడా ప్రేమతో జయించగలం. ప్రశాంతంగా జీవించాలంటే ప్రేమని పంచడం, పెంచడం అలవరుచుకోవాలి".

ఇదే అంశం మీద గత శతాబ్దపు ప్రఖ్యాత సైంటిస్టు, 'నోబెల్' గ్రహీత ఆల్బర్ట్ ఐన్‌స్టీన్ చెప్పిన మాటలు:

"శాంతి అనేది జీవిత పరమావధి. కాని అది పోరాటంతో వచ్చేది కాదు. సదవగాహన వల్ల మాత్రమే సాధ్యపడుతుంది".

ప్రతి తెలుగు గడప దీపావళి కాంతులతో శోభిల్లాలని కాంక్షిస్తూ, మరోసారి మీ అందరికీ నా శుభాకాంక్షలు తెలియజేస్తున్నాను.

*జైహింద్!*

☆



# మహిళా రైతులకు మంచిరోజులు

దేశంలో మహిళా రైతుల సంఖ్యను ప్రోత్సహించేందుకు కేంద్రం సరికొత్త పథకాన్ని ప్రవేశపెట్టనుంది. స్వయం సహాయక సంఘాల ద్వారా ఇప్పటికే మహిళా శక్తిని సంఘటితం చేసిన ప్రభుత్వం తాజాగా వ్యవసాయంలోనూ వారికి సరైన ప్రాధాన్యం కల్పించనుంది. వ్యవసాయ రంగంలో మహిళల పాత్రను మరింత పెంచేందుకు కొత్త పథకాన్ని అమలు చేయాలని కేంద్రం నిర్ణయించింది.

జాతీయ గ్రామీణ జీవనోపాధి మిషన్‌లో భాగంగా 'మహిళా కిసాన్ సశక్తికరణ్ పరియోజన' పేరుతో డిసెంబర్ నుంచి ఈ పథకాన్ని ప్రారంభించనుంది. దీనికి సంబంధించి కేంద్ర గ్రామీణాభివృద్ధిశాఖ తాజాగా ముసాయిదా నిబంధనలను జారీ చేసింది. ఈనెల 18, 19వ తేదీల్లో జాతీయ గ్రామీణాభివృద్ధి సంస్థ (ఎన్ఐఆర్‌డీ)లో జరిగే సదస్సులో దీనికి తుదిరూపు ఇవ్వనున్నారు. ముసాయిదా పత్రాన్ని కేంద్రం అన్ని రాష్ట్రాల గ్రామీణాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శులకు పంపించింది. రాష్ట్రాలు తమ అభిప్రాయాలను సమర్పించాలని కేంద్రం కోరింది. అవసరమైతే ముసాయిదాలో మార్పులు చేసి డిసెంబర్ 1 నాటికి రాష్ట్రాలకు పంపించనున్నట్లు కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ సంయుక్త కార్యదర్శి విజయకుమార్ తెలిపారు.

## వ్యవసాయ కూలీలుగానే మహిళలు

మహిళలు వ్యవసాయ రంగంలో పాలుపంచుకుంటున్నా.. వారికి రైతులుగా సరైన గుర్తింపు లభించటం లేదని ప్రభుత్వం భావిస్తోంది. మహిళలు చాలావరకు వ్యవసాయ కూలీలుగానే మిగిలిపోతున్నారు. దీంతో కేవలం మహిళల కోసమే ఓ పథకాన్ని తెచ్చి వ్యవసాయ రంగంలోనూ వారికి సరైన గౌరవం కల్పించాలని కేంద్రం నిర్ణయించింది. ఇందుకోసం ఈ ఆర్థిక సంవత్సరం బడ్జెట్‌లో రూ. 100 కోట్లు కేటాయించింది. పథకం కింద కేంద్రం 75 శాతం నిధులు గ్రాంటుగా ఇస్తుంది. మిగతా నిధులను రాష్ట్రాలు సమకూర్చాలి. జాతీయ గ్రామీణ జీవనోపాధి మిషన్‌లో భాగంగా 'సశక్తికరన్ పరియోజన'ను అమలు చేస్తారు. వ్యవసాయంలో మహిళల పర్యవేక్షణ వల్ల వనరులను చక్కగా వినియోగించుకోవడం, దిగుబడులు పెరగటం, ప్రభుత్వమిచ్చే పెట్టుబడి ఉపకరణాలు సులభంగా అందుబాటులో వస్తాయని ప్రభుత్వం యోచిస్తోంది.



## పథకం ప్రధాన లక్ష్యాలు

- వ్యవసాయ రంగంలో మహిళల పాత్ర పెంచి ఎక్కువ దిగుబడులు సాధించటం
- మహిళలకు సుస్థిర జీవనోపాధి కల్పించడం
- వ్యవసాయ, వ్యవసాయ అనుబంధ విభాగాల్లో మహిళల నైపుణ్యం, సామర్థ్యం పెంచడం
- గృహంలో ఆహారం, పౌష్టికాహార భద్రత కల్పించడం
- ప్రభుత్వ పెట్టుబడి ఉపకరణాలు, ఇతర సేవలు సులభంగా అందుబాటులోకి తేవడం
- ఆహార ఉత్పత్తులు పెంచి అధిక ఆదాయాన్ని ఆర్జించటం
- సాగు విస్తీర్ణం పెంచటం
- మహిళల ఉత్పత్తులకు మార్కెటింగ్ కల్పించటం

*

# స్థానిక సంస్థలకు త్వరలో మరిన్ని అధికారాలు

## స్థానిక సంస్థల పాలనపై పరిపాలనా సంస్కరణల కమిషన్ సిఫార్సులకు ఆమోదం

ఎన్నాళ్లుగానో కలలుగన్న 'గ్రామ స్వరాజ్యం' కొంత మూర్తకైనా త్వరలో అమలులోకి రానుంది. గ్రామ పంచాయతీలు, స్థానిక సంస్థలపై ఇక రాష్ట్ర ప్రభుత్వ అధికారాలకు పరిమితులు ఏర్పడనున్నాయి. ఆరోపణల ఆధారంగా గ్రామ సర్పంచ్‌లను, ఎన్నికైన స్థానిక సంస్థలను తొలగించే అధికారం ఇక పంచాయతీరాజ్ మంత్రులకు ఉండదు, ప్రస్తుతం ఏదైనా గ్రామ సర్పంచ్‌ను లేదా ఎన్నికైన పంచాయతీ బాడీని తొలగించే అధికారం పంచాయతీరాజ్ శాఖ మంత్రికి ఉంది. ఇప్పుడు ఆ అధికారం గవర్నర్ చేతుల్లోకి వెళ్లనుంది. స్థానిక సంస్థల పాలనపై పరిపాలనా సంస్కరణల కమిషన్ చేసిన పలు సిఫారసులకు కేంద్ర ప్రభుత్వం ఆమోదం తెలిపింది. ఆమోదం తెలిపిన అంశాలను ఇక అమలు చేయటమే తరువాయి. కొన్ని సిఫారసులు ఏడాదిలోగా, మరి కొన్ని సిఫారసుల రెండేళ్లలోగా అమల్లోకి రానున్నాయి. ఇవన్నీ అమలైతే.. ప్రతి స్థానిక సంస్థా ఇక ఆ పరిధిలో ఒక ప్రభుత్వంలా పనిచేస్తుంది. పన్నుల విధింపు, వసూళ్లు, సేవలు, విధుల నిర్వహణ వరకు స్థానిక సంస్థలు మరింత స్వేచ్ఛతో వ్యవహరించనున్నాయి. స్థానిక సంస్థలకు నేరుగా అప్పులు కూడా తెచ్చుకునేందుకు వీలు కల్పించనున్నారు. గ్రామీణ స్థానిక సంస్థల పటిష్టం, స్థానిక ప్రజలకు మెరుగైన పాలన అందించటమే లక్ష్యంగా కమిషన్ చేసిన పలు సిఫారసులకు కేంద్రం ఆమోదముద్ర వేసింది. వాటిలో ముఖ్యమైన అంశాలు ఇవీ...

- పంచాయతీరాజ్ సంస్థలు చేసిన తీర్మానాలను రద్దు చేసే అధికారం రాష్ట్ర ప్రభుత్వానికి ఉండదు. అలాగే ఆయా స్థానిక సంస్థలకు వ్యతిరేకంగా చర్యలు తీసుకునే అధికారం కూడా రాష్ట్ర ప్రభుత్వానికి ఉండదు.
- కార్యాలయ దుర్వినియోగం లేదా అవినీతి తదితర కారణాలతో పంచాయతీలకు ఎన్నికైన ప్రజాప్రతినిధులపై చర్యలు తీసుకునే అధికారం గానీ, ఆ సంస్థలను రద్దు చేసే అధికారం రాష్ట్ర ప్రభుత్వానికి ఉండదు. అలాంటి కేసులను విచారించే అధికారం స్థానిక అంబుడ్స్‌మన్‌కు ఉంటుంది. అంబుడ్స్‌మన్ అలాంటి కేసులను విచారించి తగిన సిఫారసులతో లోకాయుక్త ద్వారా రాష్ట్ర గవర్నర్‌కు పంపించాలి. ఎన్నికలకు సంబంధించిన ఫిర్యాదులను రాష్ట్ర ఎన్నికల కమిషన్ విచారణ జరిపి, తగిన సిఫారసులతో గవర్నర్‌కు నివేదిక సమర్పించాల్సి ఉంటుంది.
- ఒకవేళ రాష్ట్ర ప్రభుత్వం వివిధ కారణాలతో తక్షణం ఏదైనా పంచాయతీ లేదా ఎన్నికైన ప్రజాప్రతినిధులపై చర్యలు తీసుకోవాలని భావిస్తే.. ఈ విషయాన్ని రాష్ట్ర ప్రభుత్వం అంబుడ్స్‌మన్ దృష్టికి తీసుకువెళ్లి అర్జెంట్‌గా విచారణ జరపమని కోరవచ్చు. అలాంటి కేసులను నిర్ణీత కాల వ్యవధిలోగా అంబుడ్స్‌మన్ విచారించి లోకాయుక్త ద్వారా గవర్నర్‌కు నివేదిక సమర్పించాలి.
- ఏదైనా కేసులకు సంబంధించి స్థానిక అంబుడ్స్‌మన్ సిఫారసులను తిరస్కరించిన పక్షంలో అందుకు గల కారణాలతో సహా పూర్తి వివరాలను ప్రజల ముందు ఉంచాలి.
- కొన్ని జిల్లాలకు కలిపి స్థానిక సంస్థల అంబుడ్స్‌మన్‌ను ఏర్పాటు చేయాలి. ఏక సభ్య అంబుడ్స్‌మన్‌ను ముఖ్యమంత్రి అధ్యక్షతన శాసనసభ స్పీకర్, శాసనమండలి ఛైర్మన్, ప్రతిపక్ష నాయకునితో కూడిన కమిటీ ఎంపిక చేసి, గవర్నర్‌కు పంపించాల్సి ఉంటుంది. రాష్ట్ర ప్రభుత్వంలో పనిచేస్తున్న మంచి పేరున్న వ్యక్తుల జాబితా నుంచి అంబుడ్స్‌మన్‌ను ఎంపిక చేయాలి.
- రాష్ట్ర ఎన్నికల అధికారిని నియమించే అధికారం గవర్నర్‌కు అప్పగిస్తారు. ముఖ్యమంత్రి అధ్యక్షతన అసెంబ్లీ స్పీకర్, శాసన మండలి చైర్మన్, ప్రతిపక్ష నేత తదితరులతో కూడిన కమిటీ చేసిన సిఫారసు మేకు గవర్నర్ రాష్ట్ర ఎన్నికల అధికారిని ఎంపిక చేస్తారు.
- స్థానిక సంస్థల పనితీరును ఇక నుంచి సిటిజన్స్ రిపోర్టు కార్డు ఆధారంగా నిర్ధారిస్తారు. తప్పనిసరిగా స్థానిక సంస్థల్లో సామాజిక తనిఖీ విధానాన్ని అమలు చేస్తారు.
- పోలీసులను నియంత్రించే అధికారం స్థానిక సంస్థలకు ఇచ్చేందుకు తిరస్కరించిన కేంద్రం. భవన నిర్మాణ నిబంధనలు, జనన, మరణ అంశాలు, కుల, నివాస ధ్రువీకరణ పత్రాల జారీ, ఓటర్ గుర్తింపు కార్డుల జారీ, తూనికలు, కొలతలపై అజమాయిషీతో పాటు దేవాలయాల వ్యవహారాలను కూడా స్థానిక సంస్థలకు అప్పగించేందుకు ఆమోదం తెలిపింది.

పంచాయతీల్లో ఎటువంటి ఆదాయం లేకుండా పడి ఉన్న ఉమ్మడి ఆస్తులను గుర్తించి.. వాటి ద్వారా ఆదాయాన్ని ఆర్జించే చర్యలను చేపట్టే అధికారాలు స్థానిక సంస్థలకు అప్పగిస్తారు. పంచాయతీల్లో పన్నులు విధించే పరిధిని పెంచడంతో పాటు పంచాయతీకి స్వతహాగా అదనపు పన్ను ప్రత్యేక సర్‌చార్జీలను విధించే అధికారం ఇస్తారు. పంచాయతీల్లో పన్నులు విధించే విషయంలో రాష్ట్ర ప్రభుత్వ పరిధిని తగ్గిస్తారు. జిల్లా స్థాయి స్థానిక సంస్థలు రవాణా, నీటి సరఫరా, విద్యుత్ పంపిణీలను చేపడతాయి.

- రాష్ట్ర ప్రభుత్వం ఇక నుంచి రాష్ట్రానికి విడిగాను, జిల్లాకు విడిగాను రంగాల వారీగా బడ్జెట్ కేటాయింపులు చేయాలి. అలాగే జిల్లాల వారీగా కేటాయింపులను కూడా బడ్జెట్‌లో పొందుపరచాలి. మౌలిక సదుపాయాల అభివృద్ధి నిమిత్తం పంచాయతీలు స్వయంగా బ్యాంకులు, ఆర్థిక సంస్థల నుంచి అప్పులు తెచ్చుకునేలా ప్రోత్సహిస్తారు. రాష్ట్ర ప్రభుత్వం కేవలం అప్పులకు పరిమితిని విధిస్తుంది.

- ఇక వార్డు కమిటీలో ఆయా పరిధిలోని వీధి దీపాలు, పారిశుధ్యం, మంచినీటి సరఫరా, డ్రైనేజీ, రహదారులు, స్కూల్ భవనాలు, స్థానిక ఆసుపత్రులు, డిస్పెన్సరీలు, స్థానిక మార్కెట్లు, పార్కుల నిర్వహణ బాధ్యతలను చేపట్టాలి. వార్డు కమిటీలకు తగినంత బడ్జెట్‌ను కేటాయించాలి.

- కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఆస్తులపైన కూడా స్థానిక సంస్థలు సర్వీస్ ఛార్జీలను వసూలు చేస్తాయి. ఆస్తి పన్ను నుంచి ఎటువంటి మినహాయింపులు ఇవ్వరాదు. యూనిట్ ఏరియా విధానంలో ఆస్తి పన్నును నిర్ధారించాలి. *- టి.ఎన్.*

# పంచాయితీరాజ్ సంస్థలు 13వ ఆర్థిక సంఘం నిధులు పొందాలంటే నూతన అకౌంటింగ్ విధానం అమలు తప్పనిసరి

పంచాయితీరాజ్ సంస్థలలో పారదర్శకత, జవాబుదారీతనం పెంపొందించటానికి, ఆర్థిక వ్యవహారాలు సులువుగా నిర్వహించటానికి నూతన అకౌంటింగ్ విధానం ప్రవేశ పెట్టటం జరిగిందని భారతప్రభుత్వ పంచాయితీరాజ్ మంత్రిత్వ శాఖ సంయుక్త కార్యదర్శి డా. డి.కె జైన్ అన్నారు. నూతన అకౌంటింగ్ విధానంపై అపార్డులో ది21-11-2010 నుండి 23-11-2010వరకు ఏర్పాటు చేసిన 3 రోజుల మాస్టర్ ట్రైనర్స్ శిక్షణా కార్యక్రమాన్ని ప్రారంభించిన డా.డి.కె. జైన్ మాట్లడుతూ 13వ ఆర్థిక సంఘం నిధులను పంచాయితీరాజ్ సంస్థలు పొందాలంటే నూతన అకౌంటింగ్ విధానం తప్పనిసరిగా అమలు చేయలని అన్నారు. నూతన అకౌటింగ్ విధానాన్ని సులభతరం చేసేందుకుగాను NIC న్యూఢిల్లీ బృందం 'ప్రియాసాఫ్ట్' ప్రోగ్రామ్‌ను రూపొదించటం జరిగిందని, ఈ 3 రోజుల శిక్షణా కార్యక్రమంలో మాస్టర్ ట్రైనర్లు ఈ సాఫ్ట్‌వేర్‌ను ఉపయోగించి ఆర్థిక లావాదేవీలను ఎలా నిర్వహించాలో క్షుణ్ణంగా నేర్చుకొని తదనంతరం జిల్లా, మండల స్థాయి సిబ్బందికి శిక్షణా అందచేయలని సూచించారు. ఇ . గవర్నెన్సు ప్రాజెక్టుల అమలులో ఆంధ్రప్రదేశ్ మిగిలిన రాష్ట్రాలకు మార్గనిర్దేశిగా ఉన్నదని, ప్రియాసాఫ్ట్ ఉపయోగంలో కూడా ముందు వరసలో నిలుస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న పంచాయితీరాజ్ కమీషనరు శ్రీమతి పూనం మాల కొండయ్య మాట్లడుతూ ప్రియా సాఫ్ట్‌వేర్‌ను తొలివిడతగా అన్ని జిల్లాపరిషత్, మండల పరిషత్తులలో అమలు చేయిటం జరుగుతుందని చెప్పారు. అదే విధంగా ఇప్పటికే కంప్యూటరీకరణ పూర్తయిన గ్రామ పంచాయితీలలో కూడా 'ప్రియాసాఫ్ట్' ను ఉపయోగించటం జరుగుతుందన్నారు. మిగిలిన పంచాయితీలలో దశలవారిగా ప్రవేశపెట్టటం జరుగుతుందన్నారు. సాఫ్ట్‌వేర్ వినియోగంపై శిక్షణా కార్యక్రమలను జిల్లాలవారిగా ముఖ్య కార్యానిర్వహణాధికారులు, జిల్లా పంచాయితీ అధికారులతో చర్చించి ఏర్పాటు చేసుకోవాలని అన్నారు. అపార్డు. ఇ.టి.సి.లు కీలక భుమిక వహించనున్నాయిని శ్రీమతి పూనం మాలకొండయ్య అన్నారు. 3 రోజులపాటు NIC బృందం ఇచ్చే శిక్షణను వినియోగించుకొని, వేలాది మంది సిబ్బందికి విషయపరిజ్ఞానాన్ని, నైపుణ్యతను అందచేయివలసిన గురుతర బాధ్యత మాస్టర్ ట్రైనర్లపై ఉన్నాదని, మాస్టరు ట్రైనర్లు ఎంత బాగా నేర్చుకుంటే క్షేత్ర స్థాయి సిబ్బందికి అంత చక్కటి శిక్షణను అందచేయిగలరని ఆమె అన్నారు. శిక్షణ అనంతరం హెల్ప్‌లైన్ ద్వారా హ్యాండ్ హోల్డింగ్ సపోర్ట్‌కూడా అపార్డు అందచేయాలన్నారు. ఈ కార్యక్రమానికి సమన్వయకర్తలుగా పంచాయితీ రాజ్‌శాఖ ముఖ్యలెక్కల అధికారి శ్రీ రాజశేఖర్ అపార్డులోని సెంటర్ ఫర్ ఫైనాన్షియల్ మేనేజ్‌మెంట్ హెడ్ శ్రీ టి కృష్ణ వ్యవహరించారు. NIC సీనియర్ టెక్నికల్ డైరెక్టరు శ్రీమతి భారతి, సైంటిఫిక్ ఆఫీసర్లు శ్రీ హఫీజ్, శ్రీమతి స్వాతి, NIC ఢిల్లీ బృందసభ్యులు శ్రీమతి మానీ, గీత, గుజ్రాల్, విశాల్ మొ॥ వారు మాస్టర్ ట్రైనర్లకు శిక్షణ అందచేశారు. ఇ.టి.సి ఫ్యాకల్టీ, ప్రిన్సిపాల్స్, అపార్డు ఫ్యాకల్టీ తదితరులు ఈ శిక్షణలో పాల్గొన్నారు. *











# వచ్చే శతాబ్దపు తెలుగు కవితా రీతులు

## సినిమా సమీక్షలు

***ప్ర**ముఖుల వచన శైలికి సంబంధించిన పేరడీలలో మరో అంశం చలన చిత్ర సమీక్ష . పిచ్చిప్రేమ' అనే సాంఘిక చిత్రాన్ని చూశాక కొందరు ప్రముఖులు వారి అభిప్రాయాలను ఎలా వెలిబుచ్చుతారో ఊహించి, అనుకరించడానికి ప్రయత్నించాను. సందర్భంతో అట్టే సంబంధం లేకపోయినా వారి వారి అభిరుచులు తప్పనిసరిగా వెల్లడి అవుతుంటాయి.*

### విశ్వనాథ సత్యనారాయణీయం


**విశ్వనాథవారు ఏ విషయంలోనైనా నిర్మొహమాటంగా తన అభిప్రాయాలను వ్యక్త పరుస్తారని అందరికీ తెలుసు. 'పిచ్చిప్రేమ' సినిమా చూపించి, తమ అమూల్య అభిప్రాయం తెల్పండని అడిగితే వారి సమీక్ష ఇలా సాగుతుంది.**



"శ్రమ పలు విధములు, నా వంటివానికి ఇట్టివి జూచుటమే శ్రమ, దానిని సమీక్షించుట మరియొక శ్రమ. వారు సగౌరవముగా 'పిచ్చిప్రేమ'యను సాంఘిక జిత్రమును జూపి, అభిప్రాయము అడుగ కాదనుటెట్లు?

జూచితినిగదా, ఆద్యంతమొక్క తీరుగ నడిచినది. ఇందు నాయిక మొదట నాతనని సందేహించును. అతడు యనగా నాయకుడు. ఆమె ఖండిత. అతడేదియో బులిబుచ్చకములు జెప్పి రంజింప బ్రయత్నించును. ఆమె భీష్మించుకొనును. సన్నివేశములు జెప్పి రంజింప బ్రయత్నించును. ఆమె భీష్మించుకొనును. సన్నివేశములు క్రమముగా జూపుచు, సమయమెరిగి బాటలబాడించుచు, ఆటల నాడించుచు కథ నడిపించుట దర్శక దామోదరుని ప్రతిభయే యనవలెను. ప్రాచీన కాలమున తోలు బొమ్మలాట లుండెడివి. అచట నేపథ్యమున గాయకులు స్వయముగా బాడుచుందురు. ఇచ్చట బాడిన దానిని బద్దీపై నిక్షేపించి మరల మరల వినిపింపజేతురు.

నాయకుడు గెంతుచు ఆహా.... హా.... యని యేమో పాడును. ఆ పాట కర్ణపేయముగా నున్నది.




అతడట్లు వెర్రివానివలె ఏల గంతులు వేయునో మనకు తెలియదు. బహుశః అది నటనయై యుండునని నేను యూహించితిని. నాయిక జిత్రముగ నుండును. ఆమె యందరివలె లేదు. పాదరక్షలతోనే బడకగది ప్రవేశించును. అట్లే పరుండును. నాయకుడు అభ్యంతరము దెల్పడు. అనురాగమనిన నట్లుండు గాబోలు ననుకొంటిని. హాస్యరసమును పోషించుటకు బ్రత్యేకముగ నొకడు గలడు. అతడప్పుడప్పుడు బ్రత్యక్షమై ప్రేక్షకులను నవ్వింపయత్నించును. కథతో యతనికి కొంత సంబంధము యుండును. 'పిచ్చి ప్రేమ' యను పేరు చిత్రమునకు బాగుగా యతికినది..."


*(ఇలా సాగే విశ్వనాథ వారి సమీక్ష చిత్రవిజయానికి దోహదం చేసే అవకాశం వున్నదా?)* ☆

### సినిమా చ్ఛాస్త్రీయం

**ఇంద్రగంటి హనుమచ్ఛాస్త్రి గారు హనుమదింద్రగంటిగా కూడా ప్రసిద్ధులు. ఆయనది మాసిపోని నవ్యత, సాహితీస్రష్ట, అంతకు మించిన సాహితీ బంధువు. భావకవిత్వ తరానికి అభ్యుదయ తరానికి నడుమ ఆయన సేతువు. నవ్య సాహిత్య పరిషత్తు, దానికి సంబంధించిన వ్యక్తులు వారి అభిమాన విషయాలు. వారు శైలి ఇలా సాగుతుంది.**

'పిచ్చిప్రేమ' సినిమా చూడడం విశేషం కాదు గాని ఆ చిత్రాన్ని రాజమహేంద్రవరంలో చూడడం మాత్రం ఒక గొప్ప అనుభవమే! గోదావరీ తీరాన గడిపిన సంవత్సరాలు నా జీవనయాత్రలో విలువకట్టలేని రసవదధ్యాయాలు కావడం వల్లనేమో, అంతటి అనుభూతి పొందాను. రవ్వంత గాలివీచినా, అణువంత మబ్బు కదిలినా ఆనాటి స్మృతులన్నీ పన్నీటి జల్లులుగా మనసున కురుస్తాయి.

ఈ చిత్రంలో పాటలు విన్నాక నాకొకటి అనిపించింది. నాకు ఆత్మీయత, అనుబంధం వున్నవని చెప్పడం కాదు. అప్పట్లో నవ్యసాహిత్య పరిషత్తు, ఆ సందడి లేకపోతే ఇప్పటికీ వస్తున్న కొన్ని మంచి సినిమా పాటలు రావడానికి ఆస్కారం లేదు. ఈ చిత్రంలో వున్నది ప్రేమకథ కనుక వినియోగం, విరహం తప్పనిసరి దినుసు. ఆ పాటలు, మాటలు వింటుంటే మూడు దశాబ్దాల కాలంలో ఎంత మార్పు వచ్చిందీ - అని విస్తుపోయాను.



*'ఊరకే చలియించు ఈ రేయి వెన్నెలలు*
*విరహవీణా తరళ తరళ తంత్రీగతుల'*

ఆ పదాల కూర్పు. ఆ లయ మర్చిపోవడం ఎలా? మా బాపిబావ పాటల్లో నవ్యత వుండేది. రచన చేయడం ఒక ఎత్తు. వాటిని మధుర మధురంగా అందరివీ అందరూ పాడి పరవశింప చేయడం ఒక ఎత్తు, నేటి సినిమా పాటలలో అక్కడక్కడ నవ్యత, మెత్తని పదాల పోహళింపు కనిపిస్తుంది.

నవ్య సాహిత్యానికి. లొల్లాయి పదాలకు పోలిక తేవడం కొందరికి ఆమోదయోగ్యంగా వుండక పోవచ్చు.

*'నవ్వి పోదురుగాక నా కేటి సిగ్గు*
*నా ఇచ్చయేకాక నా కేటి వెరపు'*


మా అన్నగారి మాట మా అందరికీ మకుటమే!

*(నవ్య సాహిత్య పరిషత్తు లేకుండా కలం కదలదు. మరి అంతే!)*

☆

## మల్లంపల్లి చరిత్ర సమీక్ష


**చ**రిత్ర పరిశోధనే ఆహారంగా, నిద్రగా స్వీకరించి, చరిత్రగతులు దిద్దిన మల్లంపల్లి సోమశేఖర శర్మగారి సమీక్ష చరిత్రాత్మకంగానే వుంటుంది.




**శిలల భాషలు తెలుసు ఆయనకు. చాకిబండలనుకున్న వాటిని శాసనాలుగా చదివిన దిట్ట.**

'పిచ్చిప్రేమ' అనెడి ఛాయాచిత్రమును క్షుణ్ణముగా పరిశీలించినచో మనకనేక చారిత్రక అంశములు బయల్పడుననుట నిస్సందేహము. ఇందలి ప్రదేశములు ఇప్పటి ఆంధ్రరాష్ట్రము (అనగా పూర్వపు త్రిలింగము)లోని భాగ సరిహద్దు గ్రామ ప్రాంతములు.

చిత్రములో కథాగమనమునననుసరించి విఫల మనోరథయైన నాయిక నిర్జన ప్రదేశములో గల ఒక బావిలో దుమికి ఆత్మహత్యకు తలపడును. ఇక్కడ మనము సూక్ష్మముగా పరిశీలించ వలసియున్నది. ఆ బావిచుట్టూ ప్రాకరమువలె శిలా నిర్మితమైన 'బొడ్డు' గలదు. దాని నిర్మాణక్రమమును బట్టి చూడగా అది బౌద్ధశిల్పమును ప్రతిబింబించుచున్నది.



క్రీస్తుశకం 11వ శతాబ్దికి చెందిన గంగరాజయ్య (గంగన్న నామాంతరము) త్రవ్వించి యుండవచ్చునని కొందరు చారిత్రక పరిశోధకులు అభిప్రాయ పడుతున్నారు. అతని కుమారుడు దాహదాహ దూషణుడు. తండ్రి త్రవ్వించిన జలాశయములలో పూడికలు తీయించినట్టు ఒక తామ్ర శాసనము ద్వారా వెల్లడవుతున్నది. ప్రమోదిత నామ సంవత్సరము మాఘశుద్ధ దశమి ఆదివారం నాటికి దాని నిర్మాణము పూర్తి అయినదనియు కొండవీటిలో లభించిన దానశాననము స్పష్టపరుచుచున్నది.

గంగరాజయ్య ప్రపితామహుడైన బావికాచార్యులు వాస్తుశిల్పిగా ఆ కాలమున ప్రఖ్యాతి బడసినాడు. అతడు సింహాచలము, సత్రయాగ మొనరించినట్టు అగ్రహారముల దానమొనరించినట్లు సనదులు లభించినవి. అతడు క్రీస్తుశకం 1162 ప్రాంతములో జలనిధి కొలువున ఆస్థాన జ్యోతిష్కుడు. వెల నాటి బ్రాహ్మణుడు. ఇతనిది వసిష్ఠస గోత్రము. దీనికి సంబంధించిన పరిశోధన విపులముగ జరగ వలసి వున్నది.

*(ఇది చిత్ర సమీక్షా అంటే అంతే మరి - చరిత్ర విను. చెప్పనిది అడుగకు).*

☆

# దోమల బెడద నుండి తప్పించుకోవడం ఎలా?

**మన అజాగ్రత్త వల్ల, నిర్లక్ష్యం వల్ల ఏర్పడుతున్న అనారోగ్య వాతావరణంలో ప్రమాదకరమైన దోమలు వృద్ధి చెంది అనేక వ్యాధులు కలుగ జేస్తున్నాయి. ఒకటి నుండి ఎనిమిది రోజుల్లో గుడ్డు, లార్వా, ప్యూపా దశలను పూర్తి చేసుకుని ప్రమాదకరమైన దోమలుగా రూపాంతరం చెంది వాతావరణంలోకి బయలుదేరుతూ ఉంటాయి. వీటిలో ముఖ్యమైనవి ఎనాఫిలిస్, క్యూలెక్స్, ఎడిస్, మేన్‌సోనియా, ఆర్మిజెరిస్ రకాల దోమలు.**

మంచినీటి నిల్వ ఉన్న ప్రదేశాలు, ఓవర్‌హెడ్ ట్యాంక్‌లలోను ఎనాఫిలిస్ దోమలు వృద్ధి చెందుతాయి. ఎనాఫిలిస్ ఆడ దోమల వల్ల మలేరియా వ్యాధి వస్తుంది. మురికి నీటి కుంటలు, కాలువల్లో క్యూలెక్స్ దోమలు వృద్ధి చెందుతాయి. వీటివల్ల బోదకాలు వ్యాధి, మెదడు వాపు వ్యాధి వస్తాయి.



మంచినీటి తొట్టెలు, వృధాగా పడివున్న ఖాళీ టైర్లలో నిల్వ వున్న నీటిలో, ఎయిర్ కూలర్లలో ఎడిస్ దోమలు వృద్ధి చెందుతాయి. ఈ ఎడిస్ దోమకారణంగా డెంగ్యూ జ్వరం వస్తుంది. మెదడు వాపు వ్యాధి కూడా వస్తుంది.

మురికినీటిలోను, నీటిమొక్కల్లోను వృద్ధి చెందే మేన్‌సోనియా వల్ల బోదకాలు వ్యాధి వస్తుంది. ఆర్మిజెరిస్ దోమలు ఇంటి ఆవరణలోని పచ్చని చెట్లలో పెరుగుతాయి. పెద్దగా ఉండే ఈ దోమల కాటువల్ల దురదతో కూడిన దద్దుర్లు వస్తాయి. సాధారణంగా దోమల ఆయుష్షు పదిహేనురోజులు వరకు ఉంటుంది.

### దోమల నివారణ

మలాథియాన్, పైరిత్రమ్ మందులను స్ప్రేచేసి దోమలను నివారణ చేయవచ్చు. నీటిలో దోమ లార్వా దశలో వున్నప్పుడే అరికట్టేందుకు బేటాక్స్, అబేటా అనే క్రిమి సంహారక మందులు చల్లాలి. చెరువుల్లో గంబూచియా చేపలను పెంచితే దోమల తొలిదశలోనే వాటిని ఈ చేపలు తినేస్తాయి.

సాధారణంగా నిల్వనీటిపై దోమలు గుడ్లు పెడతాయి. ఈ నీటిపై కిరోసిన్ పోస్తే, అది నీటి పైపొరగా ఏర్పడి దోమ గుడ్లు పొదగబడకుండా చేస్తుంది. కాకపోతే ఈ నీటిపై తరచు కిరోసిన్ పోస్తూ ఉండాలి.

కిరోసిన్ కన్నా తక్కువ ఖర్చుతో ఆయిల్ బాల్స్ తయారు చేసుకోవచ్చు. 250 గ్రాముల రంపపొడిని ఒక గోనె గుడ్డలో బిగించి కట్టి దానిని మెకానిక్ షెడ్‌లో లభించే వేస్టు ఆయిల్‌లో వారం రోజులు నానబెట్టాలి. ఈ విధంగా ఆయిల్ బాల్ తయారవుతుంది. మురికి గుంతల్లో ఈ ఆయిల్ బాల్స్ వేయాలి. ఈ పద్ధతి వల్ల దోమలు బాగా అరికట్టబడతాయి.

### నైలాన్ నెట్లు కట్టాలి

సెప్టిక్ లెట్రిన్ ట్యాంకులలో దోమలు విపరీతంగా పెరుగుతాయి. దోమగుడ్డు దోమగా రూపాంతరం చెందేందుకు దాదాపు 11 రోజులు పడుతుంది. ఇలా తయారయిన దోమలు లెట్రిన్ గొట్టాల ద్వారా బయటకు వచ్చి మనల్ని బాధిస్తూ ఉంటాయి. ఈ దోమలు పెరిగిన తరువాత తిరిగి ట్యాంకులో ప్రవేశించి అక్కడ గుడ్లు పెడతాయి. ఈ ట్యాంక్‌లో నీరు కదలకుండా ఉంటుంది. అందువల్ల ఈ ప్రాంతం దోమలుగా మారేందుకు అనువైనదిగా ఉంటుంది.

ఈ ట్యాంక్‌లోని నీరు లక్షలాది దోమలు ఉత్పత్తి అయ్యేందుకు అనుకూలంగా ఉంటుంది. ఈ పరిస్థితిని అదుపు చేసేందుకు లెట్రిన్ ట్యాంక్‌ల గొట్టాల చిమ్నీలకు నైలాన్ నెట్‌లు కట్టాలి. ఈ నెట్ వల్ల ట్యాంక్‌లోని దోమలు బయటకు రాలేవు. బయట దోమలు ట్యాంక్‌లోకి వెళ్లలేవు. ట్యాంక్‌లో తయారయిన దోమలు 15 రోజుల్లో అక్కడే మరణిస్తాయి.

### వైరస్‌తో అదుపు

ప్రాణాంతకమైన వ్యాధిని వ్యాపింపజేసే శక్తిగల ఒక రకం దోమలను కొన్ని జన్యుపరమైన మార్పుల కారణంగా, హానిరహితం చేయవచ్చునంటున్నారు అమెరికన్ శాస్త్రవేత్తలు.

చిన్న పిల్లల్లో మెదడు వాపు వ్యాధిని కలుగజేసే 'లాక్రాస్ వైరస్' మీద ఈ శాస్త్రవేత్తలు పరిశోధనలు చేస్తున్నారు. ఈ వైరస్ దోమకణాల్లో అభివృద్ధి చెందుతూ ఉంటుంది.ఈ అభివృద్ధిని నిరోధించేందుకు 'సిండ్బిస్ వైరస్'ను ఎంచుకున్నారు. ఈ వైరస్ పలురకాల కీటకాలను హానిరహితంగా చేయగల్గుతోంది.

ఈ విషయం గుర్తించిన శాస్త్రవేత్తలు సిండ్బిస్ వైరస్ ఉన్న రక్తం నమూనాల మీద 'ఎడిస్ ట్రైసెరియాటిస్' ఆడదోమలను వదిలారు.

రక్తం మీద చేరిన ఎడిస్ ఆడదోమలు ఆ రక్తాన్ని పీల్చుకున్నాయి. ఆ దోమల శరీరంలోకి చేరిన ఈ వైరస్ యాంటీసెక్స్ ఆర్ఎన్ఏను విపరీతంగా ఉత్పత్తి చేశాయి. ఆ తరువాత ఈ దోమలలోకి మెదడు వాపు వ్యాధి కలుగజేసే లాక్రాస్ వైరస్‌ను ఎక్కించినప్పటికీ ఆ దోమల వల్ల ఆ వ్యాధి వ్యాపించలేదు.

### మలేరియా నిర్మూలనకు

జన్యుపరంగా రూపొందించిన దోమలను మనుషులపై ప్రయోగించి వారి రోగ నిరోధక శక్తి పెంపొందించాలని బ్రిటిష్ శాస్త్రవేత్తలు ఒక వినూత్న ప్రయోగాన్ని చేపట్టారు. ఈ ప్రత్యేక దోమలు వీరి దృష్టిలో మలేరియాను నిరోధించే ఎగిరే సిరంజ్‌లు.

దోమను సిరంజ్‌గాఉపయోగించడం వీరు చేస్తున్న ప్రయోగం. తొలుత మలేరియా వ్యాధి నిరోధానికి తమ ప్రయత్నంగా శ్రీకారం చుట్టారు. పోలియో వ్యాక్సిన్ తరహాలో ఇతర వ్యాధులకు కూడా నివారణ పద్ధతులు కనిపెట్టాలని వీరి ప్రయత్నం.

వీరు రూపొందించిన దోమ మలేరియాను నిరోధించే వ్యాక్సిన్‌కు ఉపయోగపడే ప్రొటీన్‌ను మనుషుల్లోకి పంపుతుంది. ఒక ఎలుకపై ఈ విధంగా చేసిన ప్రయోగం సత్ఫలితాన్నిచ్చిందని శాస్త్రవేత్తలు ప్రకటించారు.

*- సి.వి.సర్వేశ్వర శర్మ*

## బోధన ప్రణాళిక (Fixed Point Chart)

# గ్రామ వికాసం - దూర విద్యా బోధన

**మన టి.వి. (సాప్ నెట్) ఛానెల్ - 3**

**02-12-2010 నుండి 30-12-2010**

| తేదీ/లో | అభ్యర్థులు | ప్రసార సమయం | కార్యక్రమం |
|---|---|---|---|
| 02-12-2010<br>09-12-2010<br>16-12-2010<br>23-12-2010 | గ్రామ పంచాయితీ వార్డు మెంబర్లు | ఉ.11.00 - ఉ.11.20<br>ఉ.11.20 - ఉ.11.40<br>ఉ.11.40 - మ.12.00<br>మ.12.00 - మ.12.20<br>మ.12.20 - మ.12.40<br>మ.12.40 - మ.1.00<br>మ.1.00 - మ.1.20<br>మ.2.00 - సా.4.40 | గ్రామీణ నీటి సరఫరా శాఖ నుండి బదలాయించబడిన అధికారాలు<br>మండల కార్యాలయంలో అభ్యర్థులతో నిపుణుల చర్చ<br>పిల్లలలో వైకల్య నివారణ<br>మండల కార్యాలయంలో అభ్యర్థులతో నిపుణుల చర్చ<br>వరదల యాజమాన్యం<br>మండల కార్యాలయంలో అభ్యర్థులతో నిపుణుల చర్చ<br>మహిళా శిశు సంక్షేమ శాఖ ద్వారా అమలయ్యే పథకాలు-సేవలు<br>లైవ్ ఇంటరాక్షన్- మన TV స్టూడియోలోని నిపుణులతో, మండల కార్యాలయంలో హాజరైన అభ్యర్థుల సంభాషణ |
| 30.12.2010 | గ్రామ పంచాయితీ అధ్యక్షులు | ఉ.11.00 - ఉ.11.20<br>ఉ.11.20 - ఉ.11.40<br>ఉ.11.40 - మ.12.00<br>మ.12.00 - మ.12.20<br>మ.12.20 - మ.12.40<br>మ.12.40 - మ.1.00<br>మ.1.00 - మ.1.20<br>మ.1.20 - మ.1.40<br>మ.2.00 - సా.4.40 | రాష్ట్ర గిరిజన విధానం<br>మండల కార్యాలయంలో అభ్యర్థులతో నిపుణుల చర్చ<br>ప్రాథమిక విద్య, ఆరోగ్య శాఖల ద్వారా బదలాయించబడిన అధికారాలు<br>మండల కార్యాలయంలో అభ్యర్థులతో నిపుణుల చర్చ<br>ప్రకృతి వైపరీత్యాల సమయంలో నీరు, పారిశుద్ధ్యం, సహాయ పునరావాస కేంద్రాల నిర్వహణ<br>మండల కార్యాలయంలో అభ్యర్థులతో నిపుణుల చర్చ<br>ఇ.జి.ఎం.ఎం. ద్వారా యస్/యస్.టిల కొరకు లభ్యమయ్యే ఉపాధి అవకాశాలు<br>మండల కార్యాలయంలో అభ్యర్థులతో నిపుణుల చర్చ<br>లైవ్ ఇంటరాక్షన్- మన టివి స్టూడియోలోని నిపుణులతో, మండల కార్యాలయంలో హాజరైన అభ్యర్థుల సందేహాల నివృత్తి. |

# తోడు

**- ఓల్గా**

**ఆ ఫ్లాట్ మీదుగా నడుస్తుంటే గంగాధరానికి వయొలిన్ ధ్వని వినిపించింది. అతడు ఆశ్చర్యపోయాడు. ఈ ఇంట్లో వయొలిన్ వాయించేవారు ఎవరు? తలుపు తడితే నవ్వుతూ విజయలక్ష్మి కనిపించింది. వయొలిన్ వాయిస్తున్నది తనే. ఆ వేళే బజారుకు వెళ్లి, దానిని కొనుక్కొచ్చి, చిన్నప్పుడెప్పుడో నేర్చుకొన్న సంగీతాన్ని సాధన చేస్తోంది. గాడి తప్పిన స్వరాల ను గాడిన పడేసే ప్రయత్నం చేస్తోంది.**

**గంగాధరానికి ఇది ఇంకా ఆశ్చర్యం. ఎందుకంటే ఇటీవలే ఆమె భర్త చనిపోయాడు. ఎక్కడెక్కడో స్థిరపడిన పిల్లలు వచ్చి, కర్మంతరాలు చేసి, ఆమెను తమ వెంట తీసుకెళదామంటే ఆమె రానని మొరాయించేసరికి వెళ్లిపోయారు. ఇలాంటి టైములో పిల్లల దగ్గర ఉండటమే ఎవరైనా చేయగలిగేది. ఈమె మాత్రం ఇంట్లో ఉండి హాయిగా సంగీతం నేర్చుకుంటోంది. ఒంటరి బతుకు, దిగులుగా బతుకుతుందేమో అనుకుంటే ఆ ఛాయలేమీ లేకుండా కనిపిస్తోంది.**

కాని, గంగాధరాన్ని చూస్తే మాత్రం ఎవరైనా సరే ఇతడో ఒంటరి మనిషి అనుకుంటారు. అతడి భార్య కూడా కొద్దికాలం క్రితమే క్యాన్సర్‌తో మరణించింది.

భార్య పోతే తప్ప తెలియలేదు గంగాధరానికి తనెంతగా ఆమె మీద ఆధారపడి ఇన్నాళ్లూ బతికాడో. మంచి తిండి లేదు. అమర్చి పెట్టే బట్టలు లేవు. శుభ్రమైన ఇంటి వాతావరణం లేదు. అంతా చిందరవందర. కచడా పచడా. అన్నింటికి మించి మాట్లాడే తోడు లేదు.

గంగాధరం, విజయలక్ష్మిలది పక్కపక్కగా ఉండే ఒకే రకం ఫ్లాట్లు. ఇంట్లో సంభవించింది ఒకే రకం విషాదాలు. కాని, ఇరువురి వైఖరిలోనూ ఎంత తేడా!

అదేమాట అన్నాడు ఆమెతో. ఆమె నవ్వింది. భర్త పట్ల ప్రేమ ఉండటం, గౌరవం ఉండటం, అతడు పోతే దుఃఖపడటం... ఎంత వాస్తవమో భర్త పోయాక స్త్రీకి ఆర్థిక ఇబ్బందులు లేకపోతే గనుక ఆమె కొద్దో గొప్పో రిలాక్స్ కావడం అంతే వాస్తవం. ఇన్నాళ్లూ భర్త అల వాట్లను గమనిస్తూ భర్త ఆలోచనలను మన్నిస్తూ భర్తే తానై తానే భర్తై బతికింది. ఆమె ఇప్పుడు భర్త పోయాక కనీసం కొత్త స్నేహితులతో మాట్లాడుతోంది. పాత అలవాట్లను నెమరు వేసుకుంటోంది. తీరిగ్గా పుస్తకాలు చదువుకోగలుగుతోంది. ఇక వంట పని, ఇంటి పని అంటారా? భర్త పోయాక భార్యకు ఆ చాకిరి తగ్గుతుందే తప్ప కొత్త భారం ఏముంది గనుక?

కాని గంగాధరం విషయం అలా లేదు. భార్య చనిపోవడంతో ఆమె చేయవలసిన చాకిరీ అంతా అతడి నెత్తిన పడింది. ఆ చాకిరీ అతడికి చేతగాక ఇల్లు అరణ్యంలా తయారైంది. సాయంత్రమైతే చాలు అతడు ఆ ఇంట్లో ఉండలేక, ఒంటరితనం భరించలేక నరకం అనుభవిస్తున్నాడు. అలాంటి నరకంలో ప్రస్తుతం విజయలక్ష్మితో స్నేహమే ఊరట.

సంవత్సరం గడిచింది. ఇరుగూ పొరుగునే ఉంటున్నారు గనుక ఇద్దరి మధ్యనా స్నేహం పెరిగింది. అభిమానం పెరిగింది. ఆమెతో అతడు దాదాపు ప్రేమలో పడ్డాడు.

ఒకరోజు ధైర్యం చేసి ఆమెను పెళ్లి చేసుకోమని అడిగాడు. ఆమె ఆశ్చర్యపోయింది. నవ్వింది. పడీ పడీ నవ్వింది. ఆఖరున నేను మిమ్మల్ని ఎందుకు పెళ్లి చేసుకోవాలి అని అడిగింది. తోడు కోసం అన్నాడు.

తోడంటే? అతడి ఉద్దేశ్యం ఏమిటి? ఆమెకు ఆ ఉద్దేశ్యం తెలుసు. మగవాడికి ఆడతోడు అంటే బట్టలు ఉతకడం, ఇల్లు ఊడ్చడం, అంట్లు తోమడం, వండి పెట్టడం... ఇవన్నీ చేసి పెట్టడమే తోడు. ఇన్నాళ్లూ అవి చేసి చేసి విసిగిపోయి భర్త పోవడంతో ఆ పనుల నుంచి బయట పడింది. ఇప్పుడు 'తోడు' అనే అందమైన ముసుగులో మళ్లీ ఆ రాద్ధాంతంలోకి పోదలుచుకోలేదు. ఆ మాటే అతడికి స్పష్టంగా చెప్పింది.

గంగాధరం ఆలోచించాడు. చాలా ఆలోచించాడు. అమితంగా ఆలోచించాడు. స్త్రీ గౌరవించే, స్త్రీ కోరుకునే, స్త్రీ అభిమానించే మగతోడు ఎలా ఉండాలి? అతడికి సమాధానం తెలిసింది. మరుసటి రోజు అతడి పనులు అతడే చేసుకోవడం మొదలుపెట్టాడు. కిందామీదా పడి, స్టూలెక్కి బూజు దులిపి, నిచ్చెన ఎక్కి అటక సర్ది, పనిమనిషిని నానా హైరానా పెట్టి ఇల్లు సర్దుకున్నాడు. బట్టలు సర్దుకున్నాడు. అంతెందుకు? వేలు కాల్చుకోకుండానే వంట నేర్చుకుని ఆమెను ఒకరోజు భోజనానికి ఆహ్వానించాడు.


ఆమె వచ్చింది. అతడి చేతి వంట తినింది. అతడిలోని మార్పు గమనించింది.

'తోడు' అంటే ఉత్త మాటల అర్థం కాదు. తోడు అంటే బాధ్యతలో సగం, బరువులో సగం, బంధంలో సగం. సంతోషంలో సగం. కన్నీటిలో సగం. ఇది గ్రహించిన మగవాణ్ణి ఏ ఆడది వదులుకుంటుంది గనుక.

విజయలక్ష్మి-యాభై ఏళ్ళు పైబడిన విజయలక్ష్మి - భర్తపోయి ఒంటరిగా ఉన్న విజయలక్ష్మి - గంగాధరాన్ని - అలాంటి పరిస్థితుల్లోనే ఉన్న గంగాధరాన్ని - మారిన మంచి మగాడు గంగాధరాన్ని మరు నిమిషంలో ప్రేమించింది. అతడి ప్రేమను అంగీకరిస్తూ అతడి చేతి మీద ముద్దు పెట్టింది. కథ మనోహరంగా ముగిసింది.

*(1993లో రాసిన కథ)*

☆






# జాతీయస్థాయిలో ఉత్తమ గ్రామం గంగదేవిపల్లి

**శ్రీ హృశీకేశ్‌పాండా, ఐ.ఎ.ఎస్. భారత ప్రభుత్వ పంచాయతీరాజ్ మంత్రిత్వశాఖ అదనపు కార్యదర్శి వరంగల్ జిల్లాలోని గంగాదేవిపల్లె గ్రామాన్ని ఇటీవల సందర్శించారు. ఈ సందర్భంగా, 04.09.2010 మధ్యాహ్నం 3.00గంటలకు జరిపిన ప్రత్యేక గ్రామసభకు శ్రీ కూసం రాజమౌళి, గంగదేవిపల్లి గ్రామ సర్పంచ్ అధ్యక్షతన వహించగా, శ్రీయుత హృశీకేశ్ పాండా విశిష్ఠ అతిథిగా వేదికనలంకరించారు.**

**గత గ్రామ సభ తీర్మానాలు, వాటి అమలు గురించి గ్రామసభలో సర్పంచ్ చదివి వినిపించగా, అమలు చేయబడిన తీర్మానాలను ప్రజలు ఆమోదిస్తూ, అమలు కావలసిన అంశాలను తిరిగి అమలు చేయటానికి సర్పంచ్‌కి పూర్తి అధికారాన్ని ఇస్తూ తమ ఆమోదాన్ని తెలియజేశారు.**

తరువాత గ్రామపంచాయతీ 2006-07, 2007-08, 2008-09, 2009-1, 2010-11 (ఆగష్టు వరకు) ఆదాయ వ్యయాల వివరాలను పద్దుల వారీగా సమావేశంలో చదివి వినిపించి గతంలో ఆమోదించబడిన 2006-07, 2007-08, 2008-09 సంవత్సరాలకు సంబంధించిన ఆదాయ, వ్యయాలకు అదనంగా 2009-10, 2010-11(ఆగష్టు 2010 వరకు) సంవత్సరాల ఆదాయ వ్యయాలు ఆమోదానికై గ్రామసభలో చర్చనీయాంశంగా ప్రవేశపెట్టగా, హాజరైన గ్రామ ప్రజలు అట్టి ఆదాయ, వ్యయాలను ఏకగ్రీవంగా ఆమోదించారు.



గంగదేవిపల్లి గ్రామ పంచాయితీ 2009-10 సంవత్సరపు ఆడిట్ పూర్తి చేసిందని, ఇట్టి సంవత్సరానికి సంబంధించిన ఆడిట్ నివేదిక ఇంకనూ పంపలేదని, అట్టి ఆడిట్ నివేదిక పంపిన తరువాత ఆడిట్ అభ్యంతరాలు ఏవైనా లేవనెత్తితే అట్టి ఆడిట్ అభ్యంతరాలకు సమాధానాలు పంపటానికి గ్రామ పంచాయితీ సర్పంచ్‌కి పూర్తి అధికారాలు ఇస్తూ హాజరైన గ్రామ ప్రజలు ఏకగ్రీవంగా తీర్మానించి తమ ఆమోదాన్ని తెలియజేశారు. తదుపరి గ్రామ పంచాయతీ భవిష్యత్ ప్రణాళిక గురించి ఈ దిగువ పేర్కొనబడిన విధంగా తీర్మానించారు.

గ్రామ పంచాయితీ ద్వారా చేపట్టిన వివిధ అభివృద్ధి కార్యక్రమాల పట్ల సంతృప్తిని వ్యక్తం చేస్తూ, గూగుల్ సంస్థ గ్రామ పంచాయతీ పురస్కార్ క్రింద 5 లక్షల రూపాయలు ఇచ్చిందని, అట్టి నిధుల నుండి (5) అంతర్గత సిమెంట్ రోడ్లను తీసుకోటానికి సర్పంచ్ ప్రతిపాదించగా, హాజరైన గ్రామ ప్రజలు దానికి ఏకగ్రీవంగా తమ ఆమోదాన్ని తెలియజేశారు.

గతంలో ఉమ్మడి కుటుంబాలుగా ఉన్న కాలంలో అట్టి కుటుంబ యజమానులు గులాబి కార్డులు (పింక్ కార్డులు) పొందడం జరిగిందని, కాలక్రమేణా కుటుంబ సంఖ్య, పెండ్లి వగైరాల కారణంగా విడిపోయిన సందర్భంలో వారి కుటుంబాల ఆదాయం తగ్గినప్పటికీ వారు తెల్లకార్డులు పొందటానికి అర్హులైనప్పటికీ గులాబీ కార్డులున్నవారిగా పరిగణించటం వల్ల దారిద్ర్యరేఖకు దిగువన ఉన్న కుటుంబాలకు సంబంధించిన వారు వివిధ ప్రభుత్వ పథకాల క్రింద ఇవ్వబడే రాయితీలు పొందలేక ఇబ్బందులకు గురవుతున్నారని, ఆ విధంగా గ్రామ పంచాయతీ పరిధిలో ఉన్న 30 కుటుంబాల యజమానులకు తెల్లకార్డులు జారీచేయటానికి సంబంధిత అధికారుల ను కోరటానికి సర్పంచ్ తీర్మానాన్ని ప్రవేశపెట్టగా, హాజరైన గ్రామ ప్రజలు ఆ విషయాన్ని పరిశీలించి, తీర్మానాన్ని ఏకగ్రీవంగా ఆమోదిస్తూ తీర్మానించారు.

గ్రామ పంచాయతీ పరిధిలో వివిధ రకాల పింఛనులకు అర్హత కలిగి ఉన్నప్పటికీ, ఇంకా అట్టి పెన్షన్లు మంజూరీ చేయబడని ఆరుగురు వృద్ధులకు వృద్ధాప్య పెన్షన్లు, 16 మంది వికలాంగులకు వికలాంగుల పెన్షన్లు, ఇద్దరు వితంతువులకు వితంతు పెన్షన్లు మంజూరు చేయటానికి సంబంధిత అధికారులను కోరటానికి సర్పంచ్ ప్రతిపాదిస్తూ, పేర్లను గ్రామ సభలో చర్చించి ఆమోదించాల్సిందిగా కోరగా ఆ ప్రతిపాదనలను ఏకగ్రీవంగా ఆమోదిస్తూ తీర్మానించారు.

గతంలో ప్రభుత్వ, ప్రైవేట్ సంస్థల ఆర్థిక సహకారంతో జిల్లా రాష్ట్ర, దేశ స్థాయిలో ఆదర్శ గ్రామంగా గుర్తించి, ఇచ్చిన నగదు పురస్కారాలతో గ్రామంలో వివిధ అభివృద్ధి కార్యక్రమాలు జయప్రదంగా నిర్వహించి ప్రజల అవసరాలను కొంతమేరకు తీర్చడం జరిగినప్పటికీ, గ్రామంలోని కొన్ని ప్రాంతాలలో ఇంకనూ (20) సి.సి. రోడ్లను (27) సైడ్ డ్రైన్‌లను నిర్మించాల్సి ఉందని, దానికి అదనపు నిధులను సమకూర్చాల్సిందిగా సంబంధిత అధికారులను కోరటానికి సర్పంచ్ ప్రతిపాదించగా, ఆ విషయాన్ని సమగ్రంగా పరిశీలించి హాజరైన ప్రజలందరూ ఏకగ్రీవంగా తమ ఆమోదాన్ని తెలియజేస్తూ తీర్మానించారు.

మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం క్రింద గ్రామ పంచాయతీ పరిధిలోని ప్రగతి కుంట (పందుల కుంట)ను ఊట చెరువుగా మార్చటానికి, 3 అనువైన ప్రదేశాలలో చెక్ డ్యాంల నిర్మాణం చేయటానికి నిధులు మంజూరు చేయవలసిందిగా సంబంధిత అధికారులను కోరటం, తద్వారా భూగర్భ జల సంపదను పెంపొందించుకునే అవకాశాన్ని వినియోగించుకోటానికి సర్పంచ్ ప్రతిపాదించగా, హాజరైన గ్రామ ప్రజలు పరిశీలించి ఏకగ్రీవంగా ఆమోదిస్తూ తీర్మానించారు.

గ్రామ పంచాయతీ పరిధిలో ఆంధ్రాబ్యాంక్ ఆర్థిక సహాయంతో నిర్మించుకొన్న పశువైద్యశాలలో పశు వైద్యాధికారిని (వెంటర్నరీ అసిస్టెంట్ సర్జన్) (2)వెటర్నరీ అసిస్టెంట్ (3) అటెండర్ (ఒ.ఎస్)ల పోస్టులను మంజూరీ చేయాలని సంబంధిత అధికారులను కోరటానికి సర్పంచ్ ప్రతిపాదించగా, అట్టి విషయాన్ని చర్చించి హాజరైన గ్రామ ప్రజలు ఏకగ్రీవంగా ఆమోదిస్తూ తీర్మానించారు.

గంగదేవిపల్లి పరిసర గ్రామాలు, నివాస ప్రాంతాలు (తండాలు) కలుపుకొని 6000 పైన జనాభా కలిగి ఉన్న కారణంగా, ప్రస్తుత సబ్ సెంటర్ (ఊకల్) గ్రామ పంచాయతీకి దూరంగా ఉన్నందున గ్రామ పంచాయతీ సబ్ సెంటర్‌కు కావలసిన స్థలం ఇవ్వటానికి సిద్ధంగా ఉన్నందున గంగదేవిపల్లి గ్రామంలో హెల్త్ సబ్ సెంటర్, ఎ.ఎన్.యం. క్వార్టర్ మంజూరీ చేయటానికి సంబంధిత అధికారులను కోరటానికి సర్పంచ్ ప్రతిపాదించగా, ఆ ప్రతిపాదనకు హాజరైన గ్రామ ప్రజలు ఏకగ్రీవంగా ఆమోదిస్తూ తీర్మానించారు.

గంగదేవిపల్లిలోని అప్‌గ్రేడెడ్ హైస్కూలును హైస్కూల్‌గా మంజూరు చేసి తగినంత సిబ్బందిని ఏర్పాటు చేయటానికి, ఇంగ్లీష్ మీడియం పాఠశాలకు తగినంత సిబ్బందిని ఏర్పాటు చేయటానికి, సంబంధిత అధికారులను కోరటానికి సర్పంచ్ ప్రతిపాదించగా హాజరైన గ్రామ ప్రజలు అట్టి విషయాలను పరిశీలించి ఆమోదిస్తూ ఏకగ్రీవంగా తీర్మానించారు.

గ్రామ పంచాయతీ ప్రస్తుతం కంట్రాక్టు పద్ధతిపై ప్రతి సంవత్సరం త్రాగునీరు, గ్రామ పంచాయతీ పనులకు ఒకరిని, పారిశుద్ధ్య పనులకు ఒకరిని నియమించటం జరిగిందని, అట్టి వారిని శాశ్వత ప్రాతిపదికపై నియమించుకోటానికి, కనీస వేతనాలు చెల్లించటానికి ప్రభుత్వ గ్రాంటును ఇవ్వవలసిందిగా సంబంధిత అధికారులను కోరటానికి సర్పంచ్ ప్రతిపాదించగా హాజరైన గ్రామప్రజలు తమ ఆమోదాన్ని ఏకగ్రీవంగా తెలియజేశారు.

## అధ్యక్షుని అనుమతితో ఇతర అంశాలు

గంగదేవిపల్లి గ్రామం ఆదర్శ గ్రామంగా గుర్తింపు పొందినందున ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గ్రామీణాభివృద్ధి (అపార్డు) వారు గ్రామీణాభివృద్ధి శిక్షణా సంస్థ సెంటర్‌ను ఏర్పాటు చేయటానికి నిర్ణయించారు. అందుకు 50 లక్షల రూపాయలు మంజూరు చేశారని, అందులో భాగంగా శిక్షణా సంస్థ సెంటర్‌కు కావలసిన వసతి (హాస్టల్) సదుపాయం, భోజనహాలు నిర్మాణాలు చేయటానికి కావలసిన స్థలాన్ని ఎరుకల రాజమల్లు దగ్గర కొనుగోలు చేసిన స్థలం (పోచమ్మగుడి ముందు స్థలం) ఇవ్వటానికి అంగీకరించడం జరిగిందని, అపార్డు వారు కోరిన విధంగా అప్పగించినట్లు రిజిస్ట్రేషన్ గాని, అవసరమైన డాక్యుమెంట్లు గాని మంచినీటి కమిటీ, గ్రామ పంచాయితీ వ్రాయించి ఇవ్వాలని అట్టి స్థలంలో అపార్డు వారు తగిన నిర్మాణాలు చేపట్టేందుకు చర్యలు తీసుకోవాలని కోరుతూ సర్పంచ్ ప్రతిపాదించగా, గంగదేవి పల్లెలో గ్రామీణాభివృద్ధి సంస్థను మంజూరు చేసిన 'అపార్డ్' కమీషనర్ డాక్టర్ ఫణికుమార్, ఐ.ఎ.ఎస్. కు తమ ప్రత్యేక హృదయ పూర్వక ధన్యవాదాలు తెలియజేస్తూ సర్పంచ్ ప్రతిపాదనను ఆమోదిస్తూ ఏకగ్రీవంగా తీర్మానించారు.

తరువాత శ్రీ హృషీకేశ్‌పాండా, ఐ.ఎ.ఎస్ గ్రామ సభనుద్దేశించి మాట్లాడుతూ, గ్రామసభను పారదర్శకంగా, ప్రజాస్వామ్యబద్ధంగా నిర్వహించడం, వర్షం కురుస్తున్నప్పటికీ, గ్రామ ప్రజలు అత్యుత్సాహంతో అధిక సంఖ్యలో హాజరు కావడం తమకెంతో ఆనందంగా ఉందని చెప్పారు.

వారు మాట్లాడుతూ స్వాతంత్ర్యనంతరం దేశంలో పంచాయితీ రాజ్ వ్యవస్థ ఆవిర్భవించి 50 సంవత్సరాలు పూర్తి చేసుకొన్న సందర్భంగా రాజ్యాంగబద్ధంగా పంచాయతీరాజ్ సంస్థలకు అధికారాలు కల్పించడం జరిగిందని అందులో భాగంగా గ్రామ పంచాయితీ స్థాయిలో గ్రామసభకు వున్న విశిష్టస్థానాన్ని గుర్తించి గ్రామ సభను నిర్మాణాత్మక వేదికగా మలచటానికి కేంద్ర ప్రభుత్వం 2009-10వ సంవత్సరాన్ని 'గ్రామ సభ' ల సంవత్సరంగా ప్రకటించిందని మన ప్రధానమంత్రి డాక్టర్ మన్మోహన్‌సింగ్ ప్రజాస్వామ్య వ్యవస్థలో గ్రామ సభ అనేది ప్రజలు ప్రత్యక్షంగా పరిపాలనలో పాలుపంచుకోవాటానికి ఉద్దేశించిన నివేదిక అని, గ్రామంలోని ప్రజలందరూ (ఓటర్లందరు) గ్రామ సభలో పాల్గొని గ్రామ ప్రజల సమస్యల గురించి గ్రామ పంచాయతీ పక్షాన ప్రవేశ పెట్టబడిన ప్రతిపాదనల గురించి చర్చించి ఆమోదించడానికి లేదా విజయవంతం అయిన రోజే పూజ్య బాపూజీ (గాంధీజీ) కలలు కన్న

'గ్రామస్వరాజ్యం' వస్తుందని తెలియజేశారని ఆ కారణంగా ప్రజలను చైతన్యవంతులుగా చేసి తద్వారా గ్రామ సభలను బలోపేతం చేయటానికి 2009 అక్టోబర్ 2 నుండి 2010 అక్టోబర్ 2 వరకు వివిధ స్థాయిలో గ్రామ సభలపై అవగాహన కలుగజేయవలసిందిగా, కేంద్ర ప్రభుత్వం అన్ని రాష్ట్రాలను కోరిందని తెలియజేశారు.

ఇందుకు స్పందిస్తూ శ్రీ రామారావు, డిప్యూటీ కమీషనర్, పంచాయతీ రాజ్ శాఖ సహకారంతో అపార్డ్ వారు రాష్ట్రం తరపున గ్రామ సభలను ఏ విధంగా నిర్వహించాలి, ఏ ఏ అంశాలు చర్చించాలి అనే విషయాల గురించి పూర్తి సమాచారాన్ని తెలియజేస్తూ 'గ్రామ సభ నిర్వచనం- నిర్వహణ' అనే పుస్తకాన్ని ముద్రించి రాష్ట్రంలోని అన్ని గ్రామ పంచాయితీలకు పంపించటం జరిగిందని, అదేవిధంగా కళాజత బృందాల ద్వారా సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించి గ్రామ సభల నిర్వహణపై ప్రజలకు అవగాహన కల్పించడం జరిగిందని తెలియజేశారు.

తదుపరి డాక్టర్ హృషీకేశ్ పాండా, ఐ.ఎ.ఎస్. గ్రామంలోని ప్రజల ఐక్యత, స్వావలంబన, గ్రామాభివృద్ధి పట్ల అంకితభావం, గ్రామ పంచాయితీ నిబద్ధత పట్ల తన హర్షాన్ని ప్రకటిస్తూ కుటుంబ విభజన కారణంగా తక్కువ ఆదాయం పొందేవారు బి.పి.యల్. కుటుంబాలుగా గుర్తింపు పొందటానికి ప్రయత్నించటానికి బదులుగా పంటల మార్పిడి వంటి ఆధునిక సాంకేతిక వ్యవసాయ పద్ధతులు పాటించడం, పాడిపరిశ్రమ వంటి వ్యవసాయానుబంధ కార్యక్రమాలను చేపట్టడం జరగాలని, అదేవిధంగా గ్రామంలోని అన్ని కుటుంబాలు పాడి పరిశ్రమను చేపట్టాలని సూచించారు.

దీని గురించి గ్రామ ప్రజలలో చైతన్యం కల్గించాలని, సహకార సంఘం ద్వారా గాని, మాక్స్ సొసైటీ ద్వారా గాని అట్టి బి.పి.యల్. కుటుంబాలను సమీకరించి బి.ఆర్.జి.యఫ్ పథకం క్రిందగాని, డి.ఆర్.డి. నుండి గాని నిధులు సమకూర్చుకోవాలని, అవసరమైతే కేంద్ర ప్రభుత్వం నుండి దీనికి కావలసిన ప్రత్యేక నిధుల మంజూరు విషయమై పరిశీలించగలనని తెలియజేశారు. అదేవిధంగా దేశంలోనే ఆదర్శ గ్రామంగా గుర్తింపబడిన గంగదేవిపల్లి గ్రామంలో బి.పి.యల్. కుటుంబాలు ఉండరాదని వారి అభిప్రాయన్ని తెలియజేశారు.

ఈ సందర్భంగా వారు గ్రామపంచాయతీ పరిధికి సంబంధించిన ఎ.యన్.యం. ను, హెల్త్ సూపర్‌వైజర్‌ను పిలిచి గ్రామ ప్రజలకు ఏ ఏ వ్యాధులు వస్తున్నదీ, ఏ రకమైన మందులు ఇస్తున్నదీ, మలేరియా జ్వర బాధితులకు ఎన్ని టాబ్లెట్లు, ఏ ఏ డోసేజిలలో ఎన్ని రోజులు ఇస్తున్నదీ మొదలైన విషయాల గురించి ప్రశ్నించి సమాధానాలు తెలుసుకొన్నారు.


తరువాత వారు బి.ఆర్.జి.యఫ్. నిధులతో చేపట్టిన పనుల వివరాలను గురించి, బడిఈడు పిల్లలు బడికి పోతున్నదీ లేనిదీ అన్న విషయం, గ్రామ పంచాయతీ నిధుల ద్వారా చేపట్టబడిన పనులు, వాటి ఎంపిక విధానం గురించి ప్రశ్నించి సమాధానాలు తెలుసుకోవడం జరిగింది.

అనంతరం వారు ఈ గ్రామానికి అన్ని ప్రభుత్వ శాఖల అధికారులను పిలిపించి గ్రామంలో గలభౌతిక మానవ వనరులకు అనుగుణంగా ఆచరణ యోగ్యమైన ప్రణాళికను రూపొందించి ముఖ్యంగా వ్యవసాయరంగానికి గ్రామీణ అనుబంధ పరిశ్రమలు, వ్యవసాయాధారోత్పత్తులకు సంబంధించిన పరిశ్రమల స్థాపనకు తగిన సూచనలు, సలహాలు ఇప్పించాలని జిల్లా పంచాయతీ అధికారి గారిని ఆదేశించారు.

## వందన సమర్పణతో గ్రామ సభ సమాప్తమైనది.

ఈ కార్యక్రమానికి శ్రీ రామారావు, డిప్యూటీ కమీషనర్, పంచాయతీ రాజ్ రూరల్ ఎంప్లాయ్‌మెంట్; శ్రీ జానిమియా, డి.పి.ఓ. వరంగల్; బి.ఆర్.జి.ఎఫ్. కన్సల్టెంట్ మరియు రిటైర్డ్ ఐ.ఎ.ఎస్. అధికారి శ్రీ రామకృష్ణ; శ్రీ బి.భీమానాయక్, ముఖ్య కార్యనిర్వహణాధికారి, జిల్లా ప్రజాపరిషత్, వరంగల్; శ్రీమతి పారిజాతం మండల పరిషత్ అభివృద్ధి అధికారి, గీసుగొండ; శ్రీ ఆర్. పుల్లారావు, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ పర్కాల; శ్రీ జి. మహిపాల్ రెడ్డి, అసిస్టెంట్ ఇంజనీర్ ఆర్.డబ్ల్యు. ఎస్. గీసుగొండ; శ్రీ కె.యజ్ఞనారాయణ, సీనియర్ డి.ఆర్.పి.; శ్రీ వి. కర్ణాకర్, డి.ఆర్.పి; శ్రీ లక్ష్మి నర్సింహరావు, ఇ.ఓ. (పి.ఆర్ ఆర్.డి) గీసుగొండ;శ్రీ ప్రభాకర్, అసిస్టెంట్ ఇంజనీర్ (పి.ఆర్) గీసుగొండ;శ్రీమతి కళాకుమారి, అంగన్‌వాడీ సూపర్‌వైజర్; శ్రీమతి సుహాసిని, ఎ.ఎన్.యం; శ్రీమతి ఫాతిమా, ఏ.పి.డి.ఓ (ఇ.జి.ఎస్) గీసుగొండ లు కూడా హాజరయ్యారు.

ఈ గ్రామ సభలో ఉప సర్పంచ్ శ్రీమతి యార సంతోష, వార్డు మెంబర్లు మంచినీటి కమిటీ అధ్యక్షులు, శ్రీ కూసం లింగయ్య, కార్యదర్శి శ్రీ పెండ్లి మల్లారెడ్డి, వివిధ కమిటీల సభ్యులు, గ్రామ ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొనడం జరిగింది.




*- వి. కరుణాకర్, జిల్లా రిసోర్స్ పర్సన్,*
*జిల్లా శిక్షణా కేంద్రం,*
*జిల్లా ప్రజా పరిషత్, వరంగల్.*

# మహనీయుల చతురోక్తులు

*- పోలాప్రగడ సత్యనారాయణమూర్తి*

## అచ్ఛాగా ఉండకపోతే తుచ్ఛా కావలసిందే!

**నవ్యాంధ్ర సాహితీవేత్తలలో ప్రముఖవ్యక్తిగా, దక్షారామం, కీర్తి తోరణం వంటి ఉత్తమ కావ్యకర్తగా కీర్తి గడించి, అటు విశ్వనాథ వంటి సాంప్రదాయ కవుల దగ్గర్నుంచి ఇటు శ్రీశ్రీ వంటి అభ్యుదయ కవుల వరకూ, సమకాలీన సాహితీమూర్తులందరి మన్ననలనూ పొందిన విద్వత్కవి ఇంద్రగంటి హనుమచ్ఛాస్త్రిగారు. సహృదయులపట్ల ఎంత ఆత్మీయంగా వుండేవారో, కుత్సితులపట్ల అంత కరుకుగా వుండేవారాయన.**

అభ్యుదయ కవి సమ్మేళనానికి ఆయన హాజరైనప్పుడు సాంప్రదాయ బద్ధమైన పద్యాలూ, కవిత్వం రాసే ఈయన అభ్యుదయ సభలకి రావడం ఏమిటి అని వితర్కించుకున్నాడొక అభ్యుదయ కవి. అలా తర్కించుకుని ఊరుకోక, పదిమందిలోనూ శ్రీ శాస్త్రిగారిని ఆట పట్టించాలని, అందరూ వుండగా ఆయన్ని సమీపించి "శాస్త్రిగారూ! మీరు వ్రాసేటప్పుడు హనుమచ్ఛాస్త్రి అని, 'చ క్రింద, చ వత్తుతో వ్రాస్తారు కదా - అదెలాగండి? వ్రాస్తే 'హనుమత్‌శాస్త్రి' అని వ్రాయండి" అన్నాడు.

అంటూండగా అతని కళ్ళలో కనిపించిన కొంటెతనాన్ని శాస్త్రిగారు గమనించారు. గమనించి "ఎందుకు బాబూ ఈ తచ్ఛా' తుచ్ఛా శంకలు? చేతనైతే కమ్మని కవిత్వం రాసుకో - ఈ 'తుచ్ఛా' ఆలోచనలున్నాయి చూశావ్? ఇవి ఎప్పటికీ నిన్ను అచ్ఛా కవిగా మార్చలేవు" అన్నారు.

☆

## నిల్చింది

**ఓ** సాహిత్య మాసపత్రిక వారు, నవ్యాంధ్ర సాహిత్యాన్ని రెండు మూడు పేజీలలో స్థాలీపులాక న్యాయంగా సమీక్ష చేయమని కోరారు, నోరి నరసింహశాస్త్రి గారినోమారు.

*ఆయన వ్యాసం ఇలా ప్రారంభించారు.*

శివశంకరస్వామిగారి దీక్షితదుహిత నిలుస్తుంది.
జాషువాగారి ఖండ కావ్యం నిలవదు.

దువ్వూరి రామిరెడ్డిగారి పానశాల నిలుస్తుంది.
రాయప్రోలు సుబ్బారావుగారి తృణకంకణం నిలవదు.

విశ్వనాథ సత్యనారాయణగారి కిన్నెరసాని నిలుస్తుంది.
శ్రీశ్రీగారి మహాప్రస్థానం నిలవదు.

కృష్ణశాస్త్రిగారి కృష్ణపక్షం నిలుస్తుంది.
వేంకట పార్వతీశ్వర కవుల ఏకాంతసేవ నిలవదు.

ఇలా నిలుస్తుంది, నిలవదు.
కృష్ణశాస్త్రిగారి కృష్ణపక్షం నిలుస్తుంది.

వేంకట పార్వతీశ్వర కవుల ఏకాంతసేవ నిలవదు.

ఇలా నిలుస్తుంది, నిలవదు అనే మాటల తోటి సమీక్షా వ్యాసం నడిచిపోతోంటే, "ఇదేం సమీక్షండీ! ఎందుకు నిలుస్తుందో ఎందుకు నిలవదో కారణాలు కూడా రాయొద్దూ?" అని అడగబోయి ఆగి పోయాను.

ఎందుకంటే వ్యాసం చివర ఆయన ఇలా రాశారు.

"ఫలానా వారెవరో ఫలానా పుస్తకం రాశార్ట! అది నిలుస్తుంది.... కాని మరో పుస్తకం ఏదో మరొకరెవరో రాశార్ట. అది నిలవదు!"

ఈ చివరి వ్యాసం ఆ పత్రికలో ప్రచురించబడింది. అది చదివి ఆయన నవ్వి "చూశారా, ఇలా వుంటాయి నేటి సమీక్షలూ -సాహితీ పత్రికలూను" అన్నారు.

నేను తెల్లబోయాను. అంటే, శాస్త్రిగారు కావాలనే రాశారన్నమాట ఆ సమీక్షని. ఆ విధంగా కనిపించని కొంటెతనం ఎంత వుంది అందులో?

☆

## ఊరు మారుతుంది - ఉపన్యాసం మాత్రం అదే!

**రాయప్రోలు, విశ్వనాథ, దేవులపల్లి, తల్లావజ్ఝల, మొక్కపాటి, మునిమాణిక్యం, నోరి, వావిలాలవంటి మహామహులు సభ్యులుగా వుండే సాహితీ సమితిలో 1967 నుంచి నేనూ, నా భార్య రాజ్యలక్ష్మీ కూడా సభ్యులుగా వున్నాం. వేటపాలెంలో స్వర్ణోత్సవ సభల అనంతరం స్వచ్ఛందంగా తల్లావజ్ఝలవారు సాహితీ సమితిని స్థంభింపజేసేవరకూ.**

ఏడాదికి ఒకమారు ఏదో ఊళ్ళో తప్పనిసరిగా సాహితీ సమితి సమావేశాలు ఒకటి రెండు రోజులు జరిగేవి. వాటికి పెద్దా, చిన్నా తారతమ్యం లేకుండా సభ్యులంతా హాజరుకావాలి. అంతేకాదు ఒక వ్యాసమో, కవితో, కథో చదవాలి. లేదా ఉపన్యాసం అయినా ఇవ్వాలి. ఇది సభాపతి తల్లావజ్ఝలవారు ఏర్పరచిన నియమం.

ఓమారు 'ఈ సాయంత్రం నీ ఉపన్యాసం వుంది' అన్నారు తల్లావజ్ఝల వారు.

'సరే' అని ఉపన్యాసానికి సిద్ధం అవుతూ కొన్ని పాయింట్స్ రాసుకుంటున్నాను. ఆ సమయంలో మొక్కపాటి నరసింహశాస్త్రిగారు వచ్చి బారిస్టర్ పార్వతీశం నవ్వొకటి నవ్వి "ఎందుకు శ్రమ పడతావు? పాత ఉపన్యాసం ఏదైనా ఒకటి వుంటే, అదే ఉపన్యాసం ఇచ్చేయి" అన్నారు.

"అదేవిటి" అని నేను తెల్లబోయాను.

"అది అంతే బాబూ! నేను ఒక ఉపన్యాసం తయారుచేసుకున్నాను. ఏ ఊరు వెళ్ళినా, ఎవరికి ఇవ్వవలసివచ్చినా, అదే ఉపన్యాసం - స్థలం మారుతుంది - జనం మారుతారు -ఉపన్యాసం మాత్రం అదే. తుని స్టేషన్‌లో భోజనం ఎప్పుడేనా తిన్నావా? అదే కూర - అదే పచ్చడి. ఏ రోజువెళ్ళు - తినే మనుష్యులు మారతారు. కనక వాళ్ళకా కూరా పచ్చడీ కొత్తగా రుచిగా వుంటుంది. ఉపన్యాసాల రహస్యం కూడా అంతే. అందువల్ల నా మాట విని శ్రమపడకు" అన్నారు.

ఈ సలహా ఎలాంటిది అయినా ఆలోచించతగ్గది మాత్రం అవును - ఏమంటారు?

☆



# చరిత్రకే వన్నె తెచ్చిన మన చేనేత

స్వాతంత్ర్య సమరకాలంలో విదేశీ వస్తువులను బహిష్కరించి వీధుల్లో రాసులు పోసి గుట్టలుగా తగులబెట్టి తమకున్న స్వదేశాభిమానం ప్రపంచ దేశాలకు చాటి చెప్పిన ఘనత మన ముందుతరం వారిది. జాతి ప్రజల్లో సమరోత్సాహం నింపడానికి రాట్నమే ఆయుధంగా మలచుకున్నారు మన మహాత్మాగాంధీ. నాటి గుర్తుగా జాతిపిత కండెలు వడుకుతూ రాట్నం పట్టుకుని జాతి చిహ్నంగా మనకు దర్శనమిస్తారు. చరిత్రకే వన్నెతెచ్చిన భారత చేనేత పరిశ్రమ దేశాదేశాల ప్రజల ఆదరాభిమానాలను తమ స్వంతం చేసుకున్నది.

అందుకే, ఆనాడు పోర్చుగీసు, డచ్, ఫ్రెంచ్, బ్రిటిషు వ్యాపారస్తులు భారత చేనేత వస్త్రాలు కొనడానికి బారులు తీరేవారు. ముందుగానే బయానా యిచ్చేవారు. డిమాండుకూ తగ్గ సప్లయి చేయలేక పోయేవారు. చాలామంది విద్యావంతులు ఉద్యోగాలు విడిచి చేనేత వస్త్రోత్పత్తిలో భాగస్వాములై మగ్గాలు నేసిన చరిత్ర మనది. నాడు నాణ్యమైన వస్త్రాలంటే చేనేతలోనే దొరికేవి. నాణ్యతకు, మన్నికకు మారుపేరుగా ఉండటం వలన భారత చేనేతకు ప్రపంచ మార్కెట్‌లో ప్రత్యేక గుర్తింపు ఉంది.

భారతదేశంలో, అత్యధికంగా గ్రామీణ ప్రాంతంలో చేనేత వస్త్రోత్పత్తి జరుగుతున్నది. ప్రధానంగా చేనేత, పవర్‌లూం, మియా, హోజరీ రంగాలలో వస్త్ర పరిశ్రమ ఉంది. ప్రపంచ దేశాలలో ఇటువంటి వైవిధ్యం మరెక్కడా కనబడదు. పర్యావరణానికి అనుకూలమైన ఉత్పత్తులు చేయడం వలన అభివృద్ధి చెందిన వర్ధమాన దేశాలలో డిమాండు పెరుగుతున్నది.

వ్యవసాయం తరువాత రెండవ అతిపెద్ద ఉపాధి రంగంగా నిలబడిన చేనేత పరిశ్రమపై ఆధారపడి 1.25 కోట్ల మంది జీవనాధారం సాగిస్తున్నారు. జౌళి రంగంలో 3.40 కోట్ల మందికి ఉపాధి ఉంటే చేనేతలో 30% ఉన్నది. విస్తారమైన మానవ వనరులు గల విశాలభారత ఉపఖండంలో నేటికీ 72% ప్రజలు గ్రామీణ ప్రాంతంలో నివసిస్తున్నారు. దేశంలో సంఘటిత రంగం కల్పిస్తున్న ఉపాధి 5%కు మించడంలేదు.

జౌళి రంగంలో కూడా యింతకంటే భిన్నంగా ఏమీ కనబడదు. జౌళి రంగంలో 95% వస్త్రోత్పత్తి అసంఘటిత రంగంలో ఉన్నది. దేశవ్యాప్తంగా 2.5 లక్షల కోట్ల రూపాయల విలువైన వస్త్రం ఉత్పత్తి జరుగుతున్నది. ఉత్పత్తిలో సగటున 15% చేనేత వాటా ఉంది. వందేళ్ల క్రితం, చేనేత వాటా 80-85% ఉంటే యిప్పుడది తిరగబడింది. అయితే ఉత్పాదకత వందలరెట్లు పెరిగింది. నాడు కేవలం సాదా, తెల్లని, ఒకటి రెండు రంగులు మాత్రమే నేయగల సామర్థ్యం ఉండేది. నేడు రంగురంగుల్లో, మీటరుకొక డిజైను, ఆధునిక డిజైనులు, మార్కెట్‌కు అనుకూలమైన, వినియోగదారుల అభిరుచులకు తగట్టు ఉత్పత్తి చేయగలుగుతున్నది.

దేశంలో యాంత్రీకరణ వేగం పుంజుకున్నా, పారిశ్రామికీకరణ కుటీర, సంప్రదాయ పరిశ్రమలపై ఉక్కుపాదం మోపినా చేనేత రంగం చెక్కు చెదరలేదు. నాడు 60 లక్షల మగ్గాలు ఉంటే నేడు 40 లక్షలు ఉన్నాయి. నాడు సాదా వస్త్రం కేవలం మీటరు కంటే ఎక్కువ నేయలేని పరిస్థితి ఉంటే నేడు 12-15 మీటర్లు నేయగల వేగం నాణ్యత పెరిగింది. నాడు సాదా మగ్గం అయితే నేడు మగ్గానికి మూడు జాకార్డులతో శాస్త్ర సాంకేతిక నైపుణ్యం పెంచుకుని ఆత్మస్థయిర్యంతో ఉంది.

ఈ మారుతున్న కాలానికి అనుగుణంగా పరిశ్రమలో కూడా అనేక రకాల మార్పులు చోటు చేసుకున్నాయి. వ్యవసాయానికి ఏవిధంగా జాతి, కుల, మత వర్గం, వర్ణం లేదో అదే స్థాయిలో చేనేత పరిశ్రమ విస్తరించింది. అన్ని రకాల సామాజిక తెగలు, వర్గాలు, దళితులు, గిరిజనులు, బి.సి.లు, అగ్రవర్ణాల వారు సయితం చేనేత రంగంలోకి

ప్రవేశించక తప్పడం లేదు. ఉత్పత్తులు, ఎగుమతులు, మార్కెట్ ఎంతో వేగంగా విస్తరిస్తున్నది. దేశంలో 26 లక్షల కోట్ల రూపాయల విలువైన వస్త్రం జౌళిరంగంలో ఉత్పత్తి జరుగుతోంది. చేనేతరంగం వాటా 15% ఉన్నదని అధికారిక అంచనా. అంటే సుమారుగా 40 వేలకోట్ల రూపాయల వస్త్రం చేనేతరంగం వాటాగా ఉన్నది. 4,605 కోట్ల రూపాయల చేనేత వస్త్రం విదేశాలకు ఎగుమతి జరుగుతోంది. 2010-11లో జౌళిరంగంలో 8450 కోట్ల చ.మీ. వస్త్రం తయారవుతుండగా, మరో ఏడాదికి 9460 కోట్ల చదరపు మీటర్లకు పెరగనుంది. అంటే 2005-06లో సగటు మనిషికి 36.53 చ.మీ. అందుబాటులో ఉంటే, 2011-12 నాటికి 62.23 చ.మీ. అందుబాటులోకి రానున్నది. ఐదేళ్లలో వస్త్రవినియోగం రెట్టింపయ్యింది. ఉత్పత్తి కూడా మరింత పెరిగే అవకాశం ఉంది. వేగం కూడా పుంజుకున్నది.

అయితే, ఉత్పత్తి వేగం పెరుగుతున్నకొద్దీ కాలుష్యం కూడా పెరుగుతున్నది. ఉత్పత్తి కోసం ఉపయోగించే విద్యుత్తు, రంగులు, రసాయనాలు, నీరు, అద్దకం, నూలు మొదలైనవి అన్నీ పర్యావరణాన్ని, జలము, భూగర్భ వనరులపై ప్రభావం చూపుతున్నాయి. పర్యావరణ కాలుష్యం పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి. స్థానిక సంస్థల బాధ్యత చాలా కీలకం. పరిశ్రమలు, ముడిసరుకు, తక్కువ కూలికే కార్మికులు లభించే చోట్ల క్లస్టర్‌లు, పారిశ్రామికవాడలు, ప్రత్యేక ఆర్థిక మండళ్లు, అపెరల్, టెక్స్‌టైల్ పార్కులు ఏర్పాటు అవుతున్నాయి. ఏర్పాటు చేసే పరిశ్రమలలో శుద్ధి కర్మాగారాల నిర్మాణం, కలుషిత పదార్థాల శుద్ధి, పర్యావరణానికి విఘాతం కల్పించే వాటికి అనుమతులు ఇవ్వకుండా ఆపడం, లేదా యిచ్చి ఉంటే రద్దు చేయవచ్చును. ఇవన్నీ చట్టపరిధిలో చేయవలసిన చర్యలు.

దేశంలో సగటు పౌరుడికి ఏడాదికి 21.14 చదరపు మీటర్లను కొనుగోలు చేయగల సామర్థ్యం ఉంది. 1.12 చ.మీ. చేనేత వస్త్రం విలువ 136 రూపాయలు, మరమగ్గాల వస్త్రం 17.92 చ.మీ. విలువ 1135 రూపాయలు, హోజరీ 2.45 మీటర్ల విలువ నూట ఇరవై రూపాయలు పౌరులు ఈమేరకు సగటున వస్త్రాన్ని ముచ్చటపడి కొంటున్నారు. గ్రామీణులు ఏడాదికి సగటున 6.92 మీటర్లు కొంటే, పట్టణ నగరవాసులు 11.91 మీటర్లు కొంటున్నారు. ప్రతి మనిషి, పరిశ్రమలు, సంస్థలు, కార్యాలయాలు, ప్రభుత్వం, సంక్షేమ శాఖలు, కార్పొరేట్ సంస్థలు అన్నిటికి వస్త్రం అవసరం. మార్కెట్లో దొరికింది కొనడం ఆనవాయితీ. నేటి మార్కెట్ మాయాజాలంలో కార్పొరేట్ కంపెనీలు పెద్ద పెద్ద భారీ ప్రకటనలతో వినియోగదారులను తమ బ్రాండు కొనేలా మార్చి వేస్తున్నాయి. ఇది అనివార్యమయ్యింది. తమ మనుగడ కోసం కార్పొరేట్ కంపెనీల మీద ఆధారపడిన మీడియా ఈ ప్రకటనలను స్వీకరించి, ప్రచురించక తప్పనిసరి అవుతున్నది. ఇటువంటి పరిస్థితుల్లో చిన్న పరిశ్రమలు, సంప్రదాయ వృత్తులు, మానవశ్రమపై ఆధారపడే సాధారణ పరిశ్రమలు, కుటీర పరిశ్రమలు, ప్రజాకర్షణ ప్రకటనలు చేయలేవు. ప్రకటనలు చేయటానికి ఆ పరిశ్రమ పెట్టుబడి, తాహత్తు సరిపడదు. వినియోగదారులు తమ నిత్య వస్త్ర వినియోగంలో స్వదేశీ, చేనేత పరిశ్రమకు కేటాయించే అవకాశం ఎంతో ఒక్కసారి ఆలోచన చేయగలిగితే, పేదల ఉపాధిలో, పర్యావరణ పరిరక్షణ, సామాజిక సేవలో మనం భాగస్వాములు కాగలం.



## చేనేత పరిశ్రమ బలాలు

- నాణ్యమైన ఉత్పత్తులు, మన్నిక ఎక్కువ
- తరాల నుండి సంక్రమిస్తున్న నైపుణ్యం. (వేరుగా శిక్షణ కొరకు పెట్టుబడి అవసరం లేదు)
- అతి తక్కువ ఉత్పత్తి వ్యయం
- మానవశ్రమ ఆధార పరిశ్రమ
- పర్యావరణంపై ప్రభావం ఉండదు
- మహిళల శ్రమ అధికంగా ఉండటం
- విద్యుత్తు అవసరం ఉండదు
- తక్కువ ఉత్పత్తి ఖర్చులు
- వయస్సుతో నిమిత్తం లేకుండా అన్ని వయస్సుల వారికి ఉపాధి
- ఇదొక గ్రామీణ ఉపాధి రంగం
- నిర్వహణ, రిపేరు ఖర్చులు తక్కువ

## ఎదుర్కొంటున్న సమస్యలు

- నాణ్యమైన ముడిసరుకు దొరకడం లేదు
- ముడిసరుకు ధరలు విపరీతంగా పెరగడం
- మరమగ్గాల అనైతిక పోటీ
- ఇబ్బడిముబ్బడిగా దిగుమతి అవుతున్న వస్త్రాలు
- చట్టాల అమలులో నిర్లక్ష్యం
- సమాచార కొరత, కొరవడిన పారదర్శకత
- చేనేతకు ప్రత్యేక విధానం లేకపోవడం
- అసంఘటిత రంగం
- జౌళిరంగంలో చేనేత కలిసి వుండటం వలన ప్రోత్సాహకాలు జౌళిరంగానికే అధికంగా, ఎక్కువ మొత్తంలో ఉండటం
- పాలకులు, ప్రభుత్వ సిబ్బంది ఆధునిక యంత్రాలపై చూపుతున్న ప్రేమ



- సంప్రదాయ వృత్తులపై వస్తున్న చిన్నచూపు, నిర్లక్ష్యం
- పథకాలలో ఉన్న లొసుగులు
- చేనేత చట్టాలలో ఉన్న బలహీనతలు, లొసుగులు
- మానవశ్రమ ఆధారం. యాంత్రీకరణలో లాభాలవైపే చూస్తున్న వ్యాపారులు
- దళారుల సంఖ్య పెరగడం
- మజూరీలు పెరగకపోవడం
- ముడిసరుకు నూలు ఉత్పత్తిలో భారీ యంత్రాలపై ఆధారపడటం
- పెరుగుదలలేని బడ్జెట్
- పెట్టుబడికి ప్రభుత్వాలు ఉత్సాహం చూపకపోవడం
- ఫ్యాషన్ టెక్నాలజీ, శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానం చేనేత రంగానికి అందకపోవడం
- నాయకత్వంలో ఉన్న సమస్యలు

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఆదాయం, 8 లక్ష కోట్లకు పైగా పెరిగింది. అదే స్థాయిలో కేంద్ర బడ్జెట్ కూడా పెరిగింది. రాష్ట్ర బడ్జెట్ 2010-11లో లక్ష కోట్ల నాలుగు వేలకు, కేంద్ర బడ్జెట్ 11 లక్షల 8 వేల కోట్లకు పెరిగింది. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రస్తుతం కేటాయిస్తున్న బడ్జెట్ వలన సరియైన ఫలితాలు ఆశించిన స్థాయిలో కనిపించడం లేదు. ఆకలిచావులు, ఆత్మహత్యల నివారణకు పరిష్కారం చూపలేక పోతున్నాయి. కాబట్టి బడ్జెట్ కేటాయింపులు చేనేత రంగానికి గణనీయంగా పెంచవలసిన అవసరం ఎంతయినా వుంది.

**బడ్జెట్ వివరాలు**

(చేనేతరంగం) (రూ॥ కోట్లలో)

| సంవత్సరం | కేటాయింపు | విడుదల |
|---|---|---|
| 2005-06 | 52.64 | 56.47 |
| 2006-07 | 58.72 | 76.28 |
| 2007-08 | 98.52 | 71.47 |
| 2008-09 | 108.95 | 96.99 |
| 2009-10 | 382.78 | 38.94 |
| 2010-11 | 375.97 | 20.91 |

పై పట్టికననుసరించి చేనేత పరిశ్రమ అభివృద్ధి, సంక్షేమం కోసం 2005-06 నుంచి 2010-11 నేటి వరకు 1087.68 కోట్ల రూపాయలను ప్రభుత్వం కేటాయించింది. కేవలం 371 కోట్ల రూపాయలు అనగా కేవలం 34% మాత్రమే వ్యయం జరిగింది. ప్రభుత్వ సిబ్బంది, ప్రభుత్వ నేతలు బడ్జెట్ కేటాయింపులు, వ్యయంపై దృష్టి పెట్టవలసిన అవసరం ఉన్నది. చేనేత బడ్జెట్ నుండి, ఇతర పరిశ్రమలకు ఖర్చు చేస్తున్న సందర్భాలు ఉన్నాయి. కేటాయింపులు తక్కువగా ఉన్నాయి. సమస్యలు అధికంగా ఉన్నాయి. చేనేత కేటాయింపులు చేనేత పరిశ్రమకే కేటాయిస్తే పరిశ్రమ మనుగడ, అభివృద్ధి కుంటుపడకుండా ఉంటుంది. చేనేత పరిశ్రమ నుండి రాష్ట్ర బడ్జెట్‌లో ఏడాదికి 1000 కోట్లు కేటాయించాలన్న డిమాండు మరుగున పడుతున్నది.

### చేనేత పరిశ్రమ అభివృద్ధికి తీసుకోవలసిన చర్యలు

- జాతీయ చేనేత విధానం రూపొందించి అమలు చేయడం
- జౌళి రంగంతో సమానంగా ఉపాధి ప్రాతిపదికన బడ్జెట్ కేటాయించడం
- మహాత్మాగాంధీ గ్రామీణ ఉపాధి హామీ పథకం చేనేత రంగానికి వర్తింప చేయటం
- పెట్టుబడికి ప్రోత్సాహం, తక్కువ వడ్డీకి రుణాలు అందించటం
- పెరుగుతున్న ముడిసరుకు ధరలను నియంత్రించడం, పెరిగిన ధరలను సబ్సిడీ రూపంలో అందించటం
- 1985లో ప్రవేశపెట్టిన చేనేత రిజర్వేషన్ చట్టం అమలు చేయడం
- సంక్షేమ పథకాలు పటిష్టంగా అమలు చేయడం
- గ్రామ పంచాయితీ మునిసిపాలిటీలలో కార్మికులు అల్లుపట్టుటకు, పడుగు చేయుటకు మౌళిక వసతులు లేక ఇబ్బంది పడుతున్నారు. స్థలం కేటాయించాలి.
- పరిశ్రమ మౌళిక వసతులు కల్పించాలి.
- సంప్రదాయ డిజైనర్లకు శిక్షణలిచ్చి, ప్రోత్సహించాలి.
- వికేంద్రీకృత స్పిన్నింగ్ మిల్లులు ఏర్పాటు చేయాలి.
- పథకాలు మహిళా భాగస్వామ్యంతో, కార్మిక, చేనేత రంగ నిపుణుల భాగస్వామ్యంతో రూపొందించాలి.
- చేనేత పరిశ్రమకు ప్రత్యేక మంత్రిత్వశాఖ ఏర్పాటు చేయాలి.
- చేనేత సహకార సంఘాలలో స్థానిక పాలనకు అధికారం, భాగస్వామ్యం ఉంటే సమగ్ర అభివృద్ధికి దోహదపడవచ్చు.

**- పులుగుజ్జు సురేష్**

# మళ్ళీ ఉపయోగించండి - పర్యావరణాన్ని కాపాడండి

ఆధునిక జీవనశైలి వల్ల తలెత్తుతున్న సమస్యలలో అతి ప్రమాదకరమైయినది ముఖ్యమయినది ఘనవ్యర్థ పదార్థాలు (చెత్త). ఈ చెత్త ఎంత పెరుగుతూ పోతూ ఉంటే సహజ వనరులు అంతగా తరుగుతూ పోతాయి. మన జీవితాలను ఇంతగా ప్రభావితం చేస్తున్న చెత్త గురించి మనం ఏ మాత్రం పట్టించుకోము పట్టించుకోకపోవడమే కాకుండా కనీసం దీని కోసం ఆలోచించక పోవడం బాధించ దగ్గ విషయం. అయితే దీని కోసం మనం అందరం ఆలోచించాలి. ఆలోచించడమే కాకుండా మన వంతు కృషి చేసి మనం పర్యావరణాన్ని కాపాడంలో భాగస్వామ్యం వహించాలి.

### ఒక్కరోజుకి ఎంత చెత్త ఉత్పత్తి అవుతుందో మనం తెలుసుకుంటే?

సగటున ఒక మనిషి వల్ల రోజుకు ఎంత చెత్త ఉత్పత్తి అవుతుంది అంటే, ఇది వివిధ ప్రాంతాలలో వివిధ రకాలుగా వుందని చెప్పుకోవచ్చు. గ్రామీణ ప్రాంతాలలో ఒక వ్యక్తికి రోజుకి సుమారుగా 200 - 300 గ్రాములు. అదే పట్టణ ప్రాంతాలలో అయితే 500 - 700 గ్రాములు విడుదల అవుతుంది ఒక్క మన రాష్ట్ర రాజధాని హైదరాబాద్ మహానగరంలో ఒక్క రోజుకి 2,200 మెట్రిక్ టన్నులు ఉత్పత్తి అవుతుంది అలాగే మనదేశ రాజధాని ఢిల్లీలో 6,000 మెట్రిక్ టన్నుల చెత్త ఉత్పత్తి అవుతుంది అంటే మనం నమ్మగలుగుతామా? ప్రస్తుతం మన దేశ జనాభా 120 కోట్లు, అంటే రోజుకి ఒక్కొక్కరు సగటున 600 గ్రాములు చెత్తను పడేస్తుంటే, ఇన్ని కోట్ల మంది ఎన్ని వేల మెట్రిక్ టన్నులు చెత్తను పడేస్తున్నారో మీరే అంచనా వేసుకోండి.

### చెత్తవల్ల పర్యావరణానికి ఎంత నష్టమో మనం తెలుసు కోగలిగితే

రోజువారీ మన ఇంట్లో వచ్చే చెత్తనంతటిని మనం ఒక క్రమపద్ధతిలో వేయకుండా ఎక్కడపడితే అక్కడ పడేస్తాము. కాని దీనివల్ల ఎన్ని నష్టాలు కలుగుతాయో మనం తెలుసుకోలేము.

- మున్సిపాలిటి పెట్టిన చెత్తకుండీలలో వేయకుండా డ్రైనేజిల ప్రక్కన, రోడ్లప్రక్కన, ఎదువారి ఇంటి ముందు ఇలా ఎక్కడపడితే అక్కడ వేయడం వల్ల చెత్త డ్రైనేజిలలో చేరి నీరుపోకుండా ఆగి ఈగలు, దోమలు, క్రిములు వుచ్చి మన ఇళ్ళలో సంచరిస్తాయి.
- మున్సిపాలిటీ వారు రోజువారీ చెత్తనంతటిని తీసుకెళ్ళి నగర శివారుల్లో పడేస్తారు. దీంతో చెత్తను నిల్వచేసేందుకు ఎంతో భూమి వృధా అవుతుంది.
- వర్షం పడి ఈ చెత్తలోని కసరు అంతా భూమిలోకి యింకి భూగర్భంలోని నీళ్ళు చెడిపోతున్నాయి.
- చెత్తను కుప్పలుగా పోసి మనం కాల్చేస్తాము ఇలా చేయడం వల్ల దుర్వాసన వస్తుంది మరియు ఈ పొగ పీల్చడం వల్ల కాలేయానికి సంబంధించిన వ్యాధులు వచ్చి అనారోగ్య బారినపడే అవకాశం ఎక్కువ.
- కాలుష్యం పెరిగి పోతుంది.

ఈ ధోరణి ఇలాగే కొనసాగితే, భవిష్యత్‌లో మన పిల్లల ఆరోగ్య పరిస్థితి ఏమిటి? అనే ప్రశ్నకు సమాధానం దొరక్కపోవచ్చు? చెత్త మనల్ని ఇంత ప్రభావితం చేస్తుందా అని మీరు ఆలోచించకపోవచ్చు? కాని యింత ప్రమాదకరమయిన చెత్త నుండి మన పిల్లల్ని మనల్ని మనం రక్షించుకోవాలంటే కొన్ని ముఖ్యమైన మార్గాలు వున్నాయి. వాటిలో ముఖ్యమైనది చెత్తను రీసైకిల్ చేయుటం.

**రీసైకిల్ అంటే ఏమిటి :-** పునర్వినియోగం... అంటే ఒక వస్తువును మనం ఒకసారి వాడిన తరువాత మళ్ళీ దానిని ఉపయోగంలోకి తెచ్చి వినియోగించడాన్ని రీసైకిల్ అంటారు. ఇలా రీసైకిల్ చేయుటం దేశంలో ఇప్పుడిప్పుడే మొదలైయింది. కాని అభివృద్ధి చెందిన దేశాలలో మాత్రం చెత్తను నూరు శాతం మళ్ళీ వినియోగంలోకి తీసుకువచ్చే దిశగా ప్రయత్నిస్తున్నారు. అమెరికా, యూరప్‌లలో. 70 శాతం, చైనా 30 శాతం రీసైకిల్ చేస్తుంటే ఇండియాలో మాత్రం కేవలం 14 శాతం మాత్రమే రీసైకిల్ చేస్తున్నాము అని అంచనా. కాని నూటికి నూరుశాతం





గనుక రీసైకిల్ చేయగలిగితే కోట్ల రూపాయల విలువైన సహజవనరులు మిగిలిపోతాయి. భూమి వృధా కాదు, విద్యుత్ ఆదా అవుతుంది. నెలకు పన్నెండువందల టన్నుల చెత్తను రీసైకిల్ చేయగలిగితే మున్సిపాలిటికి రెండున్నర కోట్ల రవాణా ఖర్చు తగ్గిపోతుంది. అన్నిటికంటే ముఖ్యమైనది, విలువైనది పర్యావరణాన్ని కాపాడి ప్రజలు రోగాలు బారిన పడకుండా కాపాడిన వారమవుతాము. చెత్తను రీసైకిల్ చేసి తిరిగి వాడుకోక పోవడం వల్ల కొన్నాళ్ళకు సహజవనరులన్నీ ఖాళీ అవుతాయెమోనన్న భయం కలుగుతుంది.

చెత్తను రీసైకిల్ చేయాలంటే ముందుగా మనం చెత్తను రెండు రకాలుగా వేరుచేయాలి అవి 1. మట్టిలో కలవనివి (పొడిచెత్త) 2. మట్టిలో కలిసేవి (తడిచెత్త). అయితే ఈ రెండు రకాలైన చెత్తను మనం రీసైకిల్ చేసుకోవచ్చు. అది ఏవిధంగానో తెలుసుకుంటే, ముందుగా మనం మట్టిలో కలవనివి (పొడిచెత్త) తీసుకుంటే దానిలో మనం రోజువాడే పేపరు, అట్టలు, ప్లాస్టిక్, గాజు, కలప, చిరిగిన గుడ్డలు, మొదలగునవి అని చెప్పుకోవచ్చును కాని వీటన్నింటినీ దాదాపు 60 శాతం మనం రీసైకిల్ చేసుకోవడానికి వీలుంటుంది.

- పేపరును తీసుకుంటే పేపరు భూమిలో కలవడానికి 10 నుంచి 30 రోజుల సమయం పడుతుంది. అయితే ఇది చాలా తక్కువ సమయం అయినా దీనిని కూడా మనం రీసైకిల్ చేసుకుంటే చాలా లాభాలు వున్నాయి.
- 40 శాతం తక్కువ శక్తితో పేపరును మళ్ళీ రీసైకిల్ ద్వారా ఉత్పత్తి చేసుకోవచ్చు
- ఒకటన్ను పేపరు రీసైకిల్ చేస్తే 17 చెట్లను కాపాడిన వారమవుతాం. అంతే కాదు చిత్తు కాగితాలను, అట్టముక్కలను పునర్వినియోగ వస్తువులుగా మల్చుకోవడం చాలా అనువైన పని.
- చిత్తు కాగితాల నుంచి గుజ్జు తయారు చేసి బుట్టలు, బొమ్మలు తయారు చేయవచ్చు
- చిత్తు కాగితాలతో నాణ్యమైన హేండ్‌మేడ్ పేపరును తయారు చేసి ఆకర్షణీయమైన ఆదాయాన్ని పొందవచ్చు.
- ప్లాస్టిక్ తీసుకుంటే జీవన విధానంలో మార్పుల ననుసరించి ప్లాస్టిక్ వినియోగం రోజు రోజుకి పెరిగిపోతూవుంది. ఈ ప్లాస్టిక్‌లో ముఖ్యమయినది, తీసుకుంటే ప్లాస్టిక్‌బ్యాగ్స్, బాటిల్స్, బిందెలు ఇతర వస్తువులు మొదలగునవి అని చెప్పుకోవచ్చు ప్లాస్టిక్ విషయానికి వస్తే, ఒక వ్యక్తి తన జీవిత కాలంలో సగటున 22,176 ప్లాస్టిక్ బ్యాగ్‌లు వాడుతున్నారని అంచనా. ఒక వ్యక్తి ఒక వారం రోజులు సంచి బ్యాగ్స్ గనుక వాడినట్లు అయితే సుమారుగా 288 ప్లాస్టిక్ బ్యాగ్‌ల వాడకాన్ని తగ్గించవచ్చు. ప్లాస్టిక్ బాటిల్స్ అయితే ప్రతి సెకనుకు 1500 బాటిల్స్ వినియోగించబడుతున్నాయి. వీటిలో వుంచిన నీరు త్రాగడం వల్ల ప్లాస్టిక్‌లో వుండే Visphenol - A (BPA) నీటిలో కరిగి కలుస్తుంది. ఆ నీటిని మనం త్రాగడం వల్ల శరీరంలో కెన్సరన్ సెల్స్ పెరిగి కేన్సర్ వచ్చే ప్రమాదముంది.

ఇలా చెప్పుకుంటూ పోతే ప్లాస్టిక్ వల్ల వచ్చే లాభాల కన్నా నష్టాలే ఎక్కువ వున్నాయి. అందువల్ల ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించుకోవలసిన అవసరం ఎంతైనా వుందని నిపుణులు సూచనలు యిస్తున్నారు. అయితే ప్లాస్టిక్‌ను కూడా రీసైకిల్ చేసి మళ్ళీ వినియోగంలోకి తీసుకురావచ్చు.

- 70 శాతం తక్కువ ఎనర్జీతో ప్లాస్టిక్‌ను మళ్ళీ ప్లాస్టిక్‌గా తయారు చేయవచ్చు.
- ఒక టన్ను ప్లాస్టిక్‌ను రీసైకిల్ చేస్తే 1000 - 2000 గ్యాసోలైన్ మిగిలిపోతుంది.
- ప్లాస్టిక్ బ్యాగ్స్ వాడకుండా వుండటం వల్ల పెట్రోలియంను ఆదాచేయవచ్చు. అంతేకాక పునర్వినియోగ పక్రియ ద్వారా ప్లాస్టిక్ తాళ్ళు, ప్లాస్టిక్ బ్యాగ్‌లు, ప్లాస్టిక్ చాపలు, ప్లాస్టిక్ అలంకార వస్తువులు తయారు చేయవచ్చు.
- ఈ మధ్య గ్రామీణ రోడ్ల నిర్మాణంలో ప్లాస్టిక్ రజనను తారుతో కలిపి వినియోగించడం కూడా జరుగుతుంది.

ఇదే విధంగా, గాజు వస్తువులును, కాటన్ గుడ్డలను, కలపను (చెక్కముక్కలు) కూడా రీసైకిల్ ద్వారా ఉపయోగంలోకి తీసుకురావచ్చు, ఒక గాజు సీసాను రీసైకిల్ ద్వారా తయారు చేసుకుంటే

నూరు వాల్టుల బల్బు నాలుగు గంటలు పాటు వెలిగేందుకు అయ్యే విద్యుత్‌ను ఆదా చేసినట్లు, విరిగిన గాజు ముక్కలలో వివిధ రకాలైన వస్తువులు, గిఫ్టులు మొదలగునవి తయారు చేసుకోవచ్చు.

అదే విదంగా, కాటన్ గుడ్డ ముక్కలను తీసుకుంటే కాటన్ దుస్తులు భూమిలో కలవడానికి 1 నుంచి 5 నెలలు పడుతుంది. అయితే కాటన్ వస్తువులను కూడా రీ సైకిల్ ద్వారా వినియోగంలోకి తీసుకు రావచ్చు. వివిధ రకాలైన తాళ్ళు, బుట్టలు, బొమ్మలు మొదలగునవి తయారు చేయవచ్చు, అలాగే విరిగిన చెక్కముక్కలను కూడా రీసైకిల్ ద్వారా వినియోగంలోకి తెచ్చి ఉపయోగించవచ్చు. చెక్కముక్కలు భూమిలో కలవటానికి 10 నుంచి 15 సంవత్సరాలు పడుతుంది. విరిగిన చిన్న చిన్న చెక్కల ద్వారా చిన్న చిన్న ఆటవస్తువులు మరియు బొమ్మలు తయారు చేయవచ్చు.

ఇక రెండవ రకం మట్టిలో కలిసిపోయేవి (తడి చెత్త) వీటిని సేంద్రీయ వ్యర్థాలు అని కూడా అంటారు. యివి ఒక వారం నుంచి 10 రోజుల వ్యవధిలో భూమిలో కలుస్తాయి, అని చెప్పవచ్చును. వాటిలో ముఖ్యమైనవి, మన ఇంట్లో మిగిలే కుళ్ళిన కూరగాయలు, పాచిపోయిన అన్నం, పశువులు నుండి వచ్చే వ్యర్థాలు అని చెప్పుకోవచ్చును అయితే ఈ సేంద్రీయ వ్యర్థాలను కూడా రీసైకిల్ చేసి అనేక రకాలుగా ఉపయోగించవచ్చు. వీటి ద్వారా ఎరువు, గాస్, బయోగ్యాస్, విద్యుత్‌ను ఉత్పత్తి చేసుకోవచ్చును. వంట చెరుకు, సేంద్రీయ ఎరువుగా కూడా ఉపయోగించవచ్చు. వీటి అన్నింటిని కంపోస్టు లేదా వర్మికంపోస్టు విధానాల ద్వారా తిరిగి వినియోగంలోకి తీసుకురావచ్చు, అని చెప్పవచ్చును.

**వర్మి కంపోస్టు విధానం : -** గ్రామీణ ప్రాంతాలలో భూమిలో కలిసే సేంద్రీయ వ్యర్థాలను తిరిగి వినియోగంలోకి తీసుకు రావడంలో ముఖ్యమయినవి వర్మికంపోస్టు విధానం అని చెప్పుకోవచ్చు. ఈ వర్మికంపోస్టు విధానం మనం ఇంటి ఆవరణలలోనే ఏర్పాటు చేసుకోవచ్చు. అనువైన కొలతలతో కంపోస్టు నిర్మాణాలను చేపట్టేందుకు ఒక ప్రాంగణంలో అనువైన కుండీని ఏర్పాటు చేసుకొని మన గృహస్థాయి వినియోగంలో వచ్చే సేద్యపు వ్యర్థాలను సరైన విధంగా కుండీలో నిల్వచేస్తూ, దీనికి సంబంధించిన వానపాములను కుండీలలో వదలాలి. దీనికి సంబంధించిన శాస్త్రీయ పద్ధతులు పాటిస్తే, సేంద్రియ వ్యర్థాలను అతి సులువుగా సేంద్రీయ ఎరువుగా మార్చుకోవచ్చును.

ఇది గ్రామ స్థాయిలో చెత్త నంతటిని (తడిచెత్త) అతి సులువుగా రీసైకిల్ చేసి వినియోగంలోకి తెచ్చే ప్రక్రియ అయితే ఈ విధానం కొంచెం ఖర్చుతో కూడినది కాబట్టి ఈ విధానానికి గ్రామాలలో ప్రజలు ముందుకు రావటం లేదు. అయితే దీనికి ఒక మార్గం కూడా వుంది. గ్రామ స్థాయిలో గ్రామ పంచాయితీ ఆధ్వర్యంలో దీనిని నిర్మించుకుని పంచాయితీ ఆధ్వర్యంలో చెత్త నంతటిని సేకరించి దానిని వర్మికంపోస్టు చేసి సేంద్రియ ఎరువుగా ఉపయోగించుకోవచ్చు. అయితే ఈ విధానం ఒక్క గ్రామ స్థాయిలోనే కాకుండా పట్టణ ప్రాంతాలలో కూడా దీనిని అమలు చేసి సేంద్రీయ ఎరువును మార్కెట్ ద్వారా విక్రయించుకోవచ్చు. ఒక్క గృహ అవసరాల చెత్తే కాకుండా పశువుల నుండి వచ్చే వ్యర్థాలను కూడా రీసైకిల్ చేసి గ్యాస్, బయోగ్యాస్ ఉత్పత్తి చేసి వంట చెరుకుగా ఉపయోగించవచ్చు.

ఈ విధంగా తయారైన వర్మికంపోస్టు అన్ని విధాలైన పంటలకు కావలసిన సేంద్రీయ ఎరువుగా ఉపయోగించుకోవచ్చు. దీనిలో నైట్రోజన్, కాల్షియం, మెగ్నీషియం, సోడియం, జింక్, కాపర్, ఐరన్, మొదలగు అన్ని పోషకాలు లభ్యమవుతాయి. ఈ ఎరువును ముఖ్యంగా పూల మొక్కలు, కొబ్బరి చెట్లకు వాడితే మంచి ఫలితం వుంటుంది. ఈ వర్మికంపోస్టు విధానం ద్వారా భూమిలో కలిసిపోయే వ్యర్థాలను తిరిగి వినియోగంలోకి తెచ్చి దేశాన్ని సేంద్రీయ ఎరువుల ఉత్పత్తిలో స్వయం సమృద్ధి చెందిన దేశంగా నిలపగలుగుతాం.

అందుచేతనే చెత్త పనికి రానిదికాదు, చెత్తలో కనిపించే ప్రతివస్తువు ఏదో విధంగా మనకు రీసైకిల్ ద్వారా ఉపయోగపడే విధంగా వుంటుంది. చెత్తను సరిగ్గా వాడుకుంటే మనం ఎంతో కొంత ఆదాచేసినట్లు, పచ్చటి చెట్లను కాపాడినట్లు, సహజవనరులును పొదుపు చేసినట్లు, మన పిల్లల భవిష్యత్‌కు భరోసా కల్పించినట్లు అని మనమందరం తెలుసుకోవాలి.

చెత్త విషయంలో చైతన్యం వచ్చి మన సమాజాన్ని కాలుష్య రహిత సమాజంగా తీర్చి దిద్దటానికి మన వంతు కృషి మనం చేసి మన సమాజాన్ని, మన దేశాన్ని ముందుకు నడిపిద్దాం.

**- యం. ప్రదీప్ కుమార్**

రీసెర్చ్ అసోసియేట్, సి.డబ్ల్యు.యస్, అపార్డ్



స్వాతంత్ర్య సమర యోధురాలుగా, మహిళల సముద్ధరణకోసం జీవితాంతం సేవలందించిన ధీర మహిళగా, సంఘసేవా పరాయణురాలుగా జాతిపిత గాంధీజీచే ప్రశంసలందుకొన్న మహిళామణి దుర్గాబాయి.



# తల్లికే చదువు నేర్పిన కూతురు

**1920** లో గాంధీజి ఆంధ్ర ప్రాంతంలో పర్యటిస్తూ రాజమండ్రికి వచ్చారు. రాజమండ్రిలో గొప్ప సభ జరిగింది. ఆ సభలో గాంధీజీ ఉపన్యసించారు. క్రిక్కిరిసిన సభ, వాలంటీర్లు హుండీలు పట్టుకొని తిరుగుతూ డబ్బులు వసూలు చేయడం ఒక బాలిక చూచింది. ఆ అమ్మాయి వయసు 11 ఏళ్ళు. ఆ డబ్బులు గాంధీజీ కాంగ్రెసు నిధికోసం వసూలు చేస్తున్నారని వినింది. పక్కనున్న ఒక పెద్దాయననుండి అతని టోపీ అందుకొన్నది. 'అయ్యా గాంధీ నిధికి ఈ టోపీలోకి డబ్బులేయండి'' అంటూ జనం మధ్యగా చిన్న బాలిక తిరగటం చూచిన ప్రజలు డబ్బులు, ఆ టోపీలోకి వేశారు. కాసేపట్లో, టోపీనిండా డబ్బులతో, గుంపులను తోసుకొంటూ వేదిక ముందుకు వెళ్ళి తానే ఆ డబ్బులివ్వాలన్న ఆ బాలిక పట్టుదలను ఒక పెద్ద మనిషి చూశాడు. ఆ తొక్కిసలాటలో అమ్మాయిని చూచి భుజంపై కూర్చుండబెట్టి గాంధీజి ముందు దించాడు.

''బాపూ, ఈ డబ్బులు తీసుకోండి' అన్నది. బాపూ నవ్వుతూ 'పాపా, నీ గాజులు కూడా ఇస్తావా?'' అన్నాడు. ఇవిగో తీసుకోండి' అని సంతోషంగా ఇచ్చి వేసింది. గాంధీజి చిరునవ్వు ఆ బాలికపై చెరగని ముద్రవేసింది. ఆ పదకొండేళ్ళ బాలిక దుర్గాబాయి! ఆపదకొండేళ్ళ బాలిక ఒక హిందీ పాఠశాల కూడా ప్రారంభించింది. 40 మంది మహిళలున్నారా బడిలో. అందులో ఒక విద్యార్థిని దుర్గాబాయి తల్లి కృష్ణవేణమ్మ!

దుర్గాబాయి 1909 జులై 15 వ తేదీన రాజమండ్రిలో జన్మించింది. తండ్రి రామారావు. ఆయన స్వయంగా టైపు శిక్షణ సంస్థను స్థాపించి చాల మందికి ఉచితంగా శిక్షణ ఇచ్చేవారు.

దుర్గాబాయి చాల తెలివి తేటలుగల బాలిక. బాల్యంలోనే హిందీలో పాండిత్యం సంపాదించింది. వీణా వాద్య నిపుణురాలైంది. ముగ్గులు వేయడంలో దిట్ట.

1922 లో కాకినాడలోని కాంగ్రెస్ కార్యాలయంలో వేసిన ముగ్గును పెద్దలందరో మెచ్చుకొన్నారు. కాంగ్రెస్ ఒక రథంగాను, రథసారధి నెహ్రూగాను, అందులో గాంధీ కృష్ణుడుగాను, రథంపై ఒక జెండా ఎగురుతున్నట్లుగా వున్న ముగ్గు! దుర్గాబాయి ఏడవ ఏటనే పెళ్ళి చేశారు. పెళ్ళైన కొద్దికాలానికే భర్తమరణించారు.

1927లో గాంధీజి కోటి రూపాయల నిధి సేకరణ చేస్తూ రాజమండ్రి సమీపంలోని సీతానగరం ఆశ్రమంలో బసచేశారు.

ఆ కాలంలో భోగం మేళాలు ఎక్కువగా వుండేవి. దేవదాసీల జీవితం దుర్భరంగా వుండేది. ముస్లిం మహిళలు సంప్రదాయానికి బానిసలై బయటి ప్రపంచంతో సంబంధాలు లేకుండా వుండేవారు. అట్టి మహిళలకు వెలుగుబాట చూపాలని నిశ్చయించుకొన్నది దుర్గాబాయి.

స్త్రీల కోసం ప్రత్యేక సభ ఏర్పాటు చేయాలని, ఆ సభలో గాంధీజీచే ఉపన్యాసం ఇప్పించాలని నిశ్చయించింది.

కాంగ్రెస్ నాయకులు కొండా వెంకటప్పయ్య, బులుసు






సాంబమూర్తి గార్ల వద్దకు వెళ్ళి తన కోరికను తెల్పింది.

"ఏమిటీ, స్త్రీల సభ ఏర్పాటు చేస్తావా? గాంధీజీ రావాలా? అంతా పిల్ల చేష్టలు' అన్నారా పెద్దలు. దుర్గాబాయి పట్టుపట్టింది. అయితే 5 వేల రూపాయలు గాంధీజీకి ఇస్తే సభ ఏర్పాటు చేస్తాం, 5 నిమిషాలు మాట్లాడమని చెబుతాం' అన్నారా పెద్దలు.

మూడు రోజులలో 5 వేలు వసూలు చేసింది దుర్గ. అయ్యా ఇదిగో 5 వేల రూపాయలు గాంధీజి సభ ఏర్పాటు చేయండి అని చెప్పటం విని, వారు ఆమె సాహసానికి విస్తుపోయారు.

స్థానిక మునిసిపల్ హైస్కూల్ హెడ్ మాస్టరు గారిని బతిమలాడి స్కూలు మైదానంలో సభ జరపడానికి అనుమతి సంపాదించింది.

అంతటా స్త్రీలే! దేవదాసీలు, బురఖా వేసుకొన్న ముస్లిం మహిళలు!

గాంధీజి ఉపన్యాసం ప్రారంభిస్తూ "నా ఉపన్యాసాన్ని దుర్గ తెలుగులో అనువదిస్తుంది అన్నారు బాపూ. కొండా వెంకటప్పయ్య గారిని కూర్చోమన్నారు.

అయిదు నిమిషాలు మాత్రమే అన్న గాంధీజీ గంటసేపు మాట్లాడారు. బీదల కోసం డబ్బులివ్వండి అన్నారు. మహిళలు తమ నగలన్నిటినీ విరాళంగా ఇచ్చారు. దుర్గాబాయి తాను సేకరించిన అయిదు వేల నగదును ఆయనకు సమర్పించింది. ఆ సభలో మహిళలిచ్చిన నగదు, నగల విలువ పాతికవేలు!

గాంధీజీ ఆంధ్రదేశ పర్యటనలో దుర్గా బాయినే తన అనువాదకురాలుగా తన కారులోనే కూర్చుండమన్నారు.

ఐదవ తరగతిలో ముగిసిన చదువును మరలా ప్రారంభించింది. గోపరాజు రామచంద్రరావు ప్రోత్సాహంతో మెట్రిక్ పరీక్ష పాసైంది. ఇంటర్మీడియేట్, బి.ఎ ఆనర్స్‌పరీక్షల్లో ఉత్తీర్ణరాలైంది. న్యాయ శాస్త్రంలో పట్టా అందుకొన్నది.

మద్రాసులో జరిగిన ఉప్పు సత్యాగ్రహంలో పాల్గొని రెండేళ్ళ జైలు శిక్ష అనుభవించింది.

మద్రాసులో న్యాయవాదిగా వుంటూ, ఆంధ్ర మహిళా సభ భవన నిర్మాణ పూర్తి చేసింది. ఆమె ప్రతిభను గుర్తించిన నాయకులు ఆమెను రాజ్యాంగ సభ సభ్యురాలుగా ఎన్నుకొన్నారు. ఆమె పట్టుదలతో, స్త్రీలకు ఆస్తి హక్కు, ప్రాథమిక హక్కులు మున్నగు వాటిని రాజ్యాంగంలో చేర్చారు.

1952లో దుర్గాబాయిని ప్లానింగ్ కమిషన్ మెంబరుగా ప్రభుత్వం ఎన్నుకొంది. 1953లో కేంద్ర సోషల్ వెల్ఫేర్ చైర్ పర్సన్‌గా పదేళ్ళు సేవలందించారు. ఆ సమయంలో మహా మేధావి, కేంద్ర ఆర్థిక శాఖమంత్రి డా. చింతామణి దేశ ముఖ్‌గారిని పెళ్ళాడారు. అతి నిరాడంబరంగా జరిగిన ఆ వివాహానికి, జవహర్ లాల్ నెహ్రూ, ఆచార్య కృపలాని మాత్రం వచ్చారు.

1957లో, డా. దేశ్‌ముఖ్ ఆర్థికమంత్రి పదవికి రాజీనామా చేసి యూనివర్సిటి గ్రాంట్స్ కమిషన్ ఛైర్మన్‌గా నెలకు ఒక రూపాయి నామమాత్ర వేతనంతో మూడేళ్ళు పనిచేశారు. ఇంటర్నేషనల్ మానిటరిఫండ్ ప్రపంచ ఆర్థిక సంస్థ డైరెక్టర్‌గా డా.దేశముఖ్ గారిని ఆహ్వానించారు. ప్రధాని నెహ్రూ, ఆయనను ఆ పదవిని స్వీకరించమన్నారు. ఆ పదవి భారత దేశానికి గర్వకారణమన్నారు. ఏడాదికి 30 వేల డాలర్లు వేతనం, ఇతర వసతులు కల్పిస్తామన్నారు. డా. చింతామణి, భార్య దుర్గాబాయి సలహాకోరారు. అంత డబ్బు మనకెందుకు? మనం దేశ ప్రజలసేవ చేద్దామన్నారు. దుర్గాబాయి దేశ్‌ముఖ్ ఆ పదవిని తిరస్కరించారు.

1967లో దేశ్‌ముఖ్ దంపతులు హైదారాబాద్‌లో స్థిరపడ్డారు. వారి ఇంటికి 'రచన' అని పేరు పెట్టుకొన్నారు.

ఆంధ్రమహిళా సభ కార్యక్రమాలు మూడుపూవులు ఆరు కాయలుగా విస్తరించాయి. నర్సింగ్ హోమ్, ఆర్థోపెడిక్ సెంటర్, శిశు విహార్, ఎన్నో వైద్యశాలలు, ఈ రీతిగా 23 సేవా సంస్థలను ప్రారంభించారు. తన ఆస్తులన్నిటినీ ఆంధ్రమహిళా సభకు దత్తంచేశారు. అవిశ్రాంతసేవ, కార్యదీక్ష నిజాయితీ మూర్తీభవించిన వారు దుర్గాబాయి దేశ్‌ముఖ్ దంపతులు. 1971లో సాక్షరతాభవన్ మహిళా కళాశాల ప్రారంభించారు. వయోజన విద్యావ్యాప్తికి ఆమె చేసిన సేవలకు గుర్తింపుగా, నెహ్రూ లిటరసి అవార్డును అందుకొన్నారు. 1963లో ఆంధ్ర విశ్వవిద్యాలం నుంచి పద్మభూషణ ప్రశస్తినందుకొన్నారు.

ఆమె 'చింతామణి అండ్ ఐ' అన్న ఆత్మకథను ఇంగ్లీష్‌లో రచించారు.

కస్తూర్బా స్మారక నిధులు లక్షలాదిగా అందజేశారు.

దుర్గాబాయి వ్యక్తిగాకాక గొప్ప వ్యవస్థగా ప్రజలకు సేవలందించి మే 9 వ తేదీన కాలధర్మం చెందారు.

**- జానమద్ది హనుమచ్ఛాస్త్రి**

Printed & Published by: K. Chandra Mouli, Commissioner, on behalf of Andhra Pradesh Academy of Rural Development, Printed at Caxton Offset Pvt. Ltd., 11-5-416/3, Red Hills, Hyderabad-4. A.P. Published at Andhra Pradesh Academy of Rural Development, Rajendranagar, Hyderabad-30, Rangareddi. **Editor : K. Chandra Mouli**

# శ్రీమతి ఇందిరాగాంధి సంస్మరణ

జననం: 19-11-1917 మరణం: 31-10-1984

## భారత దేశ ప్రధాన మంత్రి

(24-1-1966 నుండి 24-3-1977 వరకు &
14-1-1980 నుండి 31-10-1984 వరకు)








క్రిస్మస్
శుభాకాంక్షలు